www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శనివారం | 17-3-2018 | పేజీలు: 18 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 58 సంచిక: 331 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య రా. 6.42 తదుపరి చైత్ర శు. పాడ్యమి; నక్షత్రం: పూర్వాభాద్ర రా. 7.43 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: తె. 5.30 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 6.26-7.14; అమృతఘడియలు: ఉ. 11.24-1.04; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.26; సూర్యాస్తమయం: 6.23 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



నువ్వా.. నేనా..?

- ఇటు సమైక్య ప్రతిపక్షం
- అటు నరేంద్ర వ్యూహం
- వేడెక్కిన దేశ రాజకీయం

ఇక... నువ్వా, నేనా! ఢీ అంటే ఢీ! తర్జనభర్జన లేదిక... రణగర్జనే! మోదీ సర్కారుపై తెలుగుదేశం పోరు జోరందుకుంది. కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించే స్థాయిలో పావులు కదిపింది. 'న్యాయమైన డిమాండ్ల కోసం మేం చేస్తున్న ధర్మయుద్ధం' అంటూ తెలుగుదేశాధీశుడు చంద్రబాబు అనూహ్య నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్డీయే కూటమి నుంచి వైదొలిగారు. బీజేపీతో తెగదెంపులు చేసుకున్నారు. ఉరుములేని మెరుపులా 'అవిశ్వాస అస్త్రం' ప్రయోగించారు. అంతే... ఢిల్లీ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. విపక్షాల ఐక్యతా యత్నాలకు టీడీపీ కేంద్ర బిందువుగా నిలిచింది. తెలుగుదేశం నిర్ణయాన్ని విపక్షాలు స్వాగతించాయి. టీడీపీ ఎంపీలు రావడమే ఆలస్యం... అవిశ్వాసం నోటీసుపై అనేకమంది సంతకాలు చేసేశారు. టీడీపీ, వైసీపీల తీర్మానాలు సభ ముందుకు వచ్చినప్పుడు వందమందికిపైగా సభ్యులు మద్దతు ప్రకటించారు. అయితే... దీనిపై కమలనాథులు 'విరుగుడు వ్యూహం' రచిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం చేపట్టకుండా నా అన్నట్టు పరోక్ష మిత్రపక్షం అన్నాడీఎంకేను రంగంలోకి దించారు. సభలో రభస చేయించారు. బాబు అవిశ్వాసానికి మద్దతిస్తామంటూ ప్రకటించిన అన్నాడీఎంకే అధికార ప్రతినిధి కేసీ పళనిస్వామిపై గంటలు తిరక్కుండానే తమిళనాడు సీఎం పళనిస్వామి వేటు వేశారు. ఏపీకి ప్రత్యేక హోదా డిమాండ్ నీరుగార్చడానికి మిత్రుడు నితీశ్‌ను మోదీ తెరపైకి తెస్తున్నారు. బిహార్‌కూ హోదా ఇవ్వాలని అనిపిస్తున్నారు.

ఒకవైపు మోదీ - మరో దిక్కు సమైక్య విపక్షం... సంధానకర్తగా చంద్రబాబు... క్రమంగా పెరుగుతున్న బలం... బలగం! రాబోయే ఎన్నికల యుద్ధంలో తాడోపేడో తేల్చుకొనే పకడ్బందీ వ్యూహం పదునెక్కుతున్న దృశ్యం.. సుస్పష్టం!

- 'దేశం'తో కదిలిన విపక్షాలు
- సభలో ప్రధానికి తొలి సవాల్
- శివసేనతో బీజేపీ రాజీ యత్నం?
- ఠాక్రేతో ఫడణవీస్ మంతనాలు
- అన్నాడీఎంకే, జేడీయూతో అవిశ్వాస చర్చకు బీజేపీ చెక్
- బీజేపీ వెంటే జయలలిత పార్టీ
- సభ ఆర్డర్‌లో ఉంటేనే చర్చ!
- ఎవరు ఎటువైపో చూద్దాం: నక్వీ


విపక్షాలు ఏకం కావాలి బాబు చేసింది మంచి పనే: మమత

ప్రత్యేక కథనాలు ...14, 15, 16లో

మోదీతో బాబు ఢీ

ఎన్డీయేతో కటీఫ్

కేంద్రంపై అవిశ్వాసం



- **బాబు మెరుపు నిర్ణయాలు.. వైసీపీ తీరుతో మారిన వ్యూహం**
- **సొంతగా అవిశ్వాసం.. టెలీకాన్ఫరెన్స్‌లోనే కటీఫ్ ప్రకటన**
- **నోటీసులు ఇవ్వాలని పార్టీ ఎంపీలకు ఆదేశం**
- **మీతో ఉండి ఒరిగిందేంటి?: షాకు ఘాటు లేఖ**
- **మీ నాటకాలకు ఇది తమిళనాడు కాదు.. మండలిలో ఫైర్**

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'అన్నీ నేనే... అంతా నేనే' అని సాగుతున్న మోదీ సర్కారుకు మొదటి కుదుపు! జాతీయ రాజకీయాల్లోనే కీలక మలుపు! 'దేశం' రంగంలోకి దిగింది! మొత్తం విపక్షంలోనే కదలిక వచ్చింది! ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం 'అవిశ్వాసం' రుచి చూడక తప్పని పరిస్థితి వచ్చింది. విపక్ష వైసీపీ ఒకవైపు అవిశ్వాసం

మిగతా 14వ పేజీలో...

11 పార్టీలతో బాబు ఫ్రంట్!


- ఇప్పటికే ఏర్పాటు.. ఏప్రిల్‌లో ప్రకటన
- రిపబ్లిక్ టీవీ సంచలన కథనం
- 'జాతీయం'పై ఆసక్తి లేదు, వెళ్లను: బాబు

వనరులా.. వివాదమా? మళ్లీ జైట్లీ కవ్వింపు

16



జగన్మాత అనుగ్రహంతోనే మోహ నివృత్తి



"పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణ హస్తే నమస్తే జగదేక మాతః" అని శ్యామలా దండకం. అమ్మవారి చెరుకువింటి, పుష్పబాణాల సూక్ష్మతత్వం లలితాసహస్ర నామాల్లో 'మనో రూపేక్షు కోదండా, పంచతన్మాత్ర సాయకా' అని చెప్పబడింది. లోకంలోని అందరి జనుల సమిష్టి మనసు ఆమె వామహస్తమున గల ఇక్షు కోదండం. శ్రోత, త్వక్, చక్షుర్, జిహ్వ, ఘ్రాణము (వినికిడి, స్పర్శ, చూపు, రుచి, వాసన)లనుభవించు విషయాలే పుష్పబాణాలుగా దేవి తన చేతియందుంచుకున్నది. మనుషుల కామనిరోధానికి, మనో నిరోధానికి ఆ తల్లి కారణమవుతోంది. దీనిపై మూక శంకరులు.. 'నీ కటాక్షము శివునే మోహపెట్టుచున్నది. కానీ, జనుల మోహమును మాత్రం శిథిలం చేయుచున్నది' అని పదేపదే చెప్పారు. జ్ఞానమయుడగు ఈశ్వరుని.. లోక క్షేమార్థం మోహింపజేయు శివకామ సుందరి కామాక్షి. ఆ తల్లే.. సతతం మోహమున మునిగిన భక్తుల మోహనివృత్తి చేయుచున్నది" అని చెప్పారు. ఆ జగన్మాత అనుగ్రహం ఉంటేనే మనకు మనసులో అవికారం, సమదృష్టి, నిర్మోహ స్థితి కలుగుతాయి. "అమ్మా.. ఒక్క దుర్గుణమైనా లేకుండునట్లు నా మనసును పరిశుద్ధం చెయ్యి" అని వేడుకుని అమ్మ అనుగ్రహం పొందితే ఎంతటి కామము (కోరిక) కలిగించు వస్తువులైనా మనసును చలింపజేయలేవు. ఎలాంటి ఐశ్వర్యమైనా మనను లోభపెట్టలేదు. అరిషడ్వర్గాలు అంతరించి చిత్త శుద్ధి కలగాలంటే దేవిని ధ్యానించాలి. జగన్మాత చరణములనెప్పుడూ స్మరించడమే చిరంజీవిత్వం.

-చంద్రశేఖరేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వామి ('జగద్గురు బోధలు' నుంచి)

Paramjyothi పరంజ్యోతి



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జగన్, వైసీపీ నాయకులు

అమరజీవి స్ఫూర్తితో హోదా!

పొట్టి శ్రీరాములు జయంతి సభలో వైఎస్ జగన్

పొన్నూరు, మార్చి 16: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రత్యేక హోదా సాధనకు ప్రజలు ముందుకు రావాలని ప్రతిపక్షనేత వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం పెదపాలెం క్యాంప్ ఆఫీసులో శుక్రవారం నిర్వహించిన పొట్టిశ్రీరాములు జయంతి కార్యక్రమంలో జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమరజీవి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రజలు, విద్యార్థులు, యువత ప్రత్యేక హోదా కోసం ప్రతినబూనాలని కోరారు. కాగా, కోర్టుకు హాజరు కావాల్సి రావడంతో శుక్రవారం ప్రజాసంకల్ప పాదయాత్రకు బ్రేక్ పడింది. కోర్టుకు హాజరైన ఆయన సాయంత్రం 6.30 గంటలకు గుంటూరు జిల్లా పెదపాలెంలోని తన క్యాంప్ ఆఫీసుకు చేరుకున్నారు.

సభకు రాకుండా జీతమెలా తీసుకుంటారు?

వైసీపీ ఎమ్మెల్యేలకు మంత్రి లోకేశ్ చురక



అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సభకు రాకుండా జీతాలు ఎలా తీసుకుంటారని వైసీపీ సభ్యులను మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న వైసీపీ సభకు హాజరు కాకపోవడం చాలా బాధగా ఉందన్నారు. సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చించకుండా దొడ్డిదారిన పారిపోతే ఎలాగని ప్రశ్నించారు. శుక్రవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అభివృద్ధి పనులు బాగా చేస్తుంటే.. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధికి సహకరించకపోగా, వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉపాధి పథకంలో అక్రమాలు జరుగుతున్నాయంటూ కేంద్రానికి లేఖలు రాస్తున్నారని విమర్శించారు. ఉపాధి కూలీల పొట్ట కొట్టడానికి కూడా వారు వెనుకాడటంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'డయాలసిస్‌కు బ్రేక్' వాస్తవమే..

ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించిన పూనం

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వాస్పత్రుల్లో గురువారం ఉదయం డయాలసిస్ సేవలు నిలిచిపోయిన విషయం వాస్తవమేనని ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య అన్నారు. 'డయాలసిస్‌కు బ్రేక్' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి శుక్రవారం ప్రచురించిన కథనంపై ఆమె స్పందించారు. నెఫ్రోప్లస్ అనే సంస్థ ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా డయాలసిస్ సేవలను నిలిపివేసిందన్నారు. దీని ఆధారంగా నెఫ్రోప్లస్ సంస్థపై ఎమర్జెన్సీ సేవల సర్వీసెస్ కింద క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చునన్నారు. కానీ రాష్ట్రంలో ఎక్కడా రోగులు ఇబ్బందులు పడలేదు కాబట్టి తొలి తప్పుగా భావించి విడిచిపెడుతున్నామని చెప్పారు. మరోసారి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని నెఫ్రోప్లస్‌ను హెచ్చరించినట్టు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లక్ష దాటిన జనసేన సభ్యత్వం

మిస్డ్ కాల్ మెంబర్‌షిప్‌కు ఆదరణ

గుంటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. కేవలం రెండు రోజుల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా లక్షా 12వేల 450మంది సభ్యత్వం పొందారు. ప్రజలు తమ సెల్‌ఫోన్ నుంచి 93940 22222 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే.. వెంటనే పార్టీలో సభ్యుడిగా చేరినట్లు మెసేజ్ వస్తుందని పవన్ ప్రకటించిన విషయం తెలిసిందే. శుక్రవారం పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ, మీడియా సెల్ ప్రతినిధులు సభ్యత్వ నమోదు వివరాలను వెల్లడించారు. ఇదిలా ఉంటే, జనసేన నేతాజీ యువసేన విభాగం, జనసేన ఝాన్సీ లక్ష్మీ వీరమహిళా విభాగం, జనసేన భగత్ సింగ్ స్టూడెంట్స్ వింగ్ విభాగాలను ప్రారంభించారు. ఈ కమిటీలను త్వరలో వెల్లడిస్తారు.

మిస్డ్ కాల్ పార్టీల జాబితాలో పవన్: సోమిరెడ్డి

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వని ప్రధాని మోదీకి వ్యతిరేకంగా పోరాడతానన్న పవన్ కల్యాణ్ ఒక్కసారిగా పన్నీర్ సెల్వంలా మారిపోయారని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ తరహాలో మిస్డ్ కాల్ పార్టీల జాబితాలో పవన్ కూడా చేరారా, జగన్‌ను ఆయన అనుసరిస్తున్నారా అని ప్రశ్నించారు. వైసీపీ మిస్డ్ కాల్ ఇస్తే పార్టీ సభ్యత్వం ఇస్తోందని, జనసేనలో కూడా అలాగే చేస్తోందని చమత్కరించారు. మంగళగిరిలో పవన్ ఇంటి నిర్మాణం జరిగేచోట తానూ ఇల్లు తీసుకుందామంటే, ఆరేడు కోట్లు ఖర్చు అవుతోందని, కానీ పవన్‌కు అక్కడ రూ.40లక్షలకే స్థలం ఇచ్చారని మంత్రి వ్యాఖ్యానించారు.

ఆధారాల్లేకుండా ఆరోపణలా?: విష్ణుకుమార్‌రాజు

లోకేశ్‌పై పవన్ వ్యాఖ్యలకు విష్ణుకుమార్ విస్మయం

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆధారాలు లేకుండా మంత్రి లోకేశ్‌పై పవన్ కల్యాణ్ ఆరోపణలు చేయడం సరికాదని బీజేపీ పక్షనేత పెనుమత్స విష్ణుకుమార్‌రాజు అన్నారు. ఫాతిమా విద్యార్థులకు టీడీపీ న్యాయం చేయలేదని పవన్ అనడం సరికాదన్నారు. ఫాతిమా విద్యార్థులకు న్యాయం చేశామని కామినేని శ్రీనివాస్ మంత్రిగా ఉన్నప్పుడు ఢిల్లీ చుట్టూ తిరిగారని చెప్పారు. శుక్రవారం ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. లోకేశ్‌పై చేసిన ఆరోపణలు మినహా మిగిలిన విషయాల్లో పవన్ మాట్లాడిన మాటలను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. జగన్, పవన్‌తో పొత్తు, పవన్‌తో బీజేపీ మాట్లాడిస్తుందన్న ఆరోపణల్లోనూ వాస్తవం లేదన్నారు. కడప స్టీల్ ఫ్యాక్టరీ, విశాఖ రైల్వేజోన్ త్వరలో ప్రకటించబోతున్నారని చెప్పారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శుక్రవారం సభలో ఆయన మాట్లాడారు. ఆర్థిక లోటు భర్తీ చేస్తున్నా.. ఆకస్మికంగా టీడీపీ యూ-టర్న్ తీసుకుందని, దీనిని రాజకీయ క్రీడగా అభివర్ణించారు. ఇచ్చినదాన్ని చెప్పుకోవడంలో బీజేపీ వీక్‌గా ఉంటే టీడీపీ ఉన్నత శిఖరాలు అధిరోహించిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే టీడీపీ ఎన్డీయే నుంచి బయటకు వచ్చిందని ఎమ్మెల్సీ మాధవ్ విమర్శించారు. టీడీపీ విడిపోయి తమ నెత్తిన పాలు పోసిందని వ్యాఖ్యానించారు.

సంపదతోనే సంక్షేమం!

ఏకపక్ష ధోరణితో వెళ్తే ఏదీ సాధ్యం కాదు

3 నెలలకోసారి పనితీరు సమీక్షించుకుంటా

సమష్టి కృషితో సత్ఫలితాలు: చంద్రబాబు



సీఎం చంద్రబాబును కలిసిన జూనియర్ డాక్టర్లు

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): 'సంపద సృష్టించాలి. సంక్షేమం ఉండాలి. ప్రైవేటు, పబ్లిక్ భాగస్వామ్యంతో సత్ఫలితాలు వస్తాయని నా విశ్వాసం, నా అనుభవం. ఏకపక్ష ధోరణితో ముందుకెళ్తే ఏదీ సాధ్యం కాదు. సమష్టి కృషితోనే సత్ఫలితాలు సాధ్యం. నేను ప్రతి మూడు నెలలకొకసారి ప్రభుత్వ సామర్థ్యాన్ని, నా పనితీరును సమీక్షించుకుంటా. లోపాలు సరిదిద్దుకొని ముందుకు సాగుతాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వెలగపూడి సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో శుక్రవారం నాబార్డు స్టేట్ ఫోకస్ పేపర్ 2018-19ని చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఏపీలో అనుబంధ రంగాల ప్రాజెక్టుల్లో నాబార్డు భాగస్వామిగా ఉండడం సంతోషకరమన్నారు. రైతుల భవిష్యత్‌ను దృష్టిలోపెట్టుకొని మైక్రో ఇరిగేషన్‌ను భారీ స్థాయిలో ప్రవేశపెట్టామన్నారు. రాయలసీమలో కరువును పారదోలేందుకు మైక్రో ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఆర్థికాభివృద్ధిలో దేశంలోనే సగటున ఏపీ నంబర్‌వన్ స్థానంలో ఉందని, ఈ నాలుగేళ్లలో మరింత ముందుకెళ్లిందని చెప్పారు. అభివృద్ధిలో గుజరాత్‌తో పోటీపడుతున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ, నాబార్డు లక్ష్యాల్లో తేడాలున్నా సూక్ష్మస్థాయి అధ్యయనంతో ఫలితాలు విశ్లేషించుకోవాలన్నారు. అలాగే ఈ ఏడాది మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. గుండె ఆపరేషన్లకు స్టెంట్లు అందించడంతోపాటు రక్తహీనత, చిన్నారుల్లో పౌష్ఠికాహార లోపం నివారణకు ప్రాధాన్యమివ్వాలని అన్నారు. అందుకు నాబార్డు సహకరించాలని కోరారు. వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల్లోనూ వృద్ధి రేటు బాగుందని చెప్పారు. సంక్షేమానికి సంపద సృష్టి జరగాలని అన్నారు. 2020-22 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేసే ప్రభుత్వ కృషికి దన్నుగా నాబార్డు ప్రాధాన్యత రంగానికి 2018-19కి మొత్తం రుణ ప్రణాళిక అంచనా రూ.1,65,043 కోట్లు కాగా వ్యవసాయ అనుబంధ రంగాల రుణ ప్రతిపాదనల అంచనా రూ.1,06,316 కోట్లుగా ఉంది. వీటిలో వ్యవసాయ కార్యకలాపాల్లో పెట్టుబడులకు 28 శాతం అని నాబార్డు జీఎం కేవీస్ రఘుపతి స్వాగతోపన్యాసంలో చెప్పారు. గత మూడేళ్లలో గ్రామీణ సహకార బ్యాంకుల్లో టెక్నాలజీ అనుసంధానంతో వివిధ ప్రాజెక్టులకు ఫైనాన్సియల్ ఇంక్లూజన్ ఫండ్ నుంచి రూ. 3852 లక్షలమేర నాబార్డు సాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాబార్డు ఏపీ రీజినల్ ఆఫీసర్ సీజీఎంకే సురేశ్‌కుమార్, ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ సుబ్రహ్మణియన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించిన జూడాలు

ఎట్టకేలకు జూనియర్ వైద్యులు సమ్మె విరమించారు. రెండు నెలల నుంచి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న జూడాలతో శుక్రవారం రాత్రి సీఎం చంద్రబాబు మరోసారి సమావేశం అయ్యారు. సీఎం చంద్రబాబు నుంచి స్పష్టమైన హామీ రావడంతో జూడాలు సమ్మెను విరమించేందుకు సమ్మతించారు. సీఎంతో భేటీ అనంతరం ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య మీడియాతో మాట్లాడారు. జూనియర్ వైద్యుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. స్టైఫండ్స్‌తోపాటు ఏరియర్స్‌ను కూడా వెంటనే అందిస్తామన్నారు. మరోవైపు ఇప్పటికే ఎంబీబీఎస్ వైద్యులకు రూరల్ సర్వీస్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని, పీజీలకు కూడా రద్దు చేస్తామన్నారు. ముఖ్యంగా స్టైఫండ్స్‌ను విద్యార్థుల హాజరును ఆధారంగా చేసుకుని వెంటనే అందించాలని ప్రిన్సిపాల్‌కు చెప్పామని పూనం మాలకొండయ్య తెలిపారు.



గుంటూరు జీజీహెచ్‌లో బాధితుడితో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

మీరేం మనుషులు?

ఇదేనా ఆరోగ్య ఆంధ్ర?

మంచినీళ్లు కూడా ఇవ్వలేని దుస్థితి!.. అమరావతికి పెట్టుబడులు ఎలా వస్తాయి?

ప్రాణాలు పోతుంటే రాజకీయాలా?.. నేను మరింత గట్టిగా విమర్శించగలను

48 గంటల్లోపు పరిస్థితి చక్కదిద్దాలి.. లేకుంటే నిరసన దీక్షకు దిగుతా: పవన్

గుంటూరు(మెడికల్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): "ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అంటే ఇదేనా? రాజధానికి అమరావతికి కూతవేటు దూరంలో ఉన్న గుంటూరులోనే డయేరియా మరణాలు సంభవించడమా? రక్షిత నీరు కూడా అందించలేని దుస్థితిలో ఏపీ ప్రభుత్వం ఉందని తెలిసి అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశాలు ఎలా ముందుకు వస్తాయి?" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. గుంటూరులో తీవ్ర అతిసార బారినపడిన వారిని ఆయన పరామర్శించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. గుంటూరు సంఘటనకు సంబంధించి ప్రభుత్వ స్పందనను తీవ్రంగా ఖండించారు. "ఏం మనుషులండీ మీరు? ప్రాణాలు పోతుంటే రాజకీయాలు చేస్తారా? నోటికి వచ్చినట్లు మాట్లాడితే, నేను కూడా దానికి పదింతలు, ఇంకా గట్టిగా మాట్లాడగలను. మనుషులు చనిపోతుంటే రాజకీయాలు చేస్తారా?" అని మండిపడ్డారు. ప్రభుత్వం 14 మంది మరణించినట్లు చెబుతున్నా... 24 మంది చనిపోయినట్లు తనకు సమాచారం ఉందని పవన్ తెలిపారు. "కలుషిత నీటితో జనం మృతి చెందినట్లు తెలిసినా ప్రభుత్వ పెద్దల్లో సరైన స్పందన లేదు. అదే నీటి కారణంగా ప్రజా ప్రతినిధులు మరణిస్తే ప్రభుత్వం ఇలాగే స్పందించేదా?" అంటూ పవన్ ఆవేశంగా ప్రశ్నించారు.

48 గంటలు డెడ్‌లైన్...

గుంటూరులో ప్రభుత్వం వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి పరిస్థితిని వెంటనే చక్కదిద్దాలని, సీనియర్ ఐఏఎస్ అధికారిని ఇన్‌చార్జ్‌గా నియమించాలని పవన్ డిమాండ్ చేశారు. 48 గంటల్లోపు గుంటూరులో పరిస్థితిని చక్కదిద్దకుంటే నిరసన దీక్షకు దిగుతానని హెచ్చరించారు. నగరంలో దెబ్బతిన్న మంచినీటి పైపులైన్లు మార్చి శాశ్వత ప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. బాధితులందరికీ ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తానని పవన్ పునరుద్ఘాటించారు. హోదా సాధనలో అన్ని పార్టీలు కలసి పని చేయాల్సి ఉన్నా రాజకీయ లబ్ధికోసం ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు.అవిశ్వాసంపై మాట ఎందుకు మారుస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. 23న అవిశ్వాసంఅన్న వైసీపీ ముందుగానే నోటీసు ఇచ్చిందని, అసలు అవిశ్వాసమే అక్కర్లేదన్న టీడీపీ కూడా శుక్రవారం ఆ దిశగా నిర్ణయం తీసుకుందని తెలిపారు.

బాధ్యులపై క్రిమినల్ కేసులు

8 మందిని సస్పెండ్ చేశాం: ప్రత్తిపాటి

హెల్త్ ఎమర్జెన్సీ అక్కర్లేదు: నారాయణ

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గుంటూరులో అతిసార మరణాలకు కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. తాగునీరు కలుషితం కావడానికి బాధ్యులైన 8మంది శానిటేషన్, ఇంజనీరింగ్ సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు మరణించిన 8మంది కుటుంబాలకు సీఎం ఆదేశాల మేరకు రూ.5లక్షలు చొప్పున చెక్కులు అందజేశామన్నారు. మృతుల కుటుంబాలకు చంద్రన్న బీమా కూడా వర్తింపజేస్తామని, వ్యాధిబారిన పడినవారికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. అతిసార సోకిన 130మంది ఆస్పత్రుల్లో చేరగా, 82మందికి నయమైందని పేర్కొన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ గుంటూరులో తాగునీటి కాలుష్యాన్ని నివారించేందుకు సూపర్ క్లోరినేషన్ చేయించామని, 71ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేయిస్తున్నామని తెలిపారు. 10అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచామన్నారు. గుంటూరులో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించాలని పవన్ కల్యాణ్ కోరారని, అయితే అంత అవసరం లేదన్నారు. శవరాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు.

సీఎంకు తీరిక లేదా?: సోము వీర్రాజు

గుంటూరు: తన నివాసానికి కూతవేటు దూరంలోనే డయేరియా బాధితులు మృతిచెందితే కనీసం వారి కుటుంబాలను పరామర్శించడానికి కూడా సీఎంకు తీరికలేదా అని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రశ్నించారు. ఎమ్మెల్యే మాణిక్యాలరావు మాట్లాడుతూ ప్రజలకు కావాల్సింది ఆనంద ఆదివారాలు కాదని, ఆనందపేట వాసులకు ఆనందం దక్కేలా చూడాలన్నారు.

పోలవరంపై సుదీర్ఘ సమీక్ష

మసూద్ నేతృత్వంలో నిపుణుల చర్చ

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, పరిహారంపై కేంద్రం నియమించిన నిపుణుల కమిటీ సుదీర్ఘంగా సమీక్షించింది. మసూద్ నేతృత్వంలోని కమిటీ సభ్యులు శుక్రవారం ప్రాజెక్టు భూసేకరణ, పరిహారం చెల్లింపు వంటి అంశాలపై పశ్చిమగోదావరి జిల్లా రెవెన్యూ యంత్రాంగం సహా.. సహాయ, పునరావాస కమిషనర్, రెవెన్యూ ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ ప్రాజెక్టు తాజా అంచనాలను అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రగతిని క్షేత్ర స్థాయిలో కమిటీ పరిశీలించింది. శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రాజమండ్రిలో జల వనరులశాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావుతో సహా ఇతర ఉన్నతాధికరులతో సమీక్ష నిర్వహించనుంది. ఈ సమీక్షలో భూసేకరణ, సహాయ పునరావాస చర్యలు, ప్రాజెక్టు తాజా అంచనాల సవరణ, పనుల్లో ప్రగతి వంటి అంశాలపై చర్చించనున్నారు. అనంతరం, ఈ కమిటీ విజయవాడకు వస్తుంది. జల వనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌తో భేటీ అయిన అనంతరం.. ఢిల్లీ వెళ్లనుంది.

ఏపీ నిధుల్లో కేంద్రం కోతలు

మంత్రి కళా వెంకట్రావు విమర్శ

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పథకం కింద రూ.1,900కోట్లు రావాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికి రూ.900కోట్లే కేటాయించిందని మంత్రి కళా వెంకట్రావు అన్నారు. అందులో రూ.560కోట్లు ఖర్చు చేస్తే రూ.211కోట్లు మాత్రమే విడుదల చేసిందని.. మండలిలో విమర్శించారు. కాగా, పట్టిసీమ ప్రాజెక్టును పూర్తిచేసి 2019నాటికి కర్నూలుకు నీరిస్తామని మంత్రి దేవినేని ఉమా చెప్పారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలోని పట్టణాల్లో ఇప్పటికే 61 కబేళాలు ఏర్పాటు చేశామన్నారు. మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ అరకు కాఫీని విదేశాలకు ఎగుమతి చేయడమే కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ చేనేత కార్మికులకు ముడిసరుకు, అద్దకపు రంగులు, రసాయనాల కొనుగోలుపై 20శాతం రాయితీని, పావలా వడ్డీ పథకాన్ని వర్తింపజేస్తున్నామని మంత్రి వివరించారు.

బీజేపీ పతనం ఖాయం

రాష్ట్ర మంత్రుల హెచ్చరిక

అమరావతి/నర్సీపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడే టీడీపీతో వైరం పెట్టుకునే పార్టీలు నాశనమవుతాయని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వైసీపీ, పవన్ కల్యాణ్‌తో డ్రామాలు ఆడిస్తున్న బీజేపీ పతనం కావడం ఖాయమన్నారు. మంత్రి అయ్యన్నపాత్రుడు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీని దెబ్బతీసి వచ్చే ఎన్నికల్లో అధికారం చేజిక్కించుకోవాలనే దురుద్దేశంతో పవన్‌కల్యాణ్ ద్వారా ముఖ్యమంత్రిపై, ఆయన తనయుడు లోకేశ్‌పైన ప్రధాని మోదీ అవినీతి ఆరోపణలు చేయించడం రాజకీయ వ్యభిచారం అవుతుందన్నారు. మంత్రి భూమా అఖిలప్రియ మాట్లాడుతూ, బీజేపీతో తెగతెంపులు చేసుకోవడంతో మైనార్టీలు టీడీపీ వైపు వస్తారన్నారు. కాగా, మట్టి-నీళ్లతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందా? అని ఎమ్మెల్సీ శమంతకమణి మండలిలో మండిపడ్డారు. ఆదుకొంటామని చెప్పి, అధికారంలోకి రాగానే ప్రధాని మోదీ మొండిచెయ్యి చూపారని విమర్శించారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కడప	38.0	23.0
విజయనగరం	34.0	23.0
ఏలూరు	37.0	23.0
హైదరాబాద్	30.1	24.5
చిత్తూరు	37.6	25.2
గుంటూరు	35.0	24.0
శ్రీకాకుళం	32.0	21.0
విజయవాడ	34.3	25.4
ప్రకాశం	33.8	25.6
విశాఖపట్నం	37.0	25.8
రాజమండ్రి	34.5	24.5
నెల్లూరు	36.0	25.2

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దాదాపు 65 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 8 గంటలు, దివ్యదర్శనానికి సుమారు 2 గంటల సమయం పడుతోంది. ఆదివారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో శనివారం లాటరీ ద్వారా జారీచేసే టికెట్లు.. సుప్రభాతం:50, ఆన్‌లైన్‌లో రూ.300 టికెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



'సింధు'కు బదులుగా జాతీయగీతంలో 'ఈశాన్యం'

ఈశాన్యం భారత్‌లో ముఖ్యమైన భాగం. పాకిస్థాన్‌లో భాగంగా ఉన్న 'సింధు' స్థానే మన జాతీయ గీతంలో ఈశాన్యమని చేర్చాలి.


- కాంగ్రెస్ ఎంపీ రిపున్ బోరా



ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తే.. మేమూ చేస్తాం


ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేస్తే.. మేమూ కూడా అణ్వాయుధాలను సమకూర్చుకుంటాం. జర్మనీని నాజీలు నాశనం చేసినట్లే మిడిల్ ఈస్ట్ దేశాలను అయతుల్లా నాశనం చేయాలనుకుంటున్నారు.

- సౌదీ రాజకుమారుడు మహ్మద్ బిన్ సల్మాన్



కణ చికిత్సతో అల్జీమర్స్‌కు చెక్

వాషింగ్టన్, మార్చి 16: మెదడు సామర్థ్యం మందగించి మతిమరుపు వ్యాధి వస్తుంది. ముఖ్యంగా వయసు పైబడిన వారిలో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ సమస్యకు కణ చికిత్సతో చెక్ పెట్టి మెదడు పనితీరును మెరుగుపరచవచ్చని అమెరికాలోని గ్లాడ్‌స్టన్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు తెలిపారు. 'ఇన్హిబిటరీ ఇంటర్‌న్యూరాన్స్'ను మార్పిడి చేస్తే మతిమరుపును దూరం చేయొచ్చని వివరించారు.



నవ్వితే.. ఆడో, మగో చెప్పేస్తుంది

లండన్, మార్చి 16: నవ్వుతోనే వ్యక్తి లింగం ఏదనేది చెప్పవచ్చంటున్నారు యూకేలోని బ్రాడ్‌ఫర్డ్ వర్సిటీ శాస్త్రవేత్తలు. కళ్లు, నోరు, ముక్కు, పెదాలున్న చోట శాస్త్రవేత్తలు 49 గుర్తులను జతపరిచి కృత్రిమ మేధస్సు ఆధారంగా ఓ విధానాన్ని అభివృద్ధి చేశారు. స్త్రీలు, పురుషుల నవ్వులో ఉన్న తేడాను గుర్తించడం ద్వారా లింగాన్ని కనుక్కోవచ్చని వారు తెలిపారు.

అకాల వర్షం



శ్రీవారి ఆలయం ముందు వర్షం కురుస్తున్న దృశ్యం

విజయనగరం, ప్రకాశం జిల్లాల్లో పిడుగులు

ఇద్దరు కూలీలు, మహిళ దుర్మరణం

జిల్లెలపాడు వాగులో ఒకరి గల్లంతు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో పలు జిల్లాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో పిడుగుపాటుకు ముగ్గురు బలయ్యారు. తూర్పుగోదావరి జిల్లా ఎటపాక మండలంలో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. విజయనగరం జిల్లాలో పలు ప్రాంతాల్లో కురిసింది. గరుగుబిల్లి మండలం అఖనాపురం గ్రామానికి చెందిన సిరిపురపు పార్వతి (35) పొలంలో పనిచేస్తుండగా పిడుగుపడి దుర్మరణం చెందింది. ఇక ప్రకాశం జిల్లాలో అక్కడక్కడా కందులు, మిర్చి తడిసినట్లు తెలిసింది. పలు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చీమకుర్తి సమీపంలోని గ్రానైట్ క్వారీల వద్ద పనిచేస్తున్న ఒడిశాకు చెందిన కాలుచరణ్ చిసోయ్ (34), భ్రమరాసేథ్ (43) అనే ఇరువురు వలస కార్మికులు పిడుగుపడి చనిపోయారు. దర్శి పట్టణంలో వడగళ్ల వాన కురిసింది. వెలిగండ్ల మండలంలో భారీ వర్షం కురిసింది. రాత్రి 9గంటల సమయంలో మొగుళ్లూరుపల్లి వాగులో కొట్టుకుపోతున్న ఇద్దరిని గ్రామస్తులు తాళ్ల సహాయంతో కాపాడారు. కాగా.. తమ్మినేనిపల్లికి చెందిన వరికూటి శ్రీనివాసరెడ్డి (45) మోటారుసైకిల్‌తో పాటు జిల్లెలపాడు వాగులో కొట్టుకుపోయాడు. సమాచారం అందిన వెంటనే కనిగిరి సీఐ ఎం.సుబ్బారావు, సిబ్బందితో వాగు ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు.అటు.. గుంటూరు జిల్లా మాచర్లలోనూ భారీ వర్షం కురిసింది. మార్కెట్ యార్డులో కంది బస్తాలు ఆకస్మిక వర్షానికి తడిసిపోయాయి.

తిరుమలలో భారీ వర్షం

తిరుమలలో గంటన్నరపాటు కురిసిన వర్షానికి.. శ్రీవారి ఆలయ ప్రాంతం, మాడవీధులు, రోడ్లు, కాటేజీలు, పార్కులు జలమయమయ్యాయి. ఆకస్మికంగా వర్షం కురవటంతో భక్తులు తడిసిపోయారు.

నేడూ వర్షసూచన

విశాఖపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అరేబియా సముద్రం నుంచి రాయలసీమలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం దిశగా తేమగాలులు వీస్తున్నాయి. దీంతో వాతావరణ అనిశ్చితి నెలకొని ఈదురుగాలులు, పిడుగులతో రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కడప, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయి. అక్కడక్కడా భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

పెన్షన్ తప్పునకు 'జమ'తో సరి!

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పిడుగురాళ్ల, మార్చి 16: చనిపోయినప్పటికీ 14 నెలలపాటు పెన్షన్ జమ చేసిన గుంటూరు జిల్లా పిడుగురాళ్ల ట్రెజరీ అధికారులు 'ఆంధ్రజ్యోతి' కథనంతో కలవరపడ్డారు. 'పింఛన్ కోసం బతికించారు' అనే శీర్షికతో శుక్రవారం కథనం ప్రచురితం కావడంతో ట్రెజరీ అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయమే తల్లం తులశమ్మ కుమారుడు చలపతిరావును కార్యాలయానికి పిలిపించారు. డ్రా చేసిన రూ.2.20 లక్షలను ప్రభుత్వ ఖాతాలో జమ చేయించారు.

ఎన్టీఆర్ కల నెరవేరింది

మడకశిర బ్రాంచి కాలువకు కృష్ణా జలాల విడుదల



నీటిని విడుదల చేస్తున్న సునీత, బాలకృష్ణ

హిందూపురం, మార్చి 16: హంద్రీనీవాను పూర్తిచేసి ప్రతి చెరువుకు నీరుతెచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ కల నెరవేర్చారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. శుక్రవారం సాయంత్రం అనంతపురం జిల్లా పెనుకొండ సమీపంలోని గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచి కాలువకు కృష్ణా జలాలను మంత్రి సునీత, ఎమ్మెల్యేలు బాలకృష్ణ, పార్థసారథి విడుదల చేశారు.

ఆ ఈవోను సస్పెండ్ చేయాలి : బండారు

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సింహాచలం అప్పన్న ఆలయ ఈవోను వెంటనే సస్పెండ్ చేయాలని టీడీపీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కోరారు. 'అప్పన్న ఆలయంలో అపచారం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తాకథనాన్ని ఆయన శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. స్వామికి రాజభోగం చేసి మహా నివేదన చేయడానికి ముందునుంచే ఓ మహిళ గర్భాలయంలో ఉండటం అపచారమన్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా కనీసం సంప్రోక్షణ చేయకపోవడం దారుణమని, ఇది ఆలయానికి, ప్రజలకు కూడా మంచిది కాదని పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను పరిగణనలోనికి తీసుకుని వెంటనే ఈవోను సస్పెండ్ చేయాలని ఆయన కోరారు.

'ఆర్థిక' లాఘవం!

నరేంద్రమోదీ ప్రభుత్వపు ఆఖరు బడ్జెట్ ఎటువంటి చర్చాలేకుండానే మూజువాణీ ఓటుతో సభామోదం పొందింది. గత రెండురోజుల్లో పార్లమెంటులో అత్యంత సుదీర్ఘమైన, కీలకమైన ఫైనాన్స్ బిల్లు, గ్రాట్యుటీ చెల్లింపుల బిల్లు, ప్రత్యేక పరిహార బిల్లు ఇత్యాదివి ఇదే తోవన ఆమోదం పొందాయి. రోజుల తరబడి చర్చోపచర్చలు జరిగి, విపక్షాల అభ్యంతరాల మేరకు మార్పుచేర్పులతో జరగాల్సిన పనులు నిముషాల్లో ముగిసిపోయాయి. కీలకమైన బిల్లులపై చర్చకు వీలుగా విపక్షాలను శాంతింపచేసి దారికి తేవడం వంటి ఉదాత్తమైన లక్షణాలను అధికారపక్షంనుంచి ఎలాగూ ఆశించడంలేదు కానీ, ఉద్దేశపూర్వకంగా వాటిని రెచ్చగొట్టడం, రభస మధ్యలో, 'గిలెటిన్' ప్రయోగంతో వివాదాస్పదమైన బిల్లులను గటెక్కించడం వంటి విన్యాసాలే అమితాందోళన కలిగిస్తున్నాయి.

బడ్జెట్ ప్రతిపాదనలపై సాధ్యమైనంత చర్చ జరగడమూ, చివరకు సమయాభావం వల్ల కొన్నింటికి నామమాత్రపు ఆమోదానివ్వడం గతంలో చూసిందే. కానీ, వందశాతమూ గిలెటిన్ మార్గంలోనే జరగడం ఎన్నడో కానీ చూడని వింత. కీలకమైన రైల్వేశాఖ బడ్జెట్‌లోనే నిక్షిప్తమైన నేపథ్యంలో, దశాబ్దకాలంలో అత్యధిక రైలు ప్రమాదాలు గత ఏడాది చవి చూసిన తరుణంలో ఆ శాఖ అవసరాలు కేటాయింపులపై విస్తృతమైన చర్చ జరిగివుంటే బాగుండేది. వ్యవసాయ రంగం కునారిల్లిపోయి రైతులు ఆత్మహత్యలతోనూ, పాదయాత్రలతోనూ దేశాన్ని కుదిపేస్తున్న దద్దరిల్లిపోతున్న నేపథ్యంలో దీని గురించి కూడా మాట్లాడుకొనివుంటే బాగుండేది. ఆరోగ్య రంగాన్ని పటిష్ఠం చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు ఎందుకు తగ్గించిందో ప్రశ్నించివుంటే సముచితంగా ఉండేది. గ్రామీణ పేదలకు ఇళ్ళుకట్టించి ఇచ్చే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కార్యక్రమానికి భారీ కేటాయింపులు ఉండికూడా ఖర్చు ఎందుకు చేయలేదో అడిగినా, గాంధీ పేరున్న గ్రామీణ ఉపాధి గ్యారంటీ పథకానికి అవసరపడినన్ని నిధులు ఎందుకీయలేదని నిలదీసినా ఎంతోమందికి మేలు జరిగేది. ఇవి జరగకపోవడం అటుంచి, ప్రజల కన్నుగప్పి, గుట్టుచప్పుడు కాకుండా గిలెటిన్ మార్గంలో ముందుకు నెట్టేసిన వ్యవహారాలు కొన్ని ఉన్నాయి. 218 సవరణలతో కూడిన ఫైనాన్స్ బిల్-2018లో అత్యంత కీలకమైన అంశాలు కొన్ని దాగున్నాయి. 2010నాటి విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) రాజకీయపక్షాలు విదేశీ విరాళాలను అందుకోవడాన్ని నిషేధిస్తున్నది. ఆ నిషేధాలను, నిఘాలను, విచారణలను ఎత్తిపారేస్తూ ఇప్పుడు దానికి సవరణ జరిగింది. రాబోయే కాలంలో, అందుకోబోయే విరాళాల గురించి కాదు, గత నలభైయేళ్ళుగా అందుకున్న విరాళాల విషయంలో అన్ని రాజకీయ పార్టీలకు ఇకపై ఏ బాధాలేకుండా, కాగ్ నుంచి న్యాయస్థానాల వరకూ ఎవరి వేధింపులు తలనొప్పులు లేకుండా జాగ్రత్తగా చేసుకున్న సవరణ ఇది. గతంలో బ్రిటన్‌కు చెందిన కంపెనీ వేదాంతనుంచి కోట్లాది రూపాయలు విరాళాలు తీసుకున్నందుకు ఢిల్లీ హైకోర్టు 2014లో కాంగ్రెస్, బీజేపీలను దోషులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటి సవరణతో రెండు పార్టీలూ ఆ తీర్పు నుంచి విముక్తి పొందాయి. ఇకపై, యాభైశాతం విదేశీ వాటాలున్న దేశీయ కంపెనీలు యథాశక్తిగా దేశంలోని రాజకీయపక్షాలకు భూరి విరాళాలు ఇవ్వవచ్చు. 2016నాటి ఫైనాన్స్ బిల్లు 2010నుంచి కంపెనీలకు ఈ అర్హతను దఖలు పరిస్తే, ఈ ఏడాది ఫైనాన్స్ బిల్లు నాలుగుదశాబ్దాల సాపేక్ష ప్రభావాన్ని కల్పించింది. గత ఏడాదిలో ఇలాగే గిలెటిన్ మార్గంలో నెగ్గిన ఫైనాన్స్ బిల్లు ఎన్నికల బాండ్లను తెచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల రంగంలో అద్భుతమైన సంస్కరణగా మన కాపలాదారులు అభివర్ణించిన ఈ బాండ్లు ఎంత అక్రమంగా ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. బాండ్లు కొన్నవారు వాటిని ఏపార్టీకి ఇచ్చారో, అందుకున్న పార్టీలు ఎవరు ఇచ్చారో, ఎంత ఇచ్చారో ఎవరికీ చెప్పనక్కరలేని సంస్కరణ ఇది. కార్పొరేట్ రంగం ఇచ్చే విరాళాల విషయంలో అప్పటివరకూ ఉన్న నిబంధనలు, పరిమితులు ఈ దెబ్బతో తొలిగిపోయాయి.

ఎన్నికల వ్యవస్థనీ, దేశ రాజకీయాలను విషపూరితంగా మార్చేస్తున్న విరాళాల విషయంలో ఇంతటి కుట్రలకు పాల్పడటమే ఆవేదన కలిగిస్తున్నది. చిన్నచిన్న అంశాలపై పరస్పరం కయ్యానికి కాలుదువ్వుతూ సామాన్యులను మాయచేస్తున్న రాజకీయపక్షాలు తమకు వచ్చే నిధుల విషయంలో చివరకు న్యాయవ్యవస్థలు కూడా నిలదీయలేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఇకపై, వేలకోట్ల భారీ కాంట్రాక్టు పొందిన ఒక సంస్థ తన లాభంలో యాభైశాతాన్ని అధికారంలో ఉన్న రాజకీయపార్టీకి విరాళం ఇవ్వవచ్చు. దానిని పార్లమెంటరీ విలువల కమిటీయో, కాగ్ తదితర సంస్థలో ప్రశ్నించడానికి వీల్లేదు. రాజకీయ అవినీతిని దునుమాడుతున్నట్టు కనిపించే అధికారపక్షం అడ్డుతోవలో రక్షణ కవచాలను కప్పుతున్న అద్భుతమైన విన్యాసం ఇది.

జనవాక్యం

విలంబికి స్వాగతం

స్వాగతంబిదె నూతన వత్సరంబ
ప్రగతి మార్గావలంబ 'విలంబి'వగుచు
వచ్చినావు హృత్కమలంబు విచ్చుకొనగ
మంచి చేయుము నీవు నమస్కరింతు

కొమ్మలెక్కి పిక స్వామి కూయువేళ
శ్రీయుత వసంత శోభరాజిల్లు వేళ
పూజనమ్మగు మల్లెలు పూయువేళ
వచ్చినావు హర్షంబును తెచ్చినావు

తెలుగువారి కీర్తిద్యుతి తేజరిల్ల
వత్సరాదివై అరుదెంచు భాగ్యమీవె
కాల నిర్ణయ నక్షత్ర గమనమీవె
రాశి ఫలములు తెల్పెడి రాణివీవె

మనుజులందు మనసులందు మమత నిండ
నడతయందున మిగుల మా'నవత' పండ
శాంతి చంద్రిక జగమందు సందడింప
నీదు కరుణా కటాక్షంబు నెగడనిమ్ము

అన్నదాతకు చేయూతవై చరింపు
తెలుగుబాసకు శక్తివై వెలుగునింపు
సంప్రదాయ ధ్వజంబెత్తి యురిగ సాగి
పొమ్ము విజయమ్ము దిగ్విజయమ్ము నీకు

– మంకుశ్రీను, కొప్పర్రు

నీవైనా తేవమ్మా తీపికబురు!

ప్రత్యేక హోదా కోల్పోయిన ఉగాది
ఏం చూస్తావు మమ్మల్ని ఎగాదిగా
కాషాయాన్ని నమ్మి సన్యాసులైనాము
హోదాపోయి గోదాలో దిగాము
చేదు, తీపి జంటరుచుల పర్వదినాన
చేదు మాత్రం మింగి ముఖం మాడ్చుకున్నాము
రాష్ట్రాభివృద్ధి రాచపుండు వైద్యమాయ
ఉగాది రోజున పెద్దలకు హారతిచ్చి
మా గోడు చెప్పి గొల్లుమన్నది వేడుకాయ
పచ్చని పూదోటలో శిశిరం చిందేసే
పెట్టుకున్న ఆశలన్నీ పెట్లుప్పు అయి పేలిపోయె
నీవైనా తేవమ్మా నూతన తెలుగు సంవత్సరాన
పెద్దల మనసు మంచిగ మార్చి
హోదాపై తీపి కబురు

– ఆవులపాటి రెడ్డెప్ప

జాతీయపార్టీలకు కాలం చెల్లింది

జాతీయ పార్టీల కాలం చెల్లిందని ఉత్తరప్రదేశ్, బిహార్ ఉపఎన్నికల ద్వారా తేలిపోయింది. ఒక వైపు బీజేపీ గత నాలుగేళ్ళలో కేవలం మతపర అంశాలకే ప్రాధాన్యమివ్వడం, పౌరుల వాస్తవ సమస్యలపై స్పందించకపోవడం, కొందరు బడా వ్యాపారవేత్తలకు లబ్ధిచేకూరేలా నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. రెండవ జాతీయ పార్టీ కాంగ్రెస్ పరిణితి లేని రాహుల్ నాయకత్వం వల్ల దిక్కు తోచని పరిస్థితిలో వున్నది. ఈ పరిస్థితుల్లో దేశ ప్రజలకు కేసీఆర్ మూడవ జాతీయ ఫ్రంట్ ఏర్పాటు ప్రకటన ఎంతో ఊరట కల్గించింది. ఆయన సారథ్యంలోని మూడవ ఫ్రంట్ రాబోయే ఎన్నికల్లో సృష్టించబోయే సునామీలో జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీలు పూర్తిగా కనుమరుగవ్వక తప్పదు.

– ఇఫ్తెఖార్ అహ్మద్

లెనిన్, భారతీయ మార్క్సిస్టులు

■ రామచంద్ర గుహ



గతానుగతం

త్రిపురలో మార్క్సిస్టు పాలకులు సర్దార్ భగత్ సింగ్ విగ్రహాలను నెలకొల్పి ఉన్నట్టయితే ఏమి జరిగేది? సిపిఎం అధికారాన్ని కోల్పోయిన తరువాత బీజేపీ కార్యకర్తలు ఆ విగ్రహాలను ధ్వంసం చేసివుండేవారా? ఒక సంవత్సరం క్రితం సిపిఎం సభ్యుడైన ఒక చరిత్రకారునితో బెంగుళూరులో మాటా మంతీ జరిపాను. ఆయన విద్వత్ పరుడు, క్రికెట్ అభిమాని. ఆ చరిత్రకారుని కమ్యూనిస్టు విశ్వాసాలతో ఏకీభవించకపోయినప్పటికీ ఆయనంటే నాకు చాలా ఇష్టం. సిపిఎం సభలు, సమావేశాలలో తప్పకుండా ప్రదర్శించే నాలుగు చిత్రపటాలలో రెండు 19వ శతాబ్ది జర్మన్ తాత్త్వికులవీ (మార్క్స్, ఏంగెల్స్), మరో రెండు రష్యన్ నియంతలవీ (లెనిన్, స్టాలిన్) కావడానికి కారణమేమిటని ఆయన్ని అడిగాను. భారతీయ ప్రముఖుల చిత్రపటాలను ప్రదర్శించడానికి అభ్యంతరమేమిటి? కనీసం సర్దార్ భగత్ సింగ్ చిత్ర పటాన్ని అయినా పెట్టవచ్చుగా?


భగత్ సింగ్ భారతీయుడూ, మార్క్సిస్టు కూడానూ. అయితే ఈ దేశ ప్రధాన వామపక్షాలు ఆయన్ని మరచిపోయాయి. ఈ కారణంగానే హిందుత్వ వాదులు ఆయన స్మృతిని పునరుజ్జీవింపచేసి ప్రశంసాపూర్వకంగా గౌరవిస్తున్నారు. అయినా సిపిఎం దీన్నెలా అనుమతించిందని చరిత్రకారుడైన నా మిత్రుడిని అడిగాను. ఆయన నాతో ఏకీభవించారు. ఈ అంశాన్ని తమ పార్టీ పెద్దల దృష్టికి తీసుకువెళతానని అన్నారు. అయితే ఈ విషయంలో ఆయన కృషి పెద్దగా ఫలించలేదు. భగత్‌సింగ్ కంటే లెనిన్, స్టాలిన్‌లను సిపిఎం ఎక్కువగా అభిమానించడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి– జడత్వం. చిన్నప్పటి నుంచి లెనిన్ స్టాలిన్‌ను అభిమానిస్తున్నందున వారు మరోలా ఆలోచించలేరు. వైష్ణవ వాతావరణంలో పుట్టి పెరిగిన వారు విష్ణువులో మినహా మరెవరిలోనూ దైవత్వాన్ని చూడలేరు. అలాగే మార్క్సిస్టులూ బాల్యంలో తాము ఆరాధించినవారిని మినహా మరెవ్వరినీ మహా దార్శనికులు, నాయకులుగా అంగీకరించలేక పోతున్నారు.

ఇక రెండో కారణం సిపిఎం గౌరవించే నాయకులలో భగత్‌సింగ్ ఒక మైనర్ వ్యక్తి. సిపిఎం మూలాలు అవిభక్త భారతదేశపు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో ఉన్నాయి. మరి భగత్‌సింగ్ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో సభ్యుడు కానేకాదు. ఆయన హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ (హెచ్ఎస్ఆర్ఏ) సభ్యుడు బొంబాయి, కోల్‌కతా కార్మిక శ్రేణులలో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీకి ఎనలేని ఆదరణ ఉండేది. హెచ్ఎస్ఆర్ఏ ఉత్తర భారతావనిలో మాత్రమే చురుగ్గా ఉండేది. భగత్ సింగ్ మార్క్సిస్టు అయినప్పటికీ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు కాకపోవడం వల్ల పార్టీ సభావేదికలపై ఆయన చిత్రపటాన్ని ప్రదర్శించడానికి సిపిఎం విముఖత చూపుతున్నది.

సరే, త్రిపురలో లెనిన్ విగ్రహాల పట్ల బీజేపీ అభ్యంతరానికి కారణం ఆయన విదేశీయుడు కావడమే. నిజానికి ఆ విగ్రహాలు త్రిపుర కమ్యూనిస్టు నాయకుడు నృపేన్ చక్రవర్తివి అయివున్నట్టయితే వాటిని తాము ధ్వంసం చేసేవాళ్ళం కామని బీజేపీ కార్యకర్త ఒకరు చెప్పినట్లు ఒక జాతీయ దినపత్రిక పేర్కొంది. అయితే సమస్య లెనిన్ విదేశీయుడు కావడం కాదు, ఆయన ప్రజాస్వామ్యవాది కాకపోవడమే. లెనిన్ నిరంకుశుడు, క్రూరపాలకుడు. అతడు మొదట తన దేశాన్ని తన పార్టీకి అధీనం చేశాడు. ఆ తరువాత పార్టీని పూర్తిగా తన వశంలోకి తీసుకున్నాడు. శత్రువులు, ప్రత్యర్థులను నిర్దాక్షిణ్యంగా అంతమొందించాడు. మేధావుల స్వాతంత్ర్యం, కళాకారుల స్వేచ్ఛపై ఆంక్షలు విధించాడు. అత్యంత అమానుషమైన స్టాలిన్ నియంతృత్వ పాలనకు బాటలు వేసిందీ లెనినే.

విదేశీ సిద్ధాంతాలు, నాయకులపై బీజేపీ విముఖతలో నేను పాలుపంచుకోలేను. మానవాళి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు కృషిచేసిన, పోరాడినవారు ఏ దేశం వారైనా మనం గౌరవించాలి. మన నగరాలు, పట్టణాలలో నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్ కింగ్, వాక్లేవ్ హావెల్ మొదలైన వారి విగ్రహాలను నెలకొల్పితే నేను చాలా సంతోషిస్తాను.

లెనిన్‌లో పగబట్టే గుణం ఉండేది. తన రచనలు, ప్రసంగాలలో ప్రత్యర్థులందరినీ తీవ్ర పదజాలంతో దూషించేవాడు. బూర్జువాలనేకాదు తనతో ఏకీభవించని సోషలిస్టులనూ ఆయన ద్వేషించేవాడు. లెనిన్ ఆగ్రహానికి గురైన వారిలో జర్మన్ మార్క్సిస్టు ఎడురాడో బెర్న్‌స్టెయిన్ ఒకరు. హింసాత్మక విప్లవం ద్వారా గాకుండా శాంతియుత ప్రజాస్వామిక మార్పుల ద్వారా మానవాళి స్థితిగతులను మెరుగుపరచాలని బెర్న్ స్టెయిన్ భావించారు. భారతీయ మార్క్సిస్టులు లెనిన్ కంటే బెర్న్‌స్టెయిన్‌నే ఆదర్శంగా తీసుకోవడం మంచిది. సంస్కరణవాద సోషలిస్టులు పశ్చిమ యూరోప్‌లో సుదృఢమైన సంక్షేమ రాజ్యాలను నిర్మించగా లెనిన్ రష్యాలో జార్ నియంతృత్వాన్ని కూలదోసి అంతకంటే క్రూరమైన బోల్షివిక్‌ల నియంతృత్వ పాలనను నెలకొల్పాడు. దశాబ్దాలుగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటూ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలకు సిపిఎం సారథ్యం వహిస్తోంది. అయితే లెనినిస్ట్ సూత్రాల ప్రాతిపదికన నడిపే ఏక-పార్టీ రాజ్య వ్యవస్థలో తన సైద్ధాంతిక విశ్వాసాన్ని సిపిఎం ఇంతవరకు స్పష్టంగా త్యజించలేదు!



అధికారం చెలాయించగలిగినప్పుడు, ప్రభుత్వ వ్యవస్థలు, పాలనా బాధ్యతలను పార్టీ ప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించుకో గలిగినప్పుడు మాత్రమే కమ్యూనిస్టులు ప్రభుత్వాలలో చేరాలని లెనిన్ విశ్వసించారు. ఇతర పార్టీలు, రాజకీయవేత్తలతో సమానస్థాయిలో అధికారాన్ని పంచుకోవడమనేది లెనిన్ సిద్ధాంతానికి విరుద్ధం. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు లెనినిస్టులు కావడం వల్లే 1996లో జ్యోతిబసు భారత ప్రధానమంత్రి పదవిని చేపట్టేందుకు అనుమతించలేదు.

అధికారం చెలాయించగలిగినప్పుడు, ప్రభుత్వ వ్యవస్థలు, పాలనా బాధ్యతలను పార్టీ ప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించుకోగలిగినప్పుడు మాత్రమే కమ్యూనిస్టులు ప్రభుత్వాలలో చేరాలని లెనిన్ విశ్వసించారు. ఇతర పార్టీలు, రాజకీయవేత్తలతో సమానస్థాయిలో అధికారాన్ని పంచుకోవడమనేది లెనిన్ సిద్ధాంతానికి విరుద్ధం; దీనికితోడు అటువంటి సౌభ్రాతృత్వ స్ఫూర్తి ఆయన స్వభావంలోనే లేదు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు లెనినిస్టులు కావడం వల్లే 1996లో జ్యోతిబసు భారత ప్రధానమంత్రి పదవిని చేపట్టేందుకు అనుమతించలేదు.

2004లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన యూపీఏ ప్రభుత్వంలో చేరకపోవడం ద్వారా సిపిఎం నిస్సందేహంగా మరో ఘోర తప్పిదానికి పాల్పడింది. 1996లో జ్యోతిబసు మైనార్టీ సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించివుండేవారు. అయితే అది అధికారంలో ఉన్నంతవరకు బలహీనంగానే ఉండివుండేది. ఒక ఏడాది, మహా అయితే రెండు సంవత్సరాల పాటు మనుగడ సాగించగలిగేది. అయితే 2004లో యూపీఏ ప్రభుత్వంలో వామపక్షాలు చేరివున్నట్టయితే అవి ఒక సుస్థిరమైన, దృఢమైన ప్రభుత్వంలో భాగస్వాములు అయివుండేవి. లెనినిస్టు పిడివాద సిద్ధాంతాల ప్రభావం కారణంగానే 2004లో కూడా ప్రభుత్వంలో చేరడానికి సిపిఎం వెనుకాడింది. ఇతర పార్టీలతో కలిసి పనిచేయవద్దని దశాబ్దాల క్రితమే లెనిన్ స్పష్టంగా ఆదేశించాడు కదా. ఆ ఆదేశానికి నిబద్ధమై మార్క్సిస్టులు మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో చేరలేదు. ఇందుకు వారు భారీ మూల్యాన్ని చెల్లించారు. భారతదేశ ప్రజలు కూడా పెద్ద మూల్యాన్ని చెల్లించారు.

కాలం చెల్లిన సిద్ధాంతాలను అనుసరిస్తున్న వారైనప్పటికీ భారతీయ కమ్యూనిస్టు రాజకీయ వేత్తలు మిగతా పార్టీల నాయకుల కంటే భిన్నమైన వారు. ప్రపంచ గమనం పట్ల మెరుగైన అవగాహనతో వ్యవహరిస్తారు. మతతత్వ ధోరణులు వారిలో కన్పించవు. అవినీతిపరులు కాదు. రాజకీయాలలో కుటుంబ సభ్యులను ప్రోత్సహించరు. 2004లో యూపీఏ ప్రభుత్వంలో సిపిఎం చేరివున్నట్లయితే ఆ పార్టీ ఎంపీలకు వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, గిరిజన, మహిళా, శిశు సంక్షేమ మొదలైన మంత్రిత్వ శాఖలు లభించివుండేవి. పేదల సంక్షేమానికి ఇతోధిక కృషి చేసివుండేవారు. తద్వారా దేశ ప్రజలలో మరీ ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలలో వామపక్షాలకు గుర్తింపు తెచ్చేవారు.

1920వ దశకంలో లాహోర్ నగరంలో నివసించిన సర్దార్ భగత్‌సింగ్‌కు లెనిన్, స్టాలిన్‌లు రష్యాలో నెలకొల్పిన కమ్యూనిస్టు ప్రభుత్వ వికృతాలు, భయానక తప్పిదాల గురించి తెలుసుకోగల అవకాశం ఎంతమాత్రం లేదు. 1930వ దశకంలోనే, సోవియట్ రష్యాలో కరువులు, నిర్బంధ శిబిరాలలో వేలాది పౌరుల మరణాలు, రాజకీయ ప్రత్యర్థులపై భయానక హింసాకాండ మొదలైన వాస్తవాలు సంపూర్ణ సాక్ష్యాధారాలతో వెలుగులోకి వచ్చాయి. 1956లో సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీయే స్టాలిన్ ఘోరాలు, నేరాలను తీవ్రంగా ఖండించింది. 1989లో బెర్లిన్ గోడ కూలిపోయింది. సోవియట్ యూనియన్‌లోనూ, తూర్పు యూరోపియన్ దేశాలలోనూ లెనిన్ పూర్తిగా తిరస్కరణకు గురయ్యాడు. మరి ఈ పరిణామాల నుంచి మన కమ్యూనిస్టులు నేర్చుకున్నది ఏమిటి అంటే ఏమీలేదనే సమాధానమివ్వవలసివస్తుంది. రష్యన్ నియంతల పట్ల తమ ఆరాధనా భావాన్ని కొనసాగించారు. బెంగాల్‌తో పాటు తాజాగా త్రిపురను కూడా పోగొట్టుకున్నారు. సిపిఎం తదుపరి సమావేశాలలోనైనా వేదికపై రష్యన్ నియంతలలో ఎవరో ఒకరికి బదులుగా సర్దార్ భగత్ సింగ్ చిత్రపటానికి స్థానం లభించగలదని ఆశించవచ్చునా?

(వ్యాసకర్త చరిత్రకారుడు)

పరాజయం లేని ప్రత్యామ్నాయ శక్తులు

అధికార అహాన్ని తలకెక్కించుకొని 2019 ఎన్నికల్లో తమకు తిరుగేలేదని విర్రవీగుతున్న బీజేపీ నాయకులకు ఉత్తరప్రదేశ్, బిహార్ ఉప ఎన్నికల్లో ప్రజలు బాగానే బుద్ధిచెప్పారు. ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో మూడు లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాజీనామాలతో గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభా స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ దారుణ ఓటమి ఆ పార్టీ నాయకులను దిగ్భ్రాంతి పరచింది. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన గోరఖ్‌పూర్‌లో ఎస్పీ అభ్యర్థి చేతిలో బీజేపీ అభ్యర్థి 21,961 ఓట్ల తేడాతో ఓడిపోగా, ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన ఫూల్‌పూర్‌లో బీజేపీ అభ్యర్థి ఎస్పీ అభ్యర్థి చేతిలో 59,460 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇక, బిహార్‌లోని అరారియా లోక్‌సభా స్థానంలో బీజేపీ అభ్యర్థిపై ఆర్‌జేడీ అభ్యర్థి 60వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. నరేంద్ర మోదీ తరువాత కాబోయే ప్రధానిగా ప్రచారంలో ఉన్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అభిమానులకు గోరఖ్‌పూర్ ఫలితం విస్మయం కలిగించవచ్చు. కానీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన ఉన్నవారికి మాత్రం ఈ ఫలితాలు ఎలాంటి ఆశ్చర్యాన్నీ కలిగించవు.

బిహార్‌లో రెండు శాసనసభా స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఒకటి, ఆర్‌జేడీ ఒకటి గెలుచుకొన్నాయి. బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్య పోటీ జరిగిన భబువా నియోజక వర్గంలో బీజేపీ గెలుపొందింది. అంటే, బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్య ముఖాముఖి పోటీ జరిగిన ఎన్నికల్లో బీజేపీ ముదుంది. అదే ఎస్పీ, బీఎస్పీ లాంటి పార్టీలు కలిసి పోటీచేస్తే అటు కాంగ్రెస్, ఇటు బీజేపీలవైపు ప్రజలు మొగ్గు చూపరని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో 1993లో కూడా ఎస్పీ, బీఎస్పీలు కలిసి బీజేపీ, కాంగ్రెస్‌లను ఓడించి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. 2015లో బిహార్‌లో ఆర్జేడీ, జేడీయూ, కాంగ్రెస్‌లు కలిసి బీజేపీని ఓడించగలిగాయి. ప్రజలు చైతన్యవంతులవుతున్నారు. సరైన ప్రత్యామ్నాయం ఉన్నచోట ప్రజలు ఆ వైపు మొగ్గు చూపుతున్నారు. డబ్బు, సారా, అధికారబలం, ఎందుకూ పనికిరావన్నది చరిత్ర రుజువు చేస్తున్న సత్యం. ప్రజలను ఎల్లకాలం మోసం చేయడం సాధ్యం కాదని పాలకులు గుర్తించాల్సిన కాలమిది.

ప్రత్యామ్నాయ విధానాలను ప్రజలకు వివరించి, వారిలో నవ చైతన్యాన్ని తీసుకురాగలిగితే పాలనా వ్యవస్థను అవినీతిమయం చేసిన పార్టీలను ఓడించడం పెద్ద సమస్యేమీ కాదు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయమే ఇందుకు ఒక తిరుగులేని నిదర్శనం.

1967 ఎన్నికల్లో అప్పటి వరకూ తిరుగులేని శక్తిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏకంగా 9 రాష్ట్రాలలో ఓడిపోయింది. అంటే, స్వతంత్ర భారతంలో 1952లో జరిగిన మొదటి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టిన ప్రజలు 15 సంవత్సరాలు తిరిగేలోపే గట్టి హెచ్చరిక పంపారు. స్వాతంత్ర్యం తెచ్చింది మేమేనని ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు తాము చేయాల్సింది చేశారు. తరువాత ఇందిరా గాంధీ ప్రజాకర్షక నినాదాలు, సీపీఐ లాంటి పార్టీలు ఆమెను సోషలిస్టుగా ప్రచారం చేయడంతో 1971 ఎన్నికల్లో జనం ఇందిరను మూడింట రెండొంతుల మెజార్టీతో అధికారం కట్టబెట్టారు. ప్రజలు తనకిచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఇందిర దేశంలో ఎమర్జెన్సీ విధించి జనాలను, నాయకులను చిత్రహింసలపాల్జేశారు. పత్రికా స్వేచ్ఛ లేకుండా చేశారు. ఇక దేశంలో తనకు తిరుగుండదని భ్రమించిన ఇందిర 1977లో ఎమర్జెన్సీ ఎత్తివేసి ఎన్నికలు నిర్వహించగా ప్రజలు ఆమెకు తగిన శాస్తి చేశారు. ఇందిర, ఆమె తనయుడు సంజయ్ గాంధీలతో పాటు నాటి కేంద్రమంత్రులందరినీ చిత్తుగా ఓడించారు.

ఇక, మన తెలుగు ప్రజల విషయానికొస్తే, 1983లో ఎన్టీఆర్ రూపంలో తమకు ప్రత్యామ్నాయం దొరికిన వెంటనే అప్పటి వరకూ ఉమ్మడి రాష్ట్రంలో పాతుకుపోయి ఉన్న కాంగ్రెస్ పునాదులు పెకలించేశారు. ఎన్టీఆర్ రాజకీయాలకు కొత్త అయినప్పటికీ ఆయనలోని నిజాయితీని నమ్మిన జనం కాంగ్రెస్ పార్టీ ప్రయోగించిన ఎలాంటి ప్రలోభాలకూ లొంగకుండా తీర్పునిచ్చి, ఎన్టీఆర్‌కు అధికారం అప్పగించారు. ఉత్తరప్రదేశ్, బీహార్, కేరళ, పశ్చిమబెంగాల్, త్రిపుర, తమిళనాడుతో సహా అనేక రాష్ట్రాలలో తమకు ప్రత్యామ్నాయం కనిపించిన ప్రతిసారీ పాలక పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పారు. అయితే, ప్రత్యామ్నాయ శక్తులుగా కనిపించిన వారు అధికారంలోకి వచ్చిన తరువాత ఆశయాలకు కట్టుబడి, ప్రజానుకూల పాలన సాగించకపోవడంతో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి పరాజయం పాలయ్యారు. కొందరు పూర్తిగా తెరమరుగయ్యారు. అధికారాన్ని చేజిక్కించుకోవడానికి లేదా కొన్ని పార్లమెంటు, అసెంబ్లీ సీట్లు సంపాదించుకోవటానికీ ప్రజలకు ద్రోహం చేస్తోన్న అవినీతి పరులతో జత కట్టడం వల్ల అనేక ప్రతిపక్ష పార్టీలు ప్రజా విశ్వాసాన్ని కోల్పోయాయి. అధికారం చేజిక్కించుకున్న వారిలో అతి కొద్ది మంది మాత్రమే తమ నిజాయితీని నిరూపించుకోగలిగారు. రాజకీయాలలో నిజాయితీ, విలువలు కలిగినవారు ఒకరిద్దరు ఎల్లప్పుడూ ఉంటారు. కానీ వారి మాటలు వినేవారెవ్వరు?

ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నప్పుడు తాము ప్రత్యామ్నాయమని ప్రజలను ఎవరు నమ్మించగలరో వారే విజేతలు కాగలుగుతున్నారు. 1967 నుంచి నేటి వరకూ వెలువడిన ఎన్నికల ఫలితాలు ఈ విషయాన్నే బుజువు చేస్తున్నాయి. అవకాశవాద, అవినీతి రాజకీయాలకంటే ప్రత్యామ్నాయ రాజకీయాల వైపే ప్రజల మొగ్గు ఎప్పటికీ ఉంటుంది. కొద్ది మంది వ్యక్తులైనా నిజాయితీగా ప్రత్యామ్నాయ విధానాలను ప్రజలకు వివరిస్తూ, వారిని చైతన్యవంతం చేయగలిగితే అవినీతిని పెంచి పోషిస్తున్న పార్టీలను ఓడించడం పెద్ద విషయమేమీ కాదు. ఇందులో ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం ఒక తిరుగులేని ఉదాహరణ. పట్టుదల, నిరంతర శ్రమ, నిజాయితీతో క్షేత్రస్థాయిలో పనిచేస్తే అది ఢిల్లీ అయినా, తెలంగాణ అయినా ప్రజలు తప్పక ఆదరిస్తారు. మనస్ఫూర్తిగా తమ బాగు కోరుకునే ప్రత్యామ్నాయ శక్తులకు అధికారం అప్పగిస్తారు.

■ జస్టిస్ చంద్రకుమార్
అధ్యక్షులు, తెలంగాణ ప్రజల పార్టీ

ఆదర్శ విద్యాలయాలుగా మున్సిపల్ బడులు


సామాన్యులపై భారం మోపకుండా విజ్ఞాన విప్లవంలో ఆంధ్రప్రదేశ్ భారత దేశంలోనే ముందుంది. ప్రభుత్వ పాఠశాలలకి వెళ్ళాలంటే వెనుకడుగు వేసే విద్యార్థులు నేడు మున్సిపల్ పాఠశాలలు వెతుక్కొని వెళ్ళేలా రాష్ట్రంలో అభివృద్ధి చేయడం జరిగింది. విద్యాభివృద్ధి జరగకుండా ఏ దేశం అభివృద్ధి చెందదు. అందుకే విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. మేధస్సు పరంగా, వ్యక్తిగతపరంగా కీలకమైన పాఠశాలల విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. ఆర్థిక ఇబ్బందులకు తావు లేకుండా.. ప్రతి ఒక్కరూ చదువుకోవడమే ధ్యేయంగా సరికొత్త విధానాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మౌలిక వసతుల పెంపు, మెరుగైన జీవన విధానం ద్వారా మానవ వనరుల అభివృద్ధికి కృషిచేస్తోంది. విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టి నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోంది.

ప్రభుత్వ పాఠశాలలంటే బెంచీలు, బల్లలు, మరుగుదొడ్లు, తాగునీరు లేనటువంటి సమస్యలు కనిపిస్తుంటాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మున్సిపల్ పాఠశాలల్లో జరగని అభివృద్ధి నేడు శరవేగంగా జరుగుతోంది. నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేస్తూ ఆధునిక విద్యా కేంద్రాలుగా వాటిని అభివృద్ధి చేస్తోంది. దశాబ్దాలు గడిచిపోయినా విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించలేదు. నేడు విద్యార్థులకు కనీస అవసరాలైన బెంచీలు, బల్లలు వంటి వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి అందిస్తోంది. పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఇంగ్లీష్ చదువులు, కంప్యూటర్ నైపుణ్యాలను విద్యార్థులకు అందించడం జరుగుతోంది.

మున్సిపల్ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సహాయాన్ని తీసుకుంటూ విద్యారంగాన్ని ప్రభుత్వం బలోపేతం చేస్తోంది. నాగార్జున కన్‌స్ట్రక్షన్స్, మెగా ఇంజినీరింగ్, ఎల్&టి, నారాయణ గ్రూప్ వంటి సంస్థల సహకారంతో రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ స్కూళ్ళకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం శరవేగంతో ఏర్పాటు చేస్తోంది.

స్వతంత్ర భారతదేశంలో ఎన్నడూ జరగని అభివృద్ధి నేడు మున్సిపల్ పాఠశాలల్లో చోటుచేసుకుంది. ప్రతి మున్సిపల్ పాఠశాలలో లేబొరేటరీ, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాస్‌రూమ్, బయోమెట్రిక్, గ్రంథాలయం వంటివి ఉండేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం. విద్యార్థుల్లో శారీరక దృఢత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయి. క్రీడలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతి మున్సిపల్ పాఠశాలకు ఆటస్థలం ఉండేలా చర్యలు తీసుకుంటుంది. ఆటస్థలం అందుబాటులో లేని పాఠశాలలకు సమీపంలోని పాఠశాలల్లో సదుపాయం కల్పించడం జరుగుతుంది. విద్యార్థులకు అవసరమైన స్పోర్ట్స్ కిట్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. నవ్యాంధ్రప్రదేశ్‌లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు విద్యనభ్యసించడానికి అవసరమైనటువంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. ప్రతిరోజూ విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును పర్యవేక్షిస్తూ ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కసరత్తు చేస్తోంది. మున్సిపల్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కార్పొరేట్ సంస్థలకి పోటీగా ఫలితాలని రాబడుతున్నారు. అధికారులు పాఠశాలల్లో తరుచూ తనికీలు చేస్తూ, 13 జిల్లాల్లోని అధికారులతో విద్యావ్యవస్థకు సంబంధించి సమీక్షలు నిర్వహిస్తూ లోటుపాటులను తెలుసుకొని ఎప్పటికప్పుడు సమస్యలని పరిష్కరిస్తున్నారు.

పురపాలక పరిధిలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఫౌండేషన్ కోర్సుకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇతర రాష్ట్రాలు కూడా ఈ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయా రాష్ట్రాలు అమలు చేసేందుకు అక్కడి బృందాలు వచ్చి పరిశీలించడం జరిగింది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఈ కోర్సులో చేర్చడానికి ఉత్సాహం చూపుతున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులకి కూడా శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. రూ.10 కోట్ల వ్యయంతో ఎల్&టి సహకారంతో స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌ను కూడా అమరావతి పరిధిలో ఏర్పాటు చేయడం జరుగుతోంది. మున్సిపల్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు కెరీర్ ఫౌండేషన్ కోర్సును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పేద కుటుంబాలపై ఎటువంటి భారం పడకుండా విద్యార్థుల్లో తెలివితేటలను, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించేందుకు, వారిలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు కెరీర్ ఫౌండేషన్ కోర్సు దోహదపడుతుంది పేద విద్యార్థులు కలలుకనే ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, ఇంజనీరింగ్ వంటి లక్ష్యాలను చేరుకునేందుకు ఈ కోర్సు సహకరిస్తుంది. జాతీయస్థాయి పోటీపరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఈ కోర్సు ఉపయోగపడుతుంది. విద్యార్థులకు అవసరమైన మెటీరియల్‌ను కూడా ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. బాగా రాణించే విద్యార్థులను ఎంపికచేసి వారికి మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు కూడా మున్సిపల్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ కోర్సు నిర్వహణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తూ అవసరమైన మార్పులు కూడా చేయడం జరుగుతోంది. ఆనందాంధ్రప్రదేశ్‌లో భాగంగా విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ వారిలో ఉత్సాహం నింపేందుకు మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు యోగ, 2కే రన్, 3కే రన్, 5కే రన్, ఆటల పోటీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది.



రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ విద్యకు నిధుల కొరత లేకుండా, రాష్ట్రంలో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడానికి కృషి చేస్తోంది. మారుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యారంగంలో మార్పులు తీసుకొస్తూ నవ్యాంధ్రప్రదేశ్ పాఠశాలలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. చదువుతోపాటు భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు అవసరమైన సహకారాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

విద్యార్థులు ఆనందంగా, ఆహ్లాదంగా చదువుపై తమ దృష్టి పెట్టాలంటే చుట్టూ ఉన్న పరిసరాల శుభ్రత కూడా ముఖ్యం. ప్రభుత్వ పాఠశాలల్లోని మూత్రశాలల పేరు చెప్పగానే.. నీటి వసతిలేమి, తలుపులు లేకపోవడం, దుర్గంధభరిత వాతావరణమే టక్కున స్ఫురణకు వచ్చేది. ఈ కష్టాల నుంచి విద్యార్థులకు విముక్తి కలిపించేందుకు గాను ప్రయోగాత్మకంగా మూత్రశాలలు 24 గంటల నీటి సరఫరాతో పాటు, విద్యుత్ వెలుగులు, అందమైన పలకలతో తీర్చిదిద్దిన గోడలు, అద్దాలు తదితర హంగులు ఏర్పాటు చేయడం జరిగింది. స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా సర్కార్ బడుల్లో మౌలిక వసతులను మెరుగుపరిచే చర్యల్లో నగరపాలక సంస్థ వీటిని అభివృద్ధి చేస్తుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యాన్యుటీ ప్రాతిపదికన రూ. 4848 కోట్ల నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కలిపించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఉన్నత పాఠశాలలన్నిటిలోనూ విద్యుత్ సదుపాయం ప్రాథమిక పాఠశాలల్లో 90 శాతం, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో వంద శాతం సదుపాయం కలిపిస్తున్నారు. నూరు శాతం అక్షరాస్యత సాధించాలన్న లక్ష్యంతో దిశానిర్దేశం చేసేందుకు రాష్ట్రానికి ప్రత్యేకంగా విద్యా ప్రణాళికను తయారు చేస్తూ రాష్ట్రాలన్నిటికి అదర్శంగా నిలిచింది. పాఠశాలల్లో ప్రహరీలు, క్రీడా ప్రాంగణాలు సమకూర్చి ప్రవేట్ పాఠశాలలకి దీటుగా ప్రభుత్వ పాఠశాలలు సిద్ధం అవుతున్నాయి. సర్వశిక్ష అభియాన్‌లో భాగంగా గడిచిన మూడున్నరేళ్ళలో 1361 పాఠశాలలకి విద్యుత్ సదుపాయం కల్పించడమైంది. సెంటర్ ఫర్ సైన్స్, ఎన్విరాన్‌మెంట్ నిర్వహించే హరిత పాఠశాల (గ్రీన్ స్కూల్) 2017 అవార్డు ఆంధ్రప్రదేశ్‌కి దక్కింది.

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ విద్యకు నిధుల కొరత లేకుండా, రాష్ట్రంలో విద్యార్థులకు నైతికత, విలువలతో కూడిన విద్యను అందించడానికి కృషి చేస్తూ విద్య కోసం 23,200 కోట్ల నిధులని కేటాయించి రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి వైపు ముందుకు తీసుకొని వెళ్తున్నది. రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలను ఆంధ్రప్రదేశ్‌లో వర్చువల్ క్లాసులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, చేస్తున్న సమీక్షలు మంచి ఫలితాలనిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ విద్య పరంగా ముందుంది. ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ విజ్ఞాన ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తోంది. మారుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యారంగంలో మార్పులు తీసుకొస్తూ నవ్యాంధ్రప్రదేశ్ పాఠశాలలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. చదువుతోపాటు భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు అవసరమైన సహకారాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తూ దేశ పురోభివృద్ధికి, సమాజహితానికి తోడ్పడేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఈ యజ్ఞంలో ప్రతి ఒక్కరూ సహకరించాలి.

■ పి. నారాయణ
మున్సిపల్ శాఖ మంత్రి

నకిలీ మందులపై కొరడా

అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటన

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో నకిలీ మందులు నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. నకిలీ మందుల వల్ల రోగుల ఆరోగ్యం మెరుగుపడటం లేదనే విషయం ప్రభుత్వం దృష్టికి రాలేదని మంత్రి పేర్కొనగా..ఇది చాలా దారుణమని శ్రావణ్ అన్నారు. విశాఖలో ఒక రోగికి న్యూరాలజీ సమస్యలు వచ్చాయని, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల నకిలీ మందుల రాకెట్ బయటపడటం, పోలీసుల దాడులను ఆయన సభలో ఉదహరించారు. రాష్ట్రంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల కొరత తీవ్రంగా ఉందని, నకిలీ మందుల తయారీదార్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీరాంజనేయ స్వామి కూడా కోరారు. దీనిపై మరోసారి స్పందించిన మంత్రి యనమల..నకిలీ మందుల అంశం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, సభ్యులు అడిగిన ప్రశ్నలో తేడా ఉండటం వల్ల మొదట లేదని చెప్పాల్సి వచ్చిందన్నారు. నకిలీ మందులపై జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ ఫిర్యాదు చేయగా..తనిఖీల్లో రూ.50 లక్షల విలువైన నకిలీ మందులు సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

రైతులకు భారీగా ఇన్‌పుట్ సబ్సిడీ

రాష్ట్రంలో రైతులకు భారీస్థాయిలో ఇన్‌పుట్ సబ్సిడీ అందించామని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. 2015లో 15 వేల హెక్టార్లలో వేరుశనగ, పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్న రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ అందిందన్నారు. ఎంపీఈవోలు గ్రామాలకు వస్తున్న సమాచారం రైతులకు తెలియడం లేదని, ఫీల్డ్ అధికారులు లోటు తీవ్రంగా ఉందని ఎమ్మెల్యేలు జనార్దన్‌రెడ్డి, బండారు సత్యనారాయణ వాపోయారు.

అరకు పర్యాటకానికి రూ.183 కోట్లు

లంబసింగి అభివృద్ధికి పర్యాటక శాఖ చర్యలు తీసుకుంటుందని మంత్రి అఖిలప్రియ చెప్పారు. లంబసింగి దేవుడి సృష్టి అని, దానికి మానవుడి మేదస్సు జోడిస్తే అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దవచ్చని, కానీ పర్యాటక శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు.

పర్యాటక శాఖ అధికారులు ఎమ్మెల్యేలను పట్టించుకోవడం లేదని, ఈ మధ్య కాలంలో జరిగిన బెలూన్ ఫెస్టివల్‌కు ఆహ్వానం లేదన్నారు. స్వదేశీ దర్శని పథకం కింద అరకు ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి బదులిచ్చారు. రూ.183 కోట్లతో పంపిన ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపిందని ప్రకటించారు. కాగా, నరసాపురం నియోజకవర్గంలో అనేక మంది మత్స్యకారులకు చేపల వేట జీవనోపాధిగా ఉందని..వారి కోసం చేపల రేవులు నిర్మించాలని ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు కోరారు. దీనికి సంబంధించి రూ.20 కోట్ల ప్రతిపాదనలు ఉన్నట్లు, నెలరోజుల్లో టెండర్లు పిలుస్తామని మంత్రి ఆదినారాయణరెడ్డి చెప్పారు.

ఏపీలో

'త్రిపుర' వ్యూహం!

బీజేపీ బలోపేతానికి పావులు

రాష్ట్ర ఇన్‌చార్జిగా రాం మాధవ్?

ఢిల్లీ రావాలని రాష్ట్ర నేతలకు పిలుపు

నేడు అమిత్ షాతో కీలక చర్చలు

న్యూఢిల్లీ, అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే నుంచి టీడీపీ వైదొలిగిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్ కార్యాచరణకు బీజేపీ అధిష్ఠానం సమాయత్తమైంది. వెంటనే ఢిల్లీ రావాలని ఏపీ బీజేపీ నేతలను పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఆదేశించారు. వీరితో శనివారం సాయంత్రం 4 గంటలకు పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం అవుతున్నారు. బీజేపీ వర్గాలు అందించిన సమాచారం ప్రకారం..రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కేంద్ర నాయకత్వం బలంగానే పావులు కదుపుతోంది. త్రిపుర తరహాలో టీడీపీని ఢీకొట్టాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన వ్యూహాలను అమిత్ షా సమక్షంలో జరిగే సమావేశంలో ఖరారు చేస్తారని సమాచారం. ఈ భేటీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పును కూడా ప్రస్తావించాలని కొందరు నేతలు యోచిస్తున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు హరిబాబుకు సీఎం చంద్రబాబుతో సత్సంబంధాలు ఉన్నాయని ఒక వర్గం ముందు నుంచీ గరంగా ఉంది. దాంతో టీడీపీకి వ్యతిరేకంగా పోరాడాలంటే మరో నేతను అధ్యక్షుడిగా నియమించాలని కేంద్ర నాయకత్వానికి సూచించనున్నట్లు తెలిసింది. చంద్రబాబుపై ఎదురుదాడి లక్ష్యంగా పార్టీని ముందుకు తీసుకెళ్లాలని వీరు భావిస్తున్నారు. కాగా రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న ఉత్తరప్రదేశ్ మంత్రి సిద్ధార్థ్‌నాథ్ సింగ్ స్థానంలో రాం మాధవ్‌ను నియమించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే రాష్ట్ర పార్టీకి సంబంధించి బీజేపీ జాతీయ నేతలు వ్యవహరిస్తున్న తీరుపై కొందరు రాష్ట్ర నాయకులు కినుక వహించినట్లు సమాచారం. నరసరావుపేటకు చెందిన జీవీఎల్ నరసింహారావుకు ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యత్వం ఇచ్చే సమయంలో రాష్ట్ర కార్యవర్గాన్ని కనీసం సంప్రదించలేదని వారు గుర్రుగా ఉన్నారు. పార్టీ సాంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చారని వారు పేర్కొంటున్నారు. శనివారంనాటి సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, ఎంపీ గంగరాజు, మాజీ మంత్రులు మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, ఆకుల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, మాధవ్, పార్టీ నేతలు పురంధేశ్వరి, కన్నా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొంటారు.

ఏపీలో ఇళ్ల నిర్మాణాలకు 281 కోట్లు

న్యూఢిల్లీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) పథకం కింద రెండో విడతగా రూ.281.62 కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

సూటు,బూటు వేసుకున్నవారికే కాదు..

గోచీకట్టిన వారికీ భూములిస్తాం!

రాష్ట్రానికి పెట్టుబడులే మాకు ముఖ్యం

శాసనసభలో మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి

జీవితంలో సూటువేయనివారు సైతం భాగస్వామ్యసదస్సుకు ధరించొచ్చారన్న విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యలకు కౌంటర్

రాజు కూడా సూటువేస్తారని చమత్కారం

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తే సూటు, బూటు వేసుకున్నవారికే కాదు, గోచీ కట్టుకున్నవారికి కూడా భూములు కేటాయిస్తామని పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. జీవితంలో ఎప్పుడూ సూటు బూటు వేసుకోనివారుకూడా విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సు కోసం ధరించి వచ్చారని బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్‌రాజు అనగా.. మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు టీడీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో పరిశ్రమలు, వివిధ సంస్థల స్థాపన కోసంకేటాయించిన భూముల వివరాల గురించి క్వశ్చన్ అవర్‌లో సభ్యులు పలు ప్రశ్నలు అందించారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు భాగస్వామ్య సదస్సుల నిర్వహణ తీరుపై పలు వ్యాఖ్యలు చేశారు. "నాకు తెలిసిన వాళ్లు చాలా మంది భాగస్వామ్య సదస్సులో కనిపించారు. వారెవరూ సూటు బూటు ముఖం యెరిగిన వారు కాదు. అలాంటివారి పట్ల మంత్రి జాగ్రత్తగా ఉండాల"ని అన్నారు. తాను రుషికొండ ఐటి పార్కు ప్రెసిడెంట్‌గా చాలా కాలంగా కొనసాగుతున్నానని, ఇప్పుడు ఆ ప్రాంతంలో కొత్తగా ఫ్లాంక్లిన్‌టన్, ఇన్నోవా సొల్యూషన్స్ ఇంక్ అనే సంస్థలకు 40 ఎకరాలు కేటాయించాలని ప్రభుత్వం సిద్ధం అయినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. "ఈ రెండు సంస్థల ద్వారా 2,500 ఉద్యోగాలు వస్తాయని చెబుతున్నారు. సాధారణంగా మంచి సంస్థకు ఎకరం స్థలం కేటాయిస్తే వెయ్యి ఉద్యోగాలు వస్తాయి. 2,500 మంది నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించాలంటే ఐదు ఎకరాలు సరిపోతుంది. దీనికోసం 40 వేల ఎకరాలు స్థలం అవసరమా?" అని విష్ణుకుమార్ రాజు ప్రశ్నించారు. ఇలాంటి వాటిపై ప్రభుత్వం జాగ్రత్తగా ఉండాలని, ముందు కంపెనీ స్థాయిచూసుకుని, ఆ తర్వాత భూములు కేటాయించాలని ఆయన సూచించారు. దీనిపై అమర్‌నాథ్‌రెడ్డి బదులిచ్చారు. "పెట్టుబడులు పెడతామంటే ఎవరికైనా భూములు ఇస్తాం. విష్ణుకుమార్‌రాజు ఇప్పుడు ఎమ్మెల్యే కాబట్టి బట్టలు మార్చారు. బయటకు వెళ్లినపుడు ఆయన కూడా సూటు, బూటు వేసుకొంటారు" అని మంత్రి అనడంతో సభలో నవ్వులు విరిశాయి. ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు ఉన్న ఫ్రాంక్లిన్‌టన్ వంటి కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టడం ప్రతిష్ఠాత్మకమైన విషయమన్న ఆయన, ఆ సంస్థతో ఎంవోయూ మాత్రమే చేసుకున్నామని, ఇంకా డీపీఆర్ సిద్ధం కాలేదని బదులిచ్చారు. రాష్ట్రంలో జరిగిన మూడు సీఐఐ సదస్సుల్లో రూ.14 లక్షల విలువైన ఎంవోయూలు చేసుకున్నామని, ఇందులో రూ.5 విలువైన పెట్టుబడులకు సంబంధించి.. పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రారంభించాయని, మరికొన్ని కంపెనీలు ప్రారంభ దశలో ఉన్నాయని తెలిపారు.



కర్నూలును అభివృద్ధి చేయండి: ఎస్వీ మోహన్‌రెడ్డి

పరిశ్రమలకు భూకేటాయింపులకు సంబంధించి వైసీపీ సభ్యులు పంపిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇవ్వడానికి ముందుగా ఎస్వీ మోహన్ రెడ్డి స్పందించారు. "వైఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పరిశ్రమ కోసం కేటాయించిన భూములను క్విడ్ ప్రోకో కింద అమ్ముకుని డబ్బు చేసుకొన్నారు. కాబట్టి టీడీపీ ప్రభుత్వం కూడా అలాంటివి ఏమైనా చేస్తుందా అన్న అనుమానంతో వైసీపీ సభ్యులు ఈ ప్రశ్నలు పంపి ఉంటారు. కానీ అలాంటి పరిస్థితి టీడీపీ ప్రభుత్వంలో లేదు. చాలా పారదర్శకంగా కేటాయింపులు జరుగుతున్నాయి" అని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా 30 వేల ఎకరాలు ఉన్నాయని, ఆ భూముల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రిని ఎస్వీ మోహన్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో పరిశ్రమల కోసం వేల ఎకరాలను ప్రభుత్వం సేకరించిందని, వీటిలో కొన్ని పరిశ్రమలు మూతపడ్డాయని టీడీపీ సభ్యుడు ప్రభాకర్ చౌదరి అన్నారు. ఆ మూతపడ్డ పరిశ్రమల భూములు అన్యాక్రాంతమయ్యే పరిస్థితి ఉందని, వాటిని పేద వాళ్ల ఇళ్ల కోసం కేటాయించాలని ఆయన సూచించారు.

ఎద్దు @ 20.50 లక్షలు



కర్ణాటక చరిత్రలోనే ఓ ఎద్దు అత్యధిక ధర పలికింది. షిమోగా జిల్లా గాంధీనగర్ ప్రాంతంలోని ప్రియాకుమార్‌కు చెందిన ఎద్దును తమిళనాడుకు చెందిన మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ రూ.20.50 లక్షలకు కొనుగోలు చేశారు. జల్లికట్టు పోటీల కోసమే ఈ వృషభాన్ని కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇది గతంలో రాష్ట్రస్థాయి పరుగు పోటీలో విజేతగా నిలిచి షికారీపుర 'వాల్మీకి పులి'గా పురస్కారం అందుకుంది. గతంలో ఒక్కో ఎద్దు రూ.9 లక్షల ధర పలికిన సందర్భాలున్నాయి. - బెంగళూరు

నువ్వు.. చాలా అందంగా ఉన్నావ్!!

మహిళా జర్నలిస్టుపై.. తమిళ మంత్రి అభ్యంతరకర వ్యాఖ్యలు

వివాదం ముదరడంతో క్షమాపణలు

చెన్నై, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఓ టీవీ చానెల్‌కు చెందిన మహిళా జర్నలిస్టు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఆమెపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి.. తమిళనాడు ఆరోగ్యశాఖ మంత్రి విజయభాస్కర్ తీవ్ర వివాదం సృష్టించారు. ఈ వివాదం మరింత పెరగడంతో క్షమాపణ చెప్పారు. అన్నాడీఎంకే పార్టీ ఎమ్మెల్యేల సమావేశం రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగింది. ఆ సమావేశం ముగిశాక రాత్రి ఏడుగంటల సమయంలో బయటకు వస్తున్న మంత్రి విజయభాస్కర్‌కు ఓ టీవీ చానెల్‌కు చెందిన పాత్రికేయురాలు ఎదురయ్యారు. పార్టీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలేమిటో చెప్పాలనగా...'మేడం మీరు అందంగా ఉన్నారు!' అని ఆయన కామెంట్ చేశారు. 'మేడమ్ మీ కళ్లద్దాలు చాలా అందంగా ఉన్నాయి' అంటూ తన వ్యాఖ్యల జోరును పెంచారు. "అందంగా ఉన్నావు, అందంగా ఉన్నావు" అంటూ ఆ జర్నలిస్టు ఎదుట నిలబడి నవ్వుతూ చెప్పి వెళ్లిపోయారు. ఈ దృశ్యాలు ప్రసార మాధ్యమాల్లో పదే పదే ప్రసారమయ్యాయి. పాత్రికేయ సంఘాలన్నీ మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రకటనలు జారీ చేశాయి. దీంతో మంత్రి విజయభాస్కర్ తన నివాసగృహంలో శుక్రవారం ఉదయం ఆకస్మికంగా పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేసి బేషరతుగా క్షమాపణలు చెప్పారు.

తాత్కాలిక భవనాల్లో వర్సిటీలు

ప్రతిపాదనలు పంపిస్తే పరిశీలిస్తాం

కేంద్ర మానవ వనరుల శాఖ కార్యదర్శి

న్యూఢిల్లీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఏపీలో విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు తాత్కాలిక భవనాలను గుర్తించి ప్రతిపాదనలు పంపిస్తే పరిశీలిస్తామని కేంద్ర మానవ వనరుల శాఖ కార్యదర్శి రెడ్డి సుబ్రహ్మణ్యం హామీ ఇచ్చారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు శుక్రవారం విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబుతో కలిసి కార్యదర్శిని కలిశారు. విభజన చట్టంలో పొందుపరిచిన మేరకు ఈ ఏడాదైనా వర్సిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఏర్పాటైన ఐదు కేంద్ర ఉన్నత విద్యాసంస్థలకు సక్రమంగా నిధులు అందడం లేదని, వీటికి వెంటనే నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విజయనగరంలో గిరిజన, అనంతపూర్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కేబినెట్ నోట్ సిద్ధమైందని, ఈ నెల 26 తేదీలోగా శాఖాపరమైన ప్రక్రియ పూర్తవుతుందని స్పష్టం చేశారు. మరోవైపు, గురువారం రాత్రి ఇవే అంశాలపై రెడ్డి సుబ్రహ్మణ్యంతో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ రెండు వర్సిటీల ఏర్పాటుకు తమ శాఖ ఆమోదం తెలిపిందని, ఎక్స్‌పెండిచర్ ఫైనాన్స్ కమిటీ నుంచి క్లియరెన్సులు కూడా వచ్చాయని సుబ్రహ్మణ్యం వివరించారు.

ఇంధనశాఖ ఉప కార్యదర్శిగా వేణుగోపాల్‌రెడ్డి

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఇంధనశాఖ ఉపకార్యదర్శిగా 2018 బ్యాచ్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఇటీవల డిప్యూటీ కలెక్టర్ స్థాయి నుంచి ప్రమోటైన కొత్త ఐఏఎస్ అధికారుల పోస్టింగులపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

మార్కెట్ కమిటీ కార్యవర్గ రాష్ట్ర చైర్మన్‌గా మన్నవ

రాష్ట్రంలోని మార్కెట్ల కమిటీ కార్యవర్గానికి నూతన చైర్మన్‌గా గుంటూరు మిర్చియార్డు మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నవ సుబ్బారావు శుక్రవారం ఎన్నికయ్యారు. ఆయన రెండేళ్లపాటు ఈ పదవిలో ఉంటారు.

వ్యవసాయ ఉత్పత్తుల సేకరణకు 1902కోట్లు: సోమిరెడ్డి

వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ కోసం గత నాలుగేళ్లలో ప్రభుత్వం రూ.1,902కోట్లు ఖర్చు చేసిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) గిట్టుబాటు కాని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వమే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద కొనుగోళ్లు చేస్తోందన్నారు. శుక్రవారం శాసనసభలో 'కనీస మద్దతు ధర, మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్' అంశంపై టీడీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు.

ఎంబీఏ, ఎంసీఏలో ప్రవేశానికి

ఐసెట్ మార్గం

కెరీర్ గైడ్



ప్రొఫెషనల్ కోర్సుల్లో ఎంబీఏ, ఎంసీఏలకు ప్రత్యేక స్థానం ఉంది. ఇతర కోర్సుల మాదిరిగా సీట్లకు కొరత లేనప్పటికీ మంచి ప్రమాణాలు పాటించే కాలేజీలో చదివితేనే కెరీర్ బాగుంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఎంబీఏ (మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్), ఎంసీఏ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్) కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన ఐసెట్ (ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)కు నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో ఐసెట్‌కు సంబంధించిన అర్హత, పరీక్షా విధానం తదితర అంశాలపై విశ్లేషణ...

ఐసెట్‌ను రెండు రాష్ట్రాల్లోనూ (తెలంగాణలో మొదటిసారి) ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష విధానం రెండు రాష్ట్రాల్లోనూ ఒకే విధంగా ఉంటుంది. పరీక్ష విధానంపై అవగాహన కల్పించేందుకు వెబ్‌సైట్‌లో మాక్‌టెస్ట్‌ను కూడా పొందుపరిచారు. ఐసెట్‌లో 25 శాతం మార్కులను కనీస అర్హతగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అర్హత మార్కుల విషయంలో ఎటువంటి పరిమితులు లేవు.

పరీక్ష ఇలా

పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో 200 మార్కులకు ఉంటుంది. ఇందులో 200 ప్రశ్నలు ఇస్తారు. వీటికి 150 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాలి. ఇందులో ఉండే విభాగాలు..

	ప్రశ్నలు	మార్కులు
విభాగం - ఎ (అనలిటికల్ ఎబిలిటీ)		
డేటా సఫీషియన్సీ	20	20
ప్రాబ్లమ్ సాల్వింగ్	55	55
విభాగం - బి (మ్యాథమెటికల్ ఎబిలిటీ)		
అర్థమెటికల్ ఎబిలిటీ	35	35
ఆల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ	30	30
స్టాటిస్టికల్ ఎబిలిటీ	10	10
విభాగం - సి (కమ్యూనికేషన్ ఎబిలిటీ)		
వొకాబ్యులరీ	10	10
బిజినెస్ అండ్ కంప్యూటర్ టర్మినాలజీ	10	10
ఫంక్షనల్ గ్రామర్	15	15
రీడింగ్ కాంప్రెహెన్షన్	15	15
మొత్తం	**200**	**200**

ఇలా సిద్ధమవ్వాలి...

- **అనలిటికల్ ఎబిలిటీ:** డేటా సఫీషియన్సీలో రాణించాలంటే.. అర్థమెటిక్ అంశాలపై పట్టు సాధించడం ప్రధానం. 'స్టేట్‌మెంట్ బేస్డ్' ప్రశ్నలు ఎదురయ్యే ఈ విభాగంలో ఇచ్చిన స్టేట్‌మెంట్లలో సరైనదేదో గుర్తించాల్సి ఉంటుంది. దీనికోసం సునిశిత పరిశీలన.. గణితంపై ప్రాథమిక అవగాహన తప్పనిసరి. అనలిటిక్ ఎబిలిటీ విభాగంలో సుమారు 15 ప్రశ్నలు డేటా విశ్లేషణపై ఉంటాయి. సీక్వెన్స్ అండ్ సిరీస్ విభాగం కీలకం. దీన్నుంచి దాదాపు 10 ప్రశ్నలొస్తాయి. వర్డ్ అనాలజీ, నంబర్ సిరీస్, బ్లడ్ రిలేషన్, సీటింగ్ అరేంజ్‌మెంట్, కోడింగ్, డీ-కోడింగ్, కేలండర్, క్లాక్, ట్రైన్ ప్రాబ్లమ్స్ తదితరాలపై పట్టు సాధించాలి. ఏదైనా ఒక ప్రామాణిక రీజనింగ్ పుస్తకాన్ని తీసుకొని చదివితే సరిపోతుంది. 'ప్రాబ్లం సాల్వింగ్' చాలా ప్రధానమైనది. ఈ విభాగానికి కేటాయించిన మార్కులు 55. ఇందులో ప్రాథమిక గణిత పరిజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. ఒకరకంగా ఇది జయాపజయాలను నిర్ణయిస్తుంది. ఇందులో ప్రాథమిక పరిజ్ఞానం పెంచుకోవడంతోపాటు ప్రతిరోజూ విధిగా నిర్ణీత సంఖ్యలో ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. అర్థమెటిక్‌లో భాగంగా ఉండే సరాసరి, శాతాలు, నిష్పత్తులు ఈ విభాగం ప్రిపరేషన్‌కు కూడా ఉపయోగపడతాయి.
- **మ్యాథమెటికల్ ఎబిలిటీ:** నాన్ మ్యాథ్స్ అభ్యర్థులకు కఠినంగా అనిపించే విభాగమిది. ఆరు నుంచి పదో తరగతి వరకు ఉన్న మ్యాథ్స్ అంశాల నుంచి ప్రశ్నలొస్తాయి. మొదట మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక సూత్రాలపై అవగాహన పెంపొందించుకోవాలి. హైస్కూల్ స్థాయి గణిత పుస్తకాలను అధ్యయనం చేయాలి. స్టాటిస్టికల్ ఎబిలిటీ కోసం ఇంటర్మీడియెట్ పుస్తకాల ప్రిపరేషన్ అవసరం. ముఖ్యంగా ప్రాబబిలిటీ, ఇనీక్వాలిటీస్ అంశాలకు ఈ స్థాయి ప్రిపరేషన్ తప్పనిసరి. అర్థమెటిక్ విభాగంలోని ప్రశ్నలకు సులువుగా సమాధానాలు గుర్తించాలంటే.. శాతాలు, లాభనష్టాలు, నిష్పత్తులు, మెన్సురేషన్, పని - కాలం, పని - సమయం తదితర అంశాలపై పట్టు సాధించాలి. ట్రిగనోమెట్రీ, సెట్స్ అండ్ రిలేషన్స్, లీనియర్ ఈక్వేషన్స్, ప్రోగ్రెషన్స్ తదితర అంశాలపైనా పట్టు సాధించాలి. ఇందుకు పాఠశాల స్థాయి పుస్తకాలను చదివి, ప్రాథమికాంశాలను (బేసిక్స్) అర్థం చేసుకొని, వాటిని అనువర్తనం చేస్తూ వెళ్లడం ద్వారా ఈ విభాగాన్ని తేలికగా పూర్తిచేయొచ్చు.
- **కమ్యూనికేషన్ ఎబిలిటీ:** బేసిక్ నాలెడ్జ్‌తో మంచి స్కోరు సాధనకు అవకాశమున్న సెక్షన్ ఇది. వొకాబ్యులరీ కోసం బేసిక్ ఇంగ్లీష్ గ్రామర్ నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. రోజూ కొత్త పదాలు నేర్చుకోవడం, వాటిని ఉపయోగించే విధానాన్ని ప్రాక్టీస్ చేయాలి. సందర్భోచితంగా పదాలను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలి. నిత్యం ఆంగ్ల దినపత్రికలను చదవడం ద్వారా దీన్ని పూర్తి చేయొచ్చు. అలాగే రోజూ నిర్ణీత సంఖ్యలో పదాలకు అర్థం తెలుసుకుని, వాటి ద్వారా వాక్యాలను రూపొందించుకుంటే తేలికగా గుర్తుంటాయి. కేవలం డిక్షనరీలో పదాలకు అర్థం తెలుసుకుంటే సరిపోదు. వాటిని ఉపయోగించుకునే తీరు చాలా ముఖ్యం. పదాలను సందర్భోచితంగా అర్థం చేసుకునే సామర్థ్యం కలిగి ఉండాలి. నిత్యం సాధన చేయడం ద్వారా ఇది సాధ్యమవుతుంది. రీడింగ్ కాంప్రెహెన్షన్ విభాగంలో ప్యాసేజీల ఆధారంగా అడిగే 15 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ముందుగా అభ్యర్థులకు ఒక అంశాన్ని, అందులోని కీలక పదాలను, సారాంశాన్ని పసిగట్టే నేర్పు అవసరం. దీనికోసం వ్యాసాలు, ఇంగ్లీష్ స్టోరీ పుస్తకాలు చదవడం ఉపయుక్తం. ఫంక్షనల్ గ్రామర్‌లో మంచి మార్కుల కోసం సినానిమ్స్, యాంటానిమ్స్, క్వశ్చన్ ట్యాగ్స్, డైరెక్ట్ - ఇన్‌డైరెక్ట్ స్పీచ్ తదితర అంశాలను ప్రాక్టీస్ చేయాలి. బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీలో వ్యాపార - వాణిజ్య అంశాలు, తాజా పరిణామాలు, కంప్యూటర్ బేసిక్స్‌పై అవగాహనను పరీక్షించేలా ప్రశ్నలుంటాయి. వీటికోసం బిజినెస్ టెర్మినాలజీ, వ్యాపార విధానాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. కంప్యూటర్ టెర్మినాలజీకి సంబంధించి బేసిక్ అంశాలను తెలుసుకోవాలి.

ముఖ్య సూచనలు

- పరీక్షలో ఆయా విభాగాల్లో అభ్యర్థుల ప్రాథమిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి.
- పరీక్షలో 200 ప్రశ్నలకు 150 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాలి. అంటే ఒక్కో ప్రశ్నకు ఒక్క నిమిషం కూడా అందుబాటులో లేదు. కాబట్టి వేగంగా, కచ్చితత్వంతో జవాబులిచ్చే నైపుణ్యం పెంపొందించుకోవాలి.
- పరీక్షకు సుమారుగా 70 రోజుల సమయం ఉంది. మీకు పట్టు ఉన్న అంశాలకు కాకుండా, అంతగా పరిజ్ఞానం లేనివాటికి ఎక్కువ సమయం కేటాయించాలి.
- ముందుగా సెక్షన్ బీతో ప్రిపరేషన్ ప్రారంభించాలి. ఎందుకంటే సెక్షన్ ఏ సిలబస్ కూడా ఇందులో ఇమిడి ఉంటుంది కాబట్టి. సెక్షన్ బీలో అర్థమెటిక్, ఆల్‌జీబ్రా, జామెట్రీ, స్టాటిస్టికల్ ఎబిలిటీల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఇక్కడ భావనలను అర్థం చేసుకుంటే చాలా ప్రశ్నలకు జవాబులు గుర్తించవచ్చు.
- సెక్షన్ బి సన్నద్ధత సెక్షన్ ఎలో పేర్కొన్న డాటా సఫిషియెన్సీకి కూడా ఉపయోగపడుతుంది. ప్రశ్నించే విధానమే భిన్నంగా ఉంటుంది.
- గణితేతర నేపథ్యం ఉన్నవారు సెక్షన్-బికి ఎక్కువ సమయం కేటాయించాలి. ఇలా తమ విద్యానేపథ్యం, సామర్థ్యం ఆధారంగా వ్యక్తిగత స్థాయిలో పక్కాగా ప్రణాళిక రూపొందించుకుంటే ప్రయోజనం.
- సాధ్యమైనన్ని ఎక్కువ నమూనా పరీక్షలను రాయాలి.

తెలంగాణ

తెలంగాణ ఐసెట్ - 2018 నిర్వహణ బాధ్యతలను వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరీక్ష ద్వారా అర్హత సాధించిన వారికి ప్రొ. జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జేఎన్‌టీయూహెచ్, కేయూ, మహాత్మాగాంధీ, ఉస్మానియా, పాలమూరు, శాతవాహన, తెలంగాణ యూనివర్సిటీల పరిధిలోని కాలేజీల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు.

అర్హత

ఎంబీఏ - ఏదైనా డిగ్రీ (ఓరియంటల్ లాంగ్వేజ్‌స్ కాకుండా). ఎంసీఏ - ఏదైనా డిగ్రీ. ఇంటర్మీడియెట్ / 10+2 స్థాయిలో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు అయితే 45 శాతం మార్కులు ఉంటే చాలు. చివరి సంవత్సరం కోర్సు చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30, 2018
- ఐసెట్ పరీక్ష తేదీ: మే 23, 24, 2018
- పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, మహబూబ్ నగర్, కర్నూల్, కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి, తిరుపతి, ఖమ్మం, సిద్దిపేట, విజయవాడ, కోదాడ, నిజామాబాద్, వరంగల్, విశాఖపట్నం.
- వెబ్‌సైట్: icet.tsche.ac.in

ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్‌లో ఐసెట్ - 2018 నిర్వహణ బాధ్యతలను శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరీక్ష ద్వారా అర్హత సాధించిన వారికి ఎంబీఏ, ఎంసీఏ, ఎంసీఏ (లేటరల్ ఎంట్రీ) కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. లేటరల్ ఎంట్రీ విధానంలో ఎంసీఏ కోర్సులో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందొచ్చు.

అర్హత

ఎంబీఏ - ఏదైనా డిగ్రీ (10+2+3 విధానంలో), 10వ తరగతిలో మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఉండాలి. **ఎంసీఏ:** ఏదైనా డిగ్రీ. ఇంటర్మీడియెట్ / 10+2 స్థాయిలో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. **ఎంసీఏ (లేటరల్ ఎంట్రీ):** బీసీఏ లేదా ఐటీ / సీఎస్ డిగ్రీ. ఇంటర్మీడియెట్ / 10 + 2 స్థాయిలో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.

ముఖ్య సమాచారం


- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 14, 2018.
- ఐసెట్ పరీక్ష తేదీ: మే 2, 2018.
- ఫలితాల వెల్లడి: మే 12, 2018.
- వెబ్‌సైట్: www.sche.ap.gov.in/icet

తిరుగుబాటును నడిపించిన యోధులు

పోటీ పరీక్షల ప్రత్యేకం

హిస్టరీ

భారతదేశంలో ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా 1857లో చారిత్రక తిరుగుబాటు జరిగింది. ఈ తిరుగుబాటు క్రమంగా వివిధ ప్రాంతాలకు వ్యాపించింది. అనేక మంది యోధులు ముందుండి ఈ పోరాటాన్ని నడిపించారు. అదే సమయంలో బ్రిటిషర్లు ఈ తిరుగుబాటును అణచి వేయడానికి పలు వ్యూహాలను రచించారు.



కలకత్తా సమీపంలోని డమ్‌డమ్‌లో మొదటగా ఎన్‌ఫీల్డ్ రైఫిల్స్ ప్రస్తావన వచ్చింది. మతం మలినమై పోతుందన్న ఆందోళనతో బర్హంపూర్‌లోని 19వ పదాతి దళం కవాతులో పాల్గొనడానికి నిరాకరించింది. 1857 మార్చి 29న బెంగాల్‌లోని బారక్‌పూర్ 34వ పటాలానికి చెందిన మంగళ్‌పాండే అనే సిపాయి కొవ్వు పూసిన తూటాలను వినియోగించేందుకు నిరాకరించి బాగ్ అనే అధికారిని కాల్చి చంపాడు. పాండేను ఏప్రిల్ 8న ఉరి తీశారు. ఆ తరవాత 19వ పదాతి దళాన్ని రద్దు చేశారు. సిపాయిలు ఎర్ర కలువలు, చపాతీల ద్వారా రహస్యంగా విప్లవ సందేశాలను దేశంలోని అన్ని సైనిక శిబిరాలకు చేరవేసేవారు.


మీరట్ నుంచి మొదలు

1857 ఏప్రిల్ 24న మీరట్‌లో సైన్యాధికారి కల్నల్ స్మిత్ మూడో అశ్విక దళానికి చెందిన సిపాయిలను ఎన్‌ఫీల్డ్ తుపాకులు ఉపయోగించాలని ఆదేశించాడు. ఇందుకు 85 మంది సిపాయిలు నిరాకరించడంతో వారికి పదేళ్ల జైలు శిక్ష విధించాడు. వీరిని 1857 మే 9న దుస్తులు విప్పి, బేడీలు వేసి అవమానించడంతో మే 10న సిపాయిలు బ్రిటిషర్లపై తిరుగుబాటు చేశారు. ఇది మీరట్ నుంచి ప్రారంభమైంది. అదే రోజు మొగలుల అధికార కేంద్రమైన ఢిల్లీ వెళ్లి చక్రవర్తి రెండో బహదూర్‌షాను షెహన్‌షాహి హిందుస్థాన్ (భారతదేశ చక్రవర్తి)గా ప్రకటించారు. ఢిల్లీలోని బ్రిటిష్ అధికారులైన సైమన్ ఫ్రేజర్, రిప్లిలను హత్య చేశారు. ఈ తిరుగుబాటు కార్చిచ్చులా ఢిల్లీ, కాన్పూర్, అలహాబాద్, ఝాన్సీలకు వ్యాపించింది. వీటిని అణచివేసేందుకు బ్రిటిషర్లు అనేక మంది సైన్యాధికారులను నియమించారు.

తిరుగుబాటు - అణచివేత

- **ఢిల్లీ:** భక్త ఖాన్, ఢిల్లీలో తిరుగుబాటును వ్యాప్తి చేయగా హడ్సన్ అణచి వేశాడు. ఢిల్లీ తిరుగుబాటును తిప్పికొట్టేందుకు వచ్చిన జనరల్ నికల్సన్ తిరుగుబాటులో మరణించాడు. హడ్సన్ ఈ తిరుగుబాటును అణచి రెండో బహదూర్‌షా, అతని భార్యను రంగూన్‌కు పంపి ఇతర కుటుంబ సభ్యులను కాల్చి చంపాడు. రెండో బహదూర్‌షా రంగూన్ జైల్లో 1862లో మరణించాడు. అతని సమాధి అక్కడే ఉంది.
- **కాన్పూర్:** నానా సాహెబ్.. కాన్పూర్‌లో ప్రధాన తిరుగుబాటు దారుడు. ఇతని అసలు పేరు దొండేపంత్. హవ్‌లాక్, నీల్ అనే బ్రిటిష్ అధికారులు ఇక్కడి తిరుగుబాటును అణచి వేశారు. నానా సాహెబ్, చివరి పీష్వా రెండో బాజీరావు దత్త పుత్రుడు. బ్రిటిష్ ప్రభుత్వం చేసిన అక్రమ చట్టాలు సూర్య కిరణాల్లాగా అన్ని వైపులా మండుతున్నాయని ఫ్రెంచి చక్రవర్తికి లేఖ రాశాడు. కాన్పూర్‌లో బ్రిటిష్ సైన్యాధికారి నీల్‌కు తిరుగుబాటుదారుల చేతిలో పరాభవం ఎదురైంది. మరో అధికారి హవ్‌లాక్ వచ్చి నానాసాహెబ్‌ను ఓడించి కాన్పూర్‌ను ఆక్రమించాడు. కంపెనీ ఆదేశాల మేరకు హవ్‌లాక్ కాన్పూర్ రక్షణను జనరల్ నీల్‌కు అప్పగించి లక్నో వెళ్లాడు. మరల నానా సాహెబ్, అతని అనుచరుడు తాంతియా తోపేలు నీల్ సేనలతో పోరాడి ఓడిపోయారు.
- **తాంతియా తోపే:** ఇతని అసలు పేరు రామచంద్ర పాండురంగ్. ఝాన్సీ, గ్వాలియర్ ప్రాంతాల్లో లక్ష్మీబాయికి సహకరించారు. ఇతడు గెరిల్లా యుద్ధంలో ఆరితేరిన వ్యక్తి. మాలిసన్ ఇతన్ని గెరిల్లా యుద్ధ వీరుడిగా వర్ణించారు. తాంతియా తోపే 1859లో జయ్‌పూర్ వద్ద జరిగిన సికార్ యుద్ధంలో ఓడిపోయాడు. బ్రిటిష్ సేనలు తరుముతుంటే తాంతియా తోపే సహాయం కోసం మాన్‌సింగ్‌ను ఆశ్రయించాడు. కానీ మాన్ సింగ్ (ముల్తాన్ పాలకుడు) నమ్మక ద్రోహం చేసి బ్రిటిషర్లకు తాంతియా తోపేను అప్పగించాడు.

- **ఝాన్సీ:** ఇక్కడి ప్రధాన తిరుగుబాటుదారు లక్ష్మీబాయి. ఈమె అసలు పేరు మణికర్ణిక. ఈమె ఝాన్సీ పాలకుడైన గంగాధర రావు భార్య. వీరి దత్త పుత్రుడు దామోదర్ రావు. హ్యూరోజ్ అనే బ్రిటిష్ అధికారి ఇక్కడి తిరుగుబాటును అణచి వేశాడు. దత్తత స్వీకార చట్టం ప్రకారం డల్హౌసి 1854 ఫిబ్రవరి 27న ఝాన్సీ రాజ్యాన్ని ఆక్రమించాడు. మీరట్‌లో తిరుగుబాటు ప్రారంభమైన వెంటనే లక్ష్మీబాయి సేనలు ఝాన్సీ కోటపై దాడి చేసి ఆయుధాగారం, కోశాగారాలను వశపరచుకోవడమే కాకుండా అనేక మంది బ్రిటిష్ అధికారులను హత్య చేశాయి. దీన్నే జోఖన్‌బాగ్ హత్యాకాండగా పేర్కొంటారు. చివర్లో హ్యూరోజ్ నాయకత్వంలోని బ్రిటిష్ సేనలు ఝాన్సీపై దాడి చేశాయి. ఈ యుద్ధంలో గ్వాలియర్ వద్ద లక్ష్మీబాయి మరణించింది.
- ఝాన్సీ లక్ష్మీబాయిని రోస్ 'జోన్ ఆఫ్ ఆర్క్' అని వర్ణించారు. హ్యూరోజ్ ఆమె గురించి చెబుతూ 'ఈ స్త్రీ తిరుగుబాటుదారుల్లో ఏకైక పురుషుడు'. అంతేకాదు తిరుగుబాటుదారులు అందరిలో ధైర్యవంతురాలు, తెలివి, అందం, పట్టుదల కలది అన్నారు. 'మా స్వహస్తాలతో మా స్వాతంత్ర్యాన్ని సమాధి చేయం' అంటూ ఝాన్సీ లక్ష్మీబాయి పోరాటం సాగించింది.



బి.వి. నారాయణరెడ్డి

జాబ్ కార్నర్

ఇండియన్ ఎయిర్ ఫోర్స్



ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆధ్వర్యంలోని సౌత్ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ హెడ్ క్వార్టర్ - గ్రూప్ సీ సివిలియన్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **54**
- ఉద్యోగాలు: మల్టీ టాస్కింగ్ స్టాఫ్ 12, హౌస్ కీపింగ్ స్టాఫ్ 8, మెస్ స్టాఫ్ 16, లాండ్రీమన్ 2, కుక్ 6, కార్పెంటర్ 3, పెయింటర్ 2, వల్కనైజర్ 1, ఎల్‌డీసీ 4
- అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మెట్రిక్యులేషన్ / పదో తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగంలో ఏడాది అనుభవం ఉండాలి. ఎల్‌డీసీ ఉద్యోగాలకు ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు నిమిషానికి 30 ఇంగ్లీషు పదాల టైపింగ్ చేసే సామర్థ్యం ఉండాలి.
- వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ / ప్రాక్టికల్ టెస్ట్ / ఫిజికల్ టెస్ట్ ద్వారా
- రాత పరీక్ష వివరాలు: ఇందులో ప్రశ్నలన్నీ పదో తరగతి స్థాయిలోనే ఉంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లీష్, జనరల్ అవేర్‌నెస్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. రాత పరీక్షలో అర్హత పొందిన వారిని 1:10 నిష్పత్తిలో తదుపరి ప్రక్రియలకు ఎంపిక చేస్తారు.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 17, 2018

సీనియర్ రెసిడెంట్లు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్యూబర్‌కొలాసిస్ అండ్ రెస్పిరేటరీ డిసీజెస్ (ఎన్‌ఐటీఆర్‌డీ) - సీనియర్ రెసిడెంట్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

- ఖాళీలు: **8**
- విభాగాలు: టీబీ అండ్ చెస్ట్ డిసీజెస్ / పాథాలజీ/ రేడియాలజీ / థొరాసిస్ సర్జరీ/ బయో కెమిస్ట్రీ / అనెస్థీషియా / మాలిక్యులర్ మెడిసిన్
- వయసు: ఇంటర్వ్యూ నాటికి 33 ఏళ్లు మించకూడదు.
- ఇంటర్వ్యూ తేదీ: ఏప్రిల్ 3, 2018.
- వెబ్‌సైట్: www.nitrd.nic.in

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 17 మార్చి 2018

ఉగాది పచ్చడితో శుభాకాంక్షలు..

ఉగాది అనగానే ముందుగా గుర్తొచ్చేది ఉగాది పచ్చడి. జీవితమంటే తీపి, పులుపు, చేదు వంటి రుచుల కలగలుపేననే గొప్ప జీవిత సత్యం ఉగాది పచ్చడి వెనుక దాగుందని చాలామంది భావిస్తుంటారు. ఏది ఏమైనా ఉగాది ప్రత్యేకత అయిన ఉగాది పచ్చడిని స్వయంగా చేసుకుని ఆస్వాదించాల్సిందే. ఇంతకూ ఈ పచ్చడిని ఎలా చేయాలంటే....

కావలసినవి: పచ్చి మామిడి ముక్కలు- ఒక కప్పు (సన్నగా తరిగి), వేప పువ్వు- ఒక టేబుల్‌స్పూను, బెల్లం తరుగు- ఒక కప్పు, పచ్చి కొబ్బరిముక్కలు- ఒక టేబుల్‌స్పూను, చింతపండు పేస్టు- నాలుగు టేబుల్‌స్పూన్లు, పచ్చిమిర్చి- రెండు (సన్నగా తరిగి), అరటిపండు ముక్కలు- రెండు టేబుల్ స్పూన్లు, చెరకు ముక్కలు- రెండు టేబుల్‌స్పూన్లు, నల్లద్రాక్షపళ్లు- ఆరు(కావాలనుకుంటే), ఉప్పు-తగినంత.

తయారీ: బెల్లంతో సహా పైన పేర్కొన్న అన్ని పదార్థాలను ఒక గిన్నెలో వేయాలి. చింతపండు పేస్టును కూడా అందులో కలపాలి. పచ్చడిని కొద్దిగా పలచగా చేసుకోవాలనుకుంటే చింతపండు పేస్టులో రెండుమూడు టేబుల్‌స్పూన్ల నీళ్లు కలపొచ్చు. ఉగాది పచ్చడిలో పుట్నాల పప్పును కూడా వేసుకోవచ్చు. ఇలా తయారుచేసిన ఉగాది పచ్చడిని ఇంట్లో వారికి, ఇంటికి వచ్చిన వారికి పెట్టి తెలుగు నూతన సంవత్సరాది శుభాకాంక్షలు చెప్పండి.



వంటిల్లు

పండగ రుచులు

ఉగాది అంటేనే షడ్రుచుల సమ్మేళనం. ఉగాది పచ్చడితో పాటు బొబ్బట్లు, మామిడి పులిహోర, అరటికాయ బజ్జీలు, గసగసాల పాయసం, అప్పం... అన్నీ ప్రత్యేక వంటకాలే. పండగ రోజున ఆ రుచులను మీరూ ఆస్వాదించండి.

మామిడికాయ పులిహోర

కావలసినవి: బియ్యం- ఒక కప్పు, పచ్చిమామిడికాయ తరుగు- ఒక కప్పు, ఉప్పు-తగినంత, పసుపు-1/8 టీస్పూను.

తాలింపు కోసం: నువ్వులనూనె- మూడు టేబుల్‌స్పూన్లు, ఆవాలు- అర టీస్పూను, మినపప్పు-రెండు టీస్పూన్లు, శెనగపప్పు- ఒక టేబుల్‌స్పూను, కరివేపాకు-గుప్పెడు, ఇంగువ-చిటికెడు, అల్లం- చిన్నముక్క (తరిగి), పల్లీలు-మూడు టేబుల్‌స్పూన్లు, పచ్చిమిర్చి-మూడు (సన్నగా, పొడుగ్గా తరిగి), ఎండుమిర్చి- మూడు.

తయారీ:

- బియ్యంలో సరిపడా నీళ్లు పోసి ఉడికించాలి.
- ఉడికిన అన్నాన్ని పెద్ద పళ్లెంలో పోసి పైన ఒక టీస్పూను నువ్వుల నూనె చల్లాలి.
- పల్లీలను నూనె వేయకుండా వేగించి పొట్టు తీసేయాలి.
- కళాయిలో నూనె వేడి చేసి ఆవాలు వేయాలి. అవి చిటపటలాడేటప్పుడు మినపప్పు, శెనగపప్పు, కరివేపాకు, ఎండుమిర్చి, పచ్చిమిర్చి, ఇంగువ, పల్లీలు వేసి వేగించాలి. ఆ తర్వాత అల్లం తరుగు కూడా వేసి కొంచెంసేపు వేగించాలి.
- ఆ తర్వాత పసుపు, మామిడి తరుగును వేసి మూడు నిమిషాలు గరిటెతో అటు ఇటు తిప్పాలి. ఆ తరువాత ఉప్పు వేయాలి.
- ఈ తాలింపును అన్నంలో వేసి అంతా బాగా కలిసేలా కలపాలి.



బొబ్బట్లు

కావలసినవి: పిండిముద్దకి: మైదా- ఒక కప్పు, ఉప్పు- చిటికెడు, నూనె, నీళ్లు- ఒక్కొక్కటి మూడు టేబుల్‌స్పూన్లు చొప్పున.

స్టఫ్ఫింగ్ కోసం: శెనగపప్పు, బెల్లం- ఒక్కొక్కటి ముప్పావు కప్పు, కొబ్బరి-పావుకప్పు.

తయారీ:

- మైదా, ఉప్పు, నూనె, నీళ్లు అన్నీ ఒక పాత్రలో వేసి ముద్దలా కలపాలి. దీనిపై మరో టేబుల్‌స్పూను నూనె వేసి మూతపెట్టి మూడుగంటలసేపు నానబెట్టాలి.
- శెనగపప్పును వేగించి ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించాలి.
- ఉడికిన శెనగపప్పు (నీళ్లు ఉండకుండా జాగ్రత్తపడాలి), బెల్లం, కొబ్బరిని మిక్సీలో వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి.
- మైదాపిండిని నిమ్మకాయ సైజు ఉండలుగా చేయాలి.
- ఈ ముద్దల్ని చిన్నచిన్న పూరీల్లా ఒత్తాలి. వీటి మధ్యలో పూర్ణం పెట్టి నాలుగువైపుల నుంచి మూయాలి.
- తర్వాత పూర్ణం నింపిన ఉండల్ని పెద్దవిగా, పలచగా ఒత్తాలి.
- సన్నని మంటపై తవా వేడిచేయాలి. దాని మీద నెయ్యి వేసి బొబ్బట్లను బంగారు రంగులోకి వచ్చేదాకా కాల్చాలి. అలానే రెండవ వైపు కూడా కాల్చాలి. ఇలానే మిగతా వాటిని కూడా కాల్చాలి.





గసగసాల పాయసం

కావలసినవి: గసగసాలు- మూడు టేబుల్‌స్పూన్లు, బియ్యం- రెండు టీస్పూన్లు, బెల్లం -అరకప్పు, కొబ్బరితరుగు- అర కప్పు, పాలు- రెండు కప్పులు, నీళ్లు- ఒక కప్పు, యాలక్కాయ-ఒకటి.

తయారీ:

- కడాయిని సన్నని మంటపై పెట్టి గసగసాలు, బియ్యంలను కాస్త రంగు మారేవరకు వేగించాలి.
- బియ్యం, గసగసాలు చల్లారాక మిక్సీలో గ్రైండ్ చేయాలి.
- ఇందులో కొబ్బరి తరుగు, యాలక్కాయ వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. అవసరమనుకుంటే కొద్దిగా నీళ్లు కలపొచ్చు.
- ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీయాలి. ఇందులో పాలు, బెల్లం, కొద్దిగా నీరు కలిపి కాసేపు ఉడికించాలి.
- మిశ్రమం ఉడికేటప్పుడు మధ్యమధ్యలో గరిటెతో కలుపుతుండాలి. కాస్త చిక్కనైన తర్వాత స్టవ్ ఆపేయాలి. వేడివేడిగా తిన్నా, చల్లగా తిన్నా టేస్టీగా ఉంటుంది ఈ పాయసం.



అరటికాయ బజ్జీ

కావలసినవి: అరటికాయ-ఒకటి, శెనగపిండి- ముప్పావుకప్పు, బియ్యప్పిండి-పావు కప్పు, కారం- ఒక టీస్పూను, ఇడ్లీపిండి- రెండు టేబుల్‌స్పూన్లు, ఉప్పు- తగినంత, జీలకర్ర పొడి- కొద్దిగా, ఇంగువ-1/8 టీస్పూను, నీరు-సరిపడినన్ని.

తయారీ:

- అరటికాయ తొక్కను తీసేసి గుండ్రని ముక్కలుగా తరిగాలి. ఆ ముక్కలు నల్లబడకుండా నీళ్లల్లో వేయాలి.
- ఒక గిన్నెలో శెనగపిండి, బియ్యప్పిండి, ఇంగువ, జీలకర్రపొడి, ఇడ్లీ లేదా దోసె పిండి, కారం, ఉప్పు అన్నీ వేసి బాగా కలపాలి. ఈ పిండి కొద్దిగా జారుగా ఉండాలి.
- సన్నని మంటపై కడాయి పెట్టి నూనె వేడిచేయాలి. తర్వాత అరటికాయ ముక్కలను శెనగపిండి మిశ్రమంలో ముంచి వేడెక్కిన నూనెలో వేసి బంగారు రంగు వచ్చేదాకా వేగించాలి. అలా అన్ని అరటికాయ ముక్కలను నూనెలో వేగించాలి.
- ఎక్కువ నూనెను పీల్చినట్టు అనిపిస్తే పేపర్ టవల్స్‌పై బజ్జీలు వేస్తే అది నూనె పీల్చుకుంటుంది.



నెయ్యి అప్పం

కావలసినవి: బియ్యం- ఒక కప్పు, బెల్లం- చిన్న కప్పు, యాలకులపొడి- చిటికెడు, కొబ్బరిముక్కలు (చిన్నవి)- ఒక టేబుల్‌స్పూను, గోధుమపిండి- రెండు టేబుల్‌స్పూన్లు, అరటిపండు- (గుజ్జులా చేయాలి)-ఒకటి, వేపుడుకు- నెయ్యి లేదా నూనె.

తయారీ:

- బియ్యాన్ని బాగా కడిగి నాలుగు గంటలు నానబెట్టాలి.
- తర్వాత బియ్యాన్ని బ్లెండర్‌లో వేసి పిండిలా చేయాలి.
- బెల్లం తరుగును కూడా వేసి మెత్తటి పిండిలా చేయాలి.
- ఆ పిండిని వెడల్పాటి గిన్నెలో పోయాలి.
- దీంట్లో యాలకలపొడి, కొబ్బరిముక్కలు, గోధుమపిండి, అరటిపండు గుజ్జు వేసి బాగా కలపాలి.
- ఈ పిండి ఇండ్లీ పిండి కన్నా కాస్త ఎక్కువ చిక్కగా ఉండాలి. పిండి పలచగా అవకూడదు.
- తర్వాత పనియారం ప్యాన్‌ని (ఇడ్లీ ప్లేట్లలాంటివి) తీసుకొని ఒక్కో గుంటలో ఒక్కో టీస్పూను నెయ్యి వేయాలి.
- ఆ గుంటల్లో గరిటెడు పిండి వేసి సన్నని మంటపై ఉడికించాలి.
- ఒకవైపు ఉడికిన తర్వాత రెండో వైపుకు తిప్పి మరికాసేపు ఉడికించాలి. అవసరమైతే ఒక చుక్క నెయ్యి వేయొచ్చు.
- ఈ నెయ్యి అప్పాలను పేపర్ టిష్యూ మీద పెడితే అది నెయ్యిని పీల్చేస్తుంది.

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే..

ఆహారం - ఆరోగ్యం

నా వయసు 64 సంవత్సరాలు. హార్ట్ ఫెయిల్యూర్‌తో బాధపడుతున్నాను. నీరసం, కాళ్ళు లాగడం ఉంది. ఆహారంలో ఎలాంటి మార్పులు చేస్తే కుదుట పడతానో చెప్పండి.

హార్ట్ ఫెయిల్యూర్, గుండె సంబంధిత వ్యాధులున్నవారు జీవనవిధానంలో మార్పులు చేసుకుంటే ఆరోగ్యం కుదుటపడుతుంది.

ఆహారంలో పీచు పదార్థం : హార్ట్ ఫెయిల్యూర్ ఉన్న వారు రోగనిరోధక శక్తి పెంచుకోవడం చాలా అవసరం. పీచు పదార్థం బాడీఫ్యాట్‌ని, బ్లడ్‌ఫ్యాట్‌ని నార్మల్‌గా ఉంచడానికి ఉపయోగపడుతుంది. తొక్క వున్న గింజలు ఉదా: శెనగలు, రాజ్మా, అలసందలు, బొబ్బర్లు, పెసలు మొదలైనవాటిలో పీచు పదార్థం సమృద్ధిగా ఉంటుంది. కాబట్టి వాటిని కూరల్లో కలిపి తినాలి. అలాగే కాయగూరలు, పళ్ళలో కూడా పీచు పదార్థం అధికం. రోజుకి రెండు కప్పుల కాయగూరలు, రెండు కప్పుల పళ్ళు తప్పనిసరిగా తీసుకోవాలి. పళ్ళు, కాయగూరలు పీచుపదార్థం ఇవ్వడమే కాకుండా ఆరోగ్యాన్ని బాగు చేసే యాంటాక్సైడ్‌ని ఇస్తాయి.



ఉప్పు నియంత్రణ: రోజుకు 5 గ్రాముల ఉప్పుకంటే ఎక్కువ వాడకూడదు. ఒక టీ స్పూను ఉప్పులో 2300 మిల్లీగ్రాముల సోడియం ఉంటుంది. ఇది నార్మల్‌గా అందరు వాడవచ్చు. హార్ట్‌ఫెయిల్యూర్ ఉన్నవారు ముప్పావు టీ స్పూను (1725 మిల్లీగ్రాములు) ఉప్పువాడితే మంచిది. హార్ట్‌ఫెయిల్యూర్ తీవ్రతను బట్టి ఉప్పు తగ్గించాలి. పొటాషియం ఎక్కువగా ఉన్న ఉప్పు మార్కెట్‌లో దొరుకుతుంది అది వాడటం మంచిది. సోడియంని పొటాషియం బ్యాలెన్స్ చేస్తుంటుంది కాబట్టి పొటాషియం అధికంగా ఉన్న పళ్ళు, కూరగాయలు ఆహారంలో ఎక్కువ తీసుకోవాలి. ఆకుకూరలు, దానిమ్మ, నిమ్మకాయల్లో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. భోజనంలో నిమ్మరసం పిండుకుంటే రుచితో పాటు సోడియంని బాలెన్స్ చేస్తుంది.

అధికంగా ఉప్పు ఆహారంలో చేరకుండా ఉండాలంటే: భోజనంలో ఉప్పు చల్లుకోవడం మానేయాలి. ఇడ్లీ, దోసె, చపాతీ పిండిలలో ఉప్పు కలపడం మానేయాలి. నిలవ పచ్చళ్లకు దూరంగా ఉండాలి. బేకరీఫుడ్స్‌లో సోడియం ఇతర రసాయనాలు ఉపయోగిస్తారు. అందుకే వాటిని కూడా దూరం పెట్టాలి. బయటి ఆహారం, సాఫ్ట్‌డ్రింక్స్, నిల్వ ఉండే పదార్థాలు బాగా తగ్గించాలి.

నీరు ఎంత తాగాలి: రోజుకి 8 కప్పులు లేక 2 లీటర్ల నీళ్లు తాగాలి. మందులు వేసుకునేందుకు తాగే నీళ్లు కూడా లెక్కలోకి వస్తాయి. కొందరికి డాక్టర్ ఫ్లూయిడ్ రిస్ట్రిక్ట్ చేస్తారు. అటువంటి వారు కొలత ప్రకారంగా నీళ్లు తాగాలి.

ఆహారంలో ఎప్పుడూ ఒకే రకం పదార్థాలు కాకుండా వేరువేరు పదార్థాలు తినాలి. పళ్ళు, కాయగూరలు సీజన్లో దొరికేవి తప్పక తీసుకోవాలి. మితంగా, సులువుగా జీర్ణమయ్యేలా టైం ప్రకారం ఆహారం తీసుకోవాలి. తొక్కతో ఉన్న ముప్పావు కప్పు గింజలు మూడు సమభాగాలుగా చేసి ఒక్కొక్క భాగాన్ని ఒక్కో పూట తీసుకోవాలి. నట్స్, సీడ్స్ రోజుకి ఒక గుప్పెడు తినొచ్చు. వీటిని స్నాక్స్‌లా తీసుకుంటే మంచిది. పంచదార 4 టీస్పూనుల కంటే ఎక్కువ తీసుకోకూడదు. నూనె కూడా 4 టీ స్పూన్లు వాడాలి. చేపలు వారానికి రెండు సార్లు తింటే మంచిది. శాఖాహారులు సోయా తీసుకోవాలి. రోజుకి ఒక గుడ్డు (పచ్చసొనతో పాటు) తీసుకోవచ్చు.

మద్యం ఇతర మత్తు పదార్థాలు తీసుకోవడం పూర్తిగా మానేయాలి. ఎనర్జీ డ్రింక్స్ జోలికి వెళ్లొద్దు. వ్యాయామం చాలా అవసరం. అయితే ఇది కూడా క్రమపద్ధతిలో, ఎంత అవసరమో అంతే చేయాలి.



డాక్టర్ బి. జానకి
న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com

అందం.. ఆరోగ్యాల నిధి... వేప

గుడ్ ఫుడ్

వేపలో ఆరోగ్య సుగుణాలే కాదు, చర్మానికి వన్నె తెచ్చే లక్షణాలు కూడా ఎన్నో ఉన్నాయి. అంతేకాదు వేపను 'గ్రామాల ఫార్మసి' అని కూడా అంటారు. ఎందుకంటే వేప చెట్టు ఆకులు, పువ్వులు, కాయలు, బెరడు, కొమ్మలు అన్నింటి వల్లా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అవేమిటంటే..

- వేపలో విటమిన్-సి బాగా ఉంది. ఇది చర్మంపై నల్లమచ్చలను పోగొడుతుంది. చర్మం మెరుపును పెంచుతుంది. యవ్వనంగా కనిపించేట్టు చేస్తుంది. వేప నూనె చర్మం పొడిబారడాన్ని తగ్గిస్తుంది. చర్మంపై వచ్చే దద్దుర్లు, దురదలపై కూడా బాగా పనిచేస్తుంది.
- దీర్ఘకాలిక చర్మ సమస్యలైన యాక్నె, పొడిచర్మం, చుండ్రు, సొరియాసిస్, ఎగ్జిమా, హెర్పిస్ వంటి వాటిపై బాగా పనిచేస్తుంది.
- కళ్ల సమస్యలను తగ్గిస్తుంది. చర్మంపై ఏర్పడ్డ పుండ్లకు మంచి మందు. మొటిమలను కూడా నివారిస్తుంది.
- శిరోజాలు పటిష్టంగా ఉండేలా చేయడమే కాదు వేప వల్ల వెంట్రుకలు కూడా బాగా పెరుగుతాయి. వేపాకు పేస్టును జుట్టుకు కండిషనర్‌గా ఉపయోగిస్తారు. ఇది చుండ్రును తగ్గిస్తుంది. దీని వల్ల శిరోజాలు కూడా నల్లగా నిగ నిగలాడతాయి.
- కడుపులోని పురుగులను నాశనం చేస్తుంది.
- మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతో మంచిది. అలాగే గాయాలపై కూడా ఇది బాగా పనిచేస్తుంది. క్యాన్సర్‌కి కూడా వేప ఉత్పత్తులు మంచిదంటారు.
- మలేరియాపై వేప బాగా పనిచేస్తుంది.
- వేపకాయలు యూరినరీ ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి.



- దగ్గు, ఆస్తమా, గుండెజబ్బులు, దంతాలు, కాలేయం సమస్యలను ఇది తగ్గిస్తుంది.
- వేపలో యాంటి-బాక్టీరియల్. యాంటీ-ఫంగల్, యాంటి-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కూడా ఉన్నాయి.
- ముఖ్యంగా చర్మ సంబంధమైన జబ్బులకు తయారయ్యే మందుల్లో వేపను వాడతారు.

చిన్నారి భీముడు





ఇప్పటి పిల్లలను భీమ్ గురించి తెలుసా! అని అడగండి. ఛోటా భీమ్ తెలుసు అని ఠక్కున చెబుతారు. భారతంలో భీముని సాహసాల కన్నా ఛోటీ భీమ్ సాహసాల గురించే ఎక్కువ చెబుతారు. పిల్లలను అంతగా ఆకట్టుకున్న కార్టూన్ సిరీస్ ఛోటా భీమ్. ఢోలక్‌పూర్‌లో ఛోటా భీమ్, అతని స్నేహితులు చేసే పనులు పిల్లలకు అమితానందాన్ని పంచాయి. మరి అంతగా ఆకట్టుకున్న ఛోటా భీమ్ కబుర్లు ఎన్నెన్నో!

- ఇందులో క్యారెక్టర్లు, కాస్ట్యూమ్స్ అన్నీ 2డి యానిమేషన్‌లో చిత్రీకరించారు. అందుకే పిల్లలు ఈ కార్టూన్ షోను బాగా ఎంజాయ్ చేయగలిగారు.
- ఛోటా భీమ్ షోను క్రియేట్ చేసింది మన తెలుగు వాడు రాజీవ్ చిలకా. అతనికి సినిమా రంగంతో గానీ, టీవీ రంగంతో గానీ ఎలాంటి సంబంధం లేదు. అయినా కార్టూన్ షో రూపొందించి సక్సెస్ అయ్యాడు.
- అమెరికాలో ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేశాక కొత్తగా ఏదైనా ప్రయత్నించాలని అనుకున్నాడు. కథలు చెప్పడంలో ఆసక్తి ఉన్నా దానికి టెక్నాలజీ, క్రియేటివిటీని జోడించడంలో మాత్రం విఫలం అయ్యాడు. చివరకు యానిమేషన్ ఎంచుకుని సక్సెస్ అయ్యాడు.
- ఒకరోజు మహాభారతంలో తనకిష్టమైన భీముని క్యారెక్టర్‌కు యంగర్ వెర్షన్ రూపొందిస్తే ఎలా ఉంటుందని ఆలోచన తట్టిందట. వెంటనే ఆరు ఎపిసోడ్‌లను రూపొందించినా టర్నర్ కార్టూన్ నెట్‌వర్క్, డిస్నీ నెట్‌వర్క్‌లను మెప్పించడంలో విఫలమయ్యాడు.
- దాంతో ఛోటా భీమ్ క్యారెక్టర్‌కు కొత్తలుక్ కోసం తీవ్రంగా శ్రమించి సక్సెస్ అయ్యాడు. పోగో టీవీలో ప్రసారం అయిన మూడేళ్లలోనే టాప్ రేటెడ్ కిడ్ షోగా స్థానం సంపాదించుకుంది.
- 2008లో పోగో టీవీలో మొదటిసారిగా ప్రసారమయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు విజయవంతంగా కొనసాగుతూనే ఉంది.
- ఢోలక్‌పూర్ రాజు రాజా ఇంద్రవర్మను భీమ్, అతని స్నేహితులు రక్షిస్తుంటారు. కొన్నిసార్లు ఇతర రాజులకు సహాయపడుతుంటారు.
- కార్టూన్ షో మొత్తం అందమైన బ్యాక్‌గ్రౌండ్‌లో నడుస్తూ ఉంటుంది. పిల్లలను ఆకట్టుకోవడానికి ఇది కూడా కారణం. క్యారెక్టర్లకు కాస్ట్యూమ్ ఎంపిక కూడా షో విజయవంతం కావడానికి దోహదపడింది.
- కాలియ పాత్రను దుర్యోధనుణ్ణి దృష్టిలో పెట్టుకుని రూపొందించారు. ఢాకూ మంగల్ సింగ్ పాత్రను షోలే సినిమాలోని గబ్బర్‌సింగ్ పాత్ర స్ఫూర్తితో పెట్టారు.
- ఇందులో ఛోటా భీమ్ వయస్సు 9 ఏళ్లు. చుట్కి భీమ్‌ని ఇష్టపడుతూ ఉంటుంది. ఇందులో మాట్లాడే కోతి జగ్గు భీమ్‌కి బెస్ట్‌ఫ్రెండ్. భీమ్‌కి మౌసి చేసే లడ్డూలంటే ప్రాణం. లడ్డూ తిన్నాడంటే మరింత శక్తిమంతంగా మారి శత్రువుల ఆటకట్టిస్తాడు.
- ఛోటా భీమ్ కార్టూన్ షోలో ఆనందంతో పాటు అంతర్లీనంగా నీతి ఉండటంతో పిల్లలకు బాగా నచ్చింది.
- **క్యారెక్టర్లు:** ఛోటా భీమ్, చుట్కి, రాజు, జగ్గు, ఢోలు, భోలు, కాలియ

కిడ్ సైంటిస్ట్!

గుడ్డు పెంకులతో స్ఫటికాలు!



కావలసినవి:
శుభ్రమైన గుడ్డుపెంకులు
నీరు
సముద్రపు ఉప్పు, సైంధవ లవణం, బేకింగ్ సోడా, ఎప్సం సాల్ట్, బొరాక్స్, పంచదార
ఫుడ్‌కలర్స్
ఎగ్‌కార్టెన్స్

ప్రయోగం చేసే విధానం!
- రంధ్రం గుండ్రంగా వచ్చేలా గుడ్లను పగలగొట్టాలి.
- గుడ్డు పెంకుల్లో సొన పూర్తిగా పోయేవరకు వేడినీళ్లతో లోపలవైపు శుభ్రంగా కడగాలి.
- వీటిని వేడినీటితో సగం వరకు నింపండి. పంచదార, ఉప్పు లాంటి ఒక్కో లవణాన్ని ఒక్కో గుడ్డు పెంకులో పావు స్పూన్ చొప్పున కలపండి.
- ఇవి పూర్తిగా కరిగి నీటిలో కలసిపోయాక తగినంత ఫుడ్ కలర్‌ను కలపండి.
- గుడ్డుపెంకుల్లోని నీరు ఆవిరయ్యేంత వరకు ఎగ్‌కార్టెన్‌లో పెట్టి జాగ్రత్తగా ఉంచాలి.
- గుడ్డు పెంకుల చుట్టూ రకరకాల రంగులు, ఆకృతుల్లో చుట్టూ స్ఫటికాలు ఏర్పడతాయి.

మన జాతీయ జెండా

భారత జాతీయ పతాకాన్ని 1947 జూలై 22 రాజ్యాంగ సభ ఆమోదించింది. జాతీయ పతాకం పొడవు, వెడల్పులు 3:2 నిష్పత్తిలో ఉంటాయి. పై భాగంలో కాషాయం, మధ్యలో తెలుపు, కింద ఆకుపచ్చ రంగులు ఉంటాయి. తెలుపు రంగు మధ్య భాగంలో 24 పట్టీలతో ముదురు నీలంరంగు (నేవీ బ్లూ)తో అశోక చక్రం ఉంటుంది. కాషాయం ధైర్యం, త్యాగాలకు చిహ్నం. తెలుపు రంగు శాంతి, సత్యం, స్వచ్ఛతలకు గుర్తు. ఆకుపచ్చ వర్ణం సౌభాగ్యానికి ప్రతీక. చక్రం అభివృద్ధిని సూచిస్తుంది. బెజవాడకు చెందిన పింగళి వెంకయ్య మన జాతీయ జెండాను రూపొందించారు.

ఔనా!



సముద్రపు తాబేళ్లు తమ విసర్జక అవయవాల ద్వారా గూడా గాలి పీల్చుకోగలవు.

లవ్లీ హార్ట్!




స్టెప్ 1: ఎ3 పేపర్‌ను చిత్రంలో చూపించిన విధంగా మడవండి.
స్టెప్ 2: అడుగుభాగాన్ని పైకి మడవండి
స్టెప్ 3: మడతలు తీసేసి కాగితాన్ని వేరే వైపునకు తిప్పండి
స్టెప్ 4: చిత్రంలో చూపించిన విధంగా మధ్యలోకి మడవండి
స్టెప్ 5: అప్పుడు కాగితం పిరమిడ్ ఆకారంలోకి వస్తుంది.
రానున్న స్టెప్స్‌లో డైమండ్ ఆకారం వచ్చేలా కాగితాన్ని ఫోల్డ్ చేయాలి.
స్టెప్ 6: చిత్రంలో చూపించిన విధంగా కాగితాన్ని మడవండి
స్టెప్ 7: ఎడమ, కుడివైపు భాగాలను మధ్యలోకి మడవండి
స్టెప్ 8: మొత్తం కాగితాన్ని సగానికి మడవండి. మళ్లీ మడతలు తీసేసి కాగితాన్ని మరో వైపునకు తిప్పండి
స్టెప్ 9: అడుగుఉన్న కుడి, ఎడమ భాగాలను పైకి మడవండి
స్టెప్ 10: కాగితం పై పొరను బొమ్మలో చూపించిన విధంగా సగానికి మడవండి
స్టెప్ 11: పైన ఉన్న రెండు కాగితం అంచులను కిందకు మడవండి
స్టెప్ 12: బయటకు ఉన్న కాగితం అంచులను లోపలికి మడవండి
స్టెప్ 13: హార్ట్ ఆకారంలో ఉన్న ఈ కాగితాన్ని మరో వైపునకు తిప్పండి
అంతే హార్ట్ రెడీ!



పుస్తక పరిచయం

పిల్లల కోసం ఓ మంచి ప్రయత్నం

తెలుగులో బాల సాహిత్యం చదివేవాళ్ళే కాదు, రాసేవాళ్ళు కూడా దాదాపు కనిపించకుండా పోతున్న కాలంలో పిల్లల కోసమే ప్రత్యేకంగా రూపు దిద్దుకున్న పుస్తకం బాల విజ్ఞాన సర్వస్వం. సంస్కృతి, సంప్రదాయాల గురించే కాకుండా వివిధ రంగాల్లో ప్రముఖుల పరిచయం, ఆచారాలు, పండగల వివరాలు ఈ పుస్తకంలో చోటు చేసుకున్నాయి. పిల్లలకు సులువుగా అర్థమవడం కోసం సంభాషణల రూపంలో వివిధ అంశాలను వివరించడం బాగుంది. ముఖ్యంగా బాలలకు వారి హక్కుల గురించి సరళమైన భాషలో తెలియజెయ్యడం చక్కటి ఆలోచన. 'గాంధీతో ముఖాముఖి', 'స్వర్గంలో మన జాతి రత్నాలు', 'అహింసా- పరమోధర్మః' లాంటి ప్రదర్శనా యోగ్యమైన రచనలు ఈ పుస్తకానికి మరింత వన్నె తెచ్చాయి. కేవలం కాలక్షేపానికి కాకుండా పిల్లలకు అవగాహన కలిగించి, వారిలో ఆలోచనలు రేకెత్తించాలన్న దృష్టితో ఈ 'సర్వస్వా'న్ని రూపుదిద్దిన రచయిత నిట్టల గోపాలకృష్ణ అభినందనీయులు.




బాల విజ్ఞాన సర్వస్వం
నిట్టల గోపాల కృష్ణ
పేజీలు: 120
వెల: 60 రూపాయలు
ప్రతులకు: గోమాత సేవా ట్రస్ట్, హైదరాబాద్
ఫోన్ నెంబర్లు: 040-27037088, 9493053206

సరైన నీడను గుర్తించండి!



ఇది విన్నారా?

కరేబియన్ సముద్రం



కరేబియన్ సముద్రం పశ్చిమ అట్లాంటిక్ మహాసముద్రంలో ఒక భాగం. దీని విస్తీర్ణం 27.53 లక్షల చదరపు మైళ్లు. గరిష్ట లోతు 25 వేల అడుగులు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పగడపు దిబ్బల్లో 9 శాతం కరేబియన్ సముద్ర తీరాల్లోనే ఉన్నాయి. ప్రపంచంలోనే అతి పొడవైన పగడపు దిబ్బల్లో ఒకటైన 'మోసో అమెరికన్ బారియర్ రీఫ్' ఈ సముద్రంలోనే ఉంది. వెనిజులా, కొలంబియా, పనామా, కోస్టారికా, హోండురాస్, మెక్సికో, క్యూబా లాంటి పలు దేశాలకు ఇది తీర ప్రాంతం. ఈ సముద్రంలో అనేక ద్వీపాలు ఉన్నాయి. డాల్ఫిన్‌లు, టూనా చేపలకు ఇది ప్రసిద్ధి. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షిస్తోంది కరేబియన్ సముద్రం.

నీతికథ

ఉపాయం

ఒక గ్రామంలో ఒక ఆసామి ఉండేవాడు. అతను ఏమీ చదువుకోకపోయినా మంచి తెలివి తేటలు గలవాడు. ఒకసారి అతనికి పది రూపాయలు అవసరమయింది. దాన్ని సంపాదించటానికి అతను ఒక ఉపాయం ఆలోచించాడు.

పట్నంలో అతనికి తెలిసిన ప్లీడరు ఒకాయన ఉన్నాడు. ఆసామి ఆయన వద్దకు వెళ్లి, "ప్లీడరుగారూ, మీరు చదువుకున్నవారు, తెలివి గలవారు. నేను చదువుకోని పల్లెటూరి మొద్దును. నేను తమర్ని ఒక ప్రశ్న అడుగుతాను. సమాధానం చెప్పలేకపోతే ఇరవై రూపాయలు ఇవ్వాలి. మీరు నన్ను ఒక ప్రశ్న అడగండి, సమాధానం చెప్పలేకపోతే పది రూపాయలు ఇచ్చుకుంటాను. పేదవాణ్ణి గదా!" అన్నాడు.



అందుకు ప్లీడరుగారు ధైర్యంగా ఒప్పుకున్నారు.

"మూడు కాళ్లూ, రెండు ముక్కులూ గల పక్షి ఏది" అని ఆసామి అడిగాడు. ప్లీడరు సమాధానం చెప్పలేక ఓడినట్టు ఒప్పుకొని ఆసామికి ఇరవై రూపాయలూ ఇచ్చి, "నేను నిన్ను ఆ ప్రశ్నే అడుగుతున్నాను. సమాధానం చెప్పు, " అన్నాడు.

"ఓడిపోయాను!" అంటూ ఆసామి పది రూపాయలు ప్లీడరుగారికిచ్చి, మిగిలిన పది జేబులో వేసుకొని వెళ్లిపోయాడు

- ఎం. శేషయ్య


ట్రై సుడోకు - 134

	3	1						
			6					8
				1	8	9	4	5
		3			6			9
	8						7	
7			4			8		
4	7	6	5	2				
9					3			
						4	9	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.
నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.
ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు-133 సమాధానం



నాగచైతన్య

మాస్ పంచ్!

మాస్... మమ మాస్ చైతూని చూడండి! ఏ చేత్తో కొట్టినా పంచ్ పవర్ ఒకేలా ఉంటుంది. ఎందుకంటే... అతడు 'సవ్యసాచి'! అంటే... రెండు చేతులకు సమాన బలం కలిగిన, సమర్థవంతంగా వినియోగించగల వాడు అని అర్థం! మహాభారతంలో అర్జునుడిని 'సవ్యసాచి' అనేవారు. ఇప్పుడిదే పేరుతో అక్కినేని నాగచైతన్య (చైతూ) హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై వై. నవీన్, వై. రవిశంకర్, మోహన్ (సీవీయం) ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అందులో చైతూ ఫస్ట్ లుక్‌ని 'ఫస్ట్ పంచ్' పేరుతో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ "టైటిల్‌కి తగ్గట్టుగా నాగచైతన్య క్యారెక్టరైజేషన్ ఉంటుంది. ఆయన మాస్ అప్పీల్ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయిక. మాధవన్, భూమిక ఆసక్తికరమైన పాత్రల్లో నటిస్తున్నారు. మన దేశంతో పాటు అమెరికాలో కొంత భాగం చిత్రీకరిస్తాం. కీరవాణిగారి స్వరాలు, నేపథ్య సంగీతం చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. జూన్ 14న విడుదల చేయాలనుకుంటున్నాం" అన్నారు. రావు రమేశ్, 'వెన్నెల' కిశోర్, సత్య, 'తాగుబోతు' రమేశ్ తదితరులు చిత్రంలో ముఖ్య తారాగణం.

'సిరిమల్లె పువ్వా... సిరిమల్లె పువ్వా!'



మమత, కౌసర్ జహాన్, ప్రియ

శ్రీదేవి నటించిన 'పదహారేళ్ల వయసు' సినిమాలో 'సిరిమల్లె పువ్వా' పాట ఎంత పాపులర్ అయిందో చెప్పనక్కర్లేదు. ఆ పాట పల్లవి మకుటంగా ఎస్.ఎం. క్రియేషన్స్ సంస్థ నిర్మించే 'సిరిమల్లె పువ్వా' చిత్రం షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తెలంగాణా రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటెల రాజేంద్ర , తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమీషన్ అధ్యక్షుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహనరావు, సుధాకర్ గోరికల్ తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు గౌతమ్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరినీ ఆకట్టుకొనే కథ, కథనాలతో సినిమా ఉంటుంది. ఇందులో మంచి సందేశం కూడా ఉంది' అని తెలిపారు. కౌసర్ జహాన్ ఈ సినిమాతో నిర్మాణరంగంలోకి ప్రవేశిస్తున్నారు. ఆమె మాట్లాడుతూ 'మా దర్శకుడు చెప్పిన కథ బాగా నచ్చింది. కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి' అని చెప్పారు. మమత, నరేంద్ర, షఫీ, ప్రియ, జి.పుల్లారావు, దీప్తి, వీరు, కుమార్, గౌతమ్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

ఆరోగ్యంగా తిరిగొస్తానని నమ్ముతున్నా!

- ఇర్ఫాన్ ఖాన్



హిందీ నటుడు ఇర్ఫాన్ ఖాన్ అనారోగ్యం గురించి రోజుకొక వార్త హల్‌చల్ చేస్తోంది. నేను అరుదైన వ్యాధితో బాధ పడుతున్నానని ఆయన ఈ నెల 4న ప్రకటించినప్పటి నుంచి బోలెడు వదంతులు షికారు చేశాయి. ఆయనకు ఏదో బ్రెయిన్ ట్యూమర్ వచ్చిందన్నారు. వీటిపై ఇర్ఫాన్ స్పందించారు. "అందరూ గూగుల్‌లో వెతికి 'న్యూరో' అనగానే బ్రెయిన్‌కి సంబంధించిన వ్యాధి అనుకుంటున్నారు. కానీ, అది నిజం కాదు. న్యూరో ఎండోక్రైన్ ట్యూమర్‌తో బాధపడుతున్నా" అని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'మనం ఆశించినది ఇవ్వాలన్న బాధ్యత జీవితానికి ఉండదు. ఉండాల్సిన అవసరం కూడా లేదు' అంటూ మార్గరెట్ మిచెల్ మాటలను కోట్ చేసిన ఇర్ఫాన్... "ఊహించని ఘటనలు జీవితంలో మనల్ని మరింత ధృడంగా చేస్తాయి. కొన్ని రోజులుగా నా జీవితంలో అదే జరుగుతోంది. నేను న్యూరో ఎండోక్రైన్ ట్యూమర్‌కి చికిత్స తీసుకుంటున్నాను. నన్ను హాస్పటల్‌లో అడ్మిట్ చేశారు. కష్టంగా ఉందిక్కడ. అయితే... చుట్టూ ఉన్నవారు నాపై చూపించే ప్రేమ, వాళ్ళు ఇచ్చే ధైర్యం నాకు జీవితంపై ఆశ కలిగించాయి. చికిత్స కోసం నేను విదేశాలు వెళ్తాను. అందువల్ల, ప్రతి ఒక్కరూ నేను కోలుకోవాలని దేవుణ్ణి ప్రార్థించమని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. నా ఆరోగ్యంపై చాలా పుకార్లు వస్తున్నాయి. వీటిపై నా స్పందన గురించి ఎదురు చూస్తున్న వారందరికీ ఒక్కమాట... మరిన్ని కథలు చెప్పడానికి నేను తిరిగొస్తాననే నమ్మకంతో ఉన్నా" అన్నారు.

ఓ రేంజ్ స్టెప్పులు!



బేబి దిత్యా బాండే, ప్రభుదేవా

"డ్యాన్స్ ప్రధానంగా సాగే చిత్రాలు వచ్చి చాన్నాళ్లయింది. అందుకే ఓ రేంజ్‌లో ఉండేలా 'లక్ష్మీ'ని తెరకెక్కించాం. ప్రతిభావంతులైన చిన్నారులతో కలిసి డ్యాన్స్ చేయడం గొప్ప అనుభూతి" అని ప్రభుదేవా అన్నారు. ఆయన కీలక పాత్రలో నటిస్తోన్న చిత్రం 'లక్ష్మీ'. ప్రభుదేవా, ఐశ్వర్య రాజేష్ కీలక పాత్రధారులు. ప్రమోద్ ఫిల్మ్స్, ట్రైడెంట్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎ.ఎల్.విజయ్ దర్శకత్వంలో ప్రతీక్ చక్రవర్తి, శృతి నల్లప్ప, ఆర్.రవీంద్రన్ నిర్మిస్తున్నారు. ప్రభుదేవా మాట్లాడుతూ "నేను, విజయ్ కలిసి చేసిన 'అభినేత్రి'కి చాలా మంచి స్పందన వచ్చింది. ఆ సినిమాకు సీక్వెల్ చేద్దామని అనుకున్నా. అంతలో విజయ్ 'లక్ష్మీ' కథ చెప్పారు. వినగానే నచ్చింది. డ్యాన్స్ సినిమాలు అనగానే గొప్ప స్థాయిలో ఉండాలి. ఆ స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా మా సినిమా ఉంటుంది. శ్యామ్ మంచి సంగీతాన్నిచ్చారు" అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రభుదేవాతో కలిసి పనిచేసినంత కాలం ఏదో ఒకటి నేర్చుకుంటూ ఉంటాను. ఆయనకు మంచి స్క్రిప్ట్ సెన్స్ ఉంది" అని తెలిపారు. తప్పకుండా అన్ని వర్గాల వారినీ మెప్పించే చిత్రమవుతుందని నిర్మాతలు శ్రుతి, ప్రతీక్ అన్నారు. బేబి దిత్యా బాండే, సల్మాన్ యూసఫ్ ఖాన్, సోఫియా, కోవై సరళ, సత్యం రాజేష్, చామ్స్ తదితరులు నటిస్తోన్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: గణేశ్, ఒమర్.

వెండితెరపై... పల్లె అందాల 'రంగస్థలం'

- సుకుమార్



సమంత

"నేను పాతికేళ్లు పల్లెటూరిలో ఉన్నాను. సరిగా గమనించాలే కానీ ఒక్కో ఊరూ ఒక్కో రంగస్థలమంత వినోదాన్ని పంచుతుంది. అందుకే మా సినిమాకు 'రంగస్థలం' అనే పేరు పెట్టాం. అదే పేరుతో ఓ ఊరు కూడా ఉండటం యాదృచ్ఛికంగా కలిసొచ్చింది" అని అన్నారు సుకుమార్. రామ్‌చరణ్, సమంత జంటగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'రంగస్థలం'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, సీవీఎం (మోహన్) నిర్మిస్తున్నారు. నవీన్ ఎర్నేని మాట్లాడుతూ "ఆడియో జూక్ బాక్స్‌ని నేరుగా మార్కెట్లో విడుదల చేశాం. ఆదివారం వైజాగ్ ఆర్.కె.బీచ్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహిస్తాం. చిరంజీవిగారు ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. యు.ఎస్‌కు కూడా ముందుగానే ప్రింట్స్ పంపేస్తున్నాం" అన్నారు. సుకుమార్ మాట్లాడుతూ "చంద్రబోస్ ముందు సాహిత్యం రాస్తే, దానికి అనుగుణంగా దేవిశ్రీ ప్రసాద్ బాణీలు కట్టారు. పాటలకు చాలా మంచి స్పందన వస్తోంది. 1980 నేపథ్యంలో సాగే చిత్రమిది. '1 నేనొక్కడినే', 'నాన్నకు ప్రేమతో' చిత్రాలు పూర్తయ్యాక విదేశాల్లో ఒక పెద్దాయన నన్ను ఇంటర్వ్యూ చేస్తూ 'మీ నుంచి పల్లె నేపథ్యంలో సాగే సినిమాలను ఆశిస్తున్నాం' అని అన్నారు. ఆ మాట నా మనసులో పడింది. ఆ ఫలితమే ఈ సినిమా. ఆర్ట్ డైరక్టర్ రామకృష్ణ తన సెట్స్ ద్వారా పల్లెటూరిని రీక్రియేట్ చేశారు. 'రంగమ్మ మంగమ్మ...' పాటలో 'గొల్లభామ' అనే పదం అభ్యంతరకరంగా ఉందని కొందరు అంటున్నారు. అది ఎవరినీ కించపరచాలని పెట్ట లేదు. గొల్లభామ అనే పదాన్ని ఓ రకం కీటకాన్ని ఉద్దేశించి పెట్టాం. ఎవరూ అపార్థం చేసుకోవద్దని మనవి" అని అన్నారు. అన్ని వర్గాల వారికీ ఈ చిత్రం తప్పకుండా నచ్చుతుందని ఆర్ట్ డైరక్టర్ రామకృష్ణ, మోనిక, గీత రచయిత చంద్రబోస్ తెలిపారు.

వినోదాల విందు



విష్ణు మంచు

'దేనికైనా రెడీ', 'ఈడో రకం ఆడో రకం' చిత్రాలతో ప్రేక్షకులను నవ్వించిన మా హీరో విష్ణు మంచు, దర్శకుడు జి నాగేశ్వరరెడ్డిలు ఈ వేసవిలో 'ఆచారి అమెరికా యాత్ర'తో వినోదాల విందు ఇవ్వడానికి వచ్చేస్తున్నారని చిత్రసమర్పకులు ఎం.ఎల్. కుమార్‌చౌదరి స్పష్టం చేశారు. విష్ణు మంచు హీరోగా జి నాగేశ్వరరెడ్డి దర్శకత్వంలో ఆయన సమర్పణలో కీర్తి చౌదరి, కిట్టు నిర్మించిన చిత్రం 'ఆచారి అమెరికా యాత్ర'. ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్. ఏప్రిల్ 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. "మా చిత్రంతో విష్ణు, నాగేశ్వరరెడ్డిలు హ్యాట్రిక్ అందుకోవడం ఖాయం. ముందు రెండు చిత్రాల వలే ఇదీ ప్రేక్షకులకు వినోదాల విందు అందిస్తుంది. విష్ణు, బ్రహ్మానందం కాంబినేషన్‌లో వచ్చే సన్నివేశాలు చిత్రానికి హైలైట్‌గా నిలుస్తాయి" అని నిర్మాతలు తెలిపారు. కోట శ్రీనివాసరావు, తనికెళ్ళ భరణి, పోసాని కృష్ణమురళి, పృథ్వీ, విద్యుల్లేఖ రామన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి రచయత: మల్లాది వెంకటకృష్ణమూర్తి, మాటలు: 'డార్లింగ్' స్వామి, సంగీతం: ఎస్.ఎస్. తమన్.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
33176.00	10195.15	30460	38275	64.94	64.99
509.54	165.00	15	55		

బంగారం: ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

టిడిపి క్విట్.. మార్కెట్ ఫట్!

ఇన్వెస్టర్లలో ట్రేడ్ వార్ గుబులు .. సెన్సెక్స్ 510 పాయింట్లు పతనం

రూ.1.86 లక్షల కోట్ల సంపద ఆవిరి



మూడు వారాలుగా నష్టాల్లోనే..
వరుసగా మూడో వారం స్టాక్ సూచీలు నష్టాలతోనే ముగింపు పలికాయి. ఈవారంలో సెన్సెక్స్ 131.14, నిఫ్టీ 31.70 పాయింట్లు కోల్పోయాయి.

ముంబై: దేశంలో రాజకీయ స్థిరత్వంపై ఆందోళనలు, అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధ భయాలు పెరిగిన నేపథ్యంలో స్టాక్ మార్కెట్ భారీగా నష్టపోయింది. వారాంతం ట్రేడింగ్‌లో బిఎస్‌ఇ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ ఏకంగా 509.54 పాయింట్లు (1.51 శాతం) క్షీణించి 33,176 వద్దకు జారుకుంది. గత నెల 6 వ తేదీ తర్వాత సూచీకిదే అతి పెద్ద పతనం. నిఫ్టీ సైతం 10200 దిగువ స్థాయికి పడిపోయింది. 10180.25 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివర్లో 165 పాయింట్లు (1.59 శాతం) నష్టంతో 10,195.15 వద్ద స్థిరపడింది. ఎన్‌డిఎ కూటమి నుంచి తెలుగుదేశం పార్టీ వైదొలగడంతో పాటు పార్లమెంట్‌లో మోదీ సర్కారుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో దేశంలో రాజకీయ స్థిరత్వంపై ఆందోళనలు మొదలయ్యాయి.

భారత ఎగుమతి సబ్సిడీలపై అమెరికా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీఓ) వద్ద సవాలు చేయడం, చైనా దిగుమతులను అడ్డుకునేందుకు మరిన్ని చర్యలు చేపడతామంటూ ట్రంప్ సర్కారు సంకేతాలివ్వడంతో అంతర్జాతీయ మదుపర్లలో వాణిజ్య యుద్ధ భయాలు మరింత పెరిగాయి. దాంతో దలాల్ స్ట్రీట్‌తో పాటు ఇతర ఆసియా మార్కెట్లలోనూ అమ్మకాలు పోటెత్తాయి.

మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.143.17 లక్షల కోట్లకు పతనం

స్టాక్ మార్కెట్ భారీ పతనంతో ఇన్వెస్టర్ల సంపద రూ.1.86 లక్షల కోట్ల మేర తరిగిపోయింది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సరికి బిఎస్‌ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,86,415 కోట్లు తగ్గి రూ.1,43,17,908 కోట్లకు జారుకుంది.



నష్టాల్లో టాటా మోటార్స్ షేరు టాప్

వీకెండ్ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ కంపెనీల్లో టాటా మోటార్స్ షేరు అత్యధికంగా 3.67 శాతం పతనమైంది. ఏషియన్ పెయింట్స్ షేరు 3.09 శాతం పడిపోయింది. అదానీ పోర్ట్స్, హీరో మోటోకార్ప్, ఎస్‌బిఐ, సన్ ఫార్మా, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఒఎన్‌జిసి, హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్, ఎల్ అండ్ టి, డాక్టర్ రెడ్డీస్, టాటా స్టీల్, మారుతి సుజుకీ, టిసిఎస్, బజాజ్ ఆటో, రిలయన్స్ ఇండస్ట్రీస్, పవర్ గ్రిడ్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎయిర్‌టెల్, ఎస్‌బ్యాంక్ షేర్లు గరిష్ఠంగా 2.89 శాతం వరకు నష్టపోవాల్సి వచ్చింది. మహీంద్రా అండ్ మహీంద్రా, విప్రో, హెచ్‌యుఎల్, యస్ బ్యాంక్ మాత్రం స్వల్ప లాభాల్లో ముగిశాయి.

అన్ని రంగాల్లోనూ అమ్మకాల ఒత్తిడి

దేశీయ మార్కెట్లో బ్లూచిప్ కంపెనీలతోపాటు చిన్న, మధ్య స్థాయి సంస్థల షేర్లు కూడా ఒత్తిడికి లోనయ్యాయి. దాంతో బిఎస్‌ఇలోని మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక శాతానికిపైగా క్షీణించాయి. బిఎస్‌ఇ లిస్టెడ్ కంపెనీల్లో 1,835 నష్టపోగా.. 859 లాభాలార్జించాయి. 36 సంస్థల షేర్ల ధర ఏడాది గరిష్ఠాన్ని, మరో 108 ఏడాది కనిష్ఠానికి తాకాయి. అన్ని రంగాల సూచీలు నెగెటివ్ జోన్‌లోనే ముగిశాయి. మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, పిఎస్‌యు, పవర్, బ్యాంకింగ్ ఇండెక్స్‌లు గరిష్ఠంగా 2.30 శాతం వరకు నష్టపోయాయి.

ఎన్‌ఎస్‌ఇ ఐఎఫ్ఎస్‌సిలో డెట్ ప్లాట్‌ఫామ్

గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో ఎన్‌ఎస్‌ఇకి చెందిన అంతర్జాతీయ ఎక్స్ఛేంజ్ ఐఎఫ్ఎస్‌సిలో డెట్ సెక్యూరిటీల ప్లాట్‌ఫామ్ ప్రారంభమైంది. ఇండియన్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్‌ఇడిఎ)కి చెందిన రూ.1,950 కోట్ల విలువైన గ్రీన్ మసాలా బాండ్లను ఈ ప్లాట్‌ఫాంపై తొలుత లిస్ట్ చేశారు.

ఎల్ అండ్ టికి రూ.2,864 కోట్ల ఆర్డర్

ఇంజినీరింగ్ దిగ్గజం లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టి)కు చెందిన నిర్మాణ విభాగానికి రూ.2,864 కోట్ల ఆర్డర్ లభించింది. ఈస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ నిర్మాణం కోసం డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డిఎఫ్‌సిసిఐఎల్) నుంచి ఈ కాంట్రాక్టును దక్కించుకున్నట్లు ఎల్ అండ్ టి తెలిపింది. ఇందులో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని ఖుర్జా నుంచి పిల్ఖాని వరకు 222 రూట్ కిలోమీటర్ సింగిల్ ట్రాక్ కారిడార్‌ను నిర్మించాల్సి ఉంటుందని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది.

సాయి ప్రసాద్ గ్రూప్ ఆస్తుల వేలం

క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ.. సాయి ప్రసాద్ గ్రూప్ కంపెనీలకు చెందిన 69 ప్రాపర్టీలను వచ్చే నెల 20వ తేదీన వేలం వేయనుంది. మహారాష్ట్రకు చెందిన ఈ కంపెనీ అక్రమ పద్ధతుల ద్వారా అమాయక ప్రజల నుంచి వందల కోట్ల డిపాజిట్లను సేకరించింది. వాటిని రికవరీ చేసేందుకు సెబీ.. సాయి ప్రసాద్ గ్రూప్ సంస్థల ఆస్తులను వేలం వేయాలని నిర్ణయించింది.

దిలీప్ బిల్డ్‌కాన్‌కు రూ.1,000 కోట్ల కాంట్రాక్టు

జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఎన్‌హెచ్ఎఐ నుంచి రూ.1,004 కోట్ల విలువైన రోడ్డు కాంట్రాక్టు దక్కించుకున్నట్లు దిలీప్ బిల్డ్‌కాన్ ప్రకటించింది. ఆర్డర్‌లో భాగంగా మధ్యప్రదేశ్‌లోని జాతీయ రహదారి 75పై రోడ్ టన్నెల్, వయాడక్ట్, చుర్హాట్ బైపాస్‌ను నిర్మించాల్సి ఉంటుందని దిలీప్ బిల్డ్‌కాన్ తెలిపింది. భారీ ఆర్డర్‌ను అందుకోవటంతో బిఎస్‌ఇలో దిలీప్ బిల్డ్‌కాన్ షేరు 1.94 శాతం లాభంతో రూ.974.45 వద్ద స్థిరపడింది.

ఆర్ఇసి డాలర్ డినామినేటెడ్ బాండ్ల జారీ

» రూ.1,949 కోట్ల సేకరణ లక్ష్యం

న్యూఢిల్లీ: విదేశీ కాలపరిమితితో కూడిన డాలర్ డినామినేటెడ్ బాండ్ల జారీ ద్వారా 30 కోట్ల డాలర్లు (రూ.1,949 కోట్లు) సేకరించనున్నట్లు రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఇసి) ప్రకటించింది. ఈ ఇష్యూను ప్రారంభించినట్లు, బాండ్ల కాలపరిమితి మార్చి 22, 2028న ముగియనుందని సంస్థ తెలిపింది. మెచ్యూరిటీ తీరాక అసలు, వడ్డీ మొత్తం డాలర్లలోనే చెల్లించనున్నట్లు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఆర్ఇసి స్పష్టం చేసింది. విద్యుత్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ సమకూర్చేందుకు ఈ నిధులను ఉపయోగించనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ బాండ్లు సింగపూర్ ఎక్స్ఛేంజ్ (ఎస్‌జిఎక్స్), లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు చెందిన ఇంటర్నేషనల్ సెక్యూరిటీస్ మార్కెట్ (ఐఎస్ఎం)లో లిస్ట్ కానున్నాయి.

హిందుస్థాన్ జింక్.. రూ.6 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: వేదాంత గ్రూప్ సంస్థ హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్ఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుపై రూ.6 డివిడెండ్ చొప్పున మొత్తం రూ.3,051 కోట్లు చెల్లించనున్నట్లు ప్రకటించింది. జింక్-లెడ్, వెండి ఉత్పత్తి చేసే అగ్రగామి సంస్థల్లో హిందుస్థాన్ జింక్ ఒకటి. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న హెచ్‌జెడ్ఎల్ పెద్ద ఎత్తున జింక్-లెడ్ గనులను కలిగి ఉంది.

ఫోర్టిస్‌లో యస్ బ్యాంక్ వాటా విక్రయం

న్యూఢిల్లీ: గత నెల ఫోర్టిస్ హెల్త్‌కేర్‌లో 17 శాతం కొనుగోలు చేసిన ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్.. అందులో నుంచి 2.17 శాతం వాటాను విక్రయించింది. గత నెల 23 నుంచి ఈ నెల 15 మధ్య ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు చెందిన 1.12 కోట్ల షేర్లను (2.17 శాతం వాటాకు సమానమైన) ఓపెన్ మార్కెట్లో విక్రయించినట్లు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో యస్ బ్యాంక్ వెల్లడించింది.

రెలిగేర్‌తో ఎడెల్‌వీజ్ డీల్ రద్దు

రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన సెక్యూరిటీల వ్యాపారాన్ని కొనుగోలు చేసేందుకు గతంలో కుదుర్చుకున్న ఒప్పందం రద్దయినట్లు ఎడెల్‌వీజ్ తెలిపింది. వ్యాపార విక్రయానికి రెలిగేర్ నిర్దిష్ట సమయంలోగా అనుమతులను సంపాదించలేకపోయిందని పేర్కొంది.

బులియన్

బంగారం	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,250	---	31,180	31,230	30,410
క్రితం ముగింపు	31,510	31,450	31,370	31,380	30,540
22 క్యారెట్లు	28,940	---	28,680	28,950	28,950
క్రితం ముగింపు	29,170	29,200	28,860	29,150	29,080
వెండి (కిలో)	39,200	---	38,900	39,500	41,300
క్రితం ముగింపు	39,600	40,000	39,500	39,800	41,600

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	70.00	విజయవాడ	71.00
కరీంనగర్	71.00	గుంటూరు	71.00
వరంగల్	70.00	ఒంగోలు	73.00
మహబూబ్‌నగర్	70.00	చిత్తూరు	73.00
కర్నూలు	70.00	నెల్లూరు	73.00
విశాఖపట్నం	74.00	అనంతపురం	72.00
గోదావరి	71.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.90 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	330.00	చిత్తూరు	363.00
వరంగల్	332.00	చెన్నై	370.00
విజయవాడ	317.00	నమక్కల్	360.00
గోదావరి	317.00	బెంగళూరు	365.00
విశాఖపట్నం	325.00	ముంబై	370.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	59.10	68.53
పౌండ్	82.33	95.50
యూరో	72.74	84.37
ఆస్ట్రేలియా డాలర్	46.03	53.26
బహ్రెయిన్ దినార్	160.05	183.41
కువైట్ దినార్	179.07	222.92
ఒమని రియాల్	156.73	179.31
సౌదీ రియాల్	15.71	18.62
సింగపూర్ డాలర్	44.19	53.25
యుఎఇ దిరమ్	16.08	18.80

డాక్టర్ రెడ్డీస్‌కు ఎఫ్‌డిఎ మళ్లీ ఝలక్

జిన్నారం ఎపిఐ ప్లాంట్‌పై 4 అభ్యంతరాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : దేశీయ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యుస్ ఎఫ్‌డిఎ) నుంచి ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. హైదరాబాద్ సమీపంలోని మెదక్ జిల్లా జిన్నారంలో ఉన్న ఎపిఐ ప్లాంట్ 1లో ఎఫ్‌డిఎ తనిఖీలు నిర్వహించి నాలుగు అభ్యంతరాలు లేవనెత్తింది. మొన్నటికి మొన్న బొల్లారంలోని ఎపిఐ ప్లాంట్‌లో ఎఫ్‌డిఎ తనిఖీలు చేపట్టి ఎఫ్‌డిఎ ఐదు అభ్యంతరాలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం నాడు జిన్నారం ఎపిఐ ప్లాంట్ 1లో ఎఫ్‌డిఎ తనిఖీలు పూర్తి చేసి నాలుగు అభ్యంతరాలతో ఫారమ్ 483 జారీ చేసిందని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. నిర్దేశిత సమయంలో ఎఫ్‌డిఎ అభ్యంతరాలకు ప్రత్యుత్తరమివ్వనున్నట్లు తెలిపింది. అయితే ఎఫ్‌డిఎ ఎలాంటి అభ్యంతరాలను లేవనెత్తిందనేది మాత్రం డాక్టర్ రెడ్డీస్ వెల్లడించలేదు.

యుఎస్ మార్కెట్లోకి అలర్జీ ఔషధం

అమెరికా మార్కెట్లోకి అలర్జీ నివారణలో ఉపయోగించే లెవోసిట్రిజైన్ డైహైడ్రోక్లోరైడ్ టాబ్లెట్లను విడుదల చేసినట్లు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ తెలిపింది. ఓవర్ ది కౌంటర్ (ఒటిసి) థెరాపుటిక్ ఉత్పత్తి అయిన ఈ టాబ్లెట్లను 5ఎంజి సామర్థ్యాల్లో విడుదల చేసినట్లు పేర్కొంది. అలర్జీల నుంచి ఇరవై నాలుగు గంటల్లో ఈ ఔషధం ఉపశమనాన్ని ఇస్తుందని తెలిపింది. యుసిబి గ్రూప్‌కు చెందిన జైజాల్ అలర్జీ టాబ్లెట్లకు ఇది సమానమైనదని వెల్లడించింది. కాగా శుక్రవారం బిఎస్‌ఇలో కంపెనీ షేరు 2.07 శాతం నష్టంతో 2,138.10 రూపాయల వద్ద క్లోజైంది.

బిఎస్‌ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ADITYA SPIN. 8.92(8.66)3138
AGRO TECH FO 657.8(657.2)3656
AISHWARYA TE 6.28(6.44)3882
ALPHAGEO (I) 763.75(765.45)3291
ALU FLUORIDE 107.1(106.65)8923
AMAR RAJA BA 783(793.55)25136
ANDHRA BANK 41.8(43)1570419
ANDHRA CEMEN 10.91(10.53)35791
ANDHRA PETRO 57.15(58.05)37587
ANJANI PORTL 183.5(180.3)8355
ASTRA MICRO 84.9(86.1)98632
AUROB.PHARMA 572.7(572.8)177528
AVANTEL LTD 531.6(541.5)3534
AVANTI FEEDS 2351.2(2379.7)11975
B.N.RATHI SE 39(40.9)1780
BALAJI AMINE 597.35(626.5)11882
BAMBINO AGRO 224.85(225.3)904
BARTRONICSIN 11.85(12.08)13495
BHAGIRA.CHEM 288(291)955
BHAGYA INL 47.45(49)54146
BHARATFIN 1059.9(1063.3)39983
BNR UDYOG 27.6(26.25)357
CAMBRIDGE 70.15(70.15)1421
CAT TECHN. .93(.97)500
CCHHL 13.28(13.52)30598
CCL PRODUCTS 294.85(294.8)2124
CELESTIAL 15.25(15.45)5298
CIL SECURITS 27.8(27.85)563
COROM INTER 525.15(527.7)122095
CUBEX TUBING 21.85(23)5778
CYBERMATE 2.77(3.04)96639
CYIENT 631.5(629.55)5348
DANLAW TECH. 73.3(73.6)9969
DECAN CEMENT 548.95(552.25)315
DHAN ROTO SP 47(49)1151
DIAMONPOWER 11.57(11.68)69759
DIVI'S LAB. 1087.15(1086.1)50515
DIVYA.GRANIT 98(94.8)11
DQ ENT 13.07(13)1968
DR.REDDY'S 2138.1(2183.2)35378
EMPEE SUGARS 3.02(3.17)78952
EVEREST ORG. 132(136)1157
FACOR ALLOYS 2.62(2.71)499191
FIRSTOBJ 15.85(15.2)18737
GATI LTD. 104.85(105.15)72982
GAYATRI BIO 6.76(7)1225
GAYATRI PROJ 198.35(201.45)9096
GENNEX LAB 4.22(3.94)642304
GMR INFRASTR 17.9(18.5)2556692
GODAVARI DRU 33.2(33)2382
GOLDST INFRA 201.5(203.6)67994
GOLDSTONE EN 13.43(14.02)4200
GRANULES (I) 110(112.65)79869
GVK POWERINF 15.25(16)630189
HBL P SYS 51.35(50.55)90213
HERITGFOOD 755.55(761)5900
HIND.FLUROCA 10.5(10)2860
I.C.S.A. IND 3.37(3.26)10537
IKF TECHNO .6(.61)102305
INCAP LTD. 84(82.2)1035
IPAPPM 297.25(302.5)3344
IVRCL LTD 3.78(3.73)187217
KAKATIYA CEM 268.35(270.9)5393
KALLAM SPG. 31.9(32.05)33710
KARAN WOO-SN 1.91(1.82)900
KAVERI SEED 475.9(493.75)27686
KCP LTD 115.3(117.2)15596
KERNEX MICRO 38.2(38.7)1043
KNR CONST 293.7(294.7)20256
KREBS BIOCHM 180.95(189.05)4750
LANCO INFRA 1.21(1.16)2603960
LOKESH MACH 58.7(59.05)12384
LOTUS CHOC 50.95(51.3)1205
MADHUCON PRJ 24.2(24.5)35820
MOLD-TEK TEC 53.35(54.95)67947
MOSCHIP SEMI 37.9(37.05)217076
MSR INDIA 48.35(48.35)5885
N C L IND. 224.75(229.35)58487
NACLIND 42.8(44.35)18550
NATCO PHARM 792.05(786.85)40667
NCC 122.5(126.45)226504
NEHA INTER. 6.34(6.8)17392
NETTLINX LTD 77.5(75.25)101150
NEULAND LAB. 722.55(702.05)17438
NIHAR INFO 14.1(13.48)390
NILE LTD. 746(756)7993
NTL 3.64(3.7)1531
OIL COUNTRY 37.95(39.3)2679
PADMALAYA TE 3.14(3.1)21230
PALRED 73.55(74.4)10296
PANYAM CEMEN 42.9(44.35)9743
PENNAR STEEL 54.65(55.9)49462
PFL INFOTECH 8.53(8.27)28
PHYTOCHEM I. 65.8(63.9)6003
PITTI LAMIN. 86.35(87.6)19765
POKARNA LTD 192.6(194.75)19205
PRAJAY ENGS. 12.71(12.59)21789
PREMIER EXPL 353(362.1)3648
PRISM CEMENT 115.4(115.9)88869
RAIN 386.5(390.35)283843
RAJ PACKAGIN 41.3(40)19541
REG.CERAMIC 4.97(5.1)12810
RESTILE CER. 7.11(7.97)2217
SAGAR CEM. 900.55(906.75)415
SAMKRG PIST. 292.9(290.1)1063
SAMPRE NUTRI 51.4(53)4777
SANGHI IND. 123.65(124.6)74335
SATVAH.ISPAT 19.55(19.7)10591
SAVEN TECHNO 24.35(25.4)43163
SMPL 1.27(1.26)16624
SMS PHARMACE 77.4(79.65)8357
SREE RAYALA 157.3(153.15)4011
STEEL EXCH 26.85(26.3)84111
SUJANA INDUS .7(.69)192609
SURANATP 5(4.93)1846
SURYACHAKRA .9(.9)66268
SURYAMBA SP 71(74)1277
SURYLAK.COTT 70(70.05)9218
SUVEN LIFE S 178.7(183.05)23446
TAJ GVK HOTL 158.15(161.15)692
TANLA 35(34.7)146683
TRANSCORP IN 33.6(34.5)4765
TRANSGENE BI 2.21(2.29)13151
TRANSPORT CO 264.3(266.45)2533
USHER AGRO 5.1(5.11)7103
VICEROY HOTE 15.6(15.2)84759
VIJAY TEXTIL 44.5(44.95)529
VIMTA LABS 199(201.45)2834
VIRAT CRANE 60.5(63.65)4089
VIRINCHI 107.7(108.75)45486
VISAKA IND. 695.4(693)3554
VISTA PHARMA 41.85(42.3)150903
VIVIMED LABS 77.8(78.75)108060
VST INDUS. 2950.45(2975)159
WATERBASE 295.65(305.75)203252
XLENERGY 2.28(2.33)3815
YBRANTDIGI 5.12(5.15)322095
ZEN TECH 124.7(129.55)26988
ZENOTECH 44.55(45.65)23927

ఎన్‌ఎస్‌ఇ-500 (NSE)
షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 550.15(565.35)8271
AARTIIND 1155.85(1166.5)35960
ABAN 162.25(165.2)465390
ABB 1336.8(1373.1)101855
ABFRL 141(147.35)800252
ABGSHIP 9(9.2)7574
ACC 1567.95(1603.15)253481
ADANIENT 160.5(167.05)12405008
ADANIPORTS 370.5(382.15)4972566
ADANIPOWER 27.3(28.1)14419571
ADANITRANS 190.85(183.5)1155751
AEGISCHEM 254.3(246.7)226230
AHLUCONT 395(380.15)152616
AIAENG 1347.05(1437.9)55385
AJANTPHARM 1410.45(1379.8)255671
AKZOINDIA 1771.55(1793)11247
ALBK 51.15(51)8838442
ALLCARGO 158.55(161.45)211767
ALOKTEXT 2.95(2.95)2473322
AMARAJABAT 782.5(793.75)539427
AMBUJACEM 234.75(242.3)3348952
AMTEKAUTO 24.35(25.55)1240097
ANANTRAJ 54(55.75)947903
ANDHRABANK 42.2(42.95)13296598
APARINDS 738.1(735.85)7528
APLLTD 536.4(540.1)43245
APOLLOHOSP 1071.65(1096)384296
APOLLOTYRE 265.65(266.45)3241898
ARVIND 393(400.4)1347084
ASHIANA 163.65(167.1)40850
ASHOKA 226.05(227.9)160138
ASHOKLEY 147.15(150.55)14963488
ASIANPAINT 1122.75(1160.8)1946844
ASTRAL 854.6(869)46427
ASTRAZEN 963.05(968.4)3377
ATUL 2626.35(2684.55)8309
AUROPHARMA 572.55(572.3)3887454
AVANTIFEED 2346(2371)249459
AXISBANK 522.6(529.65)12146623
BAJAJ-AUTO 2910.45(2948.75)338593
BAJAJCORP 465.8(470)40872
BAJAJELEC 586.35(612.45)572141
BAJAJFINSV 5011.35(5034.5)178245
BAJAJHIND 10.35(10.75)3038229
BAJAJHLDNG 2602.5(2729.75)28527
BALKRISIND 1087.8(1057.55)677895
BALLARPUR 13.9(12.95)2194635
BALMLAWRIE 227.5(229.5)89527
BALRAMCHIN 86.4(86.95)4931258
BANKBARODA 143.8(143.75)12380055
BANKINDIA 104(103.7)19255322
BASF 2016.5(2042.85)10146
BATAINDIA 699.6(710.95)470154
BBTC 1214.65(1274.6)795878
BEML 1071.45(1100.3)865157
BERGEPAINT 252.45(250.05)1191164
BFUTILITIE 408.85(418.7)439383
BGRENERGY 107.45(110.4)97267
BHARATFIN 1067(1063.5)1036689
BHARATFORG 736.6(738.6)1024724
BHARTIARTL 416.75(420.45)7237424
BHEL 86.4(87.05)10466068
BHUSANSTL 41.35(41.95)2278273
BIOCON 586.3(600.5)2941070
BIRLACORPN 767.6(798.1)99455
BLISSGVS 195.95(198.25)413204
BLUEDART 4069.4(4158.1)15364
BLUESTARCO 786.6(803.15)38390
BOMDYEING 259.95(262.9)5385049
BOSCHLTD 17921.7(18025.2)49848
BPCL 447.55(462.05)6147327
BRFL 48.8(48.5)90500
BRIGADE 271.75(274.15)90012
BRITANNIA 4860.6(4868.25)151921
CADILAHC 379.1(385.1)837492
CANBK 268.35(264.45)13337818
CAPF 648.45(646.8)1610445
CARERATING 1301.4(1355.25)34673
CASTEXTECH 4.4(4.6)2439635
CASTROLIND 205.15(205.1)2126149
CCL 294.15(294.1)20556
CEATLTD 1572.75(1606.2)435681
CENTRALBK 83.8(86.5)8569548
CENTURYPLY 326.6(332.1)209419
CENTURYTEX 1183.9(1197.05)513059
CERA 3285.9(3299.05)14891
CESC 956.05(970.65)470491
CHAMBLFERT 164.7(166.35)691240
CHENNPETRO 346.3(356.65)448912
CHOLAFIN 1463.8(1479.2)130906
CIPLA 559.4(571.15)1867538
CLNINDIA 553.05(564.45)8771
COALINDIA 278.2(295.5)11016304
COLPAL 1044.45(1042.35)306314
CONCOR 1208.5(1243.25)349977
COROMANDEL 525.45(536.9)226319
CORPBANK 31.45(30.6)2207649
COX&KINGS 236(251.25)335463
CRISIL 1950.25(1960.9)14868
CUB 174.85(179.35)4237800
CUMMINSIND 765.65(783)263162
CYIENT 633.05(628.2)67238
DABUR 321.25(325.05)2715500
DALMIABHA 2842.25(2869.7)218928
DBCORP 321.65(332.6)21770
DBREALTY 56.7(58.45)851071
DCBBANK 163.25(163.75)1244530
DCMSHRIRAM 477(476.05)105867
DEEPAKFERT 325.4(329.2)278675
DELTACORP 308.4(309.5)2751792
DEN 92.15(93.45)265388
DENABANK 20.55(20.6)2856698
DHANUKA 586.65(589.9)30237
DHFL 510.35(515.45)2531783
DISHTV 68.95(69.35)2937234
DIVISLAB 1087.15(1084.55)629875
DLF 226.3(225.45)10153974
DREDGECORP 672.5(681.65)250805
DRREDDY 2142.15(2182.75)594361
DYNAMATECH 1745.85(1778.5)1824
ECLERX 1279.75(1305.45)32378
EDELWEISS 265.25(269.95)1251363
EICHERMOT 28079.15(28695.55)53436
EIDPARRY 292.35(298.55)99142
EIHOTEL 167.15(168.3)127004
ELECTCAST 28.55(28.7)168395
ELGIEQUIP 278.85(282.7)13891
EMAMILTD 1022(1050.05)195770
ENGINERSIN 160.25(165.85)3260685
EROSMEDIA 179.95(184.1)443705
ESCORTS 830.45(847.3)1447711
ESSDEE 47.3(49.35)21208
ESSELPACK 248.5(251.45)32911
EVEREADY 407(406.4)155480
EXIDEIND 213.65(217.55)2634793
FCONSUMER 59.1(59.75)11698514
FDC 281(274.25)97502
FEDERALBNK 93.3(93.65)6435789
FINCABLES 677.1(683.05)952712
FINPIPE 667.75(674.75)23514
FLFL 406.3(402.1)196249
FORTIS 155.9(160.25)9233133
FSL 49.7(50.9)4248613
GAIL 441(450.35)2916519
GATI 104.95(105.35)499979
GDL 191.7(204.45)1327388
GEPIL 829.2(841.8)20349
GESHIP 350.05(357.4)200009
GET&D 384.85(387.9)206792
GILLETTE 6430.65(6608.25)8836
GLAXO 2228.25(2291.55)21053
GLENMARK 546.2(553.8)809649
GLOBOFFS 26.8(26.95)23760
GMDCLTD 127.7(128.1)184586
GMRINFRA 17.95(18.45)39638989
GODFRYPHLP 876.6(907.15)170399
GODREJCP 1056(1072.9)1426673
GODREJIND 546.7(549.3)254971
GODREJPROP 741.6(754.7)97181
GPPL 132.25(137.45)527366
GRANULES 110.55(112.7)1704187
GREAVESCOT 117.5(117.15)469597
GREENPLY 334.75(334.85)32397
GRINDWELL 503.3(495.6)4331
GRUH 546.65(560.55)211397
GSFC 123(126.3)993448
GSKCONS 6516.6(6521.75)45587
GSPL 192.2(190.9)424520
GUJFLUORO 788.15(779.3)70276
GUJGASLTD 834.95(850.7)51207
GULFOILLUB 944.95(945)188581
GVKPIL 15.2(15.9)2906766
HATHWAY 34.15(35.15)216026
HAVELLS 516.6(520.75)1499134
HCC 32.15(32.4)6438737
HCL-INSYS 56.8(57.6)4189778
HCLTECH 967.6(959.15)4741036
HDFC 1791.4(1830)8008654
HDFCBANK 1853(1880.8)1974084
HDIL 43.05(43.05)16361348
HEIDELBERG 153.6(154.7)243524
HEROMOTOCO 3546.1(3640.8)462796
HEXAWARE 370.05(380.25)985079
HFCL 27.95(27.25)14779598
HIMATSEIDE 344.7(345.65)30599
HINDALCO 221.7(224.9)7793461
HINDCOPPER 71.7(74.15)6040991
HINDPETRO 364.75(371.55)5571154
HINDUNILVR 1299.15(1299.95)3646692
HINDZINC 314.9(318.45)6325044
HMT 31.3(31.05)3043
HMVL 228.9(229)12031
HONAUT 15795.65(15913.1)298
HOTELEELA 18.25(18.7)282244
HSIL 405.6(403.1)52034
HTMEDIA 87.75(90.3)270069
IBREALEST 204.65(209.3)4038493
IBULHSGFIN 1207.45(1237.95)1665775
ICICIBANK 298.1(301.45)28835112
ICRA 3626.45(3674.9)7872
IDBI 78.95(78.85)9536815
IDEA 81.05(80.15)16944291
IDFC 51.15(51.25)5568590
IFBIND 1328.2(1331.45)9398
IFCI 21.2(22)12997729
IGARASHI 799.6(802.85)4113
IIFL 773.35(801.4)2512267
IL&FSTRANS 69.45(69.3)284615
INDHOTEL 130(133)802990
INDIACEM 147(150.75)2196862
INDIANB 306.05(304.6)2856638
INDOCO 253.5(258)27748
INDUSINDBK 1724.7(1741.75)2412430
INEOSSTYRO 877.55(890.25)3823
INFRATEL 334.45(337.9)3780358
INFY 1171.9(1182.5)8977413
INGERRAND 702.4(704.4)10844
INOXLEISUR 263(266.55)26721
INOXWIND 120.5(120.75)77076
INTELLECT 184.95(184.15)448734
IOB 18.15(18.25)2408254
IOC 184.75(192.05)18690374
IPAPPM 297.4(303.9)46476
IPCALAB 667.55(671.1)157954
IRB 220.85(217.8)2985488
ITC 260.5(265.55)20680532
J&KBANK 58.9(60.35)1261796
JAGRAN 164.4(163.55)704275
JAICORPLTD 147.2(150.85)2271055
JBCHEPHARM 295.15(298.05)51988
JBFIND 140.75(145.65)390263
JCHAC 2482.6(2514.45)7658
JETAIRWAYS 703.8(721.9)2181774
JINDALPOLY 344.4(356.4)37016
JINDALSTEL 226.2(230.7)7506230
JISLJALEQS 109.85(112.3)7843471
JKCEMENT 1039.1(1041.1)25015
JKIL 301.75(306.6)42800
JKLAKSHMI 424.25(439.85)101622
JKTYRE 152.5(155.2)360289
JMFINANCIL 131.95(133.35)705318
JPASSOCIAT 20.85(19.2)278710720
JPINFRATEC 10.7(10.2)22405029
JPPOWER 6.15(6.3)21578153
JSWENERGY 77.9(78.95)2399328
JSWHL 1700.1(1700.65)2381
JUBILANT 852.95(852.9)855641
JUBLFOOD 2111.65(2147.1)825718
JUSTDIAL 444.55(450.65)1976952
JYOTHYLAB 359.1(357.95)284918
KALPATPOWR 456.75(459.65)77982
KANSAINER 496.85(503.45)224512
KEC 385.05(392.75)1215915
KESORAMIND 121.5(122.3)333863
KIRLOSENG 367.45(364.8)35734
KITEX 243.25(246.55)45353
KOLTEPATIL 323.2(328)106862
KOTAKBANK 1060.75(1085.65)2724910
KPIT 229.35(231.3)2250191
KRBL 444.05(454.95)193733
KSCL 476.6(493.95)685631
KSK 10.35(10.85)1130725
KTKBANK 121.25(123.65)2498330
KWALITY 90.85(98.1)7736420
L&TFH 160.45(162.05)3670100
LAKSHVILAS 101.35(104.45)556051
LAOPALA 650.15(649)74438
LAXMIMACH 6897.55(6836.15)10720
LICHSGFIN 513.45(523.2)1455054
LITL 1.2(1.15)3184078
LT 1269.3(1295.1)5152611
LUPIN 761.85(776.65)1419793
M&M 740.75(734.85)4929069
M&MFIN 433.5(435.5)2119037
MAGMA 154.9(156.9)42923
MAHINDCIE 223.4(221.95)224050
MAHLIFE 438.55(445.65)14120
MANAPPURAM 104.65(107.8)2858301
MANPASAND 380.65(380.2)293553
MARICO 301.25(301.1)2642597
MARKSANS 35.7(36.5)2318071
MARUTI 8676.55(8837.55)622932
MAYURUNIQ 496.45(496.2)6538
MCDOWELL-N 3121.55(3189.35)447479
MCLEODRUSS 148.7(148)691180
MERCK 1504.95(1489)9570
MHRIL 287.85(290.1)67399
MINDACORP 191.45(192.15)354372
MINDTREE 812.35(843.65)2317309
MMTC 67.2(62.1)24072078
MOIL 199.65(204.55)317406
MONSANTO 2518.25(2589.85)34187
MOTHERSUMI 307.45(314.05)4726244
MOTILALOFS 1154.3(1147.45)80082
MPHASIS 875.75(881.35)310010
MRF 70211.65(71737.95)4914
MRPL 116.7(118.25)703644
MTNL 20.4(20.75)3367704
MUTHOOTFIN 396.65(397.6)823743
NATCOPHARM 794.3(789.15)469443
NATIONALUM 66.25(65.8)20882814
NAUKRI 1285.5(1263.55)84190
NAVKARCORP 161.75(167.7)283118
NCC 122.45(126.35)3033412
NETWORK18 56.85(57.4)4198739
NHPC 26.6(26.8)12360523
NIITTECH 927.15(988.8)2032160
NITINFIRE 4.55(4.75)541848
NLCINDIA 92(96.5)1123991
NMDC 126.3(124.3)5286921
NTPC 164.85(169.9)12378708
OBEROIRLTY 511.2(541.7)305728
OFSS 3888.35(3922.7)37305
OIL 337.25(337.7)595571
OMAXE 225.8(226.3)397018
ONGC 177.15(180.3)8194541
ORIENTBANK 100.8(100.85)9683422
ORIENTCEM 143.8(144.4)38323
ORISSAMINE 1655.65(1662.95)10291
PAGEIND 20533.6(21183.55)62072
PARSVNATH 16.75(16.55)811161
PCJEWELLER 371.5(366.1)5450578
PEL 2491.75(2450.85)439822
PERSISTENT 816(844.35)80629
PETRONET 235(237.4)3572839
PFC 88(88.05)15307224
PFIZER 2139.7(2176.75)17090
PFS 28.25(28)1941003
PGHH 9427.5(9449)28155
PHOENIXLTD 608.65(618.2)946049
PIDILITIND 916.3(909.55)732530
PIIND 825.75(856.15)196280
PNB 98.85(98.55)55339873
POLARIS 469.25(472.8)40201
POWERGRID 192.25(194.8)5835262
PRAJIND 83.65(84.9)1156785
PRESTIGE 296.8(299.75)411056
PRISMCEM 115.65(116.45)692315
PTC 95.2(96.9)1314964
PUNJLLOYD 18.15(18.25)1407775
PURVA 144.35(150.05)543076
PVR 1292.9(1312.25)155390
RADICO 322.25(335.15)764662
RAIN 386.25(390.8)4175751
RAJESHEXPO 769.1(759.1)406896
RALLIS 231(234.35)282145
RAMCOCEM 740.8(750.25)349278
RAMCOSYS 415(420.75)25379
RATNAMANI 893.7(906.9)3748
RAYMOND 926.15(942.1)321788
RCF 77.75(80)2052291
RCOM 23.45(23.6)67745076
RECLTD 128.5(128.95)5717105
REDINGTON 137.55(144.4)383986
RELAXO 631.55(630.2)10675
RELCAPITAL 429.65(445.85)4614835
RELIANCE 900.05(911.8)14087564
RELINFRA 428.6(449.45)2482831
RENUKA 15.35(15.45)1779915
REPCOHOME 567.85(575.65)681657
RIIL 458.15(471.2)517456
RKFORGE 751.9(750.05)10990
RNAVAL 34.4(35.95)5935764
ROLTA 62.65(63.7)1302430
RPOWER 39.2(39.95)5143674
RTNPOWER 5.7(5.85)6948407
RUCHISOYA 18.45(16.75)3860257
SADBHAV 381.45(379.8)173089
SADBHIN 133.35(134.55)30538
SAIL 72.85(75.3)11625680
SANOFI 5092.05(5174.1)11121
SBIN 252.3(253.7)25728297
SCHAEFFLER 5389.45(5399.4)5091
SCHNEIDER 116.05(117.3)333401
SCI 67(68.6)862033
SHARDACROP 377.15(380.45)21993
SHILPAMED 456.45(462.55)31318
SHK 252.65(266.15)96093
SHOPERSTOP 541.45(541.2)82293
SHREECEM 16424.4(16815.65)33975
SHRIRAMCIT 2148.35(2095.35)22890
SIEMENS 1105.1(1132.6)205258
SIMPLEXINF 524.3(528.3)16950
SINTEX 20.2(18.65)19867244
SITINET 15.3(15.3)154948
SJVN 34.35(34.95)1183922
SKFINDIA 1731.15(1739.2)1983
SMLISUZU 764.2(765.6)20737
SNOWMAN 48.35(49.55)424628
SOBHA 508.15(529.55)272582
SOMANYCERA 655.85(662.85)10107
SONATSOFTW 310.25(314.75)200930
SOUTHBANK 25.1(25.65)5144997
SPARC 398.2(410.6)173213
SREINFRA 82.15(83.65)1215386
SRF 1872.75(1877.75)59244
SRTRANSFIN 1445.8(1460.65)1234375
STAR 691.9(711.55)493723
STCINDIA 154.6(149.15)139426
SUNDARMFIN 1626.65(1664.3)62788
SUNDRMFAST 595.85(613.6)1126324
SUNPHARMA 503.05(516.45)8924919
SUNTV 903.15(920.7)2564212
SUPREMEIND 1200.1(1200.8)44261
SUVEN 178.65(183)229641
SUZLON 11.7(11.65)45780242
SWANENERGY 181.6(184.7)381678
SYMPHONY 1776.8(1798.05)18402
SYNDIBANK 62.7(61.2)17613267
SYNGENE 547.3(569.85)95134
TAKE 163.1(164)144652
TATACHEM 682.1(683.35)373392
TATACOFFEE 121.95(121.75)560671
TATACOMM 624.15(639.3)351884
TATAELXSI 1012.75(1037.65)557433
TATAGLOBAL 272.4(279.6)2762357
TATAMOTORS 339.75(353.1)14205582
TATAMTRDVR 189.45(196.15)2746178
TATAPOWER 79.95(80.25)9813941
TATASPONGE 990.1(1003.35)55954
TATASTEEL 602.6(611.75)1739582
TBZ 100(101.5)153296
TCS 2825.7(2869.7)3598741
TECHM 634.7(631.85)3741772
TECHNO 334.8(340.8)715005
TEXRAIL 87.7(89.15)283515
THERMAX 1155.05(1179.2)58971
THOMASCOOK 273.85(275.3)550140
TIDEWATER 6323.85(6407.3)2022
TIMKEN 728.8(746.5)13712
TITAN 879.25(872.5)2538310
TNPL 375.6(372.9)213855
TORNTPHARM 1268.45(1279.8)187781
TORNTPOWER 251.15(252.65)481182
TREEHOUSE 11.1(10.7)297109
TRIDENT 67(68.95)519321
TRITURBINE 110.95(114.95)42937
TTKPRESTIG 6461.25(6608.4)3816
TTML 6.7(6.4)1265398
TV18BRDCST 66.5(67.4)20818525
TVSMOTOR 631.8(643.65)737419
TVSSRICHAK 3333.25(3397.8)4899
TVTODAY 521.1(512)1566236
UBL 1005.05(1023.55)242118
UCOBANK 23.15(23.65)1405257
UFLEX 365.7(361)419137
ULTRACEMCO 4026.3(4189.4)527458
UNICHEMLAB 349.8(349.9)92177
UNIONBANK 99.85(101.25)11116382
UNITECH 6.35(6.25)22714516
UPL 719.7(721.15)2219725
VAIBHAVGBL 703.85(717.35)5367
VAKRANGEE 248.05(236.95)13430838
VEDL 308.9(316.95)13398137
VIDEOIND 15.05(15.8)2929332
VIJAYABANK 56.1(56.9)1532562
VINATIORGA 804.25(803.5)14732
VIPIND 302.35(312.6)799337
VOLTAS 627.2(640.35)1841603
VRLLOG 388.05(396.6)176449
VSTIND 2957.6(2969.6)608
VTL 1286.05(1290.1)8316
WABAG 503.2(508.85)531848
WABCOINDIA 7275.35(7570.3)37052
WELCORP 150.45(158.65)391915
WELSPUNIND 60.4(61.5)1443780
WHIRLPOOL 1553.9(1589.45)189392
WIPRO 295.75(293.4)4834160
WOCKPHARMA 759.8(777.65)1541909
WONDERLA 342.7(353.85)139072
ZEEL 570.35(570.4)2562954
ZEELEARN 38.6(38.4)356079
ZENSARTECH 907.6(925.25)15453
ZYDUSWELL 1225.2(1231.75)10535

ఆంధ్రజ్యోతి

బిజినెస్

12

విజయవాడ • శనివారం 17 మార్చి 2018

andhrajyothibusiness@gmail.com

సుజుకీ నుంచి సరికొత్త ఇంట్రూడర్

ధర రూ.1,06,896

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా.. మార్కెట్లోకి అడ్వాన్స్‌డ్ వెర్షన్ ఇంట్రూడర్‌ను విడుదల చేసింది. ఈ బైక్ ధర 1,06,896 రూపాయలు. క్రూయిజర్ విభాగంలో స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునే లక్ష్యంతో సుజుకీ మోటార్ సైకిల్ ఈ బైక్‌ను తీసుకువచ్చింది. గత ఏడాది నవంబరులో సుజుకీ ఇంట్రూడర్‌ను మార్కెట్లోకి తీసుకు రాగా.. తాజాగా ఆరు సెన్సార్లతో పాటు అడ్వాన్స్‌డ్ ఫ్యూయల్ ఇంజక్షన్ ఆప్షన్‌తో సరి కొత్త బైక్‌ను తీసుకువచ్చినట్లు తెలిపింది. మార్కెట్లోకి విడుద చేసిన నాటి నుంచి ఇంట్రూడర్‌ను అపూర్వమైన స్పందన వచ్చిందని , ఇప్పటికే 15 వేలకు పైగా బైక్‌లను విక్రయించినట్లు సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సజీవ్ రాజశేఖరన్ తెలిపారు. ఈ ఏడాది ఇంట్రూడర్ విక్రయాల్లో 25 శాతం వృద్ధిని సాధించవచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

ఐడియా మా అమ్మాయిదే

'రిలయన్స్ జియో'పై ముకేశ్ అంబానీ



5జి టెలికాం సేవలకూ సిద్ధం

2028నాటికి భారత్ మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థ

లండన్: రిలయన్స్ జియో ఆలోచన తన కూతురు ఇషా దేనని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ వెల్లడించారు. 'ఫైనాన్షియల్ టైమ్స్-ఆర్సెలార్ మిట్టల్ బోల్డ్‌నెస్ ఇన్ బిజినెస్ అవార్డ్స్' కార్యక్రమంలో డ్రైవర్స్ ఆఫ్ చేంజ్ అవార్డు అందుకున్న సందర్భంగా అంబానీ మాట్లాడారు. 'అమెరికాలోని యేల్ యూనివర్సిటీలో చదువుతున్న మా అమ్మాయి ఇషా 2011లో సెలవుల కని ఇంటికి వచ్చింది. అప్పుడు ఆమె తన కోర్సుకు సంబంధించి ప్రాజెక్ట్ వర్క్ నెట్ ద్వారా సమర్పించాల్సి ఉంది. అందుకోసం నెట్ ఆన్ చేయడంతోనే.. డాడీ మన ఇంట్లో నెట్ చాలా స్లోగా ఉంది అన్నది. అదే సమయంలో అక్కడున్న ఆకాష్ (ఇషా సోదరుడు) పాత రోజుల్లో వాయిస్ కాల్స్ ద్వారానే టెలికాం కంపెనీలకు డబ్బులొచ్చేవి. ఇప్పుడంతా డిజటల్ మయం' అని చెప్పుకొచ్చాడు. అప్పుడు నా పిల్లలు ఇద్దరూ 'భవిష్యత్ అంతా బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ బిజినెస్‌దే, భారత్ ఈ టెక్నాలజీని మిస్ కాకూడదని నాకు నచ్చజెప్పారు. రిలయన్స్ జియో వ్యాపారానికి అలా నాంది పడింది' అన్నారు. జియో 4జి నెట్‌వర్క్ ద్వారా టెలికం ఖాతాదారులకు జీవిత పర్యంతం ఉచిత వాయిస్ కాల్స్‌తోపాటు, అత్యంత తక్కువ ధరకే డేటాను దేశంలో అత్యధిక జనాభాకు అందుబాటులోకి తెచ్చినట్టు ముకేశ్ అంబానీ చెప్పారు. ప్రస్తుతం అమెరికా కంటే పదో వంతు ధరకే భారత్‌లో డేటా చార్జీలు దిగివచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

5జి సేవలకూ సిద్ధం

4జి సేవలతో దేశ టెలికం రంగంలో ప్రభంజనం సృష్టించిన రిలయన్స్ జియో మరింత అత్యాధునిక 5జి టెలికాం సేవలకూ సిద్ధంగా ఉన్నట్టు అంబానీ చెప్పారు. ప్రస్తుతం రిలయన్స్ జియో 4జి ఎల్‌టిఇ ప్రపంచంలోనే అతిపెద్ద డేటా నెట్‌వర్క్ అన్నారు. '4జి సేవలకు సంబంధించి వచ్చే ఏడాదికల్లా భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ అవుతుంది. 2జి నెటవర్క్ దేశవ్యాప్తంగా విస్తరించేందుకు అన్ని టెలికాం కంపెనీలకు పాతికేళ్లు పట్టింది. రిలయన్స్ జియో మూడేళ్లలోనే అత్యంత అధునాతనమైన 4జి ఎల్‌టిఇ నెట్‌వర్క్‌ను దేశంలోని అన్ని ప్రాంతాలకు అందుబాటులోకి తెచ్చింది. అవసరమైతే ఈ రోజు నుంచే 5జి సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాం' అన్నారు. ఇళ్లు, వ్యాపారాలు, కార్లను కూడా ఇంటర్నెట్‌తో అనుసంధానించి భారీ డేటా ఆధారిత సేవలకు కూడా జియో సిద్ధమవుతోందని వెల్లడించారు.

మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థ

భారత ఆర్థిక వ్యవస్థకు యువతరమే చుక్కాని అని అంబానీ స్పష్టం చేశారు. వీరి శక్తి సామర్థ్యాలతో 2028 నాటికి భారత్ ప్రపంచంలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని చెప్పారు. ప్రస్తుత భారత యువతరం వినూత్నంగా ఆలోచిస్తూ ప్రపచంలో మేటిగా నిలిచేందుకు పట్టుదలతో ముందుకు పోతున్నారని కితాబిచ్చారు. రూ.1,500 జియో ఫోన్ ద్వారా ఫీచర్ ఫోన్లు ఉపయోగిస్తున్న 50 కోట్ల మంది భారతీయులకూ అత్యాధునిక 4జి సేవలను అందుబాటులోకి తెచ్చినట్టు అంబానీ చెప్పారు. ప్రస్తుతం రోజుకు మూడు నుంచి ఐదు లక్షల మంది రిలయన్స్ జియో ఖాతాదారులుగా చేరుతున్నట్టు తెలిపారు. రెండేళ్ల క్రితం డేటా వినియోగంలో భారత్ ప్రపంచంలో 155వ స్థానంలో ఉంటే, జియో సేవలతో ఇప్పుడు నంబర్ వన్ స్థానానికి చేరిందన్నారు.

పాత 'వాణిజ్య' వాహనాలు ఇక తుక్కే



న్యూఢిల్లీ: పాత వాణిజ్య వాహనాలకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏదైనా వాణిజ్య వాహనం 20 సంవత్సరాలపాటు రోడ్లపై తిరిగితే ఇక దాన్ని తక్కు కింద అమ్ముకోవాల్సిందే. ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఒ) ప్రత్యేక కార్యదర్శి అధ్యక్షతన వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో జరిగిన సమావేశం ఇందుకు సంబంధించిన ప్రత్యేక విధానానికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. నీతి ఆయోగ్ సిఇఒ అమితాబ్‌కాంత్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాలం తీరిన వాణిజ్య వాహనాలతో ఎదురవుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు, రోడ్లపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 2020 ఏప్రిల్ 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది. తుక్కు కింద తొలగించిన పాత వాణిజ్య వాహనం స్థానంలో కొనుగోలు చేసే కొత్త వాణిజ్య వాహనాలకు జిఎస్‌టిలో కొంత రాయితీ ఇవ్వాలని కూడా సమావేశం సిఫారసు చేసింది. ఈ నిర్ణయం అమలులోకి వస్తే దేశ వ్యాప్తంగా 20 ఏళ్లకు పైబడిన దాదాపు 2.8 కోట్ల వాణిజ్య వాహనాలు తుక్కుగా మారతాయని అంచనా.

పెద్దల పోస్టులు తరచూ మార్చొద్దు

అందుకే పిఎన్‌బి తరహా కుంభకోణాలు

అరుంధతీ భట్టాచార్య



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకుల(పిఎస్‌బి) నిర్వహణలో కీలక పాత్ర వహించే ఛైర్మన్, ఎండి, డైరక్టర్ వంటి ఉన్నత స్థాయి పోస్టుల్లో ఉన్న వ్యక్తులను తరచూ మార్చడంపై ఎస్‌బిఐ మాజీ ఛైర్‌పర్సన్ అరుంధతీ భట్టాచార్య అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకవేళ మార్చినా, ఆలస్యం లేకుండా వెంటనే ఆ పోస్టుల్లో వేరే వ్యక్తులను నియమించాలన్నారు. అలా చేయకపోవడం వల్లనే పిఎస్‌బిల్లో పిఎన్‌బి వంటి కుంభకోణాలు తలెత్తుతున్నాయన్నారు. కొత్త ఛైర్మన్, ఎండి, డైరెక్టర్లకు బ్యాంకుపై పూర్తి అవగాహన ఏర్పడే వరకు, అప్పటి వరకు ఆ పదవుల్లో ఉన్న వ్యక్తులు కొంత కాలం పాటు కొత్త వ్యక్తులకు సహకరించడం కూడా అవసరమన్నారు. ముంబై యూనివర్సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో భట్టాచార్య ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక బ్యాంక్ నిర్వహణ మొత్తాన్ని రాత్రికి రాత్రి ఒక వ్యక్తికి అప్పగించి చేతులు దులుపుకుంటే ఎలా అని ప్రశ్నించారు. పిఎన్‌బి ఉపయోగిస్తున్న కోర్ బ్యాంకింగ్ సాఫ్ట్‌వేర్ (సిబిఎస్), స్విఫ్ట్ మెసేజింగ్ ప్లాట్‌ఫాం మధ్య సరైన సమన్వయం లేకపోవడం వల్ల ఈ దురదృష్టకర సంఘటన జరిగి ఉంటుందన్నారు. ఈ లావాదేవీలు నడిపే వ్యక్తులను అతిగా నమ్మడం లేదా కోర్ బ్యాంకింగ్ సాఫ్ట్‌వేర్, స్విఫ్ట్ మెసేజింగ్ ప్లాట్‌ఫాం మధ్య తేడా ఉందనే విషయం గుర్తించకపోవడం ఈ సమస్యకు కారణమై ఉంటుందన్నారు.

అదుపు తప్పుతున్న కరెంట్ ఖాతా లోటు

వాణిజ్య లోటుతో పెరుగుతున్న కష్టాలు

ముంబై : కరెంట్ ఖాతా లోటు (సిఎడి) మళ్లీ అదుపు తప్పుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు, 2017)లో సిఎడి స్థూల దేశీయ ఉత్పత్తి(జిడిపి)లో రెండు శాతానికి చేరింది. 2016-17 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఇది 1.4 శాతం మాత్రమే. ఆర్‌బిఐ శుక్రవారం ఇందుకు సంబంధించిన గణాంక వివరాలు విడుదల చేసింది. సెప్టెంబరు 2017తో ముగిసిన రెండో త్రైమాసికంలో ఇది మరింత తక్కువగా ఉంది. అప్పట్లో ఇది జిడిపిలో 1.1 శాతం మాత్రమే. దేశం ఆర్జించిన విదేశీ మారక ద్రవ్య, ఖర్చు చేసిన విదేశీ మారక ద్రవ్యం మధ్య ఉండే లోటును సిఎడి అంటారు. ఎగుమతులకంటే వాణిజ్య వస్తువుల దిగుమతులు పెరిగి వాణిజ్య లోటు పెరగడం ఇందుకు ప్రధాన కారణమని ఆర్‌బిఐ పేర్కొంది. ఇదే కాలంలో సేవల ఎగుమతులు 17.8 శాతం, ఎన్‌ఆర్‌ఐలతో సహా వివిధ వర్గాల నుంచి అందే ప్రైవేట్ నిధుల బదిలీ 16 శాతం పెరిగాయి. లేకపోతే కరెంట్ ఖాతా లోటు మరింత పెరిగి ఉండేది. ప్రస్తుతం అనేక లోహాలు, వస్తువుల ధరలతో పాటు, చమురు ధర మరింత పెరుగుతోంది. దీంతో ముందు ముందు కరెంట్ ఖాతా లోటు మరింత పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.





వచ్చే 3 నెలల్లో 30 స్టోర్లు

సెల్ పాయింట్ ఎండి మోహన్ ప్రసాద్ వెల్లడి

అనంతపురంలో 87వ స్టోర్ ప్రారంభం

అనంతపురం: మొబైల్ ఫోన్స్ విక్రయ సంస్థ సెల్ పాయింట్.. కార్యకలాపాలను విస్తరించేందుకు రెడీ అవుతోంది. వచ్చే మూడు నెలల్లో కొత్త 30 స్టోర్లను ప్రారంభించనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ ప్రసాద్ పాండే వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో 87 వ శాఖను టాలీవుడ్ హీరోయిన్ మెహరీన్ ఫిర్జాదాతో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా తమ స్టోర్లలో దేశ,విదేశీ బ్రాండెడ్ మొబైల్ ఫోన్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అనంతపురం స్టోర్‌ను ప్రారంభించిన సందర్భంగా పలు రాయితీలను ఆఫర్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 6,490 రూపాయల విలువైన సెల్‌కాన్ 4జి స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై ఎల్ఇడి టీవీ, 999 రూపాయల విలువ చేసే కె-2 ఇండియా ఫోన్‌కు బ్లూటూత్, 2,999 రూపాయల విలువ చేసే 4జి స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రైస్ కుక్కర్, 8490 రూపాయల మోటో-ఇ4 ఫోన్‌కు పెడెస్టల్ ఫ్యాన్, 9490 రూపాయల పానాసోనిక్ ఫోన్‌కు వెట్ గ్రైండర్‌ను సెల్ పాయింట్ ఆఫర్ చేస్తోంది. మరికొన్ని మోడళ్లకు మిక్సర్‌గ్రైండర్, ట్రావెల్ బ్యాగ్, టవర్ ఫ్యాన్ వంటి బహుమతులను అందిస్తోంది. వీటికితోడు పేటీఎం ద్వారా నగదు చెల్లింపు చేసే నిర్దేశిత మొబైల్ ఫోన్‌లకు 1,200 రూపాయలు, 2,000 రూపాయల క్యాష్‌బ్యాక్ ఆఫర్ చేస్తోంది. ఈ కార్యక్రమంలో వివో జనరల్ మేనేజర్ జె స్వంగ్, సెల్ పాయింట్ రాయలసీమ ఏరియా సేల్స్ మేనేజర్ ఎస్ఎం బాషా పాల్గొన్నారు.

29 వరకు ఐజిఎస్‌టి, ఐటిసి రిఫండ్స్‌పై స్పెషల్ డ్రైవ్

జిఎస్‌టి చీఫ్ కమిషనర్ బిబి అగర్వాల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు, ఎగుమతిదారులకు తిరిగి చెల్లించాల్సిన ఐటిసి, ఐజిఎస్‌టి కోసం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జిఎస్‌టి (హైదరాబాద్ జోన్) చీఫ్ కమిషనర్ బాంకే బెహారి అగర్వాల్ వెల్లడించారు. ఈ నెల 29వ తేదీ వరకు ఈ డ్రైవ్ కొనసాగుతుందని, ఇందుకోసం ఐదుగురు అధికారుల ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. మంజుల డి హోస్‌మణి (హైదరాబాద్ కస్టమ్స్ విభాగం), శివ్ నారాయణ్ (హైదరాబాద్ జిఎస్‌టి కమిషనరేట్), ఒ ప్రదీపన్ (మేడ్చల్ జిఎస్‌టి కమిషనరేట్), సుబ్రతా ముఖర్జీ (సికింద్రాబాద్ జిఎస్‌టి కమిషనరేట్), ఎస్ బాల మురళి (రంగారెడ్డి జిఎస్‌టి కమిషనరేట్) ఆధ్వర్యంలోని బృందాలు రిఫండ్ కేసులను పరిష్కరిస్తాయని తెలిపారు. ఒక రాష్ట్రం నుంచి ముడిపదార్థాలను దిగుమతి చేసుకుని, వాటితో ఇక్కడ వివిధ రకాల వస్తువులను తయారు చేసి, ఇతర దేశాలకు ఎగుమతి చేసే ఎగుమతిదారులు ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి (ఐజిఎస్‌టి)ని క్లెయిమ్ చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఇలాంటివారు తమ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని, రిఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, రిఫండ్ వివరాలు కూడా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఇక ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను పొందాల్సిన వ్యాపారులు...జిఎస్‌టి పోర్టల్‌లో 'జిఎస్‌టి ఆర్ఎఫ్‌డి-ఒ1ఎ' ఫామ్‌ను భర్తీ చేయాలని సూచించారు. దీని ప్రింటవుట్‌ను వెంటనే తమ జ్యూరిడిక్షన్ బృందం అధికారికి సమర్పించి, ఐటిసిని రిఫండ్ చేసుకోవాలని తెలిపారు. రిఫండ్ డబ్బును పొందడంలో ఇటీవల చాలా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని వ్యాపారులు, ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న 'కియ' కమాల్

రాష్ట్రానికి రూ.4,790 కోట్ల పెట్టుబడులు

16 అనుబంధ కొరియా సంస్థల సమ్మతి

అమరావతి (ఆంధ్రజ్యోతి): దక్షిణ కొరియా కార్ల కంపెనీ 'కియ' తన సంస్థ నిర్మాణ పనులను రాష్ట్రంలో శరవేగంగా చేపడుతుండగా, ఆ దేశానికే చెందిన ఆటోమొబైల్ రంగ అనుబంధ సంస్థలు, పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహాన్ని చూపుతున్నాయి. 'కియ'కు అనుబంధంగా పరికరాలను తయారుచేసి, అందించేందుకు 16 తయారీ సంస్థలు ముందుకొచ్చాయి. ఇందుకోసం అనంతపురం జిల్లాలో రూ.4,790 కోట్ల మేర పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యాయి. దీనివల్ల 6,583 మందికి ఉపాధి లభించనుంది. ఈ విషయాలను రాష్ట్ర పరిశ్రమల శాఖకు దక్షిణ కొరియా సంస్థలు నివేదించాయి. ఈ సంస్థల తయారీ సామర్థ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం కూడా సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ సంస్థలు పరిశ్రమల శాఖతో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకోనున్నాయి.

ఉచితాలకు పలకాలి స్వస్తి!

తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ నరసింహన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రజలకు ఇచ్చే ఉచితాలకు స్వస్తి పలికే సమయం ఆసన్నమైందని, ఉచితాలు ప్రజలను పనికిరాకుండా చేసే అవకాశం ఉందని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ పేర్కొన్నారు. ఏదైనా ఉచితంగా ఇవ్వడమనేది తన దృష్టిలో మంచిది కాదన్నారు. మనం వినియోగించుకునే సేవలకు తప్పనిసరిగా ఎంతో కొంత చెల్లించే విధంగా ఉండాలన్నారు. ఉచితాలను చాలా మంది తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని చెప్పారు. శుక్రవారంనాడిక్కడ సిఐఐ తెలంగాణ నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందర్భంగా నరసింహన్ మాట్లాడారు. సమ్మిళిత వృద్ధి కేవలం ప్రభుత్వ పనేకాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలోని వారందరూ బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. హైటెక్, ఏరో స్పేస్ వంటి అంశాల గురించే కాకుండా సామాన్యుల అవసరాలను తీర్చే వాటిపైనా దృష్టిసారించాలని చెప్పారు. సామాన్యులకు మంచి నీరు, విద్య, ఉద్యోగం, నివాసం, భద్రతనిచ్చే ప్రభుత్వం ముఖ్యమైనవని, వీటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

కాలుష్యం గురించి పట్టించుకోవాలి...

పరిశ్రమలు ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఉపాధి కల్పనకు దోహదపడుతున్నాయని, ఇదే సమయంలో పర్యావరణ కాలుష్యం గురించి పారిశ్రామికవేత్తలు ఆలోచించాలని నరసింహన్ అన్నారు. కాలుష్యాన్ని నియంత్రించకపోతే ప్రతి ఒక్కరిపైనా ప్రభావం పడుతుందని చెప్పారు. కాలుష్యాన్ని నియంత్రించకపోతే వ్యవసాయ ఉత్పాదకత పైనా ప్రభావం పడుతుందన్నారు.

గుమస్తా ఉద్యోగానికి గ్రాడ్యుయేట్లు

నేటి కాలంలో విద్య ఎంతో ముఖ్యమైనదని, ఇది నాణ్యతనుకలిగి ఉంటేనే చదువున్న వారికి తగిన ఉద్యోగం లభిస్తుందని నరసింహన్ అన్నారు. ఏటా కళాశాలల నుంచి లక్షలాది మంది ఇంజనీరింగ్, మెడిసిన్ పూర్తి చేస్తున్నారని, ఇలాంటి వారు కూడా గుమస్తా ఉద్యోగానికి దరఖాస్తు చేసే పరిస్థితి నెలకొంటోందని చెప్పారు. మెరుగైన నైపుణ్యాలు లేని కారణంగానే వీరికి తగిన ఉద్యోగాలు లభించడం లేదని తెలిపారు. పరిశ్రమ అవసరాలకు తగిన విధంగా సిలబస్ ఉంటే విద్యాభ్యాసం పూర్తి చేసిన వెంటనే ఉపాధి అవకాశాలు లభించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

వైద్యం ఖరీదు..

వైద్య సేవలు అందుబాటులో ఉండటమేకాకుండా నాణ్యతతో లభించాలని గవర్నర్ అన్నారు. మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు ఆశించిన స్థాయిలో అందడం లేదని, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళితే వారి జేబు గుల్లవుతోందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం సామాన్యుల వైద్యం కోసం చర్యలు తీసుకుంటుండటం అభినందనీయమన్నారు. సంపద ఉన్నంత మాత్రాన ఆరోగ్యం సిద్ధించదని, ఆరోగ్యమే మహా భాగ్యమని నరసింహన్ గుర్తు చేశారు.

టెక్నాలజీతో నిరుద్యోగం పెరగదు

నేటి కాలంలో వృద్ధికి టెక్నాలజీ ఎంతో కీలకమైనదని, ఈ టెక్నాలజీ మూలంగా నిరుద్యోగం పెరిగిపోతుందన్న అపోహల్లో వాస్తవం లేదని నరసింహన్ అన్నారు. టెక్నాలజీ అనేది అనుసంధానంగా పని చేస్తుందే తప్ప ప్రత్యామ్నాయం కాదన్నారు. మనకు సహజ మేధస్సు ఉందని, కృత్రిమ మేధస్సు (ఎఐ) అవసరం లేదన్నారు. చిన్నవాటికి కూడా కృత్రిమ మేధస్సును వాడితే రానున్న కాలంలో మతిమరుపు రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. టెక్నాలజీ ఉత్పాదకతను పెంచే విధంగా ఉండాలే తప్ప జాడ్యాన్ని పెంచేలా ఉండొద్దన్నారు. వాట్సప్ వంటి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న అంశాల్లో వాస్తవం ఎంతో తెలుసుకోకుండా ఇతరులకు పంపిస్తున్నారని, వీటి వల్ల ఆందోళనకర పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. కొంత మంది నిద్రించాల్సిన సమయంలోనూ చాటింగ్‌లతో గడిపేస్తున్నారని చెప్పారు.

సమాచారాన్ని తెలుసుకునేందుకు ఆర్‌టిఐ చట్టం వచ్చిందని, దీన్ని దుర్వినియోగం చేసే వారు కూడా ఉన్నారని ఆయన తెలిపారు. సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఎస్‌కె జోషి, సిఐఐ తెలంగాణ మాజీ ఛైర్మన్ వి రాజన్న పాల్గొన్నారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటిన సంస్థలకు గవర్నర్ నరసింహన్ పురస్కారాలను అందజేశారు.

సిఐఐ తెలంగాణ నూతన ఛైర్మన్ సంజయ్ సింగ్





భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) తెలంగాణ నూతన ఛైర్మన్‌గా ఐటిసి లిమిటెడ్-పేపర్ బోర్డ్స్, స్పెషాలిటీ పేపర్స్ డివిజన్ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సంజయ్ సింగ్ ఎన్నికయ్యారు. సిఐఐ తెలంగాణ వైస్ ఛైర్మన్‌గా కిర్బీ బిల్డింగ్ సిస్టమ్స్ ఇండియా సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్ డి రాజు ఎన్నికయ్యారు. 2018-19 సంవత్సరానికి గాను వీరిద్దరూ తమ పదవుల్లో కొనసాగుతారు. సింగ్ ఐటిసి ప్రింటింగ్, ప్యాకేజింగ్ డివిజన్ వ్యవహారాలు కూడా చూస్తున్నారు. ఈయన 1977లో అప్పటి ఐటిసి భద్రాచలం పేపర్‌బోర్డ్స్ లిమిటెడ్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీగా చేరారు. తదనంతరం ఈ కంపెనీ ఐటిసి లిమిటెడ్‌లో విలీనం అయిన తర్వాత పేపర్ బోర్డ్స్, స్పెషాలిటీ డివిజన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మాన్యుఫ్యాక్చరింగ్) బాధ్యతలు చేపట్టారు. భద్రాచలం, త్రిబేణి, కోవై, బొల్లారం యూనిట్ల కార్యకలాపాలకు ఈయన బాధ్యత వహించారు. సిఐఐ తెలంగాణ స్టేట్ కౌన్సిల్‌లోనూ ఈయన కీలక సభ్యునిగా ఉన్నారు. 2017-18 సంవత్సరానికి వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇక సిఐఐ తెలంగాణ వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైన డి రాజుకు బిజినెస్ లీడర్‌షిప్, టర్న్‌ఎరౌండ్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లో 36 ఏళ్ల అనుభవం ఉంది.

భారతీయ బ్యాంకులు కట్టుతప్పాయ్

మాల్యా అప్పగింత కేసులో

బ్రిటిష్ న్యాయమూర్తి సంచలన వ్యాఖ్య



లండన్: విజయ్‌మాల్యా విషయంలో భారతీయ బ్యాంకులే అడ్డగోలుగా వ్యవహరించాయన్న విషయం తేటతెల్లంగా కనిపిస్తోందని బ్రిటిష్ న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. మాల్యాను అప్పగించాలని కోరుతూ భారత్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరుపుతున్న లండన్ వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎమ్మా అర్బత్‌నాట్ ఈ వ్యాఖ్యలు చేశారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు రుణాల మంజూరు విషయంలో కొన్ని బ్యాంకులు నిబంధనలను ఉల్లంఘించినట్టు స్పష్టంగా తెలుస్తోందని ఆమె అన్నారు. ఈ కేసు జిగ్‌సా పజిల్‌లా ఉందని అంటూ.. చిందరవందరగా ఉన్న సాక్ష్యాలను జాగ్రత్తగా అమర్చి చూస్తే అసలు విషయం ఇప్పుడు స్పష్టంగా అవగతమవుతోదని పేర్కొన్నారు. రుణాల మంజూరు విషయంలో బ్యాంకులు అడ్డగోలుగా వ్యవహరించి తమ నిబంధనాలను తామే ఉల్లంఘించినట్టు స్పష్టంగా తెలుస్తోందని అన్నారు.

కొందరు బ్యాంకు అధికారులకు వ్యతిరేకంగా ఉన్న అంశాల్లో వివరణ కోసం భారతీయ అధికారులను పిలిస్తున్నట్టు ఆమె తెలిపారు. మాల్యా తనకు వ్యతిరేకంగా కుట్ర జరిగిందని చెబుతున్న నేపథ్యంలో దీనికి ప్రాధాన్యం ఉందని ఆమె అన్నారు.

పిఎన్‌బి కేసు.. అందరికీ కనువిప్పు

వ్యవస్థకు చెడ్డపేరు

ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)లో వెలుగు చూసిన కుంభకోణం వ్యవస్థకు చెడ్డపేరు తెచ్చిందని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుంభకోణం అందరికీ కనువిప్పు కావాలన్నారు. ఆర్థిక సేవల వ్యవస్థలో మరింత పారదర్శకత, జవాబుదారీతనంతోపాటు కార్పొరేట్ గవర్నెన్స్‌లో నైతికత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన 58వ నేషనల్ కాస్ట్ కన్వెన్షన్‌లో వెంకయ్యనాయుడు ప్రసంగిస్తూ.. "పిఎన్‌బిలో జరిగిన ఉదంతం అందరికీ కనువిప్పులాంటిది. వ్యవస్థాగతమైన వైఫల్యాలు బయటపడ్డాయి. అది కొందరు వ్యక్తుల వల్లే కావచ్చు. కానీ ప్రభుత్వంతోపాటు వ్యవస్థ అంతటికీ చెడ్డ పేరొచ్చింది" అని అన్నారు. "మనం ఎల్‌పిజి (సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ) యుగంలో ఉన్నామని తెలుసు. కానీ ఈ విధానాలను సరైన రీతిలో వినియోగించుకోకపోతే భారీ నష్టం జరిగే ప్రమాదం ఉంది. చిన్న లోపం కూడా వ్యవస్థనంతటినీ ప్రభావితం చేసే అవకాశం ఉంది. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ ఇలాంటి చిన్న లోపాలను ఆసరాగా చేసుకునే వ్యవస్థకు భారీ గండికొట్టారు. ఈ నేపథ్యంలో మనకు ఫూల్ ప్రూఫ్ సిస్టమ్ అవసరం" అని ఆయన పేర్కొన్నారు.

కోర్టుల సమాంతర దర్యాప్తు వద్దు: కేంద్రం

పిఎన్‌బి కేసుపై కోర్టుల సమాంతర దర్యాప్తు, పర్యవేక్షణ వద్దని సర్వోన్నత న్యాయస్థానాన్ని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు వివరాలను సీల్డ్ కవర్‌లో సమర్పించాలంటూ సిబిఐకి సుప్రీంకోర్టు చేసిన సూచనను కేంద్రం వ్యతిరేకించింది.

వ్యవస్థాగత సమస్యేం కాదు: ప్రపంచబ్యాంక్

పిఎన్‌బి స్కామ్ బ్యాంకింగ్ రంగంలో వ్యవస్థాగత వైఫల్యానికి సంకేతంగా భావించలేమని ప్రపంచబ్యాంక్ ఇండియా డైరెక్టర్ జునైద్ కమాల్ అహ్మద్ అన్నారు. అయితే, ఇలాంటి కుంభకోణాలు వెలుగు చూసినప్పుడు నియంత్రణ పరమైన కార్యకలాపాలు, బ్యాంకింగ్ వ్యవస్థ సమర్థవంతంగా ఉందా లేదా అని సరిచూసుకోవాలన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) భారత విభాగ డైరెక్టర్ బ్రెట్టన్ వుడ్స్ మాత్రం కార్పొరేట్ పాలన ప్రమాణాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడారు.

డైమండ్ మార్కెట్‌పై సడలిన విశ్వాసం

నీరవ్ మోదీ స్కామ్ తరువాత వజ్రాల పరిశ్రమపై విశ్వాసం సడలిపోయిందని అసోచామ్ సర్వే వెల్లడించింది. ఆభరణాల్లోని వజ్రాల నాణ్యత, స్వచ్ఛతపై కస్టమర్లలో ఆందోళన పెరిగిందని, దాంతో వ్యాపారం గణనీయంగా తగ్గిందని అసోసియేషన్ పేర్కొంది. ఈనెలల్లో వజ్రాభరణాలకు డిమాండ్ 10-15 శాతం మేర తగ్గిందని రిపోర్టు వెల్లడించింది.

ఎల్‌ఒయులన్నింటికీ చెల్లిస్తాం: పిఎన్‌బి

నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ కంపెనీలకు జారీ చేసిన ఎల్‌ఒయులన్నింటినీ ఆమోదించి ఇతర బ్యాంకులకు సొమ్ము చెల్లించనున్నట్లు పిఎన్‌బి తెలిపింది. శుక్రవారం నాడు జరిగిన అసాధారణ సర్వ సభ్య సమావేశం (ఇజిఎం)లో బ్యాంక్ మేనేజ్‌మెంట్ ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ కుంభకోణం నుంచి గట్టెక్కగలుగుతామని వాటాదారులు, కస్టమర్లకు, సిబ్బందికి మరోసారి హామీ ఇచ్చింది.

ఆంధ్రజ్యోతి

రియల్ ఎస్టేట్

REAL ESTATE

విజయవాడ • శనివారం 17 మార్చి 2018



నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో రియల్టీ మందగిస్తోంది. ఐదారువారాల క్రితం వరకు జోరుగా సాగిన లావాదేవీలు ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి చూపించడం రియల్టీపై ప్రభావం చూపింది. దాదాపు అన్ని రాజధాని గ్రామాల్లోనూ ప్లాట్ల ధరలు రెండునెలల్లో చదరపు గజానికి రూ.3,000 నుంచి రూ.4,000 వరకు తగ్గాయి. ఢిల్లీ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ఆశలను వమ్ము చేయడంతోపాటు, గత కొన్ని నెలలుగా రియల్టీ రంగంలో నెలకొన్న కృత్రిమ బూమ్ కూడా ధరల తగ్గుదలకు కారణమనేది విశ్లేషకుల అంచనా.

రాజధాని రియల్టీకి ఢిల్లీ దెబ్బ

కేంద్ర బడ్జెట్‌లో రిక్తహస్తమే కారణం

తగ్గుతున్న ప్లాట్ల ధరలు, మందగించిన లావాదేవీలు

వేచి చూసే ధోరణిలో కొనుగోలుదారులు

మినీ కరెక్షన్

తాజా పరిణామాన్ని 'మినీ కరెక్షన్'గా మార్కెట్ ఎనలిస్టులు వర్ణిస్తున్నారు. దీర్ఘకాలంలో అమరావతికి ఇది మేలు చేస్తుందని అంటున్నారు. దళారులు, స్థిరాస్తి వ్యాపారులు కలిసి సృష్టించిన కృత్రిమ ధరల పెరుగుదల వల్లనే ఈ కరెక్షన్‌కు ఆస్కారం ఏర్పడిందని వారు చెబుతున్నారు. కరెక్షన్ వల్ల అమరావతి రియల్టీ మళ్లీ ఆరోగ్యకరమైన అభివృద్ధిని చవిచూస్తుందని అంటున్నారు. ఈ డౌన్ ట్రెండ్ మరి కొంతకాలం కొనసాగే అవకాశం ఉందని, ఆ తర్వాత ధరల స్థిరీకరణ జరిగి మళ్లీ బూమ్ మొదలవుతుందని వారు విశ్లేషిస్తున్నారు.

స్పెక్యులేషన్ కూడా కారణమే...

రాజధాని ప్లాట్లపై పెరుగుతున్న క్రేజ్‌ను సొమ్ము చేసుకునేందుకు కొందరు బడా వ్యాపారులు, మధ్యవర్తులు రంగంలోకి దిగారు. రైతుల నుంచి భూములు కొని ధరలు పెంచి విక్రయించడం మొదలుపెట్టారు. ఈ దందా జనవరి చివరి వరకూ లాభదాయకంగానే నడిచింది. పరిమితులు దాటిన స్పెక్యులేషన్, అధిక శాతం ప్లాట్లు స్వల్ప వ్యవధిలోనే నలుగురైదుగురి చేతులు మారడంతో ధరలు భారీగా పెరిగి, మరీ ధనవంతులైతే తప్ప కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో లిక్విడిటీ సమస్య తలెత్తడం, రాజధాని చుట్టుపక్కల ప్రాంతాల్లో డెవలప్‌చేసిన లేఅవుట్లలో చదరపు గజం 9,000-12,000 రూపాయల మధ్య ఉండటంతో ఇన్వెస్టర్లు, కొనుగోలుదార్లు తమ దృష్టిని రాజధాని గ్రామాల నుంచి పక్కకు మరల్చారు. దాంతో స్పెక్యులేషన్‌కు బ్రేక్ పడి కరెక్షన్‌కు అవకాశం ఏర్పడింది.



ఆగస్టు నుంచి రాజుకుంది.

రాజధాని రియల్టీలో బూమ్ గతేడాది ఆగస్టులో మొదలైంది. నవంబరు, డిసెంబరులో ఊపందుకుని, ఈ ఏడాది సంక్రాంతి సమయంలో పతాకస్థాయికి చేరింది. అమరావతిలో కొలువు దీరబోయే ప్రాజెక్టులకు సంబంధించి వస్తున్న వార్తలు, రాజధాని నిర్మాణం అనుకున్నట్టుగానే సజావుగా సాగుతుందన్న విశ్వాసంతో దేశ విదేశాల్లో ఉంటున్న ప్రవాసాంధ్రులే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు సైతం ప్లాట్ల కొనుగోలుపై ఆసక్తిని చూపారు. ప్లాట్లను అమ్ముకున్న వారికి మంచి ధరలు దక్కడమేకాకుండా రాజధాని గ్రామాల్లో లెక్కకు మిక్కిలిగా వెలిసిన స్థిరాస్తి సంస్థలు, మధ్యవర్తులూ కూడా భారీగా లాభపడ్డారు.

అన్ని గ్రామాల్లోనూ.. ఆకాశమే హద్దుగా!

రాజధాని పరిధిలోని 29 గ్రామాలూ సమాన అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభివృద్ధి వికేంద్రీకరణపై దృష్టిపెట్టారు. దాంతో అన్ని గ్రామాల్లోనూ ప్లాట్ల ధరలు పెరిగాయి. నైసర్గికంగా, భౌగోళికంగా ఉన్న అనుకూలతలతో కృష్ణానది తీర గ్రామాలైన వెంకటపాలెం, మందడం, ఉద్ధండరాయునిపాలెం, లింగాయపాలెం, రాయపూడిలో మాత్రం ఇతర గ్రామాలతో పోల్చినప్పుడు కొంత ఎక్కువ ధరలు పలికాయి. గవర్నమెంట్ కాంప్లెక్స్, ఫైస్ హబ్, రివర్‌ఫ్రంట్ టూరిజం ప్రాజెక్టులు ఇత్యాది ప్రతిష్టాత్మక నిర్మాణాల కారణంగా ఈ గ్రామాల్లో నివాస స్థలాల (రెసిడెన్షియల్ ప్లాట్ల)ను చదరపు గజం రూ.18,000 నుంచి రూ.25,000 వరకూ (ఒక సమయంలో లింగాయపాలెంలో ఇది రూ.30,000 తాకిందని కూడా అంటారు), వాణిజ్య స్థలాల (కమర్షియల్ ప్లాట్ల)ను చదరపు గజం రూ.22,000 నుంచి రూ.27,000 మధ్య విక్రయించారు.

జస్టిస్ సిటీ పనులు మొదలవడంతో నేలపాడులోనూ, ఆ పక్కనే ఉన్న తుళ్లూరులోనూ ప్లాట్ల ధరలు పరుగులు తీశాయి. వివిధ ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు కొలువు దీరుతుండడంతో నిడమర్రు, నీరుకొండ, శాఖమూరు, ఐనవోలు, కురగల్లు ఇత్యాది గ్రామాల్లోని ప్లాట్లకు కూడా మంచి ధరలే పలికాయి. మొదట్లో సరాసరి చ.గ. రూ.12,000-రూ.14,000 మధ్య లభించిన ఈ గ్రామాల్లోని స్థలాల ధరలు క్రమంగా ఊపందుకుని రూ.20,000 మార్కును తాకాయి. ఇతర గ్రామాలతో పోల్చితే చెప్పుకోదగిన ప్రాజెక్టులేమీ రాని, రాజధానికి ఓ చివరన ఉన్న అనంతవరం, నెక్కల్లుల్లో సైతం ప్లాట్ల ధరలు పెరగడంతో ఒక దశలో గజం ధర రూ.15,000 నుంచి రూ.18,000 వరకూ పలికింది.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

కేంద్ర బడ్జెట్‌తో కుదుపు!

ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్... అమరావతి నిర్మాణానికి కేంద్రం ఉదారంగా నిధులిస్తుందన్న ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన, వ్యయంతో కూడిన రాజధాని ప్రాజెక్ట్ అనుకున్న గడువులోగా పూర్తి కాకపోవచ్చన్న అనుమానాలు మొదలయ్యాయి. తెదేపా-భాజపాల మధ్య క్షీణిస్తున్న సంబంధాలు ఈ అనుమానాలను మరింత పెంచాయి. దాని ప్రభావం రియల్టీపై పడింది.



ఇదీ గృహ రుణాల కథ

సొంతిల్లు ప్రాథమిక అవసరం. అందుకే నాలుగు రాళ్లు సంపాదించడం మొదలు పెట్టిన దగ్గరి నుంచే ప్రతి వ్యక్తి అప్పోసప్పో చేసి సొంతిల్లు సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. అయితే ఇలా గృహ రుణంతో ఒక ఇంటివారయ్యే వారిలో చాలా మందికి హోమ్ లోన్ల గురించి సరిగా తెలియదు. ముఖ్యంగా కొనే ఇంటి విలువలో ఎంత మొత్తానికి లోన్ ఇస్తారు? వడ్డీ రేట్లలో రకాలు? క్రెడిట్ స్కోరు వంటి విషయాలపై సరైన అవగాహన ఉండదు. దాదాపు 10 నుంచి 30 సంవత్సరాల పాటు చెల్లించే హోమ్ లోన్లకు సంబంధించిన ముఖ్యమైన విషయాలను ఆంధ్రజ్యోతి 'రియల్టీ' పాఠకులకు డిహెచ్ఎఫ్ఎల్ జెఎండి, సిఇఒ హర్షిల్ మెహతా వివరిస్తున్నారు..

గృహ రుణంతో ఇల్లు లేదా ఫ్లాట్ కొనడం అంటే దీర్ఘకాలంపాటు చెల్లింపులకు సిద్ధపడడం. ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల గృహ రుణ పథకాలు అందుబాటులో ఉన్నాయి. నిర్మాణం పూర్తయి గృహ ప్రవేశం చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆస్తులు, నిర్మాణంలో ఉన్న ఆస్తులకుగృహ రుణాలు లభిస్తాయి. ఇళ్ల స్థలం ఉంటే మీరే ఇల్లు నిర్మించుకునేందుకు గృహ రుణం తీసుకోవచ్చు. ఇళ్ల స్థలాలు కొనుగోలు, ఉన్న ఇంటిని మరింత విస్తరించేందుకు లేదా నవీకరించేందుకూ బ్యాంకులు, హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీలు రుణాలు ఇస్తుంటాయి. అప్పు తీసుకునే ముందు ఈ విషయాలు అన్నీ క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ఆదాయ స్థాయిని బట్టి ప్రధాన మంత్రి అవాస్ యోజన (పిఎంఎవై) కింద గృహ రుణం తీసుకోవచ్చు. ఆయా వ్యక్తుల అర్హతలను బట్టి పిఎంఎవై హోమ్ లోన్లపై రూ.2.67 లక్షల వరకు సబ్సిడీ లభిస్తుంది. ఇల్లు లేదా ఫ్లాట్ల కొనుగోలు, నిర్మాణం, విస్తరణ లేదా నవీకరణ కోసం పిఎంఎవై రుణాలు లభిస్తాయి.



విలువలో రుణ నిష్పత్తి

ఇంటి విలువలో ఎంత మొత్తానికి గృహ రుణం లభిస్తుందనే విషయాన్ని విలువలో రుణ నిష్పత్తి (ఎల్‌టివి) అంటారు. గతంలో ఇది 80 శాతం వరకు ఉండేది. అంటే రూ.10 లక్షల విలువైన ఇంటిని కొంటే బ్యాంకులు లేదా హెచ్ఎఫ్‌సిలు రూ.8 లక్షల వరకు రుణం ఇస్తాయి. రూ.30 లక్షల వరకు విలువ ఉండే ఇళ్లపై 90 శాతం వరకు రుణంగా ఇస్తున్నారు.

ఇఎంఐలు

గృహ రుణం తీసుకున్నాక ఇఎంఐ రూపంలో అప్పు ఇచ్చిన బ్యాంక్ లేదా హెచ్ఎఫ్‌సికి చెల్లించాలి. దీన్నే ఇఎంఐ అంటారు. బ్యాంకులు, హెచ్ఎఫ్‌సిలు ఇచ్చిన హోమ్‌లోన్‌ను ఇలా రాబట్టుకుంటాయి. వీలైనంత వరకు నికర నెల వారీ ఆదాయంలో ఇఎంఐ 40-45 శాతం మించకుండా చూసుకోవాలి. అంతకు మించితే మాత్రం ఆర్థిక పరిస్థితుతు తలకిందులైనపుడు 'ఆర్థిక' సమస్యలు తలెత్తుతాయి. అలాగే ఒకవేళ ఆర్థికంగా కలిసొచ్చి హోమ్ లోన్‌ను ముందే చెల్లించాలకుంటే ప్రీపేమెంట్ చార్జీలు లేకుండా కూడా చూసుకోవాలి.

వడ్డీ రేటు

బ్యాంకులు, హెచ్ఎఫ్‌సిలు హోమ్ లోన్లపై స్థిర లేదా చర వడ్డీ రేట్ల పేరుతో రెండు రకాల వడ్డీ రేట్లు వసూలు చేస్తుంటాయి. ఏది ఎంపిక చేసుకోవాలనేది రుణం తీసుకునే వారి ఇష్టం. స్థిర వడ్డీ రేటును ఎంచుకుంటే ఆయా ఆర్థిక సంస్థలను బట్టి మూడు నుంచి ఐదేళ్ల వరకు అదే వడ్డీ రేటు కొనసాగుతుంది. కొన్ని బ్యాంకులైతే రుణ చెల్లింపులు చేసే పూర్తి కాలానికి కూడా స్థిర వడ్డీ రేటుతో హోమ్ లోన్లు అందిస్తున్నాయి. చర వడ్డీ రేటుపై ఇచ్చే గృహ రుణ వడ్డీ రేటు, ఆయా సంస్థల నిధుల సమీకరణ ఖర్చులను బట్టి మారుతుంటుంది. చర వడ్డీ రేట్లతో ఇచ్చే గృహ రుణాలతో పోలిస్తే స్థిర వడ్డీ రేటుతో ఇచ్చే హోమ్ లోన్లపై వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగా ఉంటుంది. భవిష్యత్‌లో వడ్డీ రేట్లు ఎలా మారే అవకాశం ఉందన్న అంచనాతో ఈ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అయితే ఇటీవల బ్యాంకులు, హెచ్ఎఫ్‌సిలు స్థిర వడ్డీ నుంచి చర వడ్డీ రేటుకు లేదా చర వడ్డీ రేటు నుంచి స్థిర వడ్డీ రేటుకు గృహ రుణాన్ని మార్చుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నాయి.



లాండ్‌పూలింగ్‌తో శాటిలైట్ టౌన్‌షిప్

- **విశాఖలో సమస్త హంగులతో 900 ఎకరాల్లో ఏర్పాట్లు**
- **250 ఎకరాల్లో అర్బన్ హౌజింగ్ .. 150 ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్**

విశాఖలో పెరుగుతున్న హౌజింగ్ డిమాండ్ నేపథ్యంలో వుడా భారీ ఎత్తున ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణానికి నిర్ణయించింది. ఇందుకోసం గాజువాక వైపు లంకెలపాలెం సమీపాన మూడు మండలాల పరిధిలో ఐదు గ్రామాల్లో సుమారు 1500 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఈ ప్రాంతం అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారికి ఆనుకొని వుండడంతో రాకపోకలకు అనువుగా వుంటుందని, త్వరగా అభివృద్ధి చేయవచ్చునని భావిస్తున్నారు.



లాండ్ పూలింగ్ మంచి అవకాశం

విశాఖపట్నంలో ప్రభుత్వ భూమి చాలా తక్కువగా వుంది. గృహ నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అందుకని భూసేకరణకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం నడుం కట్టింది. పరిహారం ఇవ్వాలంటే భారీగా చెల్లించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కాదు. అందుకే లాండ్ పూలింగ్ ప్రతిపాదించారు. ఇది ఇరువర్గాలకు లాభదాయకం. అమరావతిలో ఈ ఫార్ములా సక్సెస్ అయింది. అదేమార్గంలో ఇక్కడ చేయాలని భావిస్తున్నాం.

- పి బసంత్‌కుమార్, వుడా విసి

లాండ్‌పూలింగ్

విశాఖ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు కూడా రాజధాని అమరావతి తరహాలో లాండ్‌పూలింగ్ ద్వారా స్థలాలను సమీకరించాలని నిర్ణయించారు. శాటిలైట్ టౌన్‌షిప్ కోసం జిల్లా అధికారులు 'ట్రై జంక్షన్' అంటూ ఒక ప్రాంతానికి ఇటీవల నామకరణం చేశారు. పరవాడ, గాజువాక, సబ్బవరం మండలాలు కలిసే చోట ఈ-మర్రిపాలెం గ్రామం సమీపంలోని స్థలాలను ట్రై జంక్షన్‌గా గుర్తించారు. గాజువాక మండలం అగనంపూడి, సబ్బవరం మండలం నంగినారపాడు, గంగవరం, పరవాడ మండలం పెదముషిడివాడ, ఈ-మర్రిపాలెం గ్రామాల్లో 1500 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. వీటిలో కొండలు, గుట్టలు పోగా 900 ఎకరాలు అభివృద్ధికి అనువుగా ఉంటుందని అంచనా. ఈ 900 ఎకరాల్లో 200 ఎకరాలు ఖాళీగా ఉండగా, 700 ఎకరాల్లో అసైన్డ్ రైతులు ఉన్నారు. వీరితో ఇప్పటికే రెండుసార్లు అధికారులు సమావేశాలు నిర్వహించి, భూసేకరణ చేస్తామని, సహకరించాలని ప్రతిపాదించారు. అమరావతి తరహాలో అభివృద్ధి చేసిన భూమిలో వాటా ఇస్తామంటే అభ్యంతరం లేదని, పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటామంటే ఇవ్వలేమని అత్యధికులు స్పష్టం చేయడంతో ఆ మేరకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర మంత్రివర్గానికి సమర్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. భూసేకరణ కార్యక్రమం రెవెన్యూ యంత్రాంగం చూస్తుండగా, లాండ్ పూలింగ్ బాధ్యతను విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థకు అప్పగించారు.

దశల వారీగా నిర్మాణాలు

ట్రై జంక్షన్ దగ్గర ఎంపిక చేసిన స్థలంలో తొలి దశలో 25 వేల గృహాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. అర్బన్ హౌజింగ్‌కు ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లో 250 ఎకరాలు ప్రాథమికంగా కేటాయించారు. మరో 150 ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు డిజైన్లు సిద్ధం చేస్తున్నారు. వీటితోపాటు వాణిజ్య సముదాయాలు, రిక్రియేషన్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. పేరుకు తగ్గట్టుగా శాటిలైట్ టౌన్‌షిప్‌లా అన్ని వసతులతో తీర్చిదిద్దుతామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

కొమ్మాదిలో 166 ఎకరాల్లో

నగరానికి మరోవైపు (మధురవాడ) కూడా అర్బన్ హౌజింగ్‌కు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ కొమ్మాదిలో 111 ఎకరాలు, పరదేశిపాలెంలో 55 ఎకరాల భూమిని గుర్తించారు. వీటిని కూడా లాండ్ పూలింగ్ విధానంలోనే తీసుకొని అర్బన్ హౌజింగ్ నిర్మిస్తారు.

-విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి)

మీ వెంచర్‌లో క్లబ్ హౌజ్ ఉందా?

సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే సద్గుణరావు నగరంలోని కీలక ప్రాంతంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఐదారేళ్లుగా ఉంటున్నాడు. ఉమ్మడి కుటుంబం. ఎప్పుడూ ఇంట్లో ఏదో ఒక శుభ కార్యక్రమం ఉంటుంది. పది మంది బంధువులు, స్నేహితులను అనివార్యంగా ఆహ్వానించాలి. ప్రతిసారీ హోటల్స్, ఫంక్షన్‌హాల్స్ కోసం తిరగాల్సిందే. చిన్న చిన్న ఫంక్షన్స్‌కైనా బోలెడు డబ్బు పోయాలి. ఇష్టమైన ఆహార పదార్థాలను చక్కగా ఇంట్లోనే వండించి వడ్డిద్దామంటే 3బిహెచ్‌కె ఏమాత్రం సరిపోదు. అపార్ట్‌మెంట్ కారిడార్లలో లేదా సెల్లార్‌లో చేయడానికి చాలా ఇబ్బంది. వీలున్నంతవరకు సమీపంలో ఉన్న కాలనీల్లోని కమ్యూనిటీ హాల్స్‌ను బుక్ చేసేందుకే సద్గుణరావు మొగ్గుచూపిస్తుంటాడు. అక్కడైతే వంటవాళ్లను ఏర్పాటు చేసి ఇష్టప్రకారం వంటలు చేయించవచ్చు. కమ్యూనిటీ హాల్ ఫీజు కూడా మరీ ఎక్కువగా ఉండదు.

అధిక శాతం మంది అపార్ట్‌మెంట్‌వాసులు ఎదుర్కొనే ఇబ్బందే ఇది. కానీ పరిస్థితి మారుతోంది. భారీ అపార్ట్‌మెంట్ వెంచర్స్‌లో క్లబ్‌హౌజ్‌ను విధిగా కట్టిస్తున్నారు. కొనుగోలుదార్లు కూడా కొనే ముందు జిమ్, క్లబ్ హౌజ్ వంటి సౌకర్యాలు ఉన్నాయా లేదా అన్న విషయం ఒకటికి పదిసార్లు చెక్‌చేసుకుంటున్నారు.

మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా ఫ్లాట్స్ కోనే వారంతా, క్లబ్ హౌజ్, స్విమింగ్ పూల్, ఇండోర్ గేమ్స్, వాకింగ్ ట్రాక్, గార్డెన్ వంటి సౌకర్యాలు ఉన్న వెంచర్స్‌ను ఎంచుకుంటున్నారు. మిగతా సౌకర్యాల మాట ఎలా ఉన్నా క్లబ్ హౌజ్ కంపల్సరీ అయింది. చాలా మంది క్లబ్‌హౌజ్ ఉన్న అపార్ట్‌మెంట్‌లకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

30-40 ఫ్లాట్లు ఉన్న అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లతో ప్రారంభించి వందల ఫ్లాట్లు ఉన్న వెంచర్లలో క్లబ్ హౌజ్ ఇప్పుడు కామన్‌గా మారింది. వంద ఫ్లాట్స్ పైగా ఉన్న ప్రాజెక్టుల్లో రెండు క్లబ్ హౌజ్‌లు, ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని గేటెడ్ కమ్యూనిటీల్లో ఐదు క్లబ్ హౌజ్‌లు కూడా ఉంటున్నాయి. చిన్న బిల్డర్ల విషయానికి వస్తే పాతిక ఫ్లాట్స్ నిర్మించే వారు కూడ ఒక సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌ను క్లబ్ హౌజ్ కింద వదిలేస్తున్నారు.



ఉండి తీరాల్సిందే..

గతంలో గేటెడ్ కమ్యునిటీలు, విల్లా టౌన్‌షిప్‌లకు మాత్రమే పరిమితం అయిన క్లబ్‌హౌజ్‌లు ఇప్పుడు ఈ అపార్ట్‌మెంట్స్‌కు కూడా విస్తరించాయి. విశాలమైన క్లబ్‌హౌజ్, సెంట్రల్ ఎసితో 50 మంది నుంచి మూడు వందల మంది వరకు కలసి ఫంక్షన్ చేసుకునేందు వీలుగా వీటిని నిర్మిస్తున్నారు. సెంట్రల్ ఏసీ, స్విమ్మింగ్ పూల్ వ్యూ.. లేదా పార్క్ వ్యూ అంటూ అదనపు అందాలు తీసుకువస్తున్నారు. మొదట బిల్డరు లేదా రియల్ ఎస్టేట్ సంస్థ కొన్ని రోజుల వరకు క్లబ్‌హౌజ్ నిర్వహణ చేపట్టి ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటు తర్వాత వారికి అప్పగిస్తున్నారు. క్లబ్ హౌజ్‌లు ఫ్లాట్స్‌లో ఉండే వారికి మాత్రమే అద్దెకిస్తారు. బయటి వారికి ఇవ్వరు. అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ ఓనర్స్ ఎవరైనా తెలిసిన వారు ఉంటే వారి పేరున ఆ క్లబ్‌హౌజ్ బుక్ చేసుకుని ఫంక్షన్ చేయాల్సి ఉంటుంది. ఒక ఫంక్షన్ చేయడానికి ఒక్కో క్లబ్ హౌజ్‌కు ఐదు వేల నుంచి పాతిక వేల వరకు వసూలు చేస్తున్నారు. ఆ హాల్ కెపాసిటిని బట్టి కరెంటు చార్జీలను, ఫర్నీచర్‌ను బట్టి ధర నిర్ణయిస్తున్నారు. హోటల్స్ లేదా ఫంక్షన్‌హాల్స్‌లో ధర మరో నాలుగు రెట్లు అధికంగా ఉంటుంది. క్లబ్‌హౌజ్ లలో చిన్న పాటి బర్త్‌డే పార్టీ నుంచి పెళ్లిళ్లు, రిసెప్షన్‌లు కూడా నిర్వహిస్తున్నారు. క్లబ్ హౌజ్ అన్నది అపార్ట్‌మెంట్ విక్రయాల్లో అత్యంత కీలకంగా మారింది.

మీతో ఉండి ఒరిగిందేంటి?

ఎన్నో ఆశలతో మీ కూటమిలో చేరాం.. ఉపయోగం లేదనే బయటకొచ్చాం



- 29సార్లు ఢిల్లీకి వచ్చినా స్పందనలేదు
- చివరి బడ్జెట్‌లో ఏపీపై ప్రకటనే లేదు
- ఆర్థికబిల్లులోనూ సర్దుబాటు చేయలేదు
- అందుకే ఎన్డీయే నుంచి వెళ్లిపోతున్నాం
- బీజేపీ చీఫ్ అమిత్‌షాకు చంద్రబాబు లేఖ

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): "మా రాష్ట్రానికి మంచి సహకారం లభిస్తుందని, మా ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎన్నో ఆశలతో మీ కూటమిలో చేరాం. కాని మీతో ఉండీ ఉపయోగం లేదని అర్థమైంది. చేరిన ప్రయోజనం నెరవేరనప్పుడు కూటమిలో కొనసాగడం వృథా. అందుకే బయటకు వెళ్లిపోవాలని నిర్ణయించుకొన్నాం" అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు స్పష్టంచేశారు. ఎన్డీయే కూటమి నుంచి బయటకు వెళ్లిపోవాలని నిర్ణయం తీసుకోవడం వెనుక నేపథ్యాన్ని వివరిస్తూ.. శుక్రవారం రాత్రి ఆయనకు లేఖ రాశారు. "మా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు బీజేపీకి పట్టడం లేదన్న అభిప్రాయం అందరిలో వ్యాపిస్తోంది. రాష్ట్రాన్ని విభజించే సమయంలో తీసుకువచ్చిన విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, అదే సమయంలో నాటి ప్రధాని రాజ్యసభలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయడానికి మీ పార్టీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆసక్తిగా లేదని మేం అభిప్రాయపడుతున్నాం. విభజన సమయంలో ఈ హామీలు ఇచ్చే విభజన చట్టాన్ని రాజ్యసభలో ఆమోదించుకొన్నారు. ఆ హామీలను... విభజన చట్టంలోని అంశాలను నెరవేర్చడంలోనూ, తద్వారా తన రాజ్యాంగపరమైన బాధ్యతల నిర్వహణలోనూ కేంద్రం విఫలమైందని మేం భావిస్తున్నాం. అందుకే ఈ నిర్ణయం తీసుకొన్నాం' అని ఆ లేఖలో చంద్రబాబు వివరించారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలను సాధించుకోవడానికి తాను 29సార్లు ఢిల్లీ వచ్చానని, కానీ వచ్చిన ప్రతిసారి హామీలు... వాగ్దానాలతోనే వెనుతిరగాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. "చివరగా ఈ ఏడాది జనవరి 12న ప్రధానిని కలిశాను. ఇచ్చిన వాగ్దానాలు, హామీలు ఏవేవి ఎక్కడెక్కడ పెండింగ్‌లో ఉన్నాయో వివరిస్తూ సమగ్రమైన వినతిపత్రాన్ని ఆయనకు ఇచ్చాను. ఆ తర్వాత పార్లమెంటులో పెట్టబోయే బడ్జెట్‌లో ఈ దిశగా స్పందన ఉంటుందని ఆశించాం. ఇది లోక్‌సభలో కేంద్రం పెట్టబోయే ఆఖరి బడ్జెట్. కానీ దురదృష్టవశాత్తూ ఏపీకి సంబంధించి ఎలాంటి విధాన నిర్ణయమూ ప్రకటించలేదు. ఇది మమ్మల్ని తీవ్రంగా నిరుత్సాహపర్చింది. మార్చి ఏడో తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విలేకరుల సమావేశంలో చేసిన ప్రకటన.. ఐదు కోట్ల మంది తెలుగు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలుకు కేంద్రం ఆసక్తిగా లేదని తేటతెల్లం చేసింది. అదే రోజు మా మంత్రులు కేంద్ర మంత్రివర్గం నుంచి బయటకు వచ్చేశారు. పార్లమెంటులో ఆర్థిక బిల్లు ఆమోదం పొందేలోపు మా ప్రజల ఆకాంక్షలు ప్రతిఫలించేలా మార్పు చేర్పులు చేస్తారని ఆశించాం. కాని జరగలేదు. ఆ బిల్లును యథాతథంగా ఆమోదించేశారు. మా ప్రజల పట్ల మీ వైఖరి అర్థమయిపోయింది' అని తెలిపారు.

ఆస్తులు వాళ్లకు.. అప్పులు మాకు..

కొత్త రాష్ట్రాన్ని ఆర్థికంగా నిలబెట్టడానికి ప్రత్యేక హోదా అవసరమని విభజన సమయంలో అప్పటి బీజేపీ పక్ష నేత అరుణ్ జైట్లీ స్వయంగా రాజ్యసభలో చెప్పారని చంద్రబాబు తన లేఖలో గుర్తుచేశారు. "ఎన్డీయే ప్రధాని అభ్యర్థి మోదీ ఏపీలో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. తాను గెలిస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని, ఢిల్లీని మించిన రాజధానిని నిర్మించడానికి సాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తర్వాత అమరావతి శంకుస్థాపనకు వచ్చినప్పుడు కూడా అదే చెప్పారు. కానీ మా ఆశలు వమ్మయ్యాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. "అప్పులను జనాభా ప్రాతిపదికన విభజించడంతో అవి ఎక్కువ ఏపీకి వచ్చి పడ్డాయి. ఎక్కువ ఆస్తులు హైదరాబాద్ చుట్టూ ఉండిపోయాయి. వాటిని ప్రాంతం ప్రాతిపదికన విభజించడంతో వాటినీ పోగొట్టుకొన్నాం. గవర్నర్ పాలనలో ఉన్న నిపుణుల బృందం కొత్త రాష్ట్రానికి రూ.16 వేల కోట్ల అప్పు ఉంటుందని లెక్కగట్టింది. ఉమ్మడి రాష్ట్రానికి పారిశ్రామిక, సేవా రంగాల నుంచి బాగా ఆదాయం ఉండేది. విభజన తర్వాత ఏపీ కేవలం వ్యవసాయాధారిత రాష్ట్రంగా మిగిలిపోయి, ఆ ఆదాయాన్ని కోల్పోయింది. దీనితో విపరీతమైన ఆదాయ లోటు ఏర్పడింది. ఈ కష్టాలను తీరుస్తారనే మిమ్మల్ని, మమ్మల్ని కలిపి రాష్ట్ర ప్రజలు గెలిపించారు. కానీ ఆ ఆకాంక్షలను నిలపడంలో మీరు విఫలమయ్యారు. రెండు రాష్ట్రాల్లో కలిసి పోటీచేశాం. కానీ తెలంగాణలో మాకు మర్యాదపూర్వకంగా ఒక్క మాట కూడా చెప్పకుండా, మీ అంతట మీరే మాతో తెగతెంపులు చేసుకొన్నారు. అయినా మేం ఎన్నో ఆశలతో మీ వైపు ఎదురు చూశాం. కాని మీరు విఫలమయ్యారు. అందుకే ఈ నిర్ణయం తీసుకొన్నాం' అని అమిత్ షాకు చంద్రబాబు తేల్చి చెప్పారు.

ఆంధ్రాకు

ప్రత్యేక హోదా ఇచ్చే విషయంలో కేంద్రానికి స్పష్టమైన వైఖరి లేదని, కప్పగంతులు వేస్తూ వచ్చిందని చంద్రబాబు ఆక్షేపించారు. 'ఏ రాష్ట్రానికీ ఇకపై ప్రత్యేక హోదా ఇవ్వవద్దని 14వ ఆర్థిక కమిషన్ సిఫారసు చేసిందని మొదట మాకు చెప్పారు. అది లేకపోయినా, దాని ద్వారా వచ్చే అన్ని ప్రయోజనాలు, పారిశ్రామిక, పన్ను రాయితీలను ప్రత్యేక ఆర్థిక సాయం పేరుతో ఇస్తామన్నారు. కానీ మాకు ఏమీ రాలేదు. పైగా ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు 2017 ఏప్రిల్ తర్వాత కూడా అన్ని ప్రయోజనాలు కొనసాగుతూ వచ్చాయి. వాటికి కూడా నిలిపివేస్తున్నామని మాకు అబద్ధం చెప్పారు. 14వ ఆర్థిక సంఘంచైర్మన్, ఇతర సభ్యులు ప్రత్యేక హోదాను మరే రాష్ట్రానికి ఇవ్వవద్దని తాము ఎప్పుడూ సిఫారసు చేయలేదని పలుమార్లు చెప్పారు. నిన్న కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పార్లమెంటులో ఒక ప్రకటన చేస్తూ, ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వవద్దని ఆర్థిక సంఘం చెప్పలేదని, తాము మాత్రమే వివిధ కారణాల వల్ల ఏపీకి ఈ హోదా ఇవ్వలేదని చెప్పారు. ఏమిటీ దాగుడు మూతలు? ఎందుకని మాకు ప్రత్యేక హోదా ఇవ్వడం లేదు?' అని చంద్రబాబు ప్రశ్నించారు.

ఏమిటీ దాగుడు మూతలు?

ఇందుకే.. బయటకొచ్చాం

- టీడీపీ పొలిట్‌బ్యూరో ప్రకటన

విభజన చట్టం, రాజ్యసభలో ఇచ్చిన హామీల అమలును కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసినందునే, ఎన్డీయే నుంచి బయటకు రావాలని నిర్ణయించినట్లు టీడీపీ పొలిట్‌బ్యూరో తెలిపింది. శుక్రవారం పొలిట్‌బ్యూరో సమావేశం అనంతరం ఆ పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. "హామీలను అమలు చేయాలన్నందుకు.. మా అధినేతను హేళనగా మాట్లాడారు. కేంద్ర మంత్రులతో రాజీనామాలు చేయించిన తరువాతైనా, బడ్జెట్‌ని సవరిస్తారని ఆశించాం. ఎలాంటి స్పందనా లేదు. దీంతో ఎన్డీయే నుంచి తప్పుకోవాలని నిర్ణయించాం" అని స్పష్టం చేసింది.

మాట విననేనా?

ఆంధ్రా అభివృద్ధి ఇష్టం లేదా?

- ఇందుకే సహకరించడం లేదా?
- అన్యాయం చేసింది మోదీనే..
- చిన్నపిల్లాడిని అడిగినా చెబుతాడు
- ఇబ్బందులు పెడతారని తెలుసు..
- అయినా వెనక్కిచూడం.. ముందుకే!
- హోదా ఇవ్వని కేంద్రాన్ని ఏమీ అనరే!
- బీజేపీ, వైసీపీ, పవన్‌పై సీఎం ఆగ్రహం

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): 'మా రాష్ట్రం అభివృద్ధి చెందడం ఇష్టం లేక సహకరించడంలేదా? అభివృద్ధిలో దూసుకుపోయి నేను మీ మాట వినకుండా పోతానేమోనన్న ఉద్దేశంతో సహకరించడం లేదా' అని సీఎం చంద్రబాబు కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కేంద్రంతో వైరం పెట్టుకుంటే ఇబ్బందులు పెడతారని తెలిసినా రాష్ట్ర ప్రయోజనాల కోసం ముందడుగే వేస్తామని స్పష్టం చేశారు. వెనక్కితిరిగి చూడబోమన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్న తనను రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ బలపరచాలని పిలుపిచ్చారు. 'రాష్ట్రానికి అన్యాయం చేసింది మోదీయేనని రాష్ట్రంలో చిన్నపిల్లాడు కూడా చెప్పే స్థితికి హోదా సెంటిమెంటు వచ్చింది' అని చెప్పారు. శుక్రవారం శాసనమండలిలో విభజన హామీలపై చర్చ సందర్భంగా బాబు మాట్లాడారు. బీజేపీ, వైసీ పీ, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తననెందుకు విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. హోదా ఇవ్వని కేంద్రం గురించి ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. 'రాష్ట్రం నష్టపోవాలి.. నన్ను బలహీనపరిస్తేనే వాళ్ల ఆటలు సాగుతాయి. కానీ నేను వ్యక్తిగా కాదు.. రాష్ట్ర అధినేత గా పోరాడుతున్నా.. నా బలం 5 కోట్ల మంది ప్రజలు.. రాష్ట్రానికి అన్యాయం జరిగింది.. నాకు ఓటేసి నాపై నమ్మకం పెట్టుకున్నారు.. వారిని కాపాడాల్సిన బాధ్యత నాపై ఉంది. అందుకే పోరాడతా.. మమ్మల్ని విమర్శించి మాపైకి ఇతరులను రెచ్చగొట్టేందుకు మీకున్న శక్తిని హామీలు అమలు చేయడానికి ఎందుకు ఉపయోగించడం లేదు' అని నిలదీశారు. ఇంకా ఏమన్నారంటే..

రక్షణ బడ్జెట్ అడిగామా?

ఏపీకి నిధులిస్తే.. రక్షణకు బడ్జెట్ ఉండదని కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ అన్నారు. మేం రక్షణ బడ్జెట్ అడిగామా? మాకు అంత సంస్కారం లేదనుకుంటున్నారా? దేశభక్తి ఉంది మీ ఒక్కరికేనా? దేశాన్ని కాపాడే బాధ్యత మీకు మాత్రమే ఉందనుకుంటున్నారా? భారతదేశంలో పుట్టిన ప్రతి పౌరుడూ దేశం కోసం ప్రాణత్యాగం చేస్తాడు. సెంటిమెంటుకు నిధులు ఇవ్వలేమంటారా? విభజనతో దిక్కుతోచని స్థితిలో రాష్ట్రం ఇరుక్కుంది. తమ పిల్లల చదువులు ఏమవుతాయోనని, ఉద్యోగాలు వస్తాయో రావోనని ప్రజలు ఆందోళన చెందారు. ఆ ఆందోళనే సెంటిమెంటుగా మారింది. కేంద్రం నాటకాలు చేయడానికి ఇది తమిళనాడు కాదు. మోదీ చెబితేనే ఉపముఖ్యమంత్రిగా ఉన్నానని పన్నీర్ సెల్వం చెప్పడం ప్రధానికి ఏపాటి హుందాతనం?'

ఏపీకి ఏమి చేశారు!

'తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో ఎన్టీఆర్ టీడీపీ స్థాపించారని పార్లమెంటులో చెప్పిన ప్రధాని మోదీ... ఇప్పుడదే తెలుగువారి కోసం ఒక్కరోజైనా ఆలోచించారా? కనీసం ఒక్క గంట సమయమైనా ఏపీ సమస్యల కోసం కేటాయించారా? విడిపోయాక 2 రాష్ట్రాలను పిలిచి సమస్యలపై పరిష్కారానికి కూర్చోబెట్టి మాట్లాడేంత సమయం కూడా లేకుండా పోయిందా? ఏం చేయగలుగుతారులే అన్న ధీమానే కదా! లేదా 25 ఎంపీ సీట్లు.. 5 కోట్ల మంది ఆంధ్రులే కదా అనే చిన్నచూపా?'

భయపడను.. రాజీపడను..

'కేంద్రం నుంచి నిధులు తేలేకపోవడం నా అసమర్థత అన్నారు. నేను అసమర్థుడిని కాను. చెప్పేరీతిలో గట్టిగా చెప్పాను. ప్రధానికి ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చాను. కానీ మీరేం చేస్తున్నారు.. నాపైకి వేరే వాళ్లని రెచ్చగొడుతున్నారు. అయినా భయపడను.. రాజీపడను. పోరాడతాను.'

14వ ఆర్థిక సంఘం చెప్పిందా?

'14వ ఆర్థిక సంఘం చెప్పలేదు కాబట్టి హోదా ఇవ్వలేదని అంటున్నారు.. కానీ, హోదా ఇవ్వొద్దంటూ 14 ఆర్థిక సంఘం తన నివేదికలో ఎక్కడ చెప్పలేదని బీజేపీ మంత్రే పార్లమెంటు సాక్షిగా చెప్పారు. ఏపీకి హోదా ఇచ్చే విషయంలో ఇన్ని అసత్యాలు, డొంకతిరుగుడు సాకులు ఎందుకు? ఎందుకివ్వడం లేదో బీజేపీ స్పష్టం చేయాలి '

అందుకే బయటకు వచ్చేశాం..

'పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో పెట్టిన ఫైనాన్స్ బిల్లులో ఏపీకి అనుకూలంగా ఏవైనా మార్పులు చేస్తారని వేచి చూశాం.. బుధవారం పెట్టిన ఆ బిల్లులో కూడా ఏపీకి అనుకూలంగా మార్పులు చేయకపోవడంతో ఇక ఎన్డీఏతో కలిసి ఉండడంలో అర్థం లేదని భావించి బయటకు వచ్చేశాం. బీజేపీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఎన్డీఏతో తెగదెంపులు చేసుకున్నాకే అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించుకున్నాం'

మీ పొత్తుతో ఓట్లు తగ్గాయి..

'2014 అసెంబ్లీ ఎన్నికల ముందు జరిగిన మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో టీడీపీకి 48 శాతం ఓట్లు వచ్చాయి. బీజేపీ, పవన్ కల్యాణ్‌తో కలిసిన తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో 46.1 శాతానికి టీడీపీ ఓట్లు తగ్గాయి. స్థానిక ఫలితాల ప్రకారం చూస్తే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి 120 సీట్లు రావాలని అనేక సర్వేలు చెప్పాయి. కేవలం పొత్తుల కారణంగానే మా సీట్లు తగ్గాయి'

పదవులు ఆశించలేదు

ఎన్డీఏ-1కు మద్దతిచ్చినప్పుడు టీడీపీకి 35 మంది ఎంపీలు ఉండేవారు. ఒక్క పదవీ ఆశించకుండా ఆరున్నరేళ్ల మద్దతు అందించాం. మా నీతి నిజాయితీకి ఇది ఉదాహరణ. ప్రస్తుత ఎన్డీఏలో కూడా నేను ఒక్క పదవీ అడగలేదు. ముందు మీరే అశోక్‌గజపతిరాజుకు విమానయాన శాఖ ఇచ్చారు. ఆ తర్వాత మరో ఎంపీకి సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయ మంత్రి పదవి ఇచ్చారు. ఈ శాఖలతో రాష్ట్రానికి వచ్చే ప్రయోజనాలు ఏమీ లేవు. మొదటి నుంచీ విభజన చట్టం, పార్లమెంటులో ఇచ్చిన హామీలు అమలే అడుగుతున్నాను. అవి చేస్తారనే ఆశతోనే మీతో జట్టుకట్టాను. విభజన చట్టం పార్లమెంటులో పెట్టిన సమయంలో ప్రతిపక్షంలో ఉన్నారు కాబట్టి.. ఏపీకి సహకరించాలని పోరాడారా? ఈనాడు అధికారంలోకి వచ్చారు కాబట్టి అవన్నీ మరచిపోతారా?'

విభజన సమస్యలు ఎక్కడివక్కడే

'రాష్ట్రాన్ని నోటిపై చేసేలోపునే విభజన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. నాలుగేళ్లవుతోంది. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. రెవెన్యూ లోటు 2014-15 కేంద్ర బడ్జెట్‌లో పెడతామన్నారు. ఇప్పటికి నాలుగు బడ్జెట్‌లు వచ్చాయి. ఇంతవరకు పెట్టలేదు'

అప్పటి హామీలు ఏమయ్యాయ్..

'రాష్ట్ర విభజన తర్వాత... అప్పటి పీఎం అభ్యర్థి మోదీ గుల్బర్గాలో మాట్లాడుతూ కాంగ్రెస్ పురుడు పోసి బిడ్డను కాపాడి.. తల్లికి అన్యాయం చేసిందన్నారు. తాము అధికారంలోకి వస్తే తల్లికి కూడా న్యాయం చేస్తామన్నారు. తిరుపతి, అమరావతి శంకుస్థాపన, విశాఖకు వచ్చినప్పుడు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? రాష్ట్ర అభివృద్ధి బాధ్యత తమదేనని అమిత్ షా కూడా చెప్పారు. ఇప్పుడా మాటలన్నీ ఏమయ్యాయి?'

ఇందిరా గాంధీనే వెనక్కి తగ్గింది

ఇందిరాగాంధీ... అప్పటి ఆంధ్ర ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను ఎదుర్కోలేక సీఎం పదవి నుంచి బర్తరఫ్ చేయించారు. ఇలా చేస్తే.. ఎన్టీఆర్ సినిమాల్లోకి వెళ్లిపోతారు. టీడీపీ ఉండదని ఆమె భావించారు. కానీ, ప్రపంచమంతా తెలుగు వాళ్లు ముక్తకంఠంతో టీడీపీకి, ఎన్టీఆర్‌కు మద్దతు పలికారు. దీంతో ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రిగా తిరిగి తీసుకోకతప్పలేదు'

మమ్మల్ని అడిగి ఒడిసాకు ఇచ్చారా?

'6 నెలల్లో రైల్వేజోన్ అంశం తేల్చాలని చట్టంలో ఉంటే నాలుగేళ్ల తర్వాత ఆలోచిస్తున్నామంటారా? తమకేం అభ్యంతరం లేదని ఒడిసా ఎంపీలు చెప్పాక కూడా ఇంకేంటి సమస్య? పొరుగు రాష్ట్రాలతో మాట్లాడాలంటారు. మరి ఒడిసాకు రైల్వేజోన్ ఇచ్చినప్పుడు పొరుగు రాష్ట్రమైన ఏపీతో మాట్లాడారా? పెట్రోలియం కాంప్లెక్స్ ఏపీలో ప్రారంభించాలంటే 14 శాతం ఐఆర్ రాష్ట్రాన్ని భరించమంటారా? అదే రాజస్థాన్‌కు 12 శాతం ఐఆర్‌కే ఇస్తున్నారు కదా? 14 శాతం ఐఆర్ నేనిచ్చే పనైతే ప్రైవేటు కంపెనీలు చాలా ఉన్నాయి వచ్చి పెట్టడానికి. ఏపీలో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరిగితే.. ప్రభుత్వ సుస్థిరత పెరుగుతుంది. పెంచడానికి పైసా ఖర్చుండదు. మరి మీకేంటి ఇబ్బంది? సీట్లు పెంచితే టీడీపీ మరింత బలపడుతుందనేనా?'

పీఎంవోకు ఏ1, ఏ2నా?

'ప్రతి శుక్రవారం కోర్టుకు వెళ్లే వ్యక్తులను ఎలా సమర్థిస్తున్నారు? అవినీతిపరుల మద్దతు ఎన్డీఏకి అవసరమా? ఇది అనైతికత కాదా? నీతివంతమైన పాలన ఎలా అందిస్తారు? ప్రత్యేక హోదాతో ముడిపెట్టకుండా ఎన్డీఏ ప్రకటించిన రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతిస్తామని వైసీపీ నేత జగన్, ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. ఇప్పుడేమో అవిశ్వాసం తీర్మానం పెట్టా రు. కేసుల మాఫీ కోసం వైసీపీ వాళ్ల ప్రధాని చుట్టూ తిరుగుతున్నారు. ఎవరికీ కనీసం నమస్కారం చేయని జగన్.. రాష్ట్రపతి కాకముందే రామ్‌నాథ్ కోవింద్‌కు పాదాభివందనం ఎందుకు చేశారు? రాష్ట్రపతి అభ్యర్థిగా ఆయన పేరు అధికారికంగా బయటకు రాకముందే వైసీపీ వాళ్లు బిహార్ వెళ్లిపోయారు. అక్కడ గవర్నర్‌గా ఉన్న ఆయనతో ఒక ఫోటో తీసుకుని బయటకు వదిలారు. విచారణ సంస్థలకు ఎలాంటి సంకేతాలు వెళ్తాయి? జగన్ తమ మనిషే.. కేసుల విషయంలో జాగ్రత్తగా ఉండాలనే సంకేతాలు పంపాలనే వైసీపీ వాళ్ల ఎత్తుగడ. గుజరాత్ మాజీ సీఎం ఆనందిబెన్ పటేల్ ఏపీ గవర్నర్‌గా వస్తున్నారన్న వార్తలు రావడంతో ఆమె ఇంటికి వెళ్లి కలిశారు. కానీ ఆమె మధ్యప్రదేశ్‌కు వెళ్లారు. జగన్‌కు 24 గంటలూ నన్ను తిట్టే పనే.. నన్ను తిడితే ఏమొస్తుంది? కేంద్రంపై పోరాడితే రాష్ట్రానికి ప్రయోజనాలన్నా దక్కుతాయి. సూరత్ బీజేపీ ఉపాధ్యక్షుడు పీవీఎస్ శర్మ పవన్-బీజేపీ బంధంపై ట్వీట్ చేశారు. ఇవన్నీ దేనికి సంకేతాలు?'

జగన్ మీడియా కుట్రలు..

'ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ఆపేందుకు జగన్ మీడియా కుట్ర చేస్తోంది. పోలవరం భూసేకరణ అక్రమణలపై సీబీఐ అంటూ వార్తలు ప్రచురిస్తోంది. తెలుగు జాతి బాగుపడకూడదనే ఉద్దేశంతోనే ఆ వార్తలు రాస్తోంది. దేశవ్యాప్తంగా జాతీయ హోదా ఉన్న 16 ఇరిగేషన్ ప్రాజెక్టులు అతీగతీ లేకుండా ఉన్నాయి. పోలవరం రాష్ట్రం చేతిలో ఉంటేనే పూర్తవుతుందని స్వయంగా నీతి ఆయోగ్ కేంద్రానికి సిఫారసు చేసింది.'

కేంద్రాన్ని అడక్కుండా నన్ను విమర్శిస్తారా?

- పవన్ కల్యాణ్‌పై బాబు విసుర్లు

'ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఎందుకు? మా మాటల మీద నమ్మకం లేదా? కమిటీలో కేంద్రం నుంచి రూ.75,500 కోట్లు రావాలని తేల్చారు కదా... మరి ఆ నిధులు ఆ అడగకుండా నన్ను విమర్శిస్తే ఏమొస్తుందో పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలి' అని చంద్రబాబు డిమాండ్ చేశారు. రాజధాని నిర్మాణానికి 1500 ఎకరాలు చాలని పవన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు.. '1500 ఎకరాల్లో కూడా కట్టొచ్చు. కానీ ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు దక్కవు. మీరంతా (మండలి సభ్యులు) మంచి ఇళ్లు కట్టుకోవాలి.. ప్రజలకు మంచి రాజధాని అక్కర్లేదా' అని ప్రశ్నించారు. 'ప్రతి నియోజకవర్గానికి రూ.25 కోట్లు సర్దానని పవన్ చేసిన ఆరోపణలూ అర్థరహితం. అవినీతిని నిర్మూలించాలంటే ముందు 1000, 500 నోట్లు రద్దు చేయాలని కేంద్రానికి నేను ప్రతిపక్షంలో ఉండగానే చెప్పాను. నాలుగేళ్లు మీకు (పవన్‌కు) మంచోడిగా కనిపించాను... ఇప్పుడు చెడ్డోడిని ఎందుకు అయ్యానో అర్థం కావట్లేదు. 6 మాటలు మాట్లాడితే నేను 3 అబద్ధాలు చెబుతానా? అలా చెబితే 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఉండగలిగేవాడినా? ఎర్రచందనం స్మగ్లర్లపై మేం పోరాడినట్లు ఎవరైనా పోరాడారా? నిరసన వ్యక్తం చేస్తూ స్వయంగా జయలలితే లేఖ రాసింది. అయినా ఆగేది లేదని ఆమెకు స్పష్టం చేశాం. తమిళనాడులో నాకు వ్యతిరేకంగా పోస్టర్లు వేశారు. 2004-2014 కాలంలో ఎర్రచంద్రనం విక్రయాల ద్వారా రూ.69 కోట్లు వచ్చాయి. మేం వచ్చాక నాలుగేళ్లలో రూ.1231 కోట్లు వచ్చాయి' అని చెప్పారు. 'నా భార్య 25 ఏళ్ల నుంచి వ్యాపారరంగంలో కష్టపడుతోంది. నా కుటుంబాన్ని క్రమశిక్షణలో ఉంచుతున్నాను. రాజకీయ నాయకులు ఆస్తుల వివరాలు వెల్లడించాలని ఎథిక్స్ కమిటీని 1998లో తీసుకొచ్చిందే నేను. ఎనిమిదేళ్ల నుంచి నా కుటుంబ సభ్యుల ఆస్తులు ప్రకటిస్తున్నాను. నాపై ఇప్పటికి 26 ఎంక్వైరీలు వేశారు. ఏమీ లేదు కాబట్టే ఏమీ తేలలేదు. నిప్పులాగా బతికాను' అని తెలిపారు.

నీరవ్.. విజయసాయిరెడ్డి.. గాలి!

- ఏం సంకేతాలు పంపిస్తున్నారు: సీఎం

'నీరవ్ మోదీ దర్జాగా దేశం విడిచి వెళ్లిపోయాడు. విజయసాయిరెడ్డి ప్రధానమంత్రి కార్యాలయంలో తిరుగుతున్నారు. గాలి జనార్దన్‌రెడ్డి వంటివారు స్వేచ్ఛగా సంచరిస్తున్నారు. వీరి ద్వారా ఏం సంకేతాలు ఇస్తున్నారు' అని చంద్రబాబు ప్రశ్నించారు. శుక్రవారం టీడీపీ ఎంపీలతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ఈ ప్రస్తావన వచ్చింది. 'ప్రధాని కార్యాలయం పవిత్రమైందని, అక్కడ ఏ1, ఏ2 నిందితులకు ఏం పని? అవిశ్వాసం పెట్టి ఎంపీలతో రాజీనామా చేయిస్తే ఆ పేరుతో హోదా ఇచ్చి హీరోలా చేస్తామని జగన్‌కు ఆశ చూపించారు. ఆమరణ దీక్ష చేస్తే ఆయన వల్లే వచ్చిందని చెప్పి హోదా ఇస్తామని పవన్‌ను మభ్యపెట్టారు. నాలుగేళ్లలో నాకు వ్యతిరేకంగా మాట్లాడని పవన్ ఇప్పుడు ఆకస్మికంగా ఈ స్థాయిలో విరుచుకు పడడానికి కారణం ప్రజలకు అర్థమైంది. ఆయన స్క్రిప్టు ఎక్కడ తయారైందో కూడా తెలిసింది' అని అన్నారు.

మీతో చాలు... ఇక చెల్లు!

- ఎన్డీయేకు తెలుగుదేశం కటీఫ్
- బీజేపీతో బంధం తెగదెంపులు
- చంద్రబాబు మెరుపు నిర్ణయాలు
- కేంద్రంపై సొంతంగా అవిశ్వాస సమరం

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రంపై పోరులో తెలుగుదేశం జోరు పెంచింది. మెరుపులాంటి నిర్ణయాలతో ఢిల్లీ స్థాయిలో వేడి పుట్టించింది. వైసీపీ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి జాతీయ స్థాయిలో పెద్దగా స్పందన కనిపించకపోవడం... అదే సమయంలో, వైసీపీ ప్రధాని కార్యాలయంతో సంబంధాలు కొనసాగిస్తున్నట్లు స్పష్టం కావడంతో తెలుగుదేశం అప్పటికప్పుడు వ్యూహం మార్చింది. ఎన్డీయే నుంచి బయటికి వస్తున్నట్లు శుక్రవారం సాయంత్రం పొలిట్‌బ్యూరో సమావేశంలో అధికారికంగా ప్రకటించాలని తొలుత భావించినా... దానిని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ముందుకు జరిపారు. శుక్రవారం ఉదయాన్నే పార్టీ ఎంపీలు, ముఖ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అందులోనే కటీఫ్ నిర్ణయం తీసుకున్నారు. దానిని అధికారికంగా ప్రకటించాలని ఎంపీలకు చెప్పారు. ఆ వెంటనే టీడీపీ తరపున అవిశ్వాసం నోటీసు ఇవ్వాలని నిర్ణయించారు.

తొలుత వైసీపీ ఇచ్చే అవిశ్వాసం నోటీసుకే మద్దతు పలకాలని టీడీపీ నిర్ణయించుకుంది. ఎన్డీయే నుంచి ఇంకా బయటకు రానందువల్ల సొంతంగా అవిశ్వాసం ప్రతిపాదించడం సరికాదని భావించింది. అయితే... వైసీపీ ఇచ్చే నోటీసుకు చాలినంత మంది మద్దతు ఇస్తారా అనే అంశంపై చర్చ జరిగింది. ఇవన్నీ లెక్క వేసుకొన్న చంద్రబాబు వైసీపీ నోటీసుతో పెద్దగా ఉపయోగం లేదనే నిర్ణయానికి వచ్చారు. కేంద్రంపై ఒత్తిడి పెంచాలంటే చాలినంత మంది ఎంపీల మద్దతు కూడగట్టి అవిశ్వాసం నోటీసును సభలో చర్చకు తేవాల్సిన అవసరం ఉందని నిర్ణయించుకొన్నారు. అనుకొన్న వెంటనే పార్టీ ఎంపీలతో మాట్లాడి... ఎన్డీయేతో కటీఫ్ నిర్ణయం తీసుకుని, అవిశ్వాసం నోటీసును స్పీకర్‌కు ఇప్పించారు. ఈ వార్త ప్రకంపనలు సృష్టించింది. జాతీయ మీడియాలో శుక్రవారం ఇదే పెద్ద వార్తాంశం అయింది. టీడీపీ ఇచ్చిన నోటీసుకు మద్దతు ఇచ్చేందుకు చాలా పార్టీలు ముందుకొచ్చాయి. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఆప్, ఎస్పీ, బీఎస్పీ, తృణమూల్ వంటి పార్టీలు వరుసగా మద్దతు ప్రకటించాయి. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలుగా ఉన్న శివసేన, అకాలీదళ్ కూడా కలిసి రావడం విశేషం. టీడీపీ ఎంపీలు మద్దతు కోరుతూ తమ వద్దకు రాగానే ఆ పార్టీల ఎంపీలు సంతకాలు పెట్టేశారు. ఇన్ని పార్టీలు మద్దతు ప్రకటిస్తూ సంతకాలు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. "జాతీయ స్థాయిలో చంద్రబాబుకు ఉన్న ప్రతిష్ఠకు ఇది అద్దం పట్టింది. ఆయనకు ఉన్న పలుకుబడిని అంగీకరించక తప్పదు" అని స్వయానా బీజేపీ నేతలే వ్యాఖ్యానించారు. అవిశ్వాసానికి ఇంతమంది మద్దతు ఇస్తారని తాము ఊహించలేదని తెలిపారు.

వైసీపీ సంగతి ఇలా...

వైసీపీ కొన్నిరోజులుగా అవిశ్వాసం అంటున్నా... వారికి ఇతర పార్టీలకు చెందిన ఒక్క ఎంపీ మద్దతు కూడా దక్కలేదని టీడీపీ నేతలు చెబుతున్నారు. "ప్రధానమంత్రి కార్యాలయం చుట్టూ తిరుగుతూ, వారితో రహస్య ఒప్పందాలు చేసుకుని.. అది కప్పిపుచ్చుకోవడానికే అవిశ్వాసాన్ని వైసీపీ తెరపైకి తెచ్చిందని జాతీయ పార్టీలు కూడా పసిగట్టాయి. మేం అవిశ్వాసం పెట్టగానే పలు పార్టీలు, పెద్ద సంఖ్యలో ఎంపీలు స్వచ్ఛందంగా అవిశ్వాసానికి మద్దతిచ్చాయి" అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు పేర్కొన్నారు. బీజేపీ-వైసీపీల కుమ్మక్కు చూసే తాము సొంతంగా అవిశ్వాస తీర్మానం పెట్టామని మంత్రులు కేఈ కృష్ణమూర్తి, అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

ఏం జరుగుతుంది...

'సభ ఆర్డర్‌లో లేదు' అంటూ శుక్రవారం స్పీకర్ సుమిత్రా మహాజన్ అవిశ్వాస తీర్మానం నోటీసులను పరిగణనలోకి తీసుకోలేదు. సభను సోమవారానికి వాయిదా వేశారు. అయితే... ఇన్ని పార్టీలు అవిశ్వాసానికి మద్దతు ఇస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించి సంతకాలు చేయడంతో స్పీకర్‌పై ఒత్తిడి పెరుగుతుందని, దానిని చేపట్టక తప్పని పరిస్థితి ఏర్పడుతుందని టీడీపీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

నువ్వా.. నేనా..?

(మొదటి పేజీ తరువాయి)

అంటూ హల్‌చల్ సృష్టిస్తూనే... మరోవైపు పీఎంవోతో రాయ'బేరాలు' సాగిస్తోందంటూ... టీడీపీ హఠాత్తుగా కీలక నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ఉదయమే ఎన్డీయేకు కటీఫ్ చెప్పి... తానే సొంతంగా అవిశ్వాసం ప్రకటించింది. ఇది జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. మోదీ అంటే మండిపడుతున్న అనేక పార్టీలు తెలుగుదేశానికి మద్దతు ప్రకటించాయి. అవిశ్వాసానికి సై అంటే సై అన్నాయి. దీనిపై లోక్‌సభలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. తొలుత... స్పీకర్ సుమిత్రా మహాజన్ టీడీపీ నేత తోట నరసింహం, వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ఇచ్చిన నోటీసుల గురించి సభకు తెలియచేశారు. వెంటనే టీడీపీ ఎంపీలు ఈ తీర్మానానికి మద్దతు తెలుపుతున్నట్లు తమ సీట్ల దగ్గర నిలబడి చేతులెత్తారు. అదే దారిలో వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఎస్పీ, ఆర్జేడీ, వామపక్షాల ఎంపీలూ నిల్చుని అవిశ్వాసానికి మద్దతుగా చేతులు ఎత్తారు. ఈ సమయంలో సోనియా గాంధీ కూడా నిల్చున్నారు. అవిశ్వాసానికి అండగా నిలిచే వారి సంఖ్య వంద దాటింది. ఈ విషయం స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. అంటే... తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. అయితే... అప్పటికే కావేరీ బోర్డు ఏర్పాటు కోసం అన్నా డీఎంకే ఎంపీలు, రిజర్వేషన్లపై అధికారాన్ని రాష్ట్రాలకే వదిలి వేయాలంటూ టీఆర్ఎస్ ఎంపీలు వెల్‌లోకి వచ్చిన నిరసన తెలుపుతున్నారు. దాంతో స్పీకర్ సభ సవ్యంగా (ఆర్డర్) ఉంటేనే తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకుని మద్దతుగా ఉన్నవారిని లెక్కిస్తానని చెప్పారు. వెల్‌లో ఉన్న సభ్యులు తమ తమ స్థానాలకు వెళ్లి కూర్చోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అయినా అన్నా డీఎంకే, టీఆర్ఎస్ సభ్యులు పట్టించుకోలేదు. దీంతో అవిశ్వాస తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదని స్పీకర్ ప్రకటించారు. అవసరమైనవారి కంటే ఎక్కువమంది మద్దతు ఉందని, దీనిని పరిగణనలోకి తీసుకోవాలని టీడీపీ, తృణమూల్, కాంగ్రెస్ సభ్యులు కోరినా ఆమె పట్టించుకోలేదు. శుక్రవారం సభ ప్రారంభంకాగానే... తాజా ఉప ఎన్నికల్లో గెలిచిన ముగ్గురు ఎంపీలు ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత దివంగతులైన మాజీ సభ్యులకు నివాళి అర్పించారు. ఆపై ఉగాది, ఆయా రాష్ట్రాల నూతన సంవత్సరాది సందర్భంగా స్పీకర్ శుభాకాంక్షలు తెలిపారు. అది పూర్తయిన వెంటనే టీడీపీ, వైసీపీ ఎంపీలు పోడియం చుట్టూ చేరి నిరసన మొదలుపెట్టారు. రిజర్వేషన్ల అంశంపై టీఆర్ఎస్, కావేరీ బోర్డు ఏర్పాటుపై అన్నా డీఎంకే, నీరవ్ మోదీ అంశంపై తృణమూల్, కేంద్రం తీరుకు వ్యతిరేకంగా ఆర్జేడీ ఎంపీలు వెల్‌లోకి వచ్చి నినాదాలిచ్చారు. అర నిమిషంలోనే స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత... స్పీకర్ అవిశ్వాస తీర్మానం చదివే సమయానికి అన్ని పార్టీల సభ్యులు తమ తమ స్థానాల్లోనే ఉన్నారు. అన్నాడీఎంకే, టీఆర్ఎస్ ఎంపీలు మాత్రమే వెల్‌లో ఆందోళన కొనసాగించారు. దీంతో హౌస్ ఆర్డర్‌లో లేదంటూ తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సభను సోమవారానికి వాయిదా వేశారు. అయితే... ఆ వెంటనే మరోమారు టీడీపీ మరో అవిశ్వాసం నోటీసును అందించింది. దీనిని సోమవారం సభ ముందుకు తేవాల్సి ఉంటుంది.

చంద్రబాబూ.. భేష్: మమత



కోల్‌కతా, మార్చి 16: ఎన్‌డీఏ నుంచి వైదొలుగుతూ టీడీపీ తీసుకున్న నిర్ణయాన్ని తృణమూల్ కాంగ్రెస్ స్వాగతించింది. దేశాన్ని పెద్ద విపత్తునుంచి కాపాడడానికి అన్ని పార్టీలూ ఏకమవ్వాల్సిన సమయమొచ్చిందని తృణమూల్ అధినేత, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం ట్వీట్ చేశారు.. "ఏ రాష్ట్ర ఇబ్బందులు వారివి. టీడీపీకీ కూడా కొన్ని అపరిష్కృత అంశాలున్నాయి. ఇప్పటిదాకా ఎన్‌డీఏ తో కలిసి ఉన్నారు. ఇపుడు ఓ మంచి ప్రయోజనం కోసం టీడీపీ తీసుకున్న నిర్ణయం సరైనదని నా అభిప్రాయం" అన్నారామె. చంద్రబాబుకు సంఘీభావం ప్రకటించడం ద్వారా మమత- మోదీ సర్కార్‌పై టీడీపీ పెట్టే అవిశ్వాసానికి మద్దతిస్తారని భావించవచ్చని పార్టీ వర్గాలంటున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు గళమెత్తినా మమత స్వాగతిస్తున్నారు.. గతంలో కేసీఆర్‌కు, కాంగ్రెస్‌కు ఆమె ఫోన్ చేసి మద్దతు ప్రకటించారు. బీజేపీకి వ్యతిరేకంగా కూటమి ఏర్పడాల్సిన అవసరం ఉందని గట్టిగా నమ్ముతున్న వ్యక్తి ఆమె.

2019లో బీజేపీకి 110 సీట్లు తగ్గుతాయ్: శివసేన



ముంబై, మార్చి 16: బీజేపీపై మిత్రపక్షం శివసేన మరోసారి ధ్వజమెత్తింది. గోరఖ్‌పూర్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఓటమిని బీజేపీ పొగరు, అహంకారానికి ఎదురైన పరాభవంగా అభివర్ణించింది. 2019 ఎన్నికల్లో బీజేపీకి లోక్‌సభలో కనీసం 110 సీట్లు తగ్గిపోతాయని పార్టీ పత్రిక సామ్నా సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 10 లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా తొమ్మిది చోట్ల బీజేపీ ఓడిపోయిందని గుర్తుచేసింది. బీజేపీ ఇప్పటికైనా పరిస్థితులను అర్థం చేసుకోవాలని, లేకపోతే ఆ పార్టీని ఏ 'చాణుక్యుడూ' కాపాడలేడని పేర్కొంది. ఎన్డీయే సర్కారుపై టీడీపీ, వైసీపీలు పెట్టిన అవిశ్వాస తీర్మానాలకు మద్దతిస్తారా అన్న ప్రశ్నకు.. "మాతో ఎవరూ మాట్లాడలేదు. మేమూ ఎవరితో మాట్లాడలేదు" అని శివసేన పార్లమెంటరీ పార్టీ నేత సంజయ్ రౌత్ బదులిచ్చారు. ఉద్ధవ్ టీడీపీ అధినేత చంద్రబాబుతో మాట్లాడారా అని అడగ్గా.. 'ఇప్పటివరకు లేదు' అని చెప్పారు.

మోదీ హవా తగ్గిపోతోంది: దేవెగౌడ



బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి నుంచి టీడీపీ వైదొలగడం ద్వారా ప్రధాని మోదీ హవా కుంచించుకుపోయే పరిస్థితి ఏర్పడిందని మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల విషయంలో మోదీ యూటర్న్ తీసుకున్నారన్నారు. శుక్రవారం ఆయన సొంత నియోజకవర్గం హాసన్‌లో మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్డీయేకు టీడీపీ గుడ్‌బై చెప్పిన నేపథ్యంలో జాతీయ రాజకీయాల్లో పెనుమార్పులు వస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు ప్యాకేజీ కల్పిస్తామని చెప్పే బీజేపీ టీడీపీతో జతకట్టిందని తెలిపారు. నాలుగేళ్లయినా హామీలు నెరవేర్చకపోగా.. ప్యాకేజీ కూడా వాయిదా వేస్తూ వచ్చిందని ఆరోపించారు. ప్రధాని మోదీ యూటర్న్ తీసుకోవడం.. సరికొత్త రాజకీయ కూటములకు అవకాశం ఇవ్వడమేనని తెలిపారు. నోట్ల రద్దు, జీఎస్టీతోనే మోదీకి ప్రజాదరణ తగ్గిందని, ఏపీకి ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో ఆయన హవా మరింత తగ్గిందని చెప్పారు.

చంద్రబాబుకు ములాయం ఫోన్

న్యూఢిల్లీ, మార్చి 16: సమాజ్‌వాదీ పార్టీ అధినేత ములాయం సింగ్ యాదవ్.. సీఎం చంద్రబాబుకు తన మద్దతు ప్రకటించారు. బీజేపీకి వ్యతిరేకంగా టీడీపీ ప్రవేశపెడుతున్న అవిశ్వాస తీర్మానానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు శుక్రవారం చంద్రబాబుకు ఫోన్ చేసి చెప్పారు.

ఆంధ్రాకు తీరని అన్యాయం: ఏచూరి

న్యూఢిల్లీ, మార్చి 16: మోదీ సర్కారు ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేసిందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు హోదా ఇవ్వకపోవడం దారుణమని, కేంద్రం ఏపీ ప్రజలను మోసగించిందని ధ్వజమెత్తారు. టీడీపీ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తున్నట్లు శుక్రవారం ట్విటర్‌లో పేర్కొన్నారు.

అవిశ్వాసానికి మద్దతు: సురవరం

న్యూఢిల్లీ, మార్చి 16:ఎన్డీయే సర్కారుపై టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తామని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి శుక్రవారమిక్కడ చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం ఏపీకి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. అవిశ్వాస తీర్మానాన్ని మంచి పరిణామంగా అభివర్ణించారు. ఇప్పటికైనా బీజేపీ కుటిలబుద్ధిని చంద్రబాబు అర్థం చేసుకున్నారన్నారు.

ఎవరు మద్దతిస్తారో చూద్దాం!: కేంద్రమంత్రి నక్వీ

న్యూఢిల్లీ, మార్చి 16: మోదీ సర్కారుపై టీడీపీ అవిశ్వాస తీర్మానానికి పార్లమెంటులో ఎవరు మద్దతిస్తారన్నదే ప్రధానమని కేంద్రమంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ అన్నారు. "ఇది ఎన్నికల ఏడాది. ప్రతి రాష్ట్రానికీ డిమాండ్లు, సమస్యలు ఉంటాయి. అలాంటి వాటిపై ఇప్పుడు మేం మాట్లాడడం సరికాదు. ఎన్నికలు రాబోయే ముందు పార్లమెంటులో ఇలాంటి రిహార్సల్స్ ఆనవాయితీ అయిపోయాయి" అని నక్వీ ఎద్దేవా చేశారు.

టీఆర్ఎస్ ఎటువైపు?

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మోదీ సర్కారుపై టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తామని దేశవ్యాప్తంగా అనేక పార్టీలు ప్రకటించాయి! మరి ఇటీవల చంద్రబాబు కంటే ముందే ప్రధానిపై, కేంద్ర ప్రభుత్వంపై ఫైర్ అయిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ పరిస్థితి ఏంటి? దేశానికి బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిందేమీ లేదని ఆరోపించడంతో పాటు మూడో కూటమి ఏర్పాటుకు సిద్ధమని ప్రకటించిన కేసీఆర్.. ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ సర్కారుపై టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి మద్దతిస్తారా? లేదా..? అంటే గందరగోళమే! టీఆర్ఎస్ నేతలు ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతుండడంతో అసలు అవిశ్వాసానికి మద్దతిస్తారా లేదా.. అనే విషయంపై స్పష్టత కొరవడింది. ఎన్డీయే కూటమి నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించిన టీడీపీ.. వెంటనే మోదీ సర్కారుపై అవిశ్వాస తీర్మానానికి నోటీసివ్వడంతో శుక్రవారం జాతీయ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ పరిస్థితుల్లో టీఆర్ఎస్ ఎటువైపు వెళుతుందనేది సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. అదేసమయంలో ఆ పార్టీ నేతలు రకరకాలుగా మాట్లాడుతున్నారు. మేం అవిశ్వాసానికి అనుకూలమూ కాదు, వ్యతిరేకమూ కాదని ఓ ఎంపీ చెప్పగా.. మద్దతిచ్చే ప్రసక్తే లేదని మరో ఎంపీ చెప్పడం గమనార్హం. ఇక ఆ పార్టీ ఎమ్మెల్సీ ఒకరు అవిశ్వాసంపై అధిష్ఠానానిదే నిర్ణయమని చెప్పారు. నేతల భిన్న ప్రకటనలతో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. టీఆర్ఎస్ ఎంపీ వినోద్ శుక్రవారం ఢిల్లీలో విలేకర్లతో మాట్లాడుతూ.. 'మేం అవిశ్వాసానికి అనుకూలం కాదు, వ్యతిరేకం కాదు. మా పార్టీ అధిష్ఠానం రిజర్వేషన్ల సమస్యలపై నిరసన తెలపమని ఆదేశించడంతోనే మేం వెల్‌లోకి వెళుతున్నాం. పార్టీ ఆదేశాలకు అనుగుణంగానే నడుచుకుంటున్నాం' అని చెప్పారు. మరోవైపు టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు హైదరాబాద్‌లో ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. అవిశ్వాసానికి మద్దతిచ్చే ప్రసక్తే లేదని చెప్పారు. "అవిశ్వాస తీర్మానానికి మద్దతిచ్చే ప్రసక్తే లేదు. ఇది కేవలం రాజకీయ గిమ్మిక్కు. అవిశ్వాస తీర్మానాన్ని గెలిచేంత బలం వారికుందా? ప్రత్యేక హోదాపై కేంద్రంతో చర్చలు జరపాలి. అవిశ్వాసానికి కారణమే కనిపించడం లేదు" అని కేకే పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు హోదా ఇవ్వాలన్న డిమాండ్‌కు మాత్రం మద్దతిస్తామన్నారు. టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ హైదరాబాద్‌లోని టీఆర్ఎస్ఎల్పీలో విలేకర్లతో మాట్లాడుతూ.. పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం చర్చకు వస్తే ఎటువైపు ఓటు వేయాలనే అంశంపై తమ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఇలా నేతలు తలో మాట చెప్పడంతో అసలు అవిశ్వాసంపై టీఆర్ఎస్ వైఖరేంటనేది ప్రశ్నార్థకంగా మారింది.

వెల్లువలా మద్దతు

టీడీపీతో కలిసి వచ్చిన అనేక పార్టీలు


న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ముందుకొచ్చిన చంద్రబాబుకు సంఘీభావం వెల్లువెత్తింది. ఎన్డీయే నుంచి వైదొలగుతున్నట్లు శుక్రవారం ఉదయం చంద్రబాబు ప్రకటించిన వెంటనే పలువురు జాతీయ నేతలు ఆయనకు ఫోన్లు చేశారు. చంద్రబాబు గతంలో జాతీయ స్థాయిలో ఫ్రంట్లకు కన్వీనర్‌గా కూడా వ్యవహరించి ఉండడంతో ఢిల్లీలో మరింత క్రియాశీల పాత్ర పోషించాలని కోరారు. టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తున్నామంటూ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు, సమాజ్‌వాదీ, డీఎంకే, జేడీఎస్, శివసేన, డీఎంకే, ఆర్జేడీ, ఆప్ బీఎస్పీ, అకాలీదళ్ తదితర పార్టీలు మద్దతు పలికాయి. మద్దతు కోరుతూ టీడీపీ ఎంపీలు తమ వద్దకు రాగానే ఆ పార్టీల ఎంపీలు సంతకాలు పెట్టేశారు. ఇన్ని పార్టీలు మద్దతు ప్రకటిస్తూ సంతకాలు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. "జాతీయ స్థాయిలో చంద్రబాబుకు ఉన్న ప్రతిష్ఠకు ఇది అద్దం పట్టింది. ఆయనకు ఉన్న పలుకుబడిని అంగీకరించక తప్పదు" అని స్వయానా బీజేపీ నేతలే వ్యాఖ్యానించారు. అవిశ్వాసానికి ఇంతమంది మద్దతు ఇస్తారని తాము ఊహించలేదని తెలిపారు. కాగా, సమాజ్‌వాదీ అధినేత ములాయం సింగ్ యాదవ్ ఫోన్ చేసి అవిశ్వాస తీర్మానానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ శుక్రవారం టీడీపీ ప్రముఖుడికి ఒకరికి ఫోన్ చేశారు. చంద్రబాబు క్రియాశీల పాత్ర తీసుకుంటే బీజేపీకి వ్యతిరేకంగా బలమైన ఫ్రంట్ నిర్మాణానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఎన్డీయే నుంచి వైదొలగాలన్న టీడీపీ నిర్ణయాన్ని స్వాగతించారు. బీజేపీకి వ్యతిరేకంగా అన్ని పార్టీలూ చేతులు కలపాలని ట్వీట్ చేశారు. ఇక, ఏపీకి ప్రత్యేక హోదాపై ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడం క్షమించరాని విషయమని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. టీడీపీ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తున్నట్లు ట్విటర్లో తెలిపారు. అలాగే, సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి కూడా టీడీపీ పెట్టే అవిశ్వాస తీర్మానానికి సంపూర్ణంగా మద్దతు ఇస్తామని ప్రకటించారు. టీడీపీ రాంరాం నేపథ్యంలో జాతీయ రాజకీయాల్లో పెను మార్పులు తథ్యమని జేడీఎస్ అధినేత దేవెగౌడ చెప్పారు. నోట్ల రద్దు, జీఎస్టీ, నల్లధనంపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇప్పటికే మోదీకి ప్రజాదరణ తగ్గిందని, ఏపీకి ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో ఆయన హవా మరింత తగ్గిందని చెప్పారు. ఇక, టీడీపీ అవిశ్వాసం తమిళనాట పతాక శీర్షికలకు ఎక్కింది. మోదీని ఢీకొట్టిన ఆదర్శ నేతగా బాబును డీఎంకే నేత స్టాలిన్ అభివర్ణించారు. టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని అన్నాడీఎంకేను కూడా డిమాండ్ చేశారు. కాగా, టీడీపీ పెట్టే అవిశ్వాసానికి ఏయే పార్టీలు మద్దతు ఇస్తాయో చూడాలని కేంద్ర మంత్రి నక్వీ వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు పార్లమెంటులో ఇలాంటి రిహార్సల్స్ ఆనవాయితీ అయిపోయాయని ఎద్దేవా చేశారు. కాగా, టీడీపీ ప్రవేశపెట్టే అవిశ్వాసానికి మద్దతు ఇస్తున్నట్లు శుక్రవారం ఉదయం అన్నాడీఎంకే అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. అంతలోనే ఆ పార్టీలో ముసలం బయల్దేరింది. సాయంత్రానికి ఏకంగా అధికార ప్రతినిధినే తొలగించారు. దాంతో, ప్రధాని మోదీ జోక్యంతోనే తనను తొలగించారని, పళనిస్వామి, పన్నీరు సెల్వం బండారం బయట పెడతానని బహిష్కృత అధికార ప్రతినిధి స్పష్టం చేశారు.

సేనతో బీజేపీ రాజీ?

- ఉద్ధవ్‌తో ఫడణవీస్ మంతనాలు

ముంబై, మార్చి 16: ఎన్‌డీఏ నుంచి వైదొలుగుతున్నట్లు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటిస్తున్న సమయంలోనే బీజేపీ వేగంగా పావులు కదిపింది. కొంతకాలంగా అసంతృప్తితో రగిలిపోతూ మోదీ పాలనపై తీవ్ర విమర్శనాస్త్రాలు సంధిస్తున్న మరో భాగస్వామ్య పక్షం- శివసేనను మంచి చేసుకునే ప్రయత్నాలు మొదలెట్టింది. చంద్రబాబు మీడియా సమావేశం జరిగిన కొద్దిసేపటికే - మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ హుటాహుటిన శివసేన అధినేత ఉద్ధవ్ ఠాకరేను సహ్యాద్రి గెస్ట్ హౌస్‌కు పిలిపించి ఏకాంతంగా చర్చలు జరిపినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అవిశ్వాసానికి మద్దతు ఇవ్వొద్దని, మోదీ ప్రభుత్వానికి బాసటగా నిలబడి సహకరించాలని ఫడణవీస్ -ఉద్ధవ్ ఠాకరేను అభ్యర్థించినట్లు శివసేన వర్గాలు తెలిపాయి. అయితే తాను ఉద్ధవ్‌ను ఎక్కడా కలవలేదని ఫడణవీస్ స్పష్టం చేశారు. శివసేనకు లోక్‌సభలో 18 మంది ఎంపీలున్నారు. వారంతా తమ వెంటే ఉంటారని బీజేపీ భావిస్తోంది. బీజేపీకి కటీఫ్ చెప్పేశామని, వచ్చే ఏడాది ఎన్నికల్లో స్వతంత్రంగానే పోటీకి దిగుతామని శివసేన కొంతకాలంగా చెబుతోంది. అయితే ఎన్‌డీఏ నుంచి మాత్రం వైదొలగలేదు. తాజా పరిణామాలతో శివసేన ఆత్మశోధనలో పడింది. తాము తుది నిర్ణయం తీసుకోలేదని మాత్రం బయటికి చెబుతోంది.





పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైసీపీ, టీడీపీ ఎంపీలు




యునైటెడ్ ఫ్రంట్ బలమెంత?

టీడీపీ: 16, ఎన్సీపీ : 6, ఎస్పీ: 7, బీఎస్పీ: 0, టీఎంసీ: 34, బీజేడీ: 20, డీఎంకే: 0, జేకేఎన్‌సీ: 1, ఐఎన్ఎల్‌డీ: 2, ఏజీపీ: 0, ఆప్: 4

మొత్తం: 90

లోక్‌సభ మొత్తం స్థానాలు 545



11 పార్టీలతో బాబు యునైటెడ్ ఫ్రంట్!

- ఇప్పటికే ఏర్పాటు చేశారు.. ఏప్రిల్‌లో ప్రకటన
- మహానాడు అనంతరం కూటమి తొలిసభ
- రిపబ్లిక్ టీవీ సంచలన కథనం

న్యూఢిల్లీ, మార్చి 16: ఎన్డీయే నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు.. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని సవాల్ చేసేందుకు 11 పార్టీలతో యునైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేసినట్టు రిపబ్లిక్ టీవీ ఒక కథనాన్ని ప్రసారం చేసింది. వచ్చే నెలలో అమరావతిలో జరిగే మహానాడులో ఈ కూటమి గురించి చంద్రబాబు ప్రకటిస్తారని అందులో పేర్కొంది. నిజానికి ఇదంతా ఎన్డీయే నుంచి బయటికొచ్చాక జరిగింది కాదని.. గత కొంతకాలంగా చంద్రబాబు దేశవ్యాప్తంగా పలు ప్రాంతీయ పార్టీల నాయకులతో ఫోన్‌లో మంతనాలు జరుపుతున్నారని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రిపబ్లిక్ టీవీ పేర్కొంది. బాబు మంతనాలు జరిపిన నేతల్లో శరద్‌పవార్ (నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ), అఖిలేశ్ యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), మాయావతి (బహుజన్ సమాజ్ వాదీ పార్టీ), మమతా బెనర్జీ (తృణమూల్ కాంగ్రెస్), నవీన్ పట్నాయక్ (బిజూ జనతాదళ్), ఎంకే స్టాలిన్ (డీఎంకే), ఫరూక్ అబ్దుల్లా (జమ్ము కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్), ఓం ప్రకాశ్ చౌతాలా (ఇండియన్ నేషనల్ లోక్ దళ్), అరవింద్ కేజ్రీవాల్ (ఆమ్ ఆద్మీ పార్టీ) తదితరులున్నారు. మహానాడులో ప్రకటన అనంతరం ఏప్రిల్ 7న.. యునైటెడ్ ఫ్రంట్ తొలి సభ జరుగుతుందని కూడా రిపబ్లిక్ టీవీ తన కథనంలో తెలిపింది.



ఎన్‌డీఏతో టీడీపీ తెగదెంపులపై తమిళ పత్రికల్లో పతాక శీర్షికలు

తమిళ మీడియాలో తెలుగుదేశం

- టీడీపీ వైదొలగడంపై తమిళ మీడియాలో ప్రశంసల వర్షం
- బాబును చూసైనా బుద్ధి తెచ్చుకోండి: స్టాలిన్

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):ఎన్‌డీఏ నుంచి టీడీపీ వైదొలగడం, కేంద్ర ప్రభుత్వంపై ఆ పార్టీ అవిశ్వాసం పెట్టడంతో ప్రకంపనలు మొదలయ్యాయంటూ తమిళనాడులోని సాయంకాలం పత్రికలు, చానళ్లు పతాక శీర్షికల్లో కథనాలు ప్రచురించాయి. ప్రధాని నరేంద్రమోదీని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టిగా ఢీకొట్టారంటూ కొనియాడింది. ఇతర రాష్ట్రాల వ్యవహారాలను ఎప్పుడూ అంతగా పట్టించుకోని తమిళమీడియా.. 'టీడీపీ ఆగ్రహం' గురించి మాత్రం పతాకశీర్షికల్లో ప్రచురించడం విశేషం. తమిళులకు అనేక విధాల అన్యాయం చేస్తున్న మోదీ ప్రభుత్వంపై .. చంద్రబాబులా తిరగబడటానికి ఇదే తరుణమని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. తన రాష్ట్ర హక్కుల కోసం బీజేపీ ప్రభుత్వాన్ని ఢీకొట్టిన చంద్రబాబును చూసి ఈపీఎస్, ఓపీఎస్‌లు బుద్ధి తెచ్చుకోవాలని డీఎంకే కార్యాచరణ అధ్యక్షుడు స్టాలిన్ ఘాటుగా హితవు పలికారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని అన్నాడీఎంకే ఎంపీలను ఆయన కోరారు. కర్ణాటకలో ఎన్నికల కారణంగానే, కావేరీ జలాల్లో అధికభాగం ఆ రాష్ట్రానికి ఇవ్వాలని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని స్టాలిన్ ఆరోపించారు. "కావేరీ విషయంలో తమిళనాడును మోదీ ప్రభుత్వం వంచించింది. ఈ విషయంలో చంద్రబాబులా కేంద్రాన్ని నిలదీసే సత్తా ఈపీఎస్-ఓపీఎస్‌లకు ఉందా? చంద్రబాబుకున్న రోషంలో కొద్దిపాటి అయినా ఈ ఇద్దరు నేతలకు ఉంటే రాష్ట్ర హక్కుల్ని సాధించుకోవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. కాగా, ఎన్డీఏ నుంచి తెలుగుదేశం పార్టీ వైదొలగడంతో బీజేపీ ప్రభుత్వం కేంద్రం ఒకే ఒక్క ఎంపీ మెజారిటీతో మాత్రమే మనగలుగుతోందని ఎండీఎంకే అధినేత వైగో అన్నారు. "కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అత్తెసరు మెజారిటీతో కొనసాగుతోంది. కేవలం అన్నాడీఎంకేకు చెందిన 37 మంది ఎంపీల బలంతోనే మోదీ ప్రభుత్వం ధైర్యంగా ఉంది. ఆ ప్రభుత్వం మెడలు వంచేందుకు ఇదే సరైన సమయం. ఇన్నాళ్లూ కావేరీ జలం విషయంలో మనల్ని వంచించి, కర్ణాటక రాష్ట్రానికి న్యాయం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేసింది. వాటిని తిప్పికొట్టే తరుణమొచ్చింది. మోదీ ప్రభుత్వం మెడలు వంచి కావేరీ జలం మనకు పుష్కలంగా తీసుకురండి. కావేరి నిర్వాహక మండలి ఏర్పాటునకు ఒత్తిడి చేయండి" అంటూ అన్నాడీఎంకే ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

అవిశ్వాసం.. బీజేపీకి భయం?

టీడీపీకి పెరుగుతున్న మద్దతు.. మోదీ తీరుపై సొంత ఎంపీల్లోనే అసంతృప్తి

- అవిశ్వాసం పెడితే గైర్హాజరవుతారని సందేహం
- తీర్మానం చర్చకు రాకుండా చేసేందుకే వ్యూహాలు?

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): లోక్ సభలో టీడీపీ ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరపడానికి భారతీయ జనతా పార్టీ భయపడుతోందా? విశ్వసనీయ వర్గాలు ఈ ప్రశ్నకు అవుననే సమాధానమే ఇస్తున్నాయి. టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపేందుకు తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాది సహా అనేక పార్టీలు ముందుకొచ్చాయి. ఆఖరుకు కాంగ్రెస్ పార్టీ సైతం మద్దతు పలికింది. మరోవైపు అకాలీదళ్ కూడా తెలుగుదేశంతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతోంది. ఎన్డీయేకు మద్దతు ఉపసంహరణ విషయంపై తాము రాజకీయంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, అయితే తెలుగుదేశంతో సంఘీభావం ప్రకటిస్తున్నామని అకాలీదళ్ నేత నరేశ్ గుజ్రాల్ తెలిపారు. ఇక తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ చంద్రబాబుతో మాట్లాడారు. తాము టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపామని టీఎంసీ నేత దినేశ్ త్రివేదీ చెప్పారు. సమాజ్ వాది పార్టీ నేత రాంగోపాల్ యాదవ్ పార్లమెంట్ సెంట్రల్ హాలు నుంచి చంద్రబాబుతో మాట్లాడారు. లోక్‌సభలో బీజేపీ సంఖ్యాబలం 274 కాగా.. కాంగ్రెస్ సహా మిగతా పక్షాల బలం 265. అంటే బీజేపీకి, బీజేపీయేతర పార్టీలకూ మధ్య 9 మంది సభ్యుల తేడా మాత్రమే ఉంది. ఎన్డీయేలో ఉన్నప్పటికీ శివసేన బీజేపీపై ఆగ్రహంతో ఉంది. బిహార్‌లో నితీశ్‌కుమార్‌తో బీజేపీ చెలిమిపై లోక్ జనశక్తి, రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ కూడా అసంతృప్తితో ఉన్నాయి. బీజేపీలో సైతం పలువురు ఎంపీలు పార్టీ తీరుపట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. విప్ జారీ చేసినా బీజేపీ ఎంపీలు పూర్తిస్థాయిలో వచ్చే పరిస్థితి కనపడడం లేదు. అందువల్ల ఇప్పుడు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే మోదీ పని తీరు పట్ల వ్యతిరేకంగా ఉన్న ఎంపీలంతా ఏకమవుతారని, తీర్మానం వీగిపోయేలా చేయడానికి తీవ్రంగా కష్టపడాల్సి వస్తుందని అమిత్ షా, మోదీ భావిస్తున్నట్లు సమాచారం. అందుకే అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా చేసేందుకే బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎన్ని మిగిలేను?

నాలుగేళ్ల క్రితం సార్వత్రిక ఎన్నికల సమయంలో బీజేపీ వెంట 46 మిత్రపక్షాలు ఉండేవి. వాటిలో 17 రిజిస్టర్డ్ పార్టీలు ఉన్నాయి. వీటిలో 34 పార్టీలకు ఒక్క సీటు రాలేదు. ఎన్నికల తర్వాత కేవలం 12 మిత్రపక్షాలే మిగిలాయి. అవి.. శివసేన (18మంది ఎంపీలు), తెలుగుదేశం (16), లోక్ జనశక్తి పార్టీ(6), అకాలీదళ్(4), రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ(3), అప్నా దళ్(2). ఏఐఎన్ఆర్‌సీ, జేకేపీడీపీ, ఎన్‌పీపీ, పీఎంకే, ఎస్‌డీఎఫ్, స్వాభిమాని పక్ష పార్టీలకు ఒక్కొక్క సీటు చొప్పున ఉన్నాయి. తాజాగా జనతా దళ్ (2) ఎన్డీఏలో చేరింది. అయితే, శివసేన ఇప్పటికే బీజేపీతో తెగతెంపులు చేసుకుంటామని ప్రకటించింది. 2014లో మహారాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ మెజారిటీ స్థానాలు సంపాదించుకున్నప్పటి నుంచి తన మిత్రపక్షమైన శివసేనను విస్మరించడమే ఇందుకు కారణం. అకాలీదళ్ కూడా బీజేపీని వదులుకోవాలని ఇప్పటికే నిర్ణయించింది. బిహార్‌లో జేడీ(యు)తో చేతులు కలిపినప్పటి నుంచీ లోక్ జనశక్తి పార్టీకి, బీజేపీకి మధ్య విభేదాలు పొడసూపుతున్నాయి. కేంద్ర మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ 2019లో ఎవరితోనైనా చేతులు కలిపే అవకాశాలున్నాయి. బిహార్ మాజీ ముఖ్యమంత్రి, హిందుస్థాన్ అవామీ మోర్చా నేత జితన్‌రాం మాంఝీ ఇప్పటికే బీజేపీతో తెగతెంపులు చేసుకున్నారు. బిహార్‌లో బీజేపీతో చేతులు కలిపిన మరో మిత్రపక్షం ఆర్ఎల్ఎస్‌పీ కూడా నితీశ్ కుమార్ ఎన్డీయేలో చేరినప్పటి నుంచీ ఇబ్బందిగా ఫీలవుతోంది. ఈ పరిస్థితులు చూస్తుంటే ఎన్డీయేకి వ్యతిరేకంగా బిహార్‌లో మహా కూటమి ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. కశ్మీర్‌లోనూ పీడీపీకి, బీజేపీకి మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి.

మిత్రపక్షాలు అక్కర్లేదు: బీజేపీ

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ వ్యవహారశైలి కారణంగా.. వచ్చే ఎన్నికల నాటికి టీడీపీ, అకాలీదళ్, శివసేన, లోక్ జనశక్తి, రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ వంటి ప్రధాన పార్టీలు పోతే జేడీయూ, ఒక్కో సభ్యుడున్న పీఎంకే, నేషనల్ పీపుల్స్ పార్టీ లాంటి పార్టీలే ఎన్డీయేలో మిగులుతాయి. ఫలితంగా 2019 నాటికి బీజేపీ పూర్తిగా ఏకాకిగా పోటీచేసే పరిస్థితి ఏర్పడుతుందని స్పష్టమవుతోంది. ఈ ముప్పును బీజేపీ పట్టించుకునే స్థితిలో లేనట్టు కనిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు. బీజేపీ నేతలు మాత్రం.. దక్షిణాదిన తమ పార్టీ విస్తరించడానికి ఇదే సమయమని భావిస్తున్నామని అంటున్నారు. "ఇప్పుడు బీజేపీకి మిత్రపక్షాల అవసరం లేదు. భవిష్యత్తులోనూ ఎవరితోనూ అవసరం లేకుండా విస్తరించడమే మా లక్ష్యం" అని బీజేపీ సీనియర్ నాయకుడొకరు తాజా పరిణామాల నేపథ్యంలో వ్యాఖ్యానించడం ఇందుకు నిదర్శనం. 1999లో వాజపేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో పడిపోయిన తర్వాత మిత్రపక్షాల అవసరాన్ని బీజేపీ గ్రహించింది. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక పద్ధతి ప్రకారం బీజేపీ ఉత్తర, మధ్య, పశ్చిమ భారత్‌లలో విస్తరించింది. తమంతట తాము విస్తరించడం, ప్రత్యర్థులను బలహీనం చేయడం బీజేపీ అనుసరించే వ్యూహాలు. ఈ క్రమంలోనే.. మోదీ మిత్రపక్షాలను పట్టించుకోవట్లేదని విశ్లేషకులు అంటున్నారు.

బిహార్‌కు హోదాపై స్వరం పెంచిన జేడీయూ

- సీరియస్‌గా పరిశీలించాలని కేంద్రానికి వినతి
- నితీశ్‌తో మోదీయే అనిపిస్తున్నారా?

న్యూఢిల్లీ, మార్చి 16: ప్రత్యేక హోదా, నిధుల విడుదల కోరుతూ కేంద్రంపై అవిశ్వాస తీర్మానానికి టీడీపీ సిద్ధమవుతున్న తరుణంలో బిహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలన్న నినాదాన్ని జేడీయూ మరింత బలంగా వినిపించడం ప్రారంభించింది. తమ డిమాండ్ ఎప్పటినుంచో ఉన్నదని, కేంద్రం దీనిని సీరియస్‌గా తీసుకోవాలని జేడీయూ పక్ష నేత కేసీ త్యాగి కోరారు. జేడీయూ కూడా ఎన్‌డీఏలో భాగస్వామ్య పక్షం. "మా నాయకుడు నితీశ్‌కుమార్ ఇంతకుముందే పలుమార్లు ప్రత్యేక హోదా గురించి ప్రస్తావించారు. అయినా కేంద్రం నిరాకరిస్తూ వచ్చింది. ప్రత్యేక హోదా కోసం మేం మా పోరాటాన్ని కొనసాగిస్తాం" అని త్యాగి శుక్రవారం మీడియాతో అన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్‌తో బంధాన్ని తెంచుకుని బీజేపీతో జట్టుకట్టిన తరువాత చాలా కాలంగా జేడీయూ ఈ ప్రస్తావనే తేలేదు. కానీ టీడీపీ, వైఎస్ఆర్‌సీ, కాంగ్రెస్ పార్టీలు దీనిపై పోరాడుతుండడంతో నితీశ్ దీనిని మళ్లీ తెరపైకి తెచ్చారు. ఆయనను మోదీయే నడిపిస్తున్నారన్న విమర్శలూ లేకపోలేదు. నితీశ్ కూడా ఈ డిమాండ్‌ను మొదలెడితే ఏపీ నేతల డిమాండ్ నీరుగారుతుందని మోదీ భావిస్తున్నారని, ఇది బీజేపీ ఆడిస్తున్న నాటకమని ఢిల్లీ వర్గాలంటున్నాయి.


అన్నాడీఎంకేలో ముసలం!

- మోదీ సర్కారుపై టీడీపీ అవిశ్వాసానికి పార్టీ అధికార ప్రతినిధి మద్దతు
- కేసీ పళనిసామిపై వెంటనే బహిష్కరణ వేటు వేసిన నాయకత్వం

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు అధికార అన్నాడీఎంకేలో ముసలం పుట్టింది. నరేంద్రమోదీ ప్రభుత్వంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తామని ఆ పార్టీ సీనియర్ నేత, అధికార ప్రతినిధి కేసీ పళనిస్వామి ప్రకటించడం దీనికి కారణమైంది. ఆయన ప్రకటన చేసిన మరుక్షణమే పార్టీ నుంచి ఆయనను బహిష్కరిస్తూ అన్నాడీఎంకే నాయకత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే తనపై వేటు వేయడాన్ని కేసీ పళనిస్వామి గర్హించారు. ముఖ్యమంత్రి ఈపీఎస్, ఉపముఖ్యమంత్రి ఓపీఎస్‌ల బండారం శనివారం బయటపెడతానని హెచ్చరించారు. పార్టీలో చీలిక రాబోతోంటూ.. అధికార పక్షంలో కలకలం రేపారు. నిజానికి, కేసీ పళనిస్వామి అన్నాడీఎంకేలో సీనియర్ నాయకుడు. ఎంజీఆర్ హయాం నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. జయలలిత మృతి తర్వాత పార్టీ రెండు వర్గాలుగా చీలినప్పుడు, పన్నీర్ సెల్వం వర్గంలో ముఖ్య నేతగా వ్యవహరించారు. గతంలో ఎంపీగా పనిచేసిన ఆయన, ప్రస్తుతం పార్టీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. శుక్రవారం ఉదయం ఓ ప్రైవేటు టీవీ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన కేసీ.. కావేరి మండలి ఏర్పాటుపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఈపరిస్థితుల్లో.. టీడీపీ ముందుకుతెచ్చిన అవిశ్వాస తీర్మానానికి అన్నాడీఎంకే మద్దతివ్వక తప్పదని అన్నారు. దీంతో కంగుతిన్న ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. కేసీ పళనిస్వామిని పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించారు. అయితే, తనను బహిష్కరించే అధికారం ఓపీఎస్, ఈపీఎస్‌లకు లేదని కేసీ పళనిస్వామి ఆగ్రహించారు. వీరి బండారాన్ని బయటపెడతానని హెచ్చరించారు. ప్రధాని మోదీకి భయపడే.. తనను తొలగించారని ఆరోపించారు.

పీఎంవోలో ఏ1, ఏ2

ఎందుకు వీరి దొంగాటలు.. ఇలాంటి వాళ్లతో మేం వెళ్లడమా?.. అందుకే సొంతంగా అవిశ్వాసం



- దీని నుంచి తప్పించుకోలేరు
- మోదీని పవన్ ఎందుకు ప్రశ్నించరు?
- రాష్ట్రంపై, టీడీపీపై మహా కుట్ర
- జాతీయ రాజకీయాల్లోకి వెళ్లను
- చంద్రబాబు స్పష్టీకరణ

అమరావతి, మార్చి 16, (ఆంధ్రజ్యోతి): 'అవినీతి కేసుల్లో ఏ-1, ఏ-2లుగా ఉన్న వారిని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) ఎలా అనుమతిస్తోంది? దీనిపై పీఎంవో అయినా సమాధానం చెప్పాలి. వైసీపీ అయినా బదులివ్వాలి' అని తెలుగుదేశం అధిపతి, ముఖ్యమంత్రి చంద్రబాబు డిమాండ్ చేశారు. రాజకీయాల్లో నిర్ణయం తీసుకుంటే ధైర్యంగా వెళ్లాలని... ఈ దొంగాటలు ఎందుకని నిలదీశారు. శుక్రవారం చంద్రబాబు మీడియాతో కొద్దిసేపు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. జనసేన అధ్యక్షుడు పవన్ వైఖరిని తప్పుపట్టారు. 'రాష్ట్రానికి సాయం రావాల్సినప్పుడు దానిగురించే కేంద్రాన్ని అడగాలి. పవన్ కల్యాణ్ నిజనిర్ధారణ కమిటీ వేశారు. దానికి వివరాలిచ్చాం. రాష్ట్రానికి మొత్తం 75,500 కోట్లు రావాలని వాళ్ల కమిటీయే తేల్చింది. కానీ, దానిపై ప్రధానిని ఒక్క మాటైనా అడిగారా? ఎందుకీ డొంకతిరుగుడు? రాష్ట్రంకోసం పోరాడే నన్ను బలహీనం చేసేలా మాట్లాడడమేంటి?' అని ప్రశ్నించారు. గుంటూరులో అతిసార బాధితుల వద్దకు గురువారమే మంత్రులను పంపించామని... బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించామని చెప్పారు. ఇక... ఎర్రచందనంపై తమలాగా ఎవరు పోరాడారని ప్రశ్నించారు. రాష్ట్రంపైన, తెలుగుదేశం పైన మహా కుట్ర జరుగుతోందని చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్రం తమిళనాడు తరహా రాజకీయాలను ఇక్కడ చేయాలనుకుంటోందని మరోసారి ఆరోపించారు. 'జయలలిత ఉన్నప్పుడు ఈయన ప్రతిసారీ అక్కడకు వెళ్లేవా రు. నన్ను చూస్తే మాత్రం అలుసేంటి? కేంద్ర ప్రభుత్వం నాయకులను మేనేజ్ చేయగలదేమో కానీ ప్రజలను మేనేజ్ చేయలేద'ని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు చంద్రబాబు ఇచ్చిన సమాధానాలివి...

కేంద్రంపై మీరే అవిశ్వాసం పెట్టాలని ఎందుకు నిర్ణయించుకున్నారు?

పీఎంవోలో కూర్చున్న వాళ్ల వెనుక మేమెందుకు వెళతాం? పొత్తులో ఉన్నందున అవిశ్వాసం పెట్టడం సరికాదనుకున్నాం. శుక్రవారం ఉదయమే పొత్తు తెంచుకుని బయటకు వచ్చాం. ఆ వెంటనే అవిశ్వాసం పెట్టాం!

మీ అవిశ్వాసానికి ఎవరెవరు మద్దతిచ్చారు?

మండలిలో చేయాల్సిన ప్రసంగంపై, ఇతర సమావేశాలపైనా దృష్టి పెట్టాను. ఇంకా ఎవ్వరితో మాట్లాడలేదు. ఇప్పుడు పొత్తు కూడా లేదు కాబట్టి ఎవరితోనైనా మాట్లాడొచ్చు!

జాతీయ రాజకీయాల్లోకి వెళ్తారా?

ఈ ప్రశ్నకు ఇప్పటికే చాలాసార్లు జవాబు చెప్పాను. ఏపీని రోల్‌మోడల్‌గా అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. బీజేపీతో పొత్తు తెంచుకోవడం, అవిశ్వాసం కూడా విధిలేని పరిస్థితుల్లో తీసుకున్న నిర్ణయం.

అవిశ్వాసం సభ ముందుకు వస్తుందా?

55 మంది సంతకాలు పెట్టిన తర్వాత తప్పించుకోలేరు. ఒకవేళ సభలో గందరగోళం ఉందని చెప్పి ఆ తీర్మానం తీసుకోకపోతే ఇంకా బలహీనం అవుతారు. ఒకదశకు వచ్చేవరకే ఏం చేసినా చెల్లుతుంది. ఇంతమంది కలిసి అవిశ్వాసం ఇచ్చాక వారు తీసుకోకపోతే భయపడినట్లే అని చెప్పారు.

ఈ పోరాటాన్ని ఎలా కొనసాగిస్తారు?

రాష్ట్రానికి అన్యాయం జరిగింది. పోరాటం ప్రారంభమైంది. ఈరోజా రేపా అన్నదే తప్ప ఫలితం మాత్రం తథ్యం! మనది న్యాయపరమైన పోరాటమని జాతీయ స్థాయిలో ఒక భావన వచ్చింది.

రాహుల్ అన్ని రాష్ట్రాలు తిరిగి పార్టీల నాయకులను కలుస్తానంటున్నారు. మిమ్మల్ని కలుస్తామంటే ఏమంటారు?

ఇది ఊహాజనిత ప్రశ్న. వాళ్లు ఆ రోజున తప్పుచేశారు. విభజన చేసిన విధానం ఎవరికీ నచ్చలేదు. ఇప్పుడు వారు హృదయపూర్వకంగా ఉంటామంటే చూడాలి మరి!

అవిశ్వాసానికి కాంగ్రెస్ మద్దతిస్తామంటే తీసుకుంటారా?

ఎవరు మద్దతు ఇచ్చినా తీసుకుంటాం.

బీజేపీ రాజకీయం వెనక గవర్నర్ పాత్ర ఉందనే ప్రచారంపై!

ఇప్పుడేమీ మాట్లాడను.

కాంగ్రెస్, బీజేపీ వైఫల్యంతో రాజకీయ శూన్యత వచ్చిందా?

ఏపీలో జాతీయ పార్టీల ప్రవర్తన మంచిది కాదు. వీళ్లు ప్రాంతీయ పార్టీలు ఉండకూడదనే ఉద్దేశంతో పనిచేస్తున్నారు. దీంతో జాతీయ దృక్పథం లేకుండా పోయింది. జాతీయ పార్టీలపై ప్రజల్లో విద్వేషం పెరుగుతోంది.

లోకేశ్‌కు అంతకంటే ఏం కావాలి?

మంత్రి, తన కుమారుడు లోకేశ్‌పై జనసేన అధిపతి పవన్ చేసిన ఆరోపణలను చంద్రబాబు ఖండించారు. ఆధారాల్లేని, అవాస్తవమైన ఆరోపణలు చేశారన్నారు. 'లోకేశ్‌కు ఆ అవసరం ఏమిటి? హెరిటేజ్ లెక్కలు బహిరంగంగా ప్రకటిస్తున్నారు. ఏటా రూ.100 కోట్ల లాభం వస్తుంది. అందులో రూ. 35కోట్లు పన్నులు కడుతున్నారు. సుమారు రూ.65కోట్లు మిగులుతుంది. అంతకంటే ఏం కావాలి? డబ్బే కావాలంటే అక్కడే ఉండి వ్యాపారం చేసుకోవచ్చు. ఒకరకంగా లోకేశ్‌ది త్యాగమే. కొడుకును కూడా వదిలిపెట్టి ఇక్కడుండి కష్టపడుతున్నారు. నేనన్నా రాత్రిపూట లోకేశ్‌ను చూసేవాడిని. అతనికి అదీలేదు' అని తెలిపారు.

జాతీయ రాజకీయాలకు బాబు దూరం?

- ప్రస్తుతానికి ఏపీపైనే దృష్టి!.. సారథ్యం వహించాలని పార్టీల విన్నపం
- వైసీపీ కన్నా.. టీడీపీ చొరవకే అనూహ్య స్పందన

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి నుంచి టీడీపీ బయటకు రావడం ద్వారా దేశవ్యాప్తంగా రాజకీయ సంచలనం రేకెత్తించిన టీడీపీ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు.. ప్రస్తుతం జాతీయ రాజకీయాలకు దూరంగా ఉండే యోచనలో ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ఫెడరల్ ఫ్రంట్‌కు ఆయన నాయకత్వం వహిస్తారని రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతున్నా ఆయన దానికి ఆసక్తిగా లేరని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు తీసుకువెళ్లడంపైనే ఆయన తన దృష్టిని కేంద్రీకరిస్తున్నారని, ప్రస్తుతం అది తప్ప ఆయన ముందు మరో ఆలోచన లేదని ఆ వర్గాలు వివరించాయి. ఎన్డీయే కూటమి నుంచి బయటకు వస్తూనే కేంద్ర ప్రభుత్వంపై టీడీపీ ఇచ్చిన అవిశ్వాసం నోటీసు జాతీయ రాజకీయాల్లో చంద్రబాబు పలుకుబడికి దర్పణం పట్టింది. కొద్ది గంటల వ్యవధిలోనే అనేక పార్టీలు దీనికి మద్దతు ఇవ్వడానికి ముందుకొచ్చాయి. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు పరస్పరం పోరాడుతున్నా ఈ రెండు శిబిరాలూ టీడీపీకి మద్దతు పలికాయి. కాంగ్రెస్ పార్టీ కూడా సై అంది. ఎన్డీయే కూటమిలోని శివసేన, అకాలీదళ్ కూడా సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ వ్యవహార శైలిపై బీజేపీయేతర పక్షాల్లో నెలకొన్న వ్యతిరేకత ఈ సందర్భంగా బయటపడిందని, టీడీపీ ముందుకు వచ్చి నిలబడటంతోటే అవి తక్షణం స్పందించాయని ఆ పార్టీ ముఖ్య నేత ఒకరు చెప్పారు.

క్రియాశీల పాత్ర పోషించండి: ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన టీడీపీ ఢిల్లీలో మరింత క్రియాశీల పాత్ర పోషించాలని ఇతర పార్టీలు కోరుతున్నాయి. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ టీడీపీ ప్రముఖుడికి ఫోన్ చేసి ఇదే విషయం చెప్పారు. మరికొన్ని పార్టీల నేతలు టీడీపీ ఎంపీలతో ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.



మోదీ మాటిచ్చి మోసం చేశారు

- హోదా, హామీల బాధ్యత ఆయనదే
- వీటి సాధనకు యువతను దించుతాం
- చంద్రబాబును నేనేమీ అనలేదు
- పాలనలో లోపాలే ఎత్తిచూపాను
- పవన్ కల్యాణ్ స్పష్టీకరణ
- సీపీఐ, సీపీఎం నేతలతో భేటీ



మీడియాతో మాట్లాడుతున్న పవన్, పక్కన రామకృష్ణ , మధు

విజయవాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):విభజన హామీలను నెరవేరుస్తామని, హోదా ఐదు కాదు.. పదేళ్లు ఇస్తామని మోదీ మాటిచ్చి మోసం చేశారు. హామీల అమలు బాధ్యత ఆయనదే నని నొక్కి చెప్పారు. వాటి గురించి మోదీ పార్లమెంటులో ఎందుకు ప్రస్తావించరు.. ఆయన రాజ్యాంగ ఉల్లంఘన చేస్తున్నారని విమర్శించారు. విజయవాడలో వామపక్షాల ఆహ్వానం మేరకు ఆయన శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు సహ పది మంది నాయకులతో చర్చించారు. అనంతరం వారంతా అక్కడే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ప్రత్యేక హోదా విషయంలో వేలం పాటలా ఐదు, పది,, పదిహేను ఏళ్లు అంటూ ఎందుకు చెప్పారు? దానిని ఎందుకు అమలు చేయడం లేదు? హోదా అని అరిచిన వారికి మాత్రం ప్రత్యేక హోదాలు కట్టబెట్టారు. రాష్ట్రానికేమీ ఇవ్వలేదు. ప్రత్యేక ప్యాకేజీ ఆశ చూపించారు. 25 మంది ఎంపీలను మేనేజ్ చేస్తే, బ్లాక్ మెయిల్ చేస్తే ఐదు కోట్ల మంది ఆంధ్రులు వింటారని బీజేపీ ప్రభుత్వం అనుకోవడం పొరపాటు' అని పవన్ అన్నారు. న్యాయం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమేనని ప్రకటించారు. హామీల సాధన కోసం విద్యార్థులను, యువకులను రంగంలోకి దించుతామని.. అయితే పరీక్షలు, ఇతరత్రా ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుతానికి వారిని పక్కన పెడుతున్నామని తెలిపారు. తాను సీఎం చంద్రబాబును ఏమీ అనలేదని, పాలనలో లోపాలనే ఎత్తిచూపానని తెలిపారు. నిన్నటి దాకా తనను టీడీపీ వ్యక్తినని అన్నారని, ఇవ్వాళ బీజేపీ మనిషినని వ్యాఖ్యానిస్తున్నారని అన్నారు. తన తండ్రి, ఇతర బంధువులు వామపక్ష భావజాలాన్ని పుణికి పుచ్చుకున్నారని, కమ్యూనిస్టు పార్టీతో కలిసి పనిచేశారని చెప్పారు. అదే కోవలో తనకూ కమ్యూనిస్టు భావజాలం పట్ల మక్కువ ఏర్పడిందని తెలిపారు. హైదరాబాద్‌లో సీపీఎం నాయకుడు మధు చేసిన పోరాటాలు తనకు స్వయంగా తెలుసని చెప్పారు. వాస్తవంగా 2009 ఎన్నికల్లోనే ప్రజారాజ్యం, కమ్యూనిస్టులు కలిసి పోటీ చేయాలనుకున్నామని, అనివార్య కారణాల వల్ల వీలుపడలేదని తెలిపారు. ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే ఆందోళనలకు పవన్ కల్యాణ్ మద్దతు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని మధు, రామకృష్ణ తెలిపారు. కేంద్రం మెడలు వంచుతామని చెప్పారు. బీజేపీకి ప్రజలు చరమ గీతం పాడక తప్పదన్నారు. తాము, పవన్ కలిసి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని, ఈ నెల 19న జరిగే రౌండ్ టేబుల్ తరువాత ఉద్యమ కార్యాచరణ ఉంటుందని తెలిపారు.

ఇక రాష్ట్రంలోనే ఎక్కువ టూర్లు

- పవన్ నిర్ణయం

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలంగా వ్యవహరించేందుకు ఇక ఏపీలోనే ఎక్కువగా పర్యటనలు చేపట్టాలని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఈ నెల 14న పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొనేందుకు ఒక రోజు ముందే విజయవాడకు చేరుకున్న ఆయన.. 19 దాకా ఇక్కడే బస చేయనున్నారు. రాజధాని నగరం అమరావతి పరిధిలోని గుంటూరు జిల్లా కాజా వద్ద సొంతింటిని.. పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ఇందుకు భూమి పూజ కూడా చేశారు.

వనరులా.. వివాదమా?

- టీడీపీయే తేల్చుకోవాలి.. మళ్లీ జైట్లీ కవ్వింపు



న్యూఢిల్లీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి):ఎన్డీయే నుంచి టీడీపీ బయటకు రావడం, కేంద్రంపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వడంతో..అటు కేంద్రం కూడా ఎదురుదాడి మొదలుపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం లేవనెత్తుతున్న అంశాలకు సమాధానం చెప్పకుండా..కొత్త విషయాలను కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెరపైకి తీసుకొచ్చారు. 'ఆంధ్రప్రదేశ్‌కు హోదాతో సమానంగా ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడానికి కేంద్రం కట్టుబడి ఉంది. ఈ ప్యాకేజీని ఇచ్చే విధానంపై రాష్ట్ర ప్రభుత్వమే మాకు స్పష్టత ఇవ్వాల్సి ఉంది' అని జైట్లీ శుక్రవారం ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. 'మేము ఒక పరిష్కారాన్ని చూపించాం. అందుకు అనుగుణంగా నిధులు కావాలో లేక వివాదం రేపాలో ఏపీ ప్రభుత్వమే నిర్ణయించుకోవాలి'అని ఒకింత కవ్వింపు స్వరంతో చెప్పారు. 2016 సెప్టెంబరులోనే ప్యాకేజీపై విధివిధానాల రూపకల్పన జరిగిందని.. కానీ నిధులు మరో రూపంలో కావాలని ఈ ఏడాది జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదన చేసిందని జైట్లీ చెప్పారు. అందుకు కూడా కేంద్రం అంగీరించినప్పటికీ, ఏపీ నుంచి సరైన ప్రతిస్పందన లభించలేదని వివరించారు. ఒక ప్రత్యేక సంస్థ (ఎస్‌పీవీ)ను ఏర్పాటు చేసి నాబార్డు ద్వారా నిధులు మళ్లించేందుకు కేంద్రం అంగీకరించిందని ఆయన తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర స్థాయిలో వివరంగా చర్చించి మళ్లీ వస్తామని ఫిబ్రవరి 7న ఏపీ అధికారులు వెనక్కి వెళ్లారని.. ఇంకా తిరిగి రాలేదని అన్నారు. "వారు వస్తారని మేము నిరీక్షిస్తున్నాము" అని జైట్లీ వ్యాఖ్యానించారు.

ట్వీట్లతో విరుచుకుపడ్డ పీయూష్

కేంద్రమంత్రి పదవికి ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందో రాజ్యసభలో వివరిస్తున్న సుజనాచౌదరిని పదేపదే అడ్డుకున్న కేంద్ర రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్..సభ నుంచి బయటకొచ్చి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం ఏం చేసిందో చెబుతూ అనేక ట్వీట్లు పెట్టారు. అందులో గ్రాఫిక్స్‌తో కూడిన కొన్ని లెక్కలు వెల్లడించారు. 'ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు..వాస్తవాలు అబద్ధాలు చెప్పవు' అంటూ నిధుల వివరాలు పేర్కొన్నారు. విభజనచట్టం ప్రకారం ఏపీకి చేసిన సాయం కింద 2014-15లో వనరులలోటును రూ.3,979.50 కోట్లగా పేర్కొన్నారు. రెవెన్యూ లోటును రూ.27,138.83 కోట్లగానూ, 7 వెనుకబడిన జిల్లా అభివృద్ధికి రూ.1,050 కోట్లు, రాజధానికి రూ.2,500 కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.5,364 కోట్లగా ప్రస్తావించారు. ప్రపంచ బ్యాంకు, వివిధ ఆర్థికసంస్థల నుంచి అందుతున్న సాయంపై లెక్కలు గుప్పించారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించి తాము నియమించిన కమిటీ ఇచ్చిన నివేదికను సమగ్రంగా పరిశీలిస్తున్నామని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గోహైన్ వెల్లడించారు. ఈ మేరకు రాజ్యసభలో టీడీపీ ఎంపీ సీఎం రమేశ్ అడిగిన ఓ ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

అందుకే రాజీనామా

- ప్రత్యేక హోదా ఆంధ్ర హక్కు.. ఇతర రాష్ట్రాలతో పోల్చడం తగదు
- మా రాజీనామాలే బీజేపీకి మేలుకొలుపు
- రాజ్యసభలో సుజనా వ్యక్తిగత వివరణ



సుజన ప్రసంగానికి అడ్డుపడుతున్న పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, మార్చి 16(ఆంధ్రజ్యో తి): 'ఏపీకి సముచిత ప్రాధాన్యమి చ్చి న్యాయం చేస్తుందన్న ఆశతో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ చేరింది. మా ఆకాంక్షలకు అనుగుణంగా ఓ జాతీయ పార్టీ(బీజేపీ) సరిపడా ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న భావన మాలో నెలకొంది. సకాలంలో చర్య లు తీసుకుంటే అనేక ఇబ్బందులు తొలగిపోయేవి(స్టిచ్ ఇన్ టైమ్స్ సేవ్స్ నైన్). కానీ అలా జరగలేదు. అందుకే ప్రభుత్వంలో కొనసాగడంపై పునరాలోచించుకోవలసి వచ్చింది. దాని పర్యవసానమే ఈ రాజీనామాలు' అని కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి పేర్కొన్నారు. గురువారం రాజ్యసభలో అర్ధాంతరంగా ఆగిపోయిన తన వ్యక్తిగత వివరణ ప్రసంగాన్ని చైర్మన్ వెంకయ్యనాయుడి అనుమతితో శుక్రవారం కొనసాగించారు. 'ప్రత్యేక హోదా ఆంధ్ర హక్కు అని నొక్కి చెప్పడానికే రాజీనామాలు చే శాం. ఇది మా మాజీ భాగస్వామికి మేలుకొలుపు కావాలి' అన్నారు. ఆస్తులు, అప్పుల్లో అసమతుల్యత.. సిబ్బంది, ఆర్థిక వనరుల పంపిణీ గురించి అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ సభలో ప్రస్తావించారని గుర్తుచేశారు. 'ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ. రాజకీయ పార్టీలు అధికారంలోకి వస్తూ పోతూ ఉంటాయి. దురదృష్టవశాత్తు దాన్ని విస్మరించి ప్రభుత్వం ఏకపక్షంగా అపాయింటెడ్ తేదీని నిర్ణయించింది. దేశానికి, ప్రపంచానికి మొత్తానికి తెలిసిన కాస్మోపాలిటన్ సిటీ హైదరాబాద్‌ను ఏపీ కోల్పోయింది. ఆదాయాన్ని సృష్టించే పరిశ్రమలన్నీ తెలంగాణకు వెళ్లిపోయాయి. అవి దేశ ప్రజలంతా కలిసి 60 ఏళ్లకుపైగా నిర్మించుకున్నవి. దాంతో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రాష్ట్రంగా మిగిలిపోయింది' అని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిందని అంటున్నారని, ఒకవేళ అలాంటి సిఫారసు ఉన్నా.. అంతకు ముందే ఇచ్చిన హామీలకు దానిని ఎలా వర్తింపజేస్తారని ప్రశ్నించారు. పార్లమెంటులో ఇచ్చిన హామీలకు దాన్ని అమ లు చేయకూడదన్నారు. ప్రత్యేక హోదా ఉన్న ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయన్ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కొనసాగింపు అంశంపై కేంద్రం ముఖ్యమంత్రుల ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. ఏపీకి ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కనీసం మంత్రివర్గ ఉపసంఘం లేదా కేబినెట్ మంత్రులతో టాస్క్‌ఫోర్స్ అయినా ఏర్పాటు చేసి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. కాగా, మాట్లాడడానికి ఆమోదించిన వాక్యాలను కాకుండా అందులో లేనివి కూడా సుజనా మాట్లాడారు. దాంతో కేంద్ర మంత్రి పియూష్ గోయల్ అడ్డుకోడానికి ప్రయత్నించారు. నాటి ప్రధాని ఐదేళ్ల పాటే ప్రత్యేక హోదా ఇస్తామన్నారని, పదేళ్ల పాటు ప్రత్యేక హోదా కల్పించాలని విభజన బిల్లు ఆమోదం పొందే సమయంలో వెంకయ్య నాయుడు అన్నారని సుజనా గుర్తుచేశారు. దాంతో డిప్యూటీ చైర్మన్ కురియన్‌తో పాటు గోయల్ అభ్యంతరపెట్టారు. పత్రంలో లేని విషయాలు మాట్లాడకూడదన్నారు. టీఎంసీ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్.. సుజనాను సమర్థించారు. సభలో జరిగింది ప్రస్తావించడం తప్పుకాదని స్పష్టం చేశారు. గత రికార్డులను మాత్రమే సుజనా ప్రస్తావిస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ అన్నారు. అయినా గోయల్ అభ్యంతరం చెప్పారు. దాంతో కురియన్ జోక్యం చేసుకుని.. పత్రంలో లేని వాక్యాలు, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా చైర్మన్‌ను ఉద్దేశించి మాట్లాడిన మాటలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. దీనిపై సుజనా ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు జాతీయ పార్టీల(కాంగ్రెస్, బీజేపీ) వల్ల రాష్ట్ర విభజన చట్టం ఆమోదం పొందిందని, అశాస్త్రీయంగా రూపొందించిన బిల్లును ఆమోదించడంలో వీటిదే బాధ్యతని ధ్వజమెత్తారు.

నమ్మించి నట్టేట ముంచారు

- అందుకే బయటికొచ్చాం
- ప్రత్యేక సాయం 34 కోట్లా?
- పొత్తు ఉన్నప్పుడే నిధులివ్వలేదు
- బడ్జెట్‌లో కేంద్రం వాటా 82 వేల కోట్లు
- అవి ఇవ్వకుంటే రాష్ట్రానికి తీరని నష్టం
- శాసనసభలో యనమల స్పష్టీకరణ



అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అండగా నిలుస్తామని నమ్మించి నట్టేట ముంచిన బీజేపీని ప్రజలు ఎన్నటికీ మరచిపోరని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొత్తు ఉన్నప్పుడే ఏమాత్రం సహకరించని మోదీ ప్రభుత్వం.. ఇప్పుడు తెగతెంపులు చేసుకున్నాక ఆర్థిక సాయం చేస్తుందన్న నమ్మకం తమకు లేదన్నారు. కేంద్ర సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా పనిచేస్తోందని, రాష్ట్రాలను తీవ్ర ఇక్కట్లకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌పై గత కొద్దిరోజులుగా శాసనసభలో వివిధ పార్టీల సభ్యులు ప్రస్తావించిన అంశాలకు శుక్రవారం ఆయన వివరణ ఇచ్చారు. ఇప్పటిదాకా పది బడ్జెట్లు ప్రవేశపెట్టిన యనమల.. ఎప్పుడూ బడ్జెట్ వివరణలో రాజకీయాలు ప్రస్తావించలేదు. కేంద్రం పై విమర్శలు చేయలేదు. తొలిసారిగా తన సహజశైలికి భిన్నంగా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని సభలో పేర్కొన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. వంచించే ప్రభుత్వంతో ఎందుకు కలిసిఉండాలన్న ఉద్దేశంతోనే బయటికొచ్చామన్నారు. 'రాజకీయంగా తమిళనాడులో ఏంచేశారో చూశాం. ఇక్కడా చూస్తు న్నాం. కానీ మన రాష్ట్రంలో అలాంటి రాజకీయాలు చెల్లవు' అని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వకూడదని 14వ ఆర్థిక సంఘం చెప్పిందని ఇన్నాళ్లూ బుకాయించి.. ఆ సంస్థ అలా సిఫారసు చేయలేదని రాజ్యసభలో కేంద్రం ఇప్పుడు మాటమార్చిందన్నారు. కేంద్రం వివిధ పథకాలతో పాటు కేంద ప్రాయోజిత పథకాలు (సీఎస్ఎస్), ఇతర గ్రాంట్ల నిధులు ఇస్తుందని బడ్జెట్‌లో దాదాపు రూ.85 వేలకోట్లపైనే ప్రతిపాదించామని.. కేంద్రం ఇస్తుందన్న భరోసాతో పన్నుల వాటా కింద రూ.33 వేల కోట్లు, గ్రాంట్-ఇన్-ఎయిడ్ కింద రూ.52 వేల కోట్లపైనే ప్రతిపాదించామని తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అవి ఇస్తుందో లేదోనన్న సందేహం వెలిబుచ్చారు.

కేంద్రం దాగుడుమూతలు..

తమది పేదల సంక్షేమ బడ్జెట్ అని యనమల చెప్పారు. కేంద్రం సహకరిస్తుందన్న నమ్మకంతోనే రాష్ట్ర బడ్జెట్‌ను రూ.1.91 లక్షల కోట్లకు ప్రతిపాదించామని అన్నారు. 'డివల్యూషన్ కింద 42 శాతం నిధులివ్వాలి. కానీ నిధులు ఇచ్చినట్లు చెబుతున్నారు. అవి ఎక్కడున్నాయో కార్యాచరణలో కనిపించవని' అని యనమల వివరించారు.

రుణమాఫీతో లోటుకు లింకా?

రాష్ట్రానికి సాయం చేయకూడదన్న దురుద్దేశంతోనే అనేక అవాంతరా లు సృష్టిస్తోందని యనమల అన్నారు. 'రాష్ట్ర రెవెన్యూ లోటు రూ.16 వేల కోట్లు అని కాగ్ ఆమోదించినా.. రైతులు, మహిళల రుణమాఫీ చేశారంటూ సొంత లెక్కలుగట్టి ఇక రూ.390 కోట్లే ఇవ్వాలనడం దారుణం. రుణమాఫీ సొమ్మును రెవెన్యూ లోటుకు ముడిపెట్టడం సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమ'ని అన్నారు.

టీడీపీని బద్‌నాం చేసే యత్నం

సంకీర్ణ ధర్మానికి భిన్నంగా టీడీపీని కేంద్రం బద్‌నాం చేసే ప్రయత్నం చేసిందని యనమల విమర్శించారు. 'ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని కేవలం రూ.34 కోట్లు ఇచ్చారు. ఇది సిగ్గుచేటు. ఇటీవల రూ.350 కోట్లు ఏపీ ఖాతాకు పంపించి వెంటనే వెనక్కి తీసుకున్నారు. ఆర్థిక సంబంధాలు మరిం త దారుణంగా తయారైనందుకే పొత్తు తెంచుకున్నాం' అని చెప్పారు. ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే అన్ని రంగాలకు సంబంధించి కేంద్రం 90 శాతం, ఏపీ 10 శాతం నిధులు భరించేదని, దీని వల్ల రాష్ట్రంపై భారం తగ్గేదని వివరించారు. ముఖ్యమంత్రి కష్టపడి పరిశ్రమలను, లక్షల కోట్ల పెట్టుబడులను ఏపీకి తీసుకొచ్చారని, తమ సొంతకాళ్లపైనే నిలబడ్డామని, కేంద్రాన్ని చూసి ఒక్క పరిశ్రమ, పెట్టుబడులు రాలేదని యనమల తేల్చిచెప్పారు. ఇటీవల పరిశ్రమల కోసం ప్రకటించిన రూ.27 వేల కోట్ల రాయితీల ప్యాకేజీలో ఏపీని కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. ఏపీకి పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలు రాకుంటే బీజేపీదే బాధ్యతని స్పష్టం చేశారు. 'ఇది బడా బడ్జెట్ అని కొందరు అంటున్నారు. మీరు (బీజేపీ) నిధులిస్తారనే నిధులు ప్రతిపాదించాం. మీరు సహకరిస్తే వృద్ధి రేటు ఇంకా పెరిగేది. కానీ లేదు. రెవెన్యూ లోటు కేంద్రం నుంచి వస్తే మిగులులోకి వెళ్లిపోయే వాళ్లమ'ని అన్నారు.

గ్రహణం వీడింది!?



కడపలో ప్రధాని దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

మోదీకి శవయాత్రలు

గుంటూరు/కడప/అనంతపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ ఏ-1 ముద్దాయంటూ టీఎన్ఎస్ఎఫ్ నేతలు మండిపడ్డారు. శుక్రవారం గుంటూరులో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. వైసీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలు స్వా ర్థ రాజకీయ ప్రయోజనాలు వదిలి రాష్ట్రం కోసం పాటుపడాలని సూచించారు. కడప నగరంలోని ఐటీఐ సర్కిల్‌లో టీడీపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మకు శవయాత్ర, దహన కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం జిల్లా కేంద్రంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను ఊరేగించి అంబేడ్కర్ విగ్రహం వద్ద దహ నం చేశారు.



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

బీజేపీ సంబరాలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 16: ఎన్డీయే నుంచి తెలుగుదేశం పార్టీ బయటకు వచ్చిన నేపథ్యంలో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. శుక్రవారం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయం ఎదుట ఆపార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీని ఎదగనీయకుండా టీడీపీ కుటిల రాజకీయాలు చేసిందని అన్నారు. టీడీపీ వెళ్లిపోవడంతో తమ పార్టీకి పట్టిన గ్రహణం వీడిందని అన్నారు.

ఆ నివేదిక పైనే షమి భవిష్యత్తు



న్యూఢిల్లీ: అవినీతి నిరోధక విభాగం నివేదిక ఆధారంగా పేసర్ మహమ్మద్ షమిపై తదుపరి చర్యలు ఉంటాయని బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం చీఫ్ నీరజ్ కుమార్, బోర్డు తాత్కాలిక అధ్యక్షుడు సి.కె.ఖన్నా తెలిపారు. షమిపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాల్సిందిగా బోర్డు పరిపాలక కమిటీ చీఫ్ వినోద్ రాయ్... నీరజ్‌కుమార్‌ను ఆదేశించిన సంగతి తెలిసిందే. షమి ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని అతని భార్య ఆరోపించిన నేపథ్యంలో ఏడు రోజులలో విచారణ నివేదికను అందించాల్సిందిగా పాలక కమిటీ ఆదేశించింది.

వారెవ్వా.. సింధు

భారత మేటి షట్లర్ సింధు, జపాన్ అమ్మాయి, వరల్డ్ చాంపియన్ నొజోమి ఒకుహర మ్యాచ్ అంటేనే బ్యాడ్మింటన్ ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తుంది. ప్రతీ పాయింట్‌కోసం ఈ ఇద్దరూ తలపడే తీరు క్షణక్షణం ఉత్కంఠ రేకెత్తిస్తుంది. ఒక పాయింట్ ఆమె సాధిస్తే మరొకటి ఈమె చేజిక్కించుకొనే తీరు అభిమానులను రోమాలు నిక్కబొడుచుకొనేలా చేస్తుంది. అలా సాగుతూపోయే పోటీలో ఫలితం చివరి వరకూ దోబూచులాడుతుంది. అందుకే సింధు, నొజోమి ఇప్పటివరకూ పదిసార్లు తలపడితే ఎనిమిది మ్యాచ్‌లు మూడో గేమ్‌కు దారి తీశాయి. ఇక ఈ ప్లేయర్ల మధ్య గత ఏడాది జరిగిన 110 నిమిషాల వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్ అయితే చరిత్ర సృష్టించింది. ఇక శుక్రవారంనాటి ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ క్వార్టర్‌ఫైనల్ కూడా నువ్వా నేనా అనేలా నడిచింది. ప్రత్యర్థి గట్టి పోటీ ఇచ్చినా, ఓ గేమ్ కోల్పోయినా భారత అగ్ర షట్లర్ సింధు చివరికంటా పోరాడి జయకేతనం ఎగురవేసింది. ఒకుహరను చిత్తుచేసి తొలిసారి సెమీఫైనల్లో ప్రవేశించింది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ టైటిల్ దిశగా మరో అడుగు ముందుకు వేసింది.



మహిళల సెమీస్‌లో ఎవరితో ఎవరు?

పీవీ సింధు × యమగుచి

తై జు యింగ్ × చెన్ యుఫీ

(మ. 3.30 గం. తర్వాత స్టార్‌స్పోర్ట్స్-1లో)

మాజీ చాంపియన్ ఒకుహరపై ఉత్కంఠ విజయం

సెమీస్‌లో ప్రవేశం

ఆల్‌ఇంగ్లండ్ చాంపియన్‌షిప్

బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో ఇప్పటివరకూ జరిగిన సింగిల్స్ మ్యాచ్‌లన్నీ ఓ ఎత్తయితే..నాలుగో సీడ్ సింధు, ఏడోసీడ్ నొజోమి ఒకుహరల పోటీ మరో ఎత్తు. గంటా 24 నిమిషాలపాటు అభిమానులను ఉర్రూతలుగించిన ఆల్‌ఇంగ్లండ్ క్వార్టర్స్‌లో జపాన్ షట్లర్‌పై భారత క్రీడాకారిణిదే పైచేయి అయింది. ఈ విజయంతో ఒకుహరపై తన రికార్డును 5-5తో సమం చేసింది. అంతేకాదు నిరుడు వరల్డ్ చాంపియన్‌షిప్ ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది. జపాన్‌కు చెందిన ప్రపంచ రెండో ర్యాంకర్ అకానె యమగుచితో సింధు సెమీఫైనల్లో తలపడుతుంది.

ఆరంభంనుంచే...

సింధు, ఒకుహరల శారీరక సామర్థ్యానికి పరీక్ష పెట్టిన ఈ మ్యాచ్ తొలిగేమ్ మొదటి పాయింట్‌నుంచే పోటాపోటీగా సాగింది. పదునైన షాట్లు, సుదీర్ఘ ర్యాలీలతో తలపడడంతో తొలి గేమ్‌లో ఇద్దరూ 4-4తో సమంగా నిలిచారు. ఈ దశలో ఒకుహర ఓ పాయింట్‌పై చేసిన అప్పీల్‌ను అంపైర్ తోసిపుచ్చడంతో సింధు 6-4తో ముందంజ వేసింది. ఆధిక్యం చేతులు మారుతూ వచ్చి విరామానికి జపాన్ షట్లర్ 11-10తో ముందంజలో నిలిచింది. అనంతరం ఇద్దరూ స్మాష్‌లతో అదరగొట్టడంతో 16-16, 19-19, 20-20లతో స్కోరు సమమవుతూ వచ్చింది. ఈ దశలో సింధు వరుసగా రెండు చాలెంజ్‌లను కోల్పోగా.. ఇదే అదనుగా రెండు పాయింట్లు చేజిక్కించుకున్న నొజోమి తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లోను ఇద్దరు అద్భుత షాట్లతో ఔరా అనిపించగా..సింధు 3-1తో ఆధిక్యంలోకి వచ్చింది. అయితే బాడీ స్మాష్‌లతో విరుచుకుపడిన జపాన్ షట్లర్ 6-4తో ముందంజ వేసింది. ఇక్కడి నుంచి ఓ పాయింట్ సింధు, మరో పాయింట్ నొజోమి సాధిస్తూ మ్యాచ్‌లో ఉత్కంఠ రేపారు. 18-18తో ఉన్న దశలో ఒకుహర కొట్టిన షాట్లు లైన్ బయట పడడంతో సింధుకు రెండు పాయింట్లు దక్కాయి. జపాన్ షట్లర్ షాట్లపై మరింత నియంత్రణ కోల్పోవడంతో రెండో గేమ్‌ను సింధు చేజిక్కించుకుంది. నిర్ణాయక గేమ్‌లో తొలుత నొజోమి 4-1తో ఆధిక్యంలోకి దూసుకుపోయింది. కానీ స్మాష్‌లతో అదరగొట్టిన సింధు 4-5తో అంతరాన్ని తగ్గించింది. అదే ఊపుతో 6-6తో సమం చేయడమేకాదు..8-6తో ఆధిక్యంలో నిలిచింది. కానీ సింధు షాట్లు నెట్‌కు తాకడంతోపాటు కోర్టు వెలుపల పడడంతో 8-8తో ఒజొమి సమం చేసింది. విరామానికి జపాన్ షట్లర్ ఒక పాయింట్ ఆధిక్యం ప్రదర్శించగా..అనంతరం 14-11కు దూసుకుపోయింది. ఓ చక్కటి షాట్‌తో సింధు పాయింట్ రాబట్టినా అనవసర తప్పిదాలు చేయడంతో ఒకుహర 16-12తో ముందంజ వేసింది. అయితే పదునైన రిటర్న్‌లతో నాలుగు పాయింట్లు కైవసం చేసుకోవడం ద్వారా సింధు స్కోరును సమం చేసింది. ఆపై అద్భుత స్మాష్‌తో ఆధిక్యంలోకి వచ్చింది. ఈ దశలో సింధు ఆటలో వేగం తగ్గడంతో అంపైర్ ఎల్లో కార్డు చూపించాడు. ఆ తర్వాత నెట్ గేమ్‌కు ప్రాధాన్యమిచ్చిన సింధు షాట్లపై షాట్లు సంధించి ప్రత్యర్థిని బెంబేలెత్తించడంద్వారా గేమ్‌ను మ్యాచ్‌ను గెలుపొందింది.

‘వరల్డ్’ ఫైనల్‌లా..

ఒకుహరతో నేటి పోరు వరల్డ్ చాంపియన్‌షిప్, దుబాయ్ సూపర్ సిరీస్ ఫైనల్ మ్యాచ్‌ల లాంటిది. ఒకుహరతో పోటీ ఎప్పుడూ అంత సలువుకాదు. మా ఇద్దరి గేమ్ ఒకరికొరికి తెలుసు. అందుకే మ్యాచ్‌లో సుదీర్ఘ ర్యాలీలు సాగాయి. అందు వల్ల ఇద్దరంఅత్యుత్తమంగా ఆడాల్సి వచ్చింది - పీవీ సింధు

సంతోషంగా ఉంది

ఒకుహరను సింధు ఓడించడం సంతోషంగా ఉంది. ఇది క్లిష్టమైన పోరు. వీరిద్దరూ సుదీర్ఘ మ్యాచ్‌లు ఆడగలిగేవారే. ఈసారి మాత్రం సింధు అద్భుత విజయం సాధించడం శుభ పరిణామం. ఒకుహర ఈ పోటీలోనూ అసామాన్యంగా పోరాడింది. మరోసారి ప్రేక్షకులు చక్కటి మ్యాచ్‌ను ఆస్వాదించారు - కోచ్ గోపీచంద్

అంపైర్ నిర్ణయాలవల్లే ఓటమి!



శ్రీకాంత్

అంపైర్ అసంబద్ధ నిర్ణయాలే ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ ప్రీక్వార్టర్ ఫైనల్లో తన ఓటమికి కారణమని స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ వాపోయాడు. గురువారం అర్ధ రాత్రి జరిగిన రెండోరౌండ్ మ్యాచ్‌లో శ్రీకాంత్.. చైనాకు చెందిన అన్‌సీడెడ్ ఆటగాడు హాంగ్ యు జియాంగ్ చేతిలో ఓడిన సంగతి తెలిసిందే. ‘తొలి గేమ్‌లో ఎన్నో సర్వీస్ తప్పిదాలను అంపైర్ ప్రకటించాడు. మొదటిరోజు నా సర్వీస్‌లో అంపైర్‌కు ఎలాంటి తప్పులు కనిపించలేదు. కానీ రెండోరోజు బాధ్యతలు నిర్వర్తించిన అంపైర్‌కు మాత్రం నా సర్వీస్‌లో ఎన్నో లోపాలు కనిపించాయి. ఇది సరికాదు’ అని శ్రీకాంత్ అన్నాడు. ఇక పురుషుల డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో ఓడిన భారత జోడీ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ షెట్టి కూడా అంపైర్ నిర్ణయాలపై అసంతృప్తి ప్రకటించింది. ఈ ఏడాది మెగా టోర్నీలన్నింటిలో కొత్త సర్వీస్ నిబంధన ప్రవేశపెట్టాలని ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య నిర్ణయించిన సంగతి తెలిసిందే.

ప్రపంచ వర్సిటీ షూటింగ్‌లో భారత్‌కు స్వర్ణం

న్యూఢిల్లీ: ఎఫ్ఐఎస్‌ఏ ప్రపంచ యూనివర్సిటీ షూటింగ్ చాంపియన్‌షిప్ లో పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో భారత్ స్వర్ణం పతకం సాధించింది. కౌలాలంపూర్‌లో శుక్రవారం జరిగిన ఫైనల్లో అన్మోల్ జైన్, అచల్ ప్రతాప్ సింగ్ గ్రెవాల్, నిషాంత్ త్రయం 1725 స్కోరుతో టైటిల్ కైవసం చేసుకుంది. అలాగే మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగాల్లో మేఘన సజ్జనార్ (కర్ణాటక), ఎల్వెనిల్ వలరివాన్ (గుజరాత్) రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

జాఫర్ ‘ట్రిపుల్’ మిస్

● విదర్భ 702/5 డిక్లేర్డ్

నాగ్‌పూర్: వెటరన్ బ్యాట్స్‌మన్ వసీం జాఫర్ ఫస్ట్‌క్లాస్‌లో రెండో ట్రిపుల్ సెంచరీ అవకాశాన్ని త్రుటిలో చేజార్చుకున్నాడు. రెస్టాఫ్ ఇండియాతో ఇరానీ కప్ పోరులో విదర్భ తొలి ఇన్నింగ్స్‌ను 702/5 వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 598/3తో విదర్భ మూడో రోజైన శుక్రవారం ఆట కొనసాగించిన విదర్భకు జాఫర్ (431 బంతుల్లో 34 ఫోర్లు, సిక్సర్లతో 286) ఒక పరుగు మాత్రమే జోడించి క్లీన్ బౌల్డయ్యాడు. దీంతో అతను త్రిశతకానికి 14 పరుగుల దూరంలో నిలిచిపోయాడు. తర్వాత అపూర్వ్ వాంఖడే (99 నాటౌట్) - అక్షయ్ (37) ఐదో వికెట్‌కు 91 రన్స్ భాగస్వామ్యం నెలకొల్పారు. ప్రతికూల వాతావరణం కారణంగా మూడో రోజు కేవ లం 28 ఓవర్ల ఆట సాధ్యమైంది. ఉదయం సెషన్‌లో ఆటకు వర్షం తీవ్ర అంతరాయం కలిగించిం ది. ఇక రెండోసెషన్‌లో వెలుతురు మందగించడంతో షెడ్యూల్ కంటే ముందే ఆటను నిలిపేశారు.

రైల్వే ఉద్యోగాల సాధనకు శాప్ శిబిరాలు

గుంటూరు (క్రీడలు): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ప్రవేశపెట్టిన నూతన క్రీడా విధానంలో భాగంగా లక్ష రైల్వే ఉద్యోగాల సాధన లక్ష్యంగా 18-25 సంవత్సరాల మధ్య అర్హత కలిగిన క్రీడాకారులందరికీ శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నంలలో ఈ శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీనియర్ నేషనల్స్‌లో పాల్గొన్న, మెడల్స్ సాధించిన ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్ (మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్) కోర్సులు పాసైన వారంతా తమ వివరాలతో శాప్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైనవారు తమ దరఖాస్తులను sportsinap@gmail.comకు పంపాలి.



మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బాక్సింగ్ క్వీన్ మేరీ కోమ్‌ను సన్మానిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

బంగ్లా రచ్చరచ్చ

● ఆఖర్లో హైడ్రామా ● శ్రీలంకపై ఉత్కంఠ విజయం ● రేపు భారత్‌తో ఫైనల్ ఫైట్

శ్రీలంకతో మ్యాచ్ అంటే బంగ్లాదేశ్ ఆటగాళ్లకు పూనకమే వస్తున్నట్టుంది. ఉత్కంఠ.. ఉద్వేగం.. ఆవేశం కలగలిపిన వారి తీరు శుక్రవారం నాటి మ్యాచ్‌లో ఆవిష్కృతమైంది. ఆడుతోంది ప్రపంచకప్ ఫైనలేమో అనేంత కసి బంగ్లా బ్యాట్స్‌మెన్‌లో కనిపించింది. వీధి కొట్లాటను తలపించిన ఈ మ్యాచ్ ఆఖరి ఓవర్‌లో హైడ్రామానే నడిచింది.. 12 పరుగులు కావాల్సి ఉన్న దశలో క్రికెటర్ల మధ్య గొడవతో ఆట సాగదేమోనని అనిపించింది. కెప్టెన్ షకీబల్ హసన్ తమ బ్యాట్స్‌మెన్‌ను బయటకి వచ్చేయాలని పదేపదే సైగ చేసినా వారి కోచ్ జోక్యంతో ఆట కొనసాగింది. అటు మహ్మదుల్లా మరో బంతి మిగిలి ఉండగానే భారీ సిక్సర్‌తో జట్టును గట్టెక్కించడంతో ఆటగాళ్లు నాగిని డ్యాన్స్‌తో ఊగిపోయారు. అంతేకాదు విజయానంతరం డ్రెస్సింగ్ రూమ్ తలుపు అద్దాలను బ్యాట్‌తో పగులగొట్టారు.



బంగ్లా ఆటగాళ్ల నాగిని డ్యాన్స్



బంగ్లా డ్రెస్సింగ్ రూమ్

కొలంబో: ముక్కోణపు టీ20 సిరీస్‌లో భారత్ ఫైనల్ ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన బంగ్లాదేశ్ జట్టు శ్రీలంకపై రెండు వికెట్ల తేడాతో నెగ్గింది. తమీమ్ ఇక్బాల్ (42 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లు 50) శుభారంభాన్ని అందించగా మహ్మదుల్లా (18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 43 నాటౌట్) ఆఖర్లో లంక బౌలర్లను ఆడుకున్నాడు. టైటిల్ పోరు ఆదివారం జరగనుంది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్లకు 159 పరుగులు చేసింది. కుశాల్ పెరీరా (40 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 61), తిసార పెరీరా (37 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 58) మాత్రమే రాణించారు. ఆ తర్వాత లక్ష్యం కోసం బరిలోకి దిగిన బంగ్లా 19.5 ఓవర్లలో 8 వికెట్లకు 160 పరుగులు చేసి నెగ్గింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ మహ్మదుల్లాకి దక్కింది.

తమీమ్ అండతో...

ఓ మాదిరి లక్ష్యంకోసం బరిలోకి దిగిన బంగ్లా 33 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయిన స్థితిలో తమీమ్ ఇక్బాల్, ముష్ఫికర్ రహీమ్ అండగా నిలిచారు. 8, 12వ ఓవర్లలో తమీమ్ ఒక్కో సిక్స్ బాదాడు. ఈ ఇద్దరూ కుదురుకుంటున్న పరిస్థితిలో లంక బౌలర్లు ఒక్కసారిగా పైచేయి సాధించారు. వరుసగా మూడు ఓవర్లలో తమీమ్, ముష్ఫికర్, సౌమ్య (10) పెవిలియన్‌కు చేరడం బంగ్లాను ఇబ్బంది పెట్టింది. తమీమ్, ముష్ఫికర్ మధ్య మూడో వికెట్‌కు 64 పరుగులు వచ్చాయి. ఇక 18వ ఓవర్‌లో కెప్టెన్ షకీబ్ (7) అవుట్ కావడంతో బంగ్లా గెలుపుపై అనుమానాలు నెలకొన్నాయి.

ఆదుకున్న పెరీరా ద్వయం

శ్రీలంకను బంగ్లా బౌలర్లు ఆరంభం నుంచే ఇబ్బందిపెట్టారు. వరుస విరామాల్లో వికెట్లు తీయడంతో లంక పవర్ ప్లే ముగిసే సమయానికి 32 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. 41 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన దశలో కుశాల్ పెరీరా, తిసార పెరీరా జోడి లంకను అద్భుతంగా ఆదుకోవడంతో జట్టు గౌరవప్రదమైన స్కోరు సాధించగలిగింది. 11వ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు బాదిన కుశాల్ పెరీరా 13వ ఓవర్‌లో ఓ సిక్స్, రెండు ఫోర్లతో స్కోరులో కదలిక తెస్తూ 32 బంతుల్లో అర్ధ సెంచరీ చేశాడు. అలాగే 17వ ఓవర్‌లో తిసార వరుసగా రెండు సిక్సర్లు బాదడంతో 17 పరుగులు వచ్చాయి. అయితే కుశాల్ అద్భుత ఇన్నింగ్స్‌కు 19వ ఓవర్‌లో సౌమ్య సర్కార్ బ్రేక్ వేశాడు. దీంతో ఆరో వికెట్‌కు 97 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అదే ఓవర్‌లో భారీ సిక్స్‌తో తిసార అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. కానీ ఆఖరి ఓవర్‌లో రుబెల్ అతడిని అవుట్ చేశాడు.

గల్లీ స్థాయిలో..

ఆఖరి ఓవర్‌లో 12 పరుగులు కావాల్సి ఉన్న దశలో ఉత్కంఠ తారస్థాయికి చేరింది. తొలి బంతికి పరుగేమీ రాకపోగా రెండో బంతికి ముస్తాఫిజుర్ రనౌట్ అయ్యాడు. అయితే ఈ రెండు బంతులు కూ డా భుజానికి పై ఎత్తులో రావడంతో బంగ్లా నోబ్స్ కోసం ఎదు రు చ‌ూ సింది. కానీ అంపైర్ నుంచి స్పందన లేకపోగా ముస్తాఫిజుర్ రనౌట్ కావడం వారిని అసహనానికి గురి చేసింది. ఇదే సమయంలో మైదానంలోకి వచ్చిన సబ్‌స్టిట్యూట్ నూరుల్ హసన్.. తిసార పెరీరాతో గొడవకు దిగాడు. అటు బౌండరీ అవతల నుంచి షకీబ్ ఆగ్రహంతో ఊగిపోతూ తమ ఆటగాళ్లను బయటకి వచ్చేయమని సంజ్ఞ చేయడంతో అసలేం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అయితే హెడ్ కోచ్ ఖాలెద్ మహమూద్, అంపైర్లు.. కెప్టెన్‌ను శాంతపరిచి ఆట సాగేలా చూశారు. ఒకవేళ ఆటగాళ్లు బయటకి వచ్చి ఉంటే బంగ్లాపై అనర్హత వేటు పడేది. అయితే మూడో బంతిని మహ్మదుల్లా ఫోర్, ఆతర్వాత రెండు పరుగులు తీసి ఐదో బంతిని సిక్సర్‌గా మలచడంతో బంగ్లాకు అపూర్వ విజయం దక్కింది.



స్కోరు బోర్డు

శ్రీలంక: గుణతిలక (సి) సబ్బీర్ (బి) షకీబ్ 4; కుశాల్ మెండిస్ (సి) సౌమ్య సర్కార్ (బి) ముస్తాఫిజుర్ 11; కుశాల్ పెరీరా (సి) మెహదీ (బి) సౌమ్య సర్కార్ 61; తరంగ (రనౌట్) 5; షనక (సి) ముష్ఫికర్ (బి) ముస్తాఫిజుర్ 0; జీవన్ మెండిస్ (సి) ముస్తాఫిజుర్ (బి) మెహదీ 3; తిసార పెరీరా (సి) తమీమ్ (బి) రుబెల్ 58; ఉడాన నాటౌట్ 7; దనంజయ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు: 9; **మొత్తం: 20 ఓవర్లలో 7 వికెట్లకు 159. వికెట్ల పతనం:** 1-15, 2-22, 3-31, 4-32, 5-41, 6-138, 7-154. **బౌలింగ్:** షకీబ్ 2-0-9-1; రుబెల్ 4-0-41-1; ముస్తాఫిజుర్ 4-1-39-2; మెహదీ హసన్ 4-0-16-1; మహ్మదుల్లా 4-0-29-0; సౌమ్య సర్కార్ 2-0-21-1.

బంగ్లాదేశ్: తమీమ్ (సి) కుశాల్ పెరీరా (బి) గుణతిలక 50; లిటన్ (సి) కుశాల్ పెరీరా (బి) దనంజయ 0; సబ్బీర్ (స్టంప్డ్) కుశాల్ పెరీరా (బి) దనంజయ 13; ముష్ఫికర్ (సి) తిసార (బి) అపోన్సో 28; సౌమ్య సర్కార్ (సి) కుశాల్ పెరీరా (బి) జీవన్ 10; మహ్మదుల్లా నాటౌట్ 43; షకీబ్ (సి) దనంజయ (బి) ఉడాన 7; మెహదీ (రనౌట్) 0; ముస్తాఫిజుర్ (రనౌట్) 0; రుబెల్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు: 9; **మొత్తం: 19.5 ఓవర్లలో 8 వికెట్లకు 160. వికెట్ల పతనం:** 1-11, 2-33, 3-97, 4-105, 5-109, 6-137, 7-148, 8-148. **బౌలింగ్:** ఫెర్నాండో 1-0-10-0; దనంజయ 4-0-37-2; అపోన్సో 3-0-19-1; తిసార పెరీరా 2-0-20-0; గుణతిలక 3-0-24-1; జీవన్ 4-0-24-1; ఉడాన 2.5-0-26-1.

దలేర్ మెహందీకి రెండేళ్ల జైలు

మనుషుల అక్రమ రవాణా కేసులో కోర్టు తీర్పు



పటియాల, మార్చి 16: మనుషుల అక్రమ రవాణా కేసులో పంజాబీ పాప్ గాయకుడు దలేర్ మెహందీకి పటియాల కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ జడ్జి నిధి సైనీ శుక్రవారం ఈ మేరకు తీర్పు చెప్పారు. ఆయనకు రూ. వెయ్యి జరిమానా కూడా విధించారని దలేర్ తరపున న్యాయవాది గురుప్రీత్‌సింగ్ తెలిపారు. ఆ వెంటనే మెహందీ బెయిల్‌పై విడుదలయ్యారు.

ఐన్‌స్టీన్ సూత్రం కన్నా వేదాలు గొప్పవి

- హాకింగ్ చెప్పారంటూ కేంద్రమంత్రి హర్షవర్ధన్ వ్యాఖ్య



ఇంఫాల్, మార్చి 16: ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం "$e = mc^2$" కన్నా వేదాల్లో చెప్పిన అంశాలు ఎంతో ఉన్నతమైనవని ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ చెప్పినట్లు కేంద్రమంత్రి హర్షవర్ధన్ పేర్కొన్నారు. ఇంఫాల్‌లో మొదలైన 105వ సైన్స్ కాంగ్రెస్ సదస్సులో మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. అయితే హాకింగ్ అలా ఎప్పుడన్నారో ఆయన చెప్పలేకపోయారు. ఇదే విషయాన్ని మీడియా సైతం ప్రశ్నించడంతో.. 'హాకింగ్ అలా ఎప్పుడన్నారో మీరే శోధించండి. అది రికార్డు పరంగా కూడా ఉంది. అది ఎక్కడుందో పరిశోధించే పని చేయండి' అని చెప్పి వెళ్లిపోయారు. కొంతమంది గూగుల్‌లో సెర్చ్ చేయగా.. ఒక వెబ్‌సైట్‌లో ఈ మేరకు కథనం కనిపించింది. ఆ వెబ్‌సైట్‌ను ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైంటిఫిక్ రిసెర్చ్ ఆన్ వేదాస్ అనే సంస్థ నిర్వహిస్తోంది.

ఒక్కో రాఫెల్‌పై 1100 కోట్లు పెద్దల జేబుల్లోకి

ప్రభుత్వ ఖజానాకు 36 వేల కోట్ల నష్టం: రాహుల్

న్యూఢిల్లీ, మార్చి 16: ఒక్కో రాఫెల్ యుద్ధ విమానంపై రూ. 1,100 కోట్లు పెద్దల జేబుల్లోకి వెళ్లాయంటూ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఆరోపించారు. శుక్రవారం ఆయన కొన్ని గణాంకాలను ట్వీట్ చేశారు. 'యూపీఏ సర్కారు ఒక్కో విమానానికి రూ. 570 కోట్లు చెల్లించేలా ఫ్రెంచ్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొంది. ప్రభుత్వం మారేసరికి ఆ మొత్తం అమాతం పెరిగిపోయి.. రూ. 1,670 కోట్లకు చేరింది. ఈ లెక్కన రూ. 1,100 కోట్లు పెద్దల జేబుల్లోకి వెళ్తున్నాయి' అంటూ ట్విటర్‌లో పేర్కొన్నారు. 'ఫ్రెంచ్ కంపెనీ డసాల్ట్ ఏవియేషన్ అనేది రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పే ఓ అబద్ధపు సంస్థ. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ. 36 వేల కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఒకవైపు మరిన్ని నిధులు కేటాయించాలని సైన్యం అడుగుతున్నా.. సర్కారు రాఫెల్ కోసం డబ్బులు చెల్లించింది' అని ఆరోపించారు.

222 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్ల విక్రయం

న్యూఢిల్లీ, మార్చి 16: రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే వారికోసం.. ఎలక్టోరల్ బాండ్ల విక్రయాలను ఈ నెల 1 నుంచి 10 తేదీల మధ్య జరిపినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పీ రాధాకృష్ణన్ తెలిపారు. ఈ నెల 9 నాటికి రూ. 222 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను విక్రయించామని లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

ఆన్‌లైన్ సూసైడ్ గేమ్ ఆడుతూ విద్యార్థి ఆత్మహత్య

రూర్కీ, మార్చి 16: ఆన్‌లైన్ సూసైడ్ గేమ్ ఆడుతూ ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఐఐటీ రూర్కీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న అభిజిత్ సింగ్(21) హాస్టల్ గదిలో బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బ్లూవేల్ లాంటి ఆన్‌లైన్ సూసైడ్ గేమ్‌లో భాగంగానే అభిజిత్ ఆత్మహత్య చేసుకున్నాడని ప్రాథమిక విచారణలో తేలింది. కొద్దిరోజులుగా అభిజిత్ సూసైడ్‌కు 30 కారణాలు అనే గేమ్‌ను ఆడుతున్నట్లు ఆయన స్నేహితుడు తెలిపాడు.

2000 నోటు రద్దు ప్రతిపాదన లేదు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 16 : రెండువేల రూపాయల నోటును రద్దుచేసే ఆలోచన లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. అలాగే కోచి, మైసూరు, జైపూర్, సిమ్లా, భువనేశ్వర్ నగరాల్లో రూ.10 ప్లాస్టిక్ కరెన్సీ నోటును ప్రవేశపెట్టేందుకు ప్రయోగాలు చేయాలని నిర్ణయించామని లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రి రాధాకృష్ణన్ తెలిపారు.

పంజాబ్ 'ఆప్' చీఫ్ మాన్ రాజీనామా

చండీగఢ్, మార్చి 16: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడు భగవంత్ మాన్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. కొంతకాలంగా డ్రగ్ మాఫియాపై పంజాబ్ ఆప్ నేతలు పోరాడుతున్నారు. ఈ క్రమంలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్.. డ్రగ్ రాకెట్‌లో శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఏడీ) నేత, మాజీ మంత్రి బిక్రం సింగ్ మజీఠియా ప్రమేయంపై ఆరోపణలు చేశారు. దీనిపై మజీఠియా పరువునష్టం దావా వేశారు. ఈ నేపథ్యంలో.. కేజ్రీవాల్ గురువారం బేషరతుగా క్షమాపణలు చెబుతూ మజీఠియాకు లేఖ రాశారు. తమను సంప్రదించకుండా కేజ్రీవాల్ తీసుకున్న నిర్ణయం విస్మయానికి గురిచేసిందంటూ పంజాబ్ ఆప్ నేతలు మండిపడ్డారు. 'నేను పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నాను. సామాన్యుడిగా డ్రగ్ మాఫియాపై పోరాటం కొనసాగిస్తాను' అని భగవంత్ మాన్ ట్వీట్ చేశారు.

రామసేతుకు నష్టం కలిగించం: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 16: సేతు సముద్రం ప్రాజెక్టు కోసం హిందువుల మనోభావాలతో ముడిపడి ఉన్న రామసేతుకు నష్టం కలిగించబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్‌పై షిప్పింగ్ మంత్రిత్వశాఖ స్పందించింది. సేతుసముద్రం ప్రాజెక్టు అలైన్‌మెంట్‌కు కేంద్రం ప్రత్యామ్నాయం అన్వేషిస్తోందని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనానికి ఒక అఫిడవిట్ సమర్పించింది.

కాంగ్రెస్ ప్లీనరీలో 'హోదా'!

- తీర్మానం ప్రవేశపెట్టనున్న సోనియా
- ఆమోదించనున్న ఏఐసీసీ
- నేటినుంచి రెండు రోజులపాటు ప్లీనరీ
- రాహుల్ అధ్యక్షతన తొలి మహాసభ



ఢిల్లీలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ సమావేశంలో సోనియా, రాహుల్, మన్మోహన్, ఖర్గే

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలంటున్న కాంగ్రెస్ పార్టీ.. ఈ అంశాన్ని ఏఐసీసీ ప్లీనరీలో ప్రత్యేకంగా ప్రస్తావించనుంది. దీనిపై కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు, ప్లీనరీ ఆమోదించనున్నట్లు తెలిసింది. పార్టీ నూతన అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అధ్యక్షతన శనివారం ఇందిరాగాంధీ స్టేడియంలో ప్లీనరీ ప్రారంభం కానుంది. ఉదయం రాహుల్‌గాంధీ చేసే ప్రసంగం, తీర్మానాలు కాంగ్రెస్ భావి రాజకీయాలకు దిశానిర్దేశం చేయనున్నాయి. మిత్రపక్షాలను కూడగట్టుకునేందుకు కాంగ్రెస్ ఏం చేస్తుందనే విషయం ఈ తీర్మానాల్లో స్పష్టం కానుంది. రాహుల్ అధ్యక్షుడుగా ఎన్నిక కావడాన్ని ప్లీనరీలో పార్టీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించనున్నారు.

50 మంది నేతల ప్రసంగం..

రెండు రోజులపాటు జరిగే ఈ ప్లీనరీలో దాదాపు 50 మంది ప్రసంగిస్తారు. వీరిలో కనీసం 45 మంది.. 50ఏళ్ల లోపు నేతలే ఉంటారని పార్టీ వర్గాలు చెప్పాయి. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, గులాం నబీ ఆజాద్, చిదంబరం, జనార్దన్ ద్వివేది, మల్లికార్జున ఖర్గే, వీరప్ప మొయిలీ, ఆస్కార్ ఫెర్నాండెజ్, ముకుల్ వాస్నిక్, కపిల్ సిబల్, షీలా దీక్షిత్, ఆంటోనీ తదితర సీనియర్ నేతలతోపాటు సచిన్ పైలట్, జ్యోతిరాదిత్య సింధియా, అజయ్ మాకెన్ తదితర యువ నేతలకు మాట్లాడే అవకాశం కల్పించనున్నారు. వర్కింగ్ కమిటీకి ఎన్నికలు జరగబోవని, సభ్యులను ఎన్నుకునే అధికారాన్ని రాహుల్‌కు అప్పజెబుతూ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదిస్తుందని పార్టీ వర్గాలు చెప్పాయి. కొత్త వర్కింగ్ కమిటీని రాహుల్ ప్రకటించనున్నారు.

ప్లీనరీ పాస్‌ల అమ్మకం?

ప్లీనరీలో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి వచ్చిన పార్టీ నేతలతో ఏఐసీసీ కార్యాలయం కిక్కిరిసిపోయింది. ప్రతినిధుల పాస్‌లు కావాలని డిమాండ్ పెరిగిపోవడంతో కార్యాలయ సిబ్బంది చేతులెత్తేశారు. ఈ డిమాండ్‌ను చూసి కొన్ని ప్రతినిధి పాస్‌లను బ్లాక్‌లో అమ్మడం ప్రారంభమయింది. ఒక్కో పాస్‌కు రూ.5 వేల దాకా డిమాండ్ పలికింది. తెలంగాణకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు డబ్బు చెల్లించి మరీ వీటిని కొనుగోలు చేసినట్లు సమాచారం.

'నిర్భయ' తల్లే ఇంత అందంగా ఉందంటే..

ఆమె ఇంకెంత అందంగా ఉండేదో

- అందమైన అమ్మాయిలపై దుర్మార్గుల కళ్లు పడతాయ్
- రేప్ సమయంలో లొంగిపోయి.. ఆపై కేసు పెట్టాలి
- కర్ణాటక మాజీ డీజీపీ అనుచిత వ్యాఖ్యలు



మహిళా దినోత్సవంలో మాజీ డీజీపీ సాంగ్లియానా, డీఐజీ రూపా, నిర్భయ తల్లి ఆశాదేవీ, తండ్రి బద్రీనాథ్ సింగ్

బెంగళూరు, మార్చి 16: "ఆమె (నిర్భయ తల్లి) శరీరాకృతి చాలా బాగుంది. దీన్నిబట్టి నిర్భయ ఇంకెంత అందంగా ఉండేదో. అలాంటి అందమైనవారు దుర్మార్గుల దృష్టిని ఇట్టే ఆకర్షిస్తారు" ..ఢిల్లీలో కదిలే బస్సులో ఐదుగురి పైశాచికత్వానికి బలైన నిర్భయ తల్లి గురించి కర్ణాటక మాజీ డీజీపీ హెచ్‌టీ సాంగ్లియానా చేసిన వ్యాఖ్య ఇది. అది కూడా మహిళాదినోత్సవమైన మార్చి 8న. బెంగళూరులో ఆ రోజు జరిగిన నిర్భయ అవార్డ్స్ 2018 కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ దారుణమైన వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియో ఆలస్యంగా వెలుగు చూసింది. సాంగ్లియానా ఆ సభలో అప్పటికప్పుడు ప్రసంగించలేదు. ముందే రాసుకొచ్చిన ప్రసంగం చదివారు. ఆయన మాట్లాడుతున్నప్పుడే ఎవరో వచ్చి వారించే ప్రయత్నం చేసినా పట్టించుకోలేదు. నిర్భయ పైనా, ఆమె తల్లి పైనా అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాదు.. మహిళలు తమపై బలాత్కారం జరుగుతున్నప్పుడు లొంగిపోయి, తర్వాత కేసు పెట్టాలని ఉచిత సలహా కూడా ఇచ్చారు. అప్పుడే మహిళలు క్షేమంగా ఉంటారని, చావు నుంచి తప్పించుకోగలరని అన్నారు. ఆయన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తడంతో మరోసారి స్పందించారు. తాను ఆరోజు చేసిన వ్యాఖ్యలను విచిత్రంగా సమర్థించుకున్నారు. "నిర్భయ తల్లికి మంచి శరీరాకృతి ఉంది. నేను అదే మాట చెప్పాను. ఆమే అలా ఉంటే నిర్భయ ఎంత అందంగా ఉండేదోనన్నాను. ఎవరైనా నా దగ్గరకు వచ్చి 'సాంగ్లియానా.. మీరు ఈ వయసులో కూడా యువకుడిలా, మంచి శరీరాకృతితో ఉన్నారు' అంటే నేను చాలా సంతోషిస్తాను" అన్నారు. అందమైన మహిళలకు సాధారణంగా ముప్పు ఉంటుందని చెప్పడమే తన ఉద్దేశమన్నారు. "అందమైన అమ్మాయిలకు రక్షణ, జాగ్రత్త అవసరం. అప్పుడే వారు ఎలాంటి దడులకూ గురికారు" అని ముక్తాయించారు.

గేట్ ఫలితాలు విడుదల

- 20 నుంచి స్కోరు కార్డుల డౌన్‌లోడ్
- ఎంఎంఈలో వరంగల్ నిట్ విద్యార్థిని తొలి ర్యాంకు
- ఏరోస్పేస్ విభాగంలో విజయవాడ అభ్యర్థికి ఫస్ట్‌ర్యాంకు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



సౌరవ్



భువనచంద్ర

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)-2018 ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఏడాది గేట్ వ్యవహారాలను పర్యవేక్షించిన ఐఐటీ-గువహటి పరీక్ష ఫలితాలను శుక్రవారం వెల్లడించింది. శనివారం నుంచి http://apps gate.iitg.ac.in వెబ్‌సైట్‌లో అభ్యర్థులు ఫలితాలు చూసుకోవచ్చు. ఈ నెల 20 నుంచి మే 31 వరకు స్కోర్ కార్డులు ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనే అవకాశం ఉంది. ఆ తర్వాత డిసెంబరు 31 వరకు రూ.500 చెల్లించి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మూడేళ్ల పాటు గేట్ స్కోరు చెల్లుబాటు కానుంది. గత నెల 3, 4, 10, 11 తేదీల్లో దేశవ్యాప్తంగా 199 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే.

నిట్ విద్యార్థుల విజయదుందుభి

విడుదలైన ఫలితాల్లో వరంగల్ జాతీయ సాంకేతిక కళాశాల(నిట్) విద్యార్థులు విజయదుందుభి మోగించారు. మెకానికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్(ఎంఎంఈ) విభాగంలో కాలేజీకి చెందిన సౌరవ్ కుమార్ సింగ్ ఆలిండియా తొలి ర్యాంకును సాధించాడు. కాలేజీకి చెందిన చంద్రశేఖర్ తివారీ(ఎంఎంఈ) 12వ ర్యాంకు, పాలిక చరిత(బయో) 15వ ర్యాంకు, కుల్దీప్ జైన్(ఈఈఈ) 17వ ర్యాంకు, ముల్లపూడి రాజేంద్ర(ఈఈఈ) 33వ ర్యాంకు, అర్పితా విశ్వాస్(కెమిస్ట్రీ) 44వ ర్యాంకు, బత్తిని శివరాం(ఈఈఈ) 197వ ర్యాంకు సాధించారు. ఏపీలోని విజయవాడకు చెందిన పునుకోలు భువనచంద్ర ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో ఫస్ట్ ర్యాంకు దక్కించుకున్నాడు. 2017లో బీటెక్ పూర్తి చేసిన భువనచంద్ర రెండో ప్రయత్నంలో గేట్ తొలిర్యాంకును ఒడిసిపట్టాడు. ఉత్తరప్రదేశ్ రాజధాని లఖ్‌నవ్‌కు చెందిన రైతు బిడ్డ ప్రశాంత్ గుప్తా రసాయనశాస్త్ర విభాగంలో ఆలిండియా మొదటి ర్యాంకు కైవసం చేసుకున్నాడు. అతడు 71.67% మార్కులు దక్కించుకున్నాడు.

మిస్డ్ కాల్, ఎస్ఎంఎస్‌తో.. ఈపీఎఫ్ బ్యాలెన్స్ వివరాలు

- పది భాషల్లో వివరాలు
- అందుబాటులోకి కొత్త సదుపాయం

న్యూఢిల్లీ, మార్చి 16: ఉద్యోగులు తమ భవిష్య నిధి (పీఎఫ్) ఖాతాలో బ్యాలెన్స్ వివరాలు తెలుసుకోవడానికి మరింత సులభతరమైన వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) ఈ మేరకు రెండు టెలిఫోన్ నంబర్లను ప్రకటించింది. వీటికి ఫోన్ చేయడం, సందేశాన్ని పంపడం ద్వారా ఉద్యోగులు తమ ఖాతాలోని నిల్వ, పీఎఫ్ కాంట్రిబ్యూషన్, కేవైసీ వివరాలను తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ సేవలు పొందేందుకు ఖాతాదారులు తమ యూఏఎన్‌ను వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకుని ఉండాలని పేర్కొన్నారు. ఆయా వివరాలిలా ఉన్నాయి..

ఫోన్ ద్వారా..

- ఫోన్ ద్వారా పీఎఫ్ నిల్వలను తెలుసుకునేందుకు 011-22901406 నంబరుకు మిస్ కాల్ ఇస్తే సరిపోతుంది.
- ఖాతాదారులు ఈపీఎఫ్ఓతో రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నంబరు నుంచే మిస్ కాల్ ఇవ్వాల్సి ఉంటుంది
- రెండు సార్లు రింగ్ రాగానే.. కాల్ దానంతట అదే కట్ అవుతుంది. ఇందుకు ఎలాంటి చార్జీలు ఉండవు
- కాల్ కట్ అయిన కొద్దిసేపట్లో పీఎఫ్ ఖాతాదారుడి మొబైల్‌కు.. నిల్వ విలువలు, ఇతర సమాచారం మెసేజ్ రూపంలో వస్తుంది

ఎస్ఎంఎస్ ద్వారా..

- మొబైల్ ఎస్ఎంఎస్ ద్వారా ఖాతా నిల్వలు తెలుసుకోవాలనుకునే వారు 7738299899 నంబరుకు "EPFOHO UAN' అని టైప్ చేసి, మెసేజ్ పంపాలి. వెంటనే ఖాతాదారుడి మొబైల్‌కు ఈపీఎఫ్ ఖాతా నిల్వలు ఆంగ్ల భాషలో ఎస్ఎంఎస్ రూపంలో వస్తాయి.
- ఖాతాదారులు తెలుగు, కన్నడ, తమిళ్, మలయాళం, గుజరాతీ, బెంగాలీ, మరాఠీ, పంజాబీ, హిందీ భాషల్లో వివరాలను పొందే సదుపాయం ఉంది. ఇందుకు వారు కోరుకున్న భాషలోని తొలి మూడు అక్షరాలను ఎస్ఎంఎస్‌లో పేర్కొనాలి. ఉదాహరణకు తెలుగులో సందేశం రావాలనుకునేవారు "EPFOHO UAN TEL' అని మెసేజ్ పంపాల్సి ఉంటుంది.

తెలుగు అభివృద్ధికి కేంద్రం చర్యలు తీసుకోవాలి: వెంకయ్య

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని మానవవనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి రెడ్డి సుబ్రహ్మణ్యానికి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. శుక్రవారం ఆయన తెలుగు భాషపై సమీక్ష నిర్వహించారు. మైసూరులోని భారతీయ భాషల కేంద్రంలో డైరెక్టర్ పదవి ఖాళీగా ఉందని, దాని నియామకానికి ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించి వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఏపీ, తెలంగాణలో కూడా అలాంటి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంతోపాటు ఇతర యూనివర్సిటీల్లో ఉన్న విధంగా ఢిల్లీలోని జేఎన్‌యూలో కూడా తెలుగు భాషా విభాగాన్ని ఏర్పాటు చేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అన్నారు. నెల్లూరులో ఎన్‌సీఈఆర్‌టీ కేంద్ర నిర్మాణ పురోగతిపై కూడా కార్యదర్శితో సమీక్షించారు.

జనాల్లోకి పరిశోధనలు

- శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ పిలుపు
- ఇంఫాల్‌లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభం



ఇంఫాల్, మార్చి 16: "ఆర్ అండ్ డీ అర్థం మార్చండి. 'దేశాభివృద్ధికి పరిశోధన'గా దానిని రూపాంతరీకరణ చేయండి. పరిశోధనలను ప్రయోగ శాలల నుంచి క్షేత్రస్థాయికి తీసుకెళ్లండి. వాటి ఫలితాలను ప్రజలకు అందించండి" అని శాస్త్రవేత్తలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో ఐదు రోజులపాటు జరగనున్న 105వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. ఆవిష్కరణలలోనూ, శాస్త్ర, సాంకేతికత వినియోగంలోనూ భారత్‌కు ఘనమైన వారసత్వం, సుదీర్ఘ చరిత్ర ఉన్నాయని గుర్తుచేశారు. మరొకసారి ఈ రంగంలో ముందు వరుసలో నిల్చోవాల్సిన సమయం వచ్చిందన్నారు. సామాన్యుల సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి సైన్సే సహాయపడుతుందని చెప్పారు. "మన సంస్థలు, ప్రయోగ శాలల తలుపులను మన పిల్లల కోసం తెరిచి ఉంచాలి. పాఠశాల విద్యార్థులతో సంభాషించే యంత్రాంగాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేయాలి. మీకు వ్యక్తిగతంగా ఇది నా వినతి. ఏడాదిలో 100 గంటలపాటు 100 మంది విద్యార్థులతో గడపండి. శాస్త్ర సాంకేతికతపై వారితో చర్చించండి. తద్వారా యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచవచ్చు" అని వివరించారు. పోషకాహార లోపం, మలేరియా వంటి వ్యాధుల నివారణకు శాస్త్రవేత్తలు తోడ్పాటునందించాలని కోరారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ చరిత్రలో ఈశాన్య రాష్ట్రాల్లో సమావేశాలు జరగడం ఇది రెండోసారి అని తెలిపారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.**